అక్టోబర్ 2013

₹ 5

# ఆంధ్రప్రదేశ్

అందరికీ నచ్చే మాసపత్రిక



జయ జయహే
మహిషాసుర మర్దిని





# విరిసే పువ్వుల వెన్నెల . . .

# ఈ సంచికలో . . .

పాఠకుల స్పందన . . . . . . . . . . 2
ముందుమాట . . . . . . . . . . 3
సంపాదకీయం . . . . . . . . . . 4
అప్పుల కన్సల్టెన్సీ (హాస్య కథ)) . . . . . . . . . . 5
మహిళలు గడప దాటని రోజుల్లోనే యూరోప్‌లో రాణించింది (ఎందరో సైన్స్‌మహానుభావులు).. 8
సంక్షేమ పథకాలకు సాయం చేయండి... . . . . . . . . . . 9
సి.ఎం. సమీక్షలు. . . . . . . . . . . 11
ప్రజలకు బాధ్యులుగా ఉంటేనే ప్రభుత్వాలకు మనుగడ : సి.ఎం. . . . . . . . . . . 13



మాతృభాషా వికాసమే
మన ధ్యేయం కావాలి: సి.ఎం..... 14

'సర్టిఫికెట్' పొందటం ఇంత సులువా !. . . . . . . . . . 15
అలరిస్తున్న 'శతరూప'. . . . . . . . . . 16
కవులు ఎందరో, 'ప్రజాకవి' ఒక్కడే. . . . . . . . . . 17
ఆత్మలేని తనువు (కథ) . . . . . . . . . . 19
తెలంగాణ విడిచి ఉండలేనన్న ఉన్నవ (తెలుగు వెలుగులు) . . . . . . . . . . 21
తెలుగు పలుకుబడులు . . . . . . . . . . 23



కదిలేదొకటి... కదిలించేది మరొకటి !..... 25

సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లను అదుపు చేయాలి . . . . . . . . . . 27
మా వంట 'రవి' చేసి పెడ్తున్నాడు . . . . . . . . . . 29
దసరా కార్టూన్లు . . . . . . . . . . 31
పెద్ద సమస్యకి చిన్న పరిష్కారం(మన సమస్యలు-మహా పరిష్కారాలు). . 32
జీ.ఓ.లు. . . . . . . . . . . 33
తెలుగుపాళీ - గాంధీ బాటీ . . . . . . . . . . 36
జీ.ఓ.లు . . . . . . . . . . 38
'మీ త్రాగుడు వల్ల వాళ్ళ విద్యా శాఖ నడుస్తోంది'. . . . . . . . . . 41
హైదరాబాద్‌కి మెగా ప్రాజెక్టు. . . . . . . . . . 42
నడుస్తున్న చరిత్ర . . . . . . . . . . 43



ప్రేమ, త్యాగాలకు సంకేతం !......45

ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఎల్.ఐ.సి. పాలసీలకు శ్రీకారం. . . . . . . . . . 47
ప్రభుత్వ సాయంతో 'పట్టు' సాధించారు!. . . . . . . . . . 48
స్త్రీ శక్తి (కథ). . . . . . . . . . 49
మా ఊరి చెరువుతో మాట్లాడదాం రండి!! . . . . . . . . . . 51
అమ్మ ఒళ్ళో పాలు తాగుతున్న బిడ్డను. . . . . . . . . . 53
గయ్యాళి పెండ్లాం (చల్నేదో బాల్‌కిషన్) . . . . . . . . . . 54
కవుల అక్షర క్రీడలు (సాహితీ విన్యాసాలు) . . . . . . . . . . 55
దసరా కార్టూన్లు . . . . . . . . . . 56
అన్నమయ్య పలుకుల ఒంపుసొంపులు . . . . . . . . . . 57
రూ. 183 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం. . . . . . . . . . . 58
120 ఏళ్ల తర్వాత కొత్త భూసేకరణ బిల్లు. . . . . . . . . . . 59
రావిర్యాలలో ఆగాఖాన్ అకాడమీ . . . . . . . . . . 60
ఆ 'రాకుమారి' గోడ కూలి చనిపోయింది ! (చివరి రోజుల్లో). . . . . . . . . . 61
ప్రతి కొత్తా ఒక వింత. . . . . . . . . . 62
ముఖ్యమంత్రి డైరీ. . . . . . . . . . 63
మోక్షిక - మోహన్(కథ). . . . . . . . . . 65
మా అమ్మాయి బంగారుతల్లి! (గోరు ముద్దలు). . . . . . . . . . 68
అభినయ పరిణామం - దీపిక. . . . . . . . . . 69
పుస్తక సమీక్ష . . . . . . . . . . 70
శ్రీ'రమణీయం' . . . . . . . . . . 72

శాలివాహన శకం 1935
ఆశ్వీజ 9 - కార్తీక 9

సంపుటి : 57 సంచిక : 4

# ఆంధ్రప్రదేశ్

(తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో ప్రచురితం)

కమీషనర్ & పబ్లిషర్
ఎం. దానకిషోర్, ఐ.ఎ.ఎస్.

ప్రధాన సంపాదకులు
జి. వల్లీశ్వర్

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్
కె.ఎస్. శాస్త్రి

సహ సంపాదకులు
చెన్నూరి గణేశ్, రాజఫణి వి.
ప్రసాద్ గోసాల, ఎ. మధుసూదన రెడ్డి

ముఖచిత్రం
మహిషాసురమర్దిని
(చిత్రకారుడు: కె.వి. భీమారావు)

రెండవ కవర్
విరిసే పువ్వుల వెన్నెల
(ఫోటో : చిలుకూరి శ్రీనివాసరావు, కడియం)

మూడవ కవర్
సాహసం
(ఫోటో : సి. హెచ్. ప్రభుదాస్, హైదరాబాద్)

నాల్గవ కవర్
'జన' గణేశుని మహాయాత్ర
(ఫోటో : సురేష్, మెగాకలర్ ల్యాబ్)

ప్రతి :రూ. 5/- ఏడాది చందా :రూ. 50/-

ప్రచురణ
సమాచార, పౌర సంబంధాల శాఖ
సమాచార భవన్, ఎ.సి. గార్డ్స్
హైదరాబాద్ - 500 028

ఫోన్ : 040-23300258

ముద్రణ
కాక్స్టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్

# పాఠకుల స్పందన

### 'పాఠాలు' నేర్చుకుంటున్నాం

'ఆంధ్రప్రదేశ్' పత్రిక ద్వారా 'సమున్నత చరిత్ర' తెలుసుకుంటూ, 'తెలుగు వెలుగులు' పాఠాలు నేర్చుకుంటున్నాం. రోజురోజుకూ కొత్తదనం పుణికి పుచ్చుకుంటూ, మా అభిమాన పత్రిక పాఠకుల మనసుల్ని దోచుకుంటోంది. కమ్మని కథలు, కవితలతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు గురించిన సమాచారాన్ని పాఠకుల ముంగిటకు చేర్చే ప్రయత్నం చేస్తున్న సంపాదక వర్గానికి అభినందనలు. ప్రజా ప్రయోజనాల కోసం వినియోగదారుల సమాచారం కూడా అందిస్తే బాగుంటుందని మా అభిప్రాయం.

**- వి. షేక్. నబి రసూల్,**
*బోరబండ, హైదరాబాద్*

### గుర్తుకొస్తున్నాయి...

'ఆంధ్రప్రదేశ్' సెప్టెంబర్ సంచిక చాలా బాగుంది. గణేష్ చతుర్థి కార్యక్రమం బాగా నచ్చింది. 'అభినయ పరిణామం' శీర్షికలో సి. నాగభూషణం గురించి ప్రచురించిన వ్యాసం చదువుతుంటే, పాత జ్ఞాపకాలు గుర్తుకువచ్చాయి. నేను చిత్తూరు జిల్లా గ్రామాలలో పనిచేస్తున్న రోజుల్లో నాగభూషణం 'రక్తకన్నీరు' నాటకం వేశారు. దానికి ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరై ఆనందించారు.

**- సూర్యదేవర గిరిజా ప్రసాద్,**
*వైకుంఠపురం, తిరుపతి*

### 'మట్టిహారతి' బాగుంది

'ఆంధ్రప్రదేశ్' సెప్టెంబర్ సంచికలో 'మహాగణపతి' గురించి ఆధ్యాత్మిక సమాచారంతో 'సృష్టి రహస్యం' మకుటంతో ప్రచురించిన వ్యాసం ఎంతో బాగుంది. అందులో మహాగణపతిని వృక్షతత్వానికి ప్రతీకగా అభివర్ణించారు. 'మట్టిహారతి' కవిత దారుణ విలయంలో చిక్కుకున్న యాత్రికులకు జేజేలు పలికింది. సంపాదకీయంలో సిటిజన్స్ ఛార్టర్ గురించి, అందులో ఉద్యోగులకు జవాబుదారీ విధించే అంశాలు గురించి వివరించారు. ఉద్యోగులంతా దీని సంస్కృతిని అలవరించుకుంటేనే లక్ష్యాలను సాధించగలం. అది ఎలా సాధ్యమన్నది ఆలోచించాలి.

**- ఎస్. సత్యనారాయణ చార్యులు**
*తెనాలి, గుంటూరు జిల్లా*

## మట్టి హారతి

మీ హారాలు సమర్పిస్తున్నదే కాదు
ప్రకృతి వైపరీత్యాల బాధితుల కోసం కాదా!
అయిన వాళ్లే ప్రాణాలనేక చిక్కి పోయినటుంటే
విహారాలను మాని అందరి కోసం
ఆలోచించి ప్రయాణించే అవస్థలా!
రణరంగం నుంచి మరణ వర్షంలో... కాదే
ఏ తల్లి మీ గుండెల్ని చీల్చుతుంటే...!
మీ ప్రాణాలు కోసం మీ ఆశలే ఆర్పేసి కదా!
సమయస్ఫూర్తి... ఏ సంకల్పమైనా
హృదయ విదారక ఆర్తి దృశ్యాల మధ్య
మానవత్వ హస్తాలు చాచే మనం మీరు
దారిదాం విలయంలో
గ్రామాలే మాయమైన వరద సునామీలో
మీలా ఉంటున్న ప్రతి వాళ్ళకీ రక్షకులయ్యారు
బాధితులందరికీ బాట చూపిస్తూ
కష్టపడుతున్న ఒకే చోట చూసుకుంటూ
రక్షణలో మీ తెగువకు
మంచుకొండలు కరిగి కన్నీళ్ళు కార్చాయి
ఆ ప్రకృతి సిగ్గుపడి తలొంచి సలాం చేసింది.
వైపరీత్యాల అక్షరాలైన చోట
మీ సేవకే జేజేలు పలుకుతున్నాయి
ప్రాణాలు కాపాడుతూ... అమరులైన మీ కర్తవ్యానికి
నివాళులు అర్పించిన ఈ నేల మట్టితో
హారతులిస్తున్నాం మీకు గౌరవిస్తున్నాం.



### గమనిక

'ఆంధ్రప్రదేశ్' సెప్టెంబరు సంచిక 6వ పేజీలో ప్రచురించిన ఈ **'మట్టి హారతి'** కవిత రచించిన వారు **డాక్టర్ సి. భవానీ దేవి**గా గమనించ కోరుతున్నాం. సాంకేతిక కారణాల వల్ల రచయిత్రి పేరులో పొరపాటు దొర్లినందుకు చింతిస్తున్నాం. - సం॥

### 'నరేంద్రజీ' పై వ్యాసం బాగుంది

'ఆంధ్రప్రదేశ్' సెప్టెంబర్ సంచికలో 'తెలుగు వెలుగులు' శీర్షికన 'ఆయన పేరు వింటే ప్రభుత్వం ఒణికిపోయేది' అనే మకుటంతో ఆనాటి ఆర్యసమాజ్ నాయకుడు పండిట్ నరేంద్ర జీ పై ప్రచురించిన వ్యాసం ఎంతో బాగుంది. ఈ వ్యాసం ద్వారా నరేంద్ర జీ గురించి ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాము. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రచురించిన కవితలు బాగున్నాయి. ఆదర్శ రచయిత్రి శ్రీమతి మాలతీ చందూర్ మృతితో సాహితీ లోకం మూగబోయింది. ఆమెకు మా హృదయ పూర్వక నివాళులు.

**-బి. మహబూబ్ నబీ**
*గుత్తి, అనంతపురం జిల్లా*

### 'మంచి'ని గుర్తించడం కష్టం

'ఆంధ్రప్రదేశ్' సెప్టెంబరు సంచికలో 'సిటిజన్స్ ఛార్టర్' పై రాసిన సంపాదకీయంలో వ్యక్తం చేసిన 'ఆవేదన' అర్థమయింది. మంచిని గుర్తించడానికి తప్పక అవకాశమవుతుంది. ఇక, 'మంచుమాల'లో టీ.వి.ల ద్వారా పిల్లలకు జరుగుతున్న హాని గురించి బాగా తెలియ జేశారు. చక్కటి వ్యాసంతో, సకాలంలో పత్రికను అందిస్తున్న సంపాదకవర్గానికి అభినందనలు.

**- ఎస్.వి. స్వామి,**
*బాయురేపేట, ఒంగోలు*

### 'సిటిజన్స్ ఛార్టర్' పై విశేష స్పందన

ఆంధ్రప్రదేశ్' సెప్టెంబరు సంచికలో 'సిటిజన్స్ ఛార్టర్' అమలుపై ప్రచురించిన వ్యాసానికి సంబంధించి పాఠకుల నుంచి అధిక సంఖ్యలో స్పందన లభించింది. ఈ వ్యాసం చక్కటి సమాచారాన్ని అందించిందని కొందరు పేర్కొనగా, 'సిటిజన్స్ ఛార్టర్' అమలు లో అక్కడక్కడ జరుగుతున్న లోపాల గురించి మరి కొంతమంది తెలియజేశారు.

'సిటిజన్స్ ఛార్టర్' అమలుకు సంబంధించి వారు లేవనెత్తిన సందేహాలు, సమస్యలను పరిపాలన శాఖ కమీషను మరియు డైరెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళడం జరుగుతుంది. - సం॥

ముందుమాట

# ఏది సరైన నివాళి

'నిర్భయ' కేసులో నలుగురు దోషులకి ఉరిశిక్ష పడింది. "ఆమెకు ఇదే సరైన నివాళి" అంటూ మీడియాలో వార్తలొచ్చాయి! 2012 డిసెంబర్ 16 రాత్రి ఢిల్లీ నగర వీధుల్లో ఒక ప్రైవేట్ బస్సులో ప్రయాణిస్తున్న నిర్భయని వెంటి, అతికిరాతకంగా ఆమెని శారీరకంగా హింసించి, ఆమె మరణానికి కారణమైన ఆరుగురిలో నలుగురికి ప్రత్యేక న్యాయస్థానం 'ఉరి' ఒక్కటే తగిన శిక్ష అని నిర్ణయించింది. అందులో నిందితుడు మైనర్ అన్న కారణంగా అతనికి మూడేళ్ళ జైలు శిక్షని విధించారు. (ఒక నిందితుడు రిమాండులో వుండగా చనిపోయాడు)

ఈ కేసులో దోషులైన వారికి ఉరిశిక్ష పడే దాకా శాంతించలేమంటూ దేశవ్యాప్తంగా మహిళాలోకం ఎలుగెత్తి నినదిస్తూ ఉద్యమించింది. 'నిర్భయ' తల్లిదండ్రులు సయితం "ఆ కిరాతకులకు ఉరిశిక్ష పడితేనే మా పాపకి ఆత్మకి శాంతి కలుగుతుంది" అంటూ ఆవేదనా భరిత హృదయాలతో తీర్పుకోసం ఎదురుచూశారు.

సెప్టెంబర్ 13న న్యాయమూర్తి ఇచ్చిన తీర్పుతో ఎవ్వరూ విభేదించలేరు - ఒక్కడి డిఫెన్స్ లాయర్ తప్ప.

"మరో మూడు మాసాల్లో ఈ దేశంలో రేప్ అంటూ జరగకపోతే నేను అప్పీలుకే వెళ్ళను" అంటూ న్యాయస్థానం బయట టీవీఛానళ్ళ ముందు బహిరంగంగా ప్రకటించి ఆ డిఫెన్స్ లాయర్ వార్తల్లోకెక్కారు.

అలా మాట్లాడినందుకు ఆ లాయర్ని చాలామంది పత్రికల్లో, టీవీల్లో, సోషల్ మీడియాలో విమర్శించారు.

కాని ఆ ప్రశ్నకి సమాధానం మాత్రం లభించలేదు.

రేప్! బాలికలు, యువతులు, మహిళలు - ఎవరైనా అత్యాచారాలకి గురవుతున్న వార్తలు ఈ తీర్పు వెలువడినాక కూడా వస్తూనే వున్నాయి. మరీ పసిపిల్లల మీద కూడా...! ఛ.. ఎంత వికృతంగా తయారవుతున్నాము - అని నాగరికులైన వాళ్ళంతా సిగ్గుతో తలవంచుకునేలా చేస్తున్నాయి ఈ వార్తలు.

ఈ వార్తలిలా వుంటే - "అర్ధరాత్రి ఆడపిల్ల నడివీధిలో తిరగగలిగే రోజు ఎప్పుడు?" అంటూ ప్రశ్నిస్తూ టీవీల్లో చర్చలు చేస్తున్నారు, పత్రికల్లో రాస్తున్నారు స్త్రీ వాద సానుభూతిపరులు. క్రైమ్ మూవీల సినిమాలు, టీవీసీరియల్స్, ఇంటర్నెట్‌లో అశ్లీల వెబ్‌సైట్లు, నగ్న చిత్రాలు - అశ్లీల సంభాషణల్ని అతి సులువుగా మనిషి మనిషికి ఎస్ఎమ్ఎస్‌లు, ఎమ్మెమ్మెస్‌ల ద్వారా చేరవేసే సెల్‌ఫోన్‌లు... ఇన్ని రకాలుగా మగవాళ్ళని పెడదోవ పట్టించే సాంకేతిక పరిజ్ఞానం సమాజంలో చొచ్చుకుపోతోంది. నేరాలు పెరగడానికి కావలసినంతగా మనిషిని రెచ్చగొట్టి, వ్యాపారంగా మార్చే ప్రభావాన్ని ఈ మీడియా చూపిస్తోంది.

ఈ నేపథ్యంలో ఒక్క నేరంలో ఒక నలుగురికి ఉరిశిక్ష పడగానే 'హమ్మయ్య' అని ఊపిరి తీసుకోగలమా?

ఒక చట్టం వచ్చింది కాబట్టి, నేరస్థుల్ని చట్టమే శిక్షిస్తుంది కాబట్టి, "ఇంక ఆడ పిల్లలు ధైర్యంగా వుండవచ్చు" అని చెప్పగలమా?

టెక్నాలజీ విస్తృతం కావడం వల్ల వస్తున్న దుష్పరిణామాలను నిరోధించడానికి ఇప్పుడున్న చట్టాలు, కోర్టులు సరిపోతాయా?

'నిర్భయ' కేసులో లాగా 'నిర్భయ' చట్టం వల్ల దోషులకి కఠిన శిక్ష పడటం బాధిత కుటుంబాలకి ఉపశమనం కలిగించవచ్చు. నేరం చేయకుండా కొంత మందిని భయపెట్టడానికి ఉపయోగపడవచ్చు. కాని ఇది శాశ్వత పరిష్కారం కాగలదా?

వేల సంవత్సరాలుగా మన సమాజం - పాశ్చాత్య సమాజాల కన్నా ఆరోగ్యంగా వుండగలగడానికి కారణం - బలమైన కుటుంబ వ్యవస్థ. తాతలు, మామ్మలు దాకా కుటుంబంలో ప్రతి ఒక్కరి నుంచి ఏదో ఒక సంస్కార గుణాన్ని అలవర్చుకుంటూ పిల్లలు పెరిగారు. ఏది మంచి, ఏది చెడు, ఏది చెప్పవచ్చు, ఏది చెప్పకూడదు, ఎవరితో ఎలా మాట్లాడాలి, ఎలా ప్రవర్తించాలి... వగైరా అనేక అంశాలను విద్యార్థి దశ పూర్తయ్యేసరికి ప్రతి యువతీ, యువకుడూ, తెలుసుకునేలా చేసింది ఈ వ్యవస్థ. ఈ సంస్కారాన్ని సమాజంలో బలంగా నాటింపజేయడంలో గురువులు కూడా కీలకపాత్ర వహించారు.

ఆ సంస్కారంలో - పెద్దలంటే గౌరవం వుంది, ఆడపిల్లల పట్ల మగపిల్లలు సోదరభావంతో మెలగాలన్న సందేశం వుంది. ఆడపిల్లలు ఎలా మెలగాలో వుంది. దైవ భక్తి వుంది, పాపభీతి వుంది, సామాజిక స్పృహ వుంది, దేశ భక్తి వుంది. జీవ కారుణ్య దృష్టి వుంది, మానవతా దృక్పథం వుంది. మనిషి జీవించినంతకాలం పెడదోవ రాకుండా జీవించాలన్న గీతాసారం వుంది.

ఇంత శక్తివంతమైన సంస్కారాన్ని పిల్లలకి ఇవ్వగల అవకాశం ఇప్పటికీ తల్లిదండ్రులకి, గురువులకే వుంది. అందుకే టెక్నాలజీ ఎంత పెడదారులు వేస్తున్నా, ఒక ఉత్తమ సంస్కారమే అంకుశంలా పనిచేయగలిగి వుంటుంది.

'నిర్భయ' కేసులో న్యాయం జరగాలని ఆరాటపడిన ప్రతి యువతీ ఒక బాధ్యత గల తల్లిగా తన పిల్లలకి సరైన సంస్కారం ఇస్తూ పెంచటం కన్నా ఉన్నతమైన 'నివాళి' (నిర్భయకి) మరొకటి వుంటుందా?

కమీషనర్



# ఎలా నిర్వచించాలంటే...!

మన రాష్ట్రంలో తలసరి ఆదాయం పెరిగింది.

2004-05లో రూ. 25,321గా వున్న తలసరి ఆదాయం 2012-13 నాటికి రూ. 78,177కి చేరుకుంది.

"తలసరి ఆదాయం పెరిగింది కాబట్టి రాష్ట్రానికి ఇవ్వాల్సిన కేంద్రనిధుల వాటాని తగ్గించటం ఎలా సమర్థనీయం?" అంటూ ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి ఇటీవల హైదరాబాద్ వచ్చిన 14వ ఆర్థిక సంఘం ముందు ప్రశ్నించారు.

పదవ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి లభించిన కేంద్ర పన్నులలోని వాటా 7.91 శాతంగా వుంటే 13వ ఆర్థిక సంఘం సిఫార్సులలో అది 6.94 శాతానికి కుదించుకుపోయింది. ఈ లెక్కన 2015-20 కాలంలో రాష్ట్రాలకు పంచదగిన పన్నుల వాటా 20 లక్షల కోట్ల రూపాయలు అయితే, ఈ తగ్గుతున్న కేటాయింపుల పరిమాణం అప్పటికి 20 వేల కోట్ల రూపాయలవుతుంది. ఇది ఇప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రణాళిక పరిమాణంలో 40 శాతం అన్నమాట.

ఈ అంశాన్ని ఉటంకిస్తూ ముఖ్యమంత్రి ఒక ప్రశ్న వేశారు. "తలసరి ఆదాయాన్ని పెంచుకురావటం రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యానికి సూచికగా గుర్తించి, (అదనపు నిధులతో) సత్కరించాల్సింది పోయి. ఇలా కోత విధించటం ద్వారా శిక్షిస్తారా?"

నిజమే, మన తలసరి ఆదాయం పెరిగింది. ఎంత - అంటే జాతీయ స్థాయి సగటు కంటే ఎక్కువ. కాని, వాస్తవం ఏమిటి?

అసలు తలసరి ఆదాయం పెరగటం అంటే సగటున ఎంత పెరిగింది అన్నదే లెక్క. అంతేకాని ఈ పెరిగిన స్థాయిలో రాష్ట్రంలోని 12 కోట్ల ప్రజల ఆదాయం వుందా? ఇలా ప్రశ్నించుకుంటే వచ్చే జవాబు...? కాని, తలసరి ఆదాయం పెరగటానికి కారణం - ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ప్రభుత్వరంగ సంస్థలు, ప్రత్యేక ఆర్థిక మండలాలు వగైరా రంగాలలో ఆదాయాలు పెరగటం. ఈ పెరుగుదలని సాధించేందుకు అవసరమైన సాధనా సంపత్తిని సమకూర్చటంలో రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని పాత్రని నిర్వహించి వుండటంలో చెప్పనక్కర్లేదు.

కాని, ఈ పెరుగుదల లేదా అభివృద్ధి అనేది రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని రంగాలలో ఒకే రకంగా వుండదు. పెరుగుదల వేగం ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో వున్నట్లు రిటైల్ వ్యాపార రంగంలో వుండకపోవచ్చు.

ఈ కారణంగా ఆదాయంలో అసమానతలనేవి మనరాష్ట్రంలోనూ వున్నాయి. వీటిని తగ్గించటం కోసమే ప్రభుత్వం 'రాజీవ్ యువకిరణాలు' వంటి పథకాలను ముమ్మరంగా అమలు చేస్తోంది. ఎస్.సి, ఎస్.టి ఉప ప్రణాళికకు చట్టబద్ధత కల్పించటం ద్వారా వాళ్ళ జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు కృషి చేస్తోంది.

ఏ కొత్త పథకమైనా ఖర్చుతో కూడుకున్నదే. ఉదాహరణకి - 'రాజీవ్ యువకిరణాలు'. దీనిమీద ఇప్పటిదాకా 280 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది. నిరుద్యోగ యువతని నిర్లక్ష్యం చేస్తే సమాజానికి ఎంత నష్టమో, ప్రమాదమో గుర్తించిన ప్రభుత్వం నిరుద్యోగ యువతని సుశిక్షితులైన మానవ వనరులుగా తయారు చేయటం కోసం ఉద్దేశించిన కార్యక్రమం 'రాజీవ్ యువకిరణాలు'. నిజానికి ఇది జాతీయ అవసరం కూడా. ఇలాంటి పథకాలకి నిధులు ఎలా వస్తాయి?

అందుకే 14వ ఆర్థిక సంఘం ముందు తన ప్రతిపాదనలను వెల్లడిస్తూ ముఖ్యమంత్రి ఇలా అన్నారు:

"తలసరి ఆదాయం పెరుగుదలని కొలబద్దగా తీసుకుని కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాని నిర్ణయించటం సరికాదు. మా రాష్ట్రంలో ఆదాయం పెరుగుదలని ఎక్కువగా చూపించేది నాలుగు జిల్లాలే. వాటి వల్లనే తలసరి ఆదాయం పెరుగుదల కనిపిస్తోంది. ఆ నాలుగు జిల్లాల్ని మినహాయించి, మిగతా 19 జిల్లాల వరకే తీసుకుంటే మా తలసరి ఆదాయం జాతీయ స్థాయి కన్నా తక్కువ. కాబట్టి ఏవో నాలుగు జిల్లాల్లో వున్న పరిస్థితి ఆధారంగా నిధుల వాటాని నిర్ణయించటం జరిగితే అందువల్ల మిగతా 19 జిల్లాలకీ అన్యాయం జరుగుతుంది... వాస్తవిక దృక్పథంతో ఆర్థిక సంఘం ఆలోచించాలని కోరుకున్నాం."

రాష్ట్రంలో ఆదాయం పెంచటం కోసం ప్రభుత్వం సాగిస్తున్న ప్రయత్నాలకి, ఆర్థిక వనరులను ఖర్చు పెట్టటంలో ప్రదర్శిస్తున్న క్రమశిక్షణకి కూడా ఈ నిధుల కేటాయింపు సందర్భంలో తగిన వెయిటేజినివ్వాలని, గతంలో లాగానే 1971 జనాభా లెక్కల ప్రాతిపదికన నిధుల కేటాయింపు జరగాలని.... వగైరా మరికొన్ని అంశాలను కూడా ముఖ్యమంత్రి 14వ ఆర్థిక సంఘం దృష్టికి తీసుకువచ్చారు. అయితే, 'తలసరి ఆదాయం పెరుగుదల'ని ముఖ్యమంత్రి నిర్వచించిన కోణంలో చూడకపోతే రాష్ట్రానికి 14వ ఆర్థిక సంఘం ద్వారా రావాల్సిన పరిమాణంలో కేంద్ర నిధులు రాకపోయే ప్రమాదం వుంది.

అందుకే, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే, వాస్తవిక దృక్పథమున్న ప్రతి పౌరుడూ సమర్థించదగిన నిర్వచనం శ్రీ కిరణ్‌రెడ్డి చెప్పిన 'తలసరి ఆదాయం పెరుగుదల'.



**హాస్య కథ**

# అప్పుల కన్సల్టెన్సీ

-జె. మేరీకృపాబాయి

**"అప్పుచేసి పప్పు కూడు తినరా ఓ నరుడా! గొప్పనీతి వాక్యమిది వినరా ఓ నరుడా" అని కేప్పైన పాటను తనకు గుర్తున్న బాణీలో హమ్ చేస్తూ వైట్ పేపర్ని ఏ వేవో లెక్కలు వేసుకుంటున్నాడు అప్పారావు. ఆ హమ్మింగుకు కారణమేమిటో అర్థం కాక అతనివైపు వింతగా చూసింది ఆదిలక్ష్మి.**

**"ఆదిలక్ష్మీ నా సంతోషానికి కారణం నీకు తెలీదం లేదు కదూ! ఒక్క ఐదు నిముషాలు ఇలా నా ప్రక్కన కూర్చున్నావంటే అసలు కారణం వివరిస్తాను" అంటూ చిరునవ్వు నవ్వాడు అప్పారావు. అప్పారావు ఆనందానికి కారణం ఏమిటో తెలుసుకోవాలని ఆదిలక్ష్మి చటుక్కున వెళ్లి అతని ప్రక్కనే సోఫాలో కూర్చుంది. అప్పారావు చెప్పడం ప్రారంభించాడు.**

"ఆదిలక్ష్మీ! నేను రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో క్లర్కుని. వెనక ఆస్తులు పాస్తులు లేవు. నీ దగ్గర నుంచి కట్నకానుకలు వసూలు చేయలేదు. జీవితాంతం ఈ చిన్న ఉద్యోగంలో కొట్టుమిట్టాడుతూ పేదవాడిగా మిగిలిపోలేను. అందువలన గొప్ప వాడిని కావాలనుకుంటున్నాను" నవ్వుతూనే చెప్పాడు అప్పారావు.

"మేరాక్షరాలా. ఈ భూగోళంలోని పేదవారంతా గొప్ప వాళ్లై పోవాలనే అనుకుంటున్నారు" వ్యంగ్యంగా అంది ఆదిలక్ష్మి.

"కరెక్ట్ ఆదిలక్ష్మీ! నువ్వన్నట్టు ఈ భూమి మీద అందరూ సంపన్నులైపోవాలని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. వారి వారి పరిధిలో ధనవంతులు అవుతున్నారు. కానీ నేనే ఊహించని రీతిలో నా పరిధి దాటి గొప్ప వాడినైపోవాలనుకుంటున్నాను" ఉద్వేగంగా చెప్పాడు అప్పారావు.

"అదెలా?" ఆశ్చర్యంగా అంది ఆదిలక్ష్మి.

"అప్పులు చేసి గొప్పవాడినై పోవాలనుకుంటున్నాను" తను గొప్పవాడు కావడానికి ఎంచుకున్న మార్గాన్ని ఆదిలక్ష్మితో పంచుకున్నాడు అప్పారావు.

"అప్పులు చేస్తే తిప్పలు తప్పవు. అప్పు ముప్పుకు దారి తీస్తుంది."

తనకు తెలిసిన సత్యాన్ని చెప్పింది ఆదిలక్ష్మి.

"నో ఆదిలక్ష్మీ ఈ విషయంలో నేను నీతో విభేదిస్తాను. అప్పులు రెండు రకాలుంటాయి. మంచి అప్పులు, చెడ్డ అప్పులు. నేను మంచి అప్పులు మాత్రమే చేస్తాను. అప్పులు చెయ్యడంలో మెళకువలు పాటిస్తాను."

"గత నెలలో నేను మా కొలీగ్ దగ్గర రెండు లక్షలు రూపాయలను బ్యాంకులో నేనే చేస్తానంటూనే, ఆ బ్యాంకు వడ్డీ నేనిస్తాను అంటూ ఆ డబ్బుతీసుకొని నీకు గోల్డ్ కొన్నాను కదా! నెల రోజుల్లో బంగారం రేటు ఊహించని విధంగా పెరిగిపోయింది. ఈ విషయంలో అప్పు ఇచ్చిన ఆ శంకర్ కంటే అప్పు తీసుకున్న మనమే ఎక్కువ లాభపడ్డాం. ఎప్పటిలాగే అప్పుకే వడ్డీ రేటు వస్తాం. ఆ వడ్డీ రేటు శంకర్ కిస్తాను. మిగిలిన సొమ్ము రెండు మూడు వాయిదాలలో ఇచ్చేస్తాను. మనదగ్గర వారి రెండు లక్షలు కూడగట్టి కొని బంగారం కొనాలంటే రెండు ఆస్తులిచ్చాం. మంచి అప్పు అంటే ఇలా ఉంటుంది" వివరిస్తూ చెప్పాడు అప్పారావు.

అతనివైపు ఆశ్చర్యంగా చూసింది ఆదిలక్ష్మి.

"అప్పు చేయకూడదని, అప్పుచేస్తే తిప్పలు తప్పవని అందరూ అంటారంటే మీరు రివర్స్‌లో మాట్లాడుతున్నారు. నాకేదంతా తికమకగా ఉంది బాబూ!" అంది ఆదిలక్ష్మి తన బంగారు గాజులు సవరించుకుంటూ.

"అప్పు చెయ్యరాదు. వైద్యుడు లేనట్టి ఊరున ఉండవద్దు. చొప్పడ కున్నట్టి ఊర కోరకుము సుమతీ! అనే పద్యం నువ్వు వినలేదా? అది పెరాలి మాట! సుమతీ శతక కర్త అప్పన్న ఉండలేనే విచారించాలని శాసనం చేశాడు. అంటే అప్పు మంచిదని, అప్పు తప్పుకాదని అర్థం" వివరించాడు అప్పారావు.


కొత్త అర్థమైనట్టు తలూపింది ఆదిలక్ష్మి తన కొత్త మోడల్ గోల్డ్ చైన్ వైపు మురిపెంగా చూస్తూ.

మరో ఐదు నెలల తర్వాత ఆ బంగారం రేటు రెట్టింపయింది. అప్పారావు ఆనందం మూడురెట్లు పెరిగింది.

'మరో ఐదారు ఐదు వేలు చెల్లిస్తే శంకర్ బాకీ తీరిపోతుంది' మనసులోనే అనుకుంటూ హోల్డ్ అవసరంగా తిరుగుతున్న రెండు సీలింగ్ ఫ్యాన్స్ స్విచ్‌లను కసుక్కున ఆఫ్ చేశాడు అప్పారావు.

"ఆదిలక్ష్మీ మనం చెల్లించాల్సిన బాకీ అంతా ఉంది. ఇలా ఫ్యాన్లు అనవసరంగా వేసేసి కరెంటు






బిల్లు ఎక్కువ తెచ్చుకోకూడదు. అప్పుకు వడ్డీ కడుతున్నాం కాబట్టి ఆ వడ్డీని ఇక్కడ పొదుపు చేయాలి" ఒక కొత్త ఆర్థిక సూత్రాన్ని ఆదిలక్ష్మికి నేర్పించాడు అప్పారావు.

వెంటనే ఆదిలక్ష్మి ఒక్క పరుగున వెళ్లి వంటింట్లో వృథాగా వెలుగుతున్న లైట్ ఆపేసి వచ్చింది. ఒక శుభముహూర్తాన అప్పారావు పర్సనల్‌లోన్, పి.యఫ్ లోను పెట్టి వందగజాల స్థలం కొనేశాడు. 'అప్పు చేసి పప్పు కూడు తినరా ఓ నరుడా' అంటూ పదిసార్లు పాడేశాడు.

"ఇప్పుడా లోన్లు తీసుకొని ఆ స్థలం కొనకపోతే ఏమైంది? శంకర్ బాకీ తీరింది నిన్నటి నెలలోనే కదా!" విసుక్కుంది ఆదిలక్ష్మి.

"ఆదిలక్ష్మి! నువ్వు అక్కడే పొరబడుతున్నావు. బ్యాంకులో 'లోన్' ని తెలుగులో 'అప్పు' అనకూడదు. అది శాలరీలో మనకు తెలియకుండానే కట్ అవుతుంది. ఆ పీరియడ్‌లో అది తీరిపోతుంది. అప్పు బయట వడ్డీ వ్యాపారస్తుల దగ్గర తీసుకోకూడదు. మనకు నమ్మకమైన వారి దగ్గర అంటే మంచి వ్యక్తుల దగ్గరే అప్పు చేయాలి. అదీ తక్కువ వడ్డీ అయితేనే" మరొక ఆర్థిక సూత్రం చెప్పాడు అప్పారావు.

"ఈ రెండు లోనల్లా తీరే వరకూ నేను పనిమనిషిని మాన్పించేస్తాను. ఇంటి పని నేనే చేసుకుంటాను. స్కూల్ పిల్లలకు ట్యూషన్ కూడా చెబుతామనుకుంటున్నాను" అంది ఆదిలక్ష్మి ఉత్సాహంగా.

"థ్యాంక్యూ ఆదిలక్ష్మి! మూడేళ్ల తర్వాత లోన్స్ తీరిపోతాయి కదా! అప్పుడు హౌసింగ్‌లోన్ తీసుకొని స్వంత ఇల్లు కట్టుకుందాం" తృప్తిగా అన్నాడు అప్పారావు.

"మళ్లీ ఇల్లు కట్టు కోవడానికి అప్పా?" విచారంగా అంది ఆదిలక్ష్మి.

"ఆదిలక్ష్మి! ఇల్లు కట్టుకోవడానికి తీసుకొన్న లోన్ అసలు అప్పే కాదని ఒక ఆర్థిక శాస్త్ర వేత్త అన్నాడు. అయినా లోన్ ఇన్‌స్టాల్‌మెంట్ కట్టడానికి సరిపడ సొమ్ము మనకు ఒక పోర్షన్ నుండి వచ్చేస్తుంది" ఆదిలక్ష్మి చెవిలో గుసగుసలాడాడు అప్పారావు.

ఆదిలక్ష్మి ఆనందానికి హద్దేలేకపోయింది. అప్పు చేసి సంపాదించే కాన్సెప్ట్ మీద ఆదిలక్ష్మికి అనురాగం పెరిగిపోయింది.

*****

ఇల్లు పూర్తి చేసే వేళ ఇరవై వేలు తగ్గితే ఒక వ్యక్తి దగ్గర ప్రామిసరీనోటు వ్రాసి ఇరవై వేలు అప్పుతెచ్చాడు అప్పారావు. "ఖాళీ నోటుపై సంతకం చేస్తే పక్క వీధిలో వడ్డీ వ్యాపారస్తుడు ఎన్ని లక్షలైనా అప్పుగా ఇస్తాడట" తనకు తెలిసిన విషయాన్ని చెప్పింది ఆదిలక్ష్మి.

"ఆదిలక్ష్మి! నేను తెచ్చిన ఇరవైవేలూ, ప్రామిసరీ నోటుపై అక్షరాలా అంతే వ్రాసి తక్కువ వడ్డీకి తీసుకువచ్చాను. నువ్వు చెబుతున్నట్లు ఖాళీ నోటుపై సంతకం మహా ప్రమాదం. అలా ఎప్పుడూ చెయ్యకూడదు. ఎక్కువ వడ్డీకి అప్పు చేస్తే ముప్పుతప్పదు. జీవితమంతా వడ్డీ కట్టడానికే సరిపోతుంది. అప్పు చేసేటప్పుడు కొన్ని మెళకువలు, కొన్ని సూత్రాలు, కొన్ని జాగ్రత్తలు పాటించాలి" అంటూ హితబోధ చేశాడు అప్పారావు.

గృహ ప్రవేశం సమయంలో తన కొలీగ్స్ ఇచ్చిన ఇరవై వేల గిఫ్ట్ చెక్‌ని మార్చి అప్పు తీర్చేశాడు అప్పారావు.

ఇరవై వేల అప్పుని, వడ్డీతో సహా పువ్వుల్లో పెట్టి చెల్లించిన అప్పారావు వైపు ఆశ్చర్యంగా చూశాడు కాంతిలాల్.

"అప్పారావు గారూ! మీకు ఎన్ని లక్షలు కావాలన్నా ఇస్తాను. తీసుకోండి. ఎప్పుడు అవసరమైతే అప్పుడు అడగండి" చిరునవ్వుతో అన్నాడు కాంతిలాల్.

'లక్షల్లో అప్పు చేయాల్సి వస్తే నీ దగ్గర చెయ్యకూడదు.' మనసులోనే అనుకున్నాడు అప్పారావు. పైకి మాత్రం "అలాగేసార్!" అంటూ అక్కడి నుండి నిష్క్రమించాడు.

*****

మరో వారం రోజుల తర్వాత అప్పారావు దగ్గరకు అప్పులిచ్చే శేఠ్‌లు నలుగురు వచ్చారు. "సార్! మీకు అప్పు కావాలంటే మేమిస్తాం. మీ నిజాయితీ, క్రమశిక్షణ మాకు నచ్చాయి" అంటూ బ్రతిమాలారు.

"నో! థ్యాంక్స్!" అంటూ సున్నితంగా తిరస్కరించాడు అప్పారావు. విచారంగా నిష్క్రమించారు శేఠ్‌లు.

అతి తక్కువ కాలంలో అందలమెక్కుతున్న అప్పారావు వైపు వింతగా చూస్తున్నారు ఆఫీస్ స్టాఫ్. అప్పారావు బాస్ బదరీనాథ్‌కు విషయం అర్థంకాక తల గోక్కుంటున్నాడు. తను సెకండ్ హ్యాండ్ బైక్ మీద ఆఫీసుకు వెళ్లడం, అప్పారావు కొత్త మోడల్ న్యూ బైక్ మీద రావడం ఆఫీసర్‌కు అర్థం కాకుండా ఉంది. తను అద్దె ఇంట్లో సతమతమవడం, అప్పారావు గృహ ప్రవేశానికి ఆహ్వానించడం ఆఫీసర్‌ని పిచ్చెక్కిస్తోంది.

ఇక పోతే అప్పారావు కొలీగ్స్‌కి విషయం అర్థకాక, పిచ్చి చూపులు చూస్తున్నారు. లగ్జరీ వస్తువులు కొనడానికి లోన్స్ తీసుకొనే ఆ కొలీగ్స్‌కి రోజు రోజుకూ అప్పులు పెరిగిపోతున్నాయి. వారికి ఉద్యోగం రాక ముందుకంటే, వచ్చిన తర్వాత అప్పులు ఎక్కువైనాయి.

*****

కాలచక్రంలో మరో రెండు సంవత్సరాలు గడిచాయి. అప్పారావు జీతం పెరిగింది. ఆ పెరిగిన సొమ్మును ఇన్‌స్టాల్‌మెంట్‌గా పెట్టి కార్ లోన్ తీసుకొని కారు కొన్నాడు. కారు కొన్నరోజు ఆఫీస్‌లో గ్రాండ్‌గా పార్టీ ఇచ్చాడు. ఆ ఆఫీసులో అప్పారావు పై స్థాయి ఉద్యోగులు సుమారు ఇరవైమంది ఉంటారు. వారిలో ఒక్కరు కూడా అప్పారావులా ఎదిగిన వారు లేరు. అప్పారావు ఎదుగుతున్న తీరు వారిని అబ్బురపరచింది. అప్పారావు తెలివిగా ఒక్కో మెట్టూ ఎక్కుతున్న విధానం వారికి అర్థమైంది. అప్పారావు పద్ధతిలో తాము లేమని వారు అర్థం చేసుకున్నారు.

ఓ రోజు అసిస్టెంట్ మేనేజర్ హరీష్ లంచ్ టైంలో అప్పారావు దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. అప్పారావు చిరునవ్వుతో ఆహ్వానించాడు.

"చూడు అప్పారావ్! నువ్వు మంచి కొత్త మోడల్ కారు కొన్నావు కానీ రోజూ ఆఫీస్‌కి వేసుకు రావడం లేదే?" అంటూ ప్రశ్నించాడు.

"భలే వారు సార్! క్లర్కు ఉద్యోగం చేస్తూ రోజూ ఆఫీసుకి కార్లో వస్తే ఇంకేమైనా ఉందా? పెట్రోలుకి ఎంత ఖర్చవుతుంది! కారు స్టేటస్ సింబల్. ఎప్పుడైనా పార్టీలకు, ఫంక్షన్లకు వేసుకొస్తూ ఉంటాను. రోజూ కార్లో తిరిగితే నా ప్రోగ్రెస్ ఆగిపోతూ!" మరొక

ఆర్థిక సూత్రాన్ని వినిపించాడు అప్పారావు.

"చూడు అప్పారావ్! నాకొక సందేహముంది. తీరుస్తావా?" అడిగాడు హరీష్.

"అడగండి సార్!" నవ్వుతూ అన్నాడు అప్పారావ్.

"అప్పారావ్! నువ్వు ఒక మామూలు క్లర్కు ఉద్యోగం చేస్తున్నావ్. ఈ ఉద్యోగంలో ఉన్నవారు ఏ నెల జీతం ఆ నెల దైనందిన కార్యక్రమాలకు సరి పెట్టుకుంటారు. ఒక్కోసారి అదీ కష్టమే అవుతుంది. కానీ నువ్వు హుషారుగా ఒక్కో మెట్టూ ఎక్కేస్తున్నావ్? అది ఎలా సాధ్యం?" ఆశ్చర్యంగా అన్నాడు హరీష్.

''ఓహో! అదా సార్! నా విజయానికి కారణం అప్పులు సార్! అప్పులు! అప్పులు చేసి గొప్పవాడినయ్యాను. అప్పులే చెయ్యక పోతే నేనూ మీలాగే పేదవాడిగా మిగిలిపోయేవాడిని" అన్నాడు అప్పారావు.

గతుక్కుమన్నాడు హరీష్. 'అంటే అప్పారావు తనను పేదవాడిగా జమ కట్టేసాడు. తన జీతం అప్పారావు జీతం కంటే ఐదురేట్లు ఎక్కువ ప్చ్!' అనుకున్నాడు హరీష్.

రెండు క్షణాల తర్వాత అప్పారావుని ప్రశ్నించాడు.

"అప్పారావ్! అప్పులు చేసి గొప్పవాడివి ఎలా అయ్యావు? గతంలో నేను ఒకసారి ఏభై వేలు అప్పు చేశాను. దానికి వడ్డీలు కట్టీ కట్టీ ఇప్పటికి రెండు లక్షలు కట్టాల్సి వచ్చింది. ఇంకా ఇరవై వేలు కట్టాలి. రోజూ ఆ వడ్డీ వ్యాపారితో పేచీ పడుతూనే ఉన్నాను. ఒక్క అప్పు చేసి తప్పు చేసినట్లు ఫీలవుతున్నాను. నువ్వు ఇన్ని అప్పులు ఎలా తీర్చ గలిగావు?" అర్థంకానట్లుగా అడిగాడు హరిష్.

"అదే సార్! మీకూ నాకూ తేడా! మీరు పెద్ద వడ్డీకి అప్పు తెచ్చి ముందుగా కారు కొనేశారు. దానిని రోజూ ఆఫీసుకి వేసుకొస్తున్నారు. దానికి పెట్రోలు ఖర్చు, రిపేర్ల ఖర్చు, దానికి వేసిన షెడ్డు ఖర్చు, అంతా కలిసి తడిసి మోపెడయ్యింది. మీరు కారు కోసం చేసిన అప్పు చెడ్డ అప్పు. ఆ అప్పుతో ఏదైనా ప్రొడక్టివిటీ ఉన్న పని చెయ్యాల్సింది. ఒకవైపు అప్పు చేసినపుడు మరొక వైపు పొదుపు పాటించాలి. అలా కాకుండా మీరు విలాస వంతమైన జీవితం గడిపేశారు. నేను విజయ పథంలో పయనిస్తూ చివరికి కారుకొన్నాను. మీరు ఏమీ లేకుండానే ముందుగా కారు కొనేశారు. మీ కారు వేగంగానే వెళుతోందిగానీ మీరు స్లో అయిపోయారు. అసలు అప్పులు ఎప్పుడు చెయ్యాలి? దేని కోసం చేయాలి? అనే విషయాలు ప్రాథమికంగా అందరికీ తెలిసి ఉండాలి. లేకుంటే ఖాళీ ప్రామిసరీ నోటుపై సంతకం చేసినట్లు జీవితం చిక్కుల్లో చిక్కుకుంటుంది. సార్! ఒక్క విషయం చెప్పమంటారా? బ్యాంకులోనును బ్యాంకు వాళ్ల కంటే మనమే బాగా ఉపయోగించు కోవాలి" పకపకా నవ్వేశాడు అప్పారావు.

అప్పును సరిగా ఉపయోగించుకోలేనందుకు హరీష్‌కు ఏడుపు వచ్చినంత పనైంది. అప్పారావు మాటలకు హరీష్‌కు గుణ పాఠం కలిగింది. అతను ఆత్మవిమర్శలో పడిపోయాడు.

*****

మరో రెండు సంవత్సరాల తర్వాత అప్పారావుకు పొలం కొనాలనే ఆలోచన కలిగింది. తను సేవ్ చేసుకున్న డబ్బు నాలుగు లక్షల వరకూ ఉంది. మరో లక్ష అవసరమైంది. తన సన్నిహితులు పదిమంది దగ్గర చేబదులుగా ఆ లక్ష రూపాయలూ సమకూర్చుకున్నాడు. పొలం కొనేశాడు. హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

అప్పారావు ప్రోగ్రెస్ చూసి అతని కార్యాలయంలోనూ, అతని ఇరుగు పొరుగు చాలా మందిలో ఈర్ష్య, అసూయా కలిగాయి. అప్పు చేయడంలో అతనికున్న టెక్నిక్ తమకు లేదే అని కుమిలి పోయారు. ప్రభుత్వ పదవిలో ఉండి ఎన్నో లోన్స్ తీసుకుని పైకి వచ్చిన అతడు రిటైర్ అయిపోతే బావుండునని కోరుకున్నారు. కానీ మరి కొందరు అతనిని స్ఫూర్తిగా తీసుకున్నారు. అప్పారావు ఎదిగినట్లు తామూ ఎదగాలని ప్రయత్నాలు ప్రారంభించారు.

*****

కాల చక్రం మరింత వేగంగా ముందుకు సాగింది. అప్పారావు రిటైర్ అయిపోయాడు. ఆ మరునటి రోజు అతని కార్యాలయం ఎదురుగా 'అప్పుల కన్సల్టెన్సీ' అనే కొత్త బోర్డు చూసి ఆశ్చర్యపోయారు. అదేమిటా అనుకుంటూ దానిలోనికి జొరబడ్డారు. అప్పారావు కొత్త సూట్‌లో ధగ ధగా మెరిసి పోతున్నాడు. ఒక కొత్త రివాల్వింగ్ కుషన్ చైర్‌లో కూర్చుని ఉన్నాడు. అతనికి చెరొక ప్రక్కా ఇద్దరు క్లర్కులున్నారు. వారి ముందు ఒక రౌండ్ టేబుల్ ఉంది. దానిపై కొంత స్టేషనరీ ఉంది.

"అప్పారావు గారూ! ఏమిటిదంతా?" అర్థం కానట్లు అడిగాడు అసిస్టెంట్ మేనేజర్ హరీష్.

"హరీష్‌గారూ! నేను రిటైర్ అయిన తర్వాత ఈ కన్సల్టెన్సీ ఓపెన్ చేశాను. దీనికి నేను డైరెక్టర్ని. ఈ కన్సల్టెన్సీలో అప్పు అంటే ఏమిటి? ఏది మంచి అప్పు? ఏది చెడ్డ అప్పు? ఏ అప్పుతో ఏ పని చేస్తే బావుంటుంది? కొత్తగా ఏర్పడిన కుటుంబం ముందుగా ఏ అప్పు చెయ్యాలి? ఏ బ్యాంకులు ఏ రకం అప్పులు ఇస్తాయి? ఏ బ్యాంకు ఎంత శాతం వడ్డీకి అప్పు ఇస్తోంది? తదితర అంశాల పై ఇక్కడ సలహాలు ఇవ్వబడతాయి. మంచి అప్పులు తీసుకొనే దిశగా వ్యక్తులను ఈ కన్సల్టెన్సీ ప్రోత్సహిస్తుంది." చిరునవ్వుతో అన్నాడు అప్పారావు.

అప్పారావు ప్రతిభకు అక్కడున్న వారంతా విస్తుపోయారు.

"అప్పారావుగారూ! మీరు ఇంకా అప్పులు చేస్తూనే ఉన్నారా?" అడిగాడు శంకర్.

"లేదు శంకర్! నేను అప్పులు చేయ్యడం మానేశాను. ఇక నాకు అప్పులు చేయ్యాల్సిన అవసరం లేదు. కానీ ప్రస్తుతం నేను అప్పులు ఇవ్వాలనుకుంటున్నాను. ముందుగా నాకు ఎవరైతే సహాయం చేశారో వారందరికీ వడ్డీలేకుండా సహాయ పడదామనుకుంటున్నాను" అన్నాడు అప్పారావు.

"అప్పారావుగారూ! మీ కన్సల్టెన్సీలో సలహాలు ఉచితంగా ఇస్తారా? లేక ఫీజు ఉందా?'' అడిగాడు ఒక వ్యక్తి.

"మా కన్సల్టెన్సీలో ఉచితంగా సలహా ఇవ్వరు. ఫీజు వందరూపాయలు. ఇక పై ఎప్పుడూ పెంచే యోచన లేదు." తృప్తిగా సమాధానం చెప్పాడు అప్పుల కన్సల్టెన్సీ డైరెక్టర్ అప్పారావు.

☆

## టోపి

టోపి ఎండకాలంలో
గొడుగు
టోపి రక్షణ శాఖలో
గౌరవం
టోపి బట్టతలనైనా
జుట్టతలలా చూపుతుంది

గాంధీ టోపి
నెహ్రూ టోపి
హిందువు టోపి
ముస్లిం టోపి
ఏ టోపి అయితే ఏమి?
దర్జీ చేతిలో శిల్పం

ఈ టోపి
మన తలపై
కిరీటం
టోపి నువ్వు పెట్టుకొని
రక్షించుకో
టోపి మరొకరికి పెట్టి
భక్షించకు.

– వై. సత్యనారాయణ

ఎందరో సైన్స్ మహానుభావులు

# మహిళలు గడప దాటని రోజుల్లోనే యూరోప్‌లో రాణించింది

**శాస్త్ర సాంకేతిక పరిశోధనా రంగంలో మహిళలు తక్కువగా కనబడతారు.**

**ఈ రంగంలోని వివక్ష అనేది మరో విస్తృతమైన అంశం. అయితే తారసపడిన కొందరు భారతీయ మహిళా శాస్త్రవేత్తలు మాత్రం చాలా గుండె దిటవుతో పనిచేశారనిపిస్తుంది. సైటాలజి, జెనెటిక్స్, ఫైటో బయోలజి, ఎథ్నో బాటనీ, ఔషధ మొక్కలు, క్రోమోజోముల ప్రవర్తన - ఇలా పలు రకాలుగా కృషి చేసిన జానకి అమ్మాళ్ (1897-1984) ప్రత్యేకంగా కనబడతారు. బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ బొటానికల్ లాబొరేటరి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రల్ మెడిసిన్, కోయంబత్తూర్‌లోని షుగర్‌కేన్ బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్ - ఇలా చాలా పరిశోధనా సంస్థలలో గణనీయమైన పరిశోధన చేశారు.**



జానకీ అమ్మాళ్

జానకి అమ్మాళ్‌గా ప్రాచుర్యం పొందిన ఎదవలెత్ కక్కాట్ జానకి అమ్మాళ్ 1897 నవంబర్ 4న అప్పటి మద్రాను ప్రెసిడెన్సీ - ఇప్పటి కేరళలోని -టెల్లిచేరిలో జన్మించారు. శ్రీమతి దేవకి, ఈ.కె. క్రిష్ణన్ ఆమె తల్లిదండ్రులు. పదకొండు మంది సంతానంలో జానకి ఒకరు. తండ్రి మద్రాను ప్రెసిడెన్సీలో జ్యుడీషియల్ సర్వీస్‌లో పనిచేసేవారు. టెలిచెరిలోనూ, మద్రాస్ క్వీన్ మేరీ కాలేజీ, ప్రెసిడెన్సీ కాలేజీలోనూ చదివారు. 1921లో మద్రాను యూనివర్సిటీ నుంచి బి.ఏ. ఆనర్సు పొందారు. మద్రానులోనే ఉమెన్స్ క్రిస్టియన్ కాలేజీలో లెక్చరర్‌గా చేరారు. 1923లో ఎం.ఏ. పొందారు.

1914లో లెవీ ఎల్. బార్బర్ (Levi L. Barbour) ఇటువైపు దేశాల మహిళలు ఆధునిక విజ్ఞానం, వైద్యం, గణితం వంటి రంగాలు అధ్యయనం చేయడానికి వీలుగా స్కాలర్‌షిప్ ప్రారంభించారు. ఈ స్కాలర్‌షిప్ తోడ్పాటుతో జానకి అమ్మాళ్ 1925లో మిచిగన్ యూనివర్సిటీ నుంచి ఎం.ఎస్సీ. డిగ్రీ గడించారు. ఈ డిగ్రీ పొంది జానకీ అమ్మాళ్ అదే ఉమన్స్ క్రిస్టియన్ కాలేజీలో ప్రొఫెసర్ ఆఫ్ బాటనీగా చేరారు.

మళ్ళీ మరలా మిచిగాన్ యూనివర్సిటీకి తొలి ఓరియంటల్ బార్బర్ రీసెర్చి ఫెలోగా వెళ్ళి 1931లో డి.ఎస్సీ. పట్టాపొందారు. తిరువనంతపురంలోని మహారాజా కాలేజీ ఆఫ్ సైన్స్‌లో బోధన ప్రారంభించారు. ఆమెకు మిచిగాన్ విశ్వవిద్యాలయంలో చేసిన పరిశోధన బోధన కంటే ఆకర్షణీయంగా కనిపించింది.

కోయంబత్తూరులోని షుగర్ కేన్ బ్రీడింగ్ స్టేషన్ (నేడు దీనినే షుగర్‌కేన్ బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్ అంటారు)లో పూర్తిస్థాయి పరిశోధనలో దిగారు. ఆ సంస్థ అప్పటికే అంతర్జాతీయ ఖ్యాతిని పొందింది. దీనికి కారకులు సి.ఎ.బార్బర్, టి.ఎస్. వెంకటరామన్ వంటి వారి కృషి. కరువునూ, రోగాలను తట్టుకునే కో-419 చెరకు అక్కడి పరిశోధనా ఫలితమే. ఇక్కడ రూపొందించబడిన చెరకు రకాలు మనదేశంలోనే కాక చెరుకు పండించే ఇతర దేశాల్లో కూడా ప్రాచుర్యం పొందాయి. 1934 నుంచి 1939 దాకా జానకీ అమ్మాళ్ జెనెటిస్ట్‌గా పనిచేసి చెరకు, చెరకు సంబంధమైన గడ్డి రకాల సాయంతో సంకర రకాలు సృష్టించారు.

1939 నుంచి 1950 దాకా జానకీ అమ్మాళ్ ఇంగ్లాండులోని జాన్‌ఇన్స్ హార్టీకల్చర్‌తో ఇన్‌స్టిట్యూషన్‌లో అసిస్టెంట్ సైటాలజిస్ట్‌గానూ, పిమ్మట రాయల్ హార్టికల్చరల్ సొసైటీలో సైటాలజిస్ట్‌గానూ చేశారు. ఇంగ్లాండులో ఉన్నప్పుడే గార్డెన్ ప్లాంట్స్‌లోని క్రోమోజోముల గురించి చేసిన అధ్యయనం తర్వాత వాటి పరిణామం తెలుసుకోవడానికి దోహదం చేసింది. ఆమె పరిశోధనలు యూరో సైంటిస్టుల ప్రశంసలు పొందాయి.

1951 భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆహ్వానం మేరకు తిరిగి వచ్చి వ్యవస్థ రూపొందించింది. రెండేళ్ళ తర్వాత సెంట్రల్ బొటానికల్ లాబొరేటరీలో చేరి పరిశోధన చేశారు. ఈ సంస్థ తొలుత లక్నోలోనూ, తర్వాత అలహాబాదు నుంచి పనిచేసింది.

1959లో జమ్ములోని రీజినల్ రీసర్చి లాబొరేటరీలో చేరారు. అక్కడ ఐదేళ్ళు చేశాక జమ్ములోని రీజనల్ రీసర్చి లాబొరేటరీలోని సైటో జెనెటిక్స్ విభాగాన్ని ప్రారంభించారు. పిమ్మట 1964లో జమ్మూలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రల్ మెడిసిన్‌గా నేడు పిలువబడే సంస్థలో ఎమిరిటస్ సైంటిస్ట్‌గా చేశారు. జమ్ములో ఉన్నప్పుడే పర్వత ప్రాంతాల వృక్షజాలం గురించి ఆసక్తి పెరిగింది. చైనా, బర్మా, మలేషియాలో వృక్ష జాతులు ఎలా సంకరమయ్యాయో పరిశోధనగా చూపారు ఆమె.

కొంతకాలం ముంబయిలోని భాభా అటామిక్ రీసెర్చి సెంటర్‌లో పరిశోధన చేశాక, 1970లో మద్రాసులో స్థిరపడ్డారు. అయినా ఆవిడ పరిశోధన మానలేదు. అప్పటి కాలంలో చదవడం; విదేశాల్లో పరిశోధన చేయడం, ఢిల్లీ, లక్నో, అలహాబాదు, జమ్ము, బొంబాయి వంటి చోట్ల పరిశోధన కోసం పనిచేయడం మనకు ఆశ్చర్యం కల్గిస్తుంది. ఈ అనుభవాలను ఆవిడ పరిశోధనగా మార్చుకున్నది. అటవీ ప్రాంతాల్లో వృక్షజాలం ఎలా వ్యాప్తి చెందుతుందో పరిశోధించారు. శీతలంగా, చిత్తడిగా ఉండే ఈశాన్య హిమాలయాల వృక్షజాలం ఏ రకంగా పొడిగా, చల్లగా ఉండే వాయువ్య హిమాలయాల వృక్షజాలానికి భిన్నమో జానకీ అమ్మాళ్ చూపారు. ఆసియా ఖండపు వృక్ష జాలం సంబంధించి చేసిన పరిశోధన కూడా విశేషమైనదే! సి.డి. డార్లింగ్‌టన్‌తో కలసి సిద్ధం చేసిన 'ది క్రోమోజోమ్ అట్లాస్ ఆఫ్ కల్టివేటర్ ప్లాంట్స్' గ్రంథం ప్రపంచ స్థాయి గుర్తింపు గలది.

1956లో మిచిగాన్ యూనివర్సిటీ గౌరవ ఎల్‌ఎల్‌బి పట్టా బహూకరించింది. 1957లో భారతప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చింది. 1984 ఫిబ్రవరి 7న 86 సం॥ వయసులో జానకీ అమ్మాళ్ మరణించినా-చివరి వరకు ఆవిడ పరిశోధనలు చేశారు. ఆమె పరిశోధనా పత్రం తొలిసారి 1931లో ప్రచురింపబడగా, ఆఖరిది 1985లో (ఆమె మరణించిన తర్వాత) ప్రచురితమైంది. ఐదున్నర దశాబ్దాల పాటు సాగిన పరిశోధన వెనుక - దృఢచిత్తం, పూర్తి స్థాయి భారతీయ అలవాట్లు, గాంధీజీ జీవన శైలి, ప్రచారానికి అర్రులు చాచక పోవడం వంటివి స్పష్టంగా కనబడతాయి. అవసరమైన చోట రాజీ పడకుండా పోరాడిన వ్యక్తిత్వం కూడా ద్యోతకమవుతుంది. అంతటి సుద్గుణాల పోగు ఈ మహిళా శాస్త్రవేత్త!

*- డా॥ నాగసూరి వేణుగోపాల్*



# సంక్షేమ పథకాలకు సాయం చేయండి

## 14వ ఆర్థిక సంఘానికి ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి వినతి

**దే**శంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇతోధిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి శ్రీ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి 14వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి ఇచ్చే పన్నుల వాటాను కనీసం 40 శాతానికి పెంచాలని ఆయన కోరారు.

పద్మభూషణ్ డాక్టర్ వైవీరెడ్డి అధ్యక్షతన ఏర్పడిన 14వ ఆర్థిక సంఘం సెప్టెంబర్ 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో విస్తృత చర్చలు జరిపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి, ఇతర మంత్రులతో పాటు ప్రధాన కార్యదర్శి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, రాజకీయ పార్టీల నేతలతో ఆర్థిక సంఘం సభ్యులు చర్చలు జరిపి ప్రతిపాదనలు స్వీకరించారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టిన వివిధ సంక్షేమ పథకాల పనితీరుతో పాటు మెట్రో రైలు పనులను కూడా ఆర్థిక సంఘం పరిశీలించింది. శ్రీ వైవీ రెడ్డితో పాటు ఆర్థిక సంఘం సభ్యులు ప్రొఫెసర్ అభిజిత్ సేన్, శ్రీమతి సుష్మానాథ్, డాక్టర్ గోవిందరావు, డాక్టర్ సుదీప్తో ముండ్లే, శ్రీ అజయ్ నారాయణ ఝా కూడా చర్చల్లో పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో తాము చేపట్టిన సంక్షేమ పథకాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, ఫలితంగా రాష్ట్ర ప్రగతి పురోగమనంలో ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. 12వ పంచవర్ష ప్రణాళికలో రాష్ట్ర ఆర్థిక ప్రగతి 8.3 శాతానికి చేరుకుంటుందనే విశ్వాసం తనకుందని అన్నారు. జాతీయ స్థాయి కన్నా రాష్ట్ర ఆర్థిక ప్రగతి సూచి ఎక్కువ ఉందని ఆయన తెలిపారు.

వ్యవసాయ రంగంలో రాష్ట్రం ఎంతగానో పురోగమించిందని చెబుతూ, 2005 నుంచి 2012వరకు 5 శాతం ప్రగతి సాధించామని ఇది జాతీయ స్థాయిలోని 3.67 శాతం కన్నా చాలా ఎక్కువని శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక తీసుకువచ్చి దానికి చట్టబద్ధత కల్పించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు.

ఉప ప్రణాళిక కోసం రూ. 12,251 కోట్లు బడ్జెట్‌లో కేటాయించామని ఆయన గుర్తు చేశారు. 'బంగారుతల్లి' పథకం ద్వారా ఆడపిల్లలు వారి కాళ్ళపై వారు నిల్చునేలా చేస్తున్నామని, కోటి మంది రైతులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతో పాటు రూ. 1.85 లక్షల కోట్లతో 'జలయజ్ఞం' చేపట్టామని ముఖ్యమంత్రి ఆర్థిక సంఘం సభ్యులకు వివరించారు.

మహిళా సాధికారతలో రాష్ట్రం దేశంలో అగ్రగామిగా నిలిచిందని పేర్కొంటూ 1.46 కోట్ల స్వయం సహాయక సంఘాలకు 5 లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని చెప్పారు. స్త్రీనిధి బ్యాంకు ద్వారా రూ. 1650 కోట్ల మేర రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందిరమ్మ అమృత హస్తం ద్వారా 3.4 లక్షల మంది గర్భిణీలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు.

రాజీవ్ యువకిరణాల ద్వారా మూడేళ్ళలో 15 లక్షల మంది యువతీ యువకులకు శిక్షణ ఇప్పించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఏటా రూ. 4500 కోట్లు చెల్లించి 26 లక్షలకు పైగా వెనుకబడిన విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు పేదరిక నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా 2100 కోట్ల రూపాయలు వ్యయం చేసి 73.19 లక్షల మందికి పింఛన్లు అందచేస్తున్నామని చెప్పారు.

రూ. 3000 కోట్ల వ్యయంతో 2.25 కోట్ల మంది పేదలకు రూపాయికే కిలో బియ్యం అందిస్తున్నామని అన్నారు. 3572 కోట్ల రూపాయలను రాజీవ్ ఆరోగ్య శ్రీకి కేటాయించి పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల ద్వారా చికిత్సలు చేయిస్తున్నట్లు చెప్పారు. 2500 కోట్ల రూపాయలతో పేదలకు పక్కా ఇళ్ళు నిర్మించి ఇస్తున్నట్లు చెప్పారు.

'రచ్చబండ' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్ర ప్రభుత్వం పై ఆర్థిక భారం పడుతున్నా మౌలిక వసతుల కల్పనలో వెనకాడేది లేదని ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అనేక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపడుతున్నామని, 58 వేల కోట్ల రూపాయలతో చేపడుతున్న మెట్రో రైలు ప్రాజెక్ట్ తలమానికం కానున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ. 8 వేల కోట్ల మేర వ్యయం కానున్న మరో 37 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని ఆయన చెప్పారు.

గత ఏడాది హైదరాబాద్‌లో నిర్వహించిన భాగస్వామ్య సదస్సుకు మంచి స్పందన వచ్చిందని, రూ. 6.48 లక్షల కోట్ల పెట్టుబడితో ప్రాజెక్టులు నెలకొల్పేందుకు 234 సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని 12వ ప్రణాళిక వ్యయాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాల కన్నా ఎక్కువగా రూ. 3,42,842 కోట్లుగా చూపామని శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గుర్తించి అవసరాల మేరకు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్రం నుంచి రాష్ట్రానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం అంతకంతకు తగ్గడం పట్ల

## మంత్రివర్గ నిర్ణయాలు

# 5 వేల ఉద్యోగాల భర్తీకి ఆమోదం



**డి.కె. అరుణ**
*సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి*

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న మొత్తం 5 వేల పోస్టుల భర్తీకి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉపాధి కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీతో పాటు కొత్త నియామకాలు సత్వరం చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే వేలాది ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన సెప్టెంబర్ 20న జరిగిన మంత్రివర్గ సమావేశం ఉద్యోగ నియామకాలతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2009 సెప్టెంబర్ నుంచి 2010 నవంబర్ వరకు రాష్ట్రంలో వరుసగా సంభవించిన వరదలతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాలలో మరమ్మతుల కోసం ప్రపంచ బ్యాంక్ నుంచి వెయ్యి కోట్ల రూపాయల ఆర్థిక సహాయం తీసుకోవాలని కూడా మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు ఒక ముసాయిదాను మంత్రివర్గం ఆమోదించింది.

మంత్రివర్గం ఆమోదం వ్యక్తం చేసింది. ఇందులో పదవీ విరమణ చేసిన హైకోర్టు జడ్జి హోదాలో ఛైర్మన్, మరో ముగ్గురు సభ్యులు ఉంటారు.

మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్, నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, ప్రకాశం జిల్లా మార్టూరులో కొత్తగా ఇఎస్‌ఐ డిస్పెన్సరీలు ఏర్పాటు చేయడంతో పాటు వాటికి అవసరమైన సిబ్బంది నియామకానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మహిళా ఖైదీల కోసం వరంగల్, రాజమండ్రి, హైదరాబాద్‌లలో ప్రత్యేక జైళ్ళు, అనంతపురం, మంగళగిరి, ఒంగోలు, చిత్తూరులలో ప్రత్యేక సబ్‌జైళ్ళు ఏర్పాటు చేసే ప్రతిపాదనకు కూడా అంగీకారం తెలపడం జరిగింది.

రాష్ట్రంలో పలు జిల్లాలలో ఇండస్ట్రియల్ పార్కులు, లెదర్ పార్కులు ఏర్పాటు

రవాణా శాఖ పనిభారాన్ని దృష్టిలో పెట్టుకుని మొత్తం 392 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ నుంచి మొదలుకుని కింది స్థాయి సిబ్బంది వరకు ఉన్నారు. అలాగే అవినీతి నిరోధక శాఖలో కూడా కొత్తగా 47 పోస్టులకు నియామకాలు జరుపనున్నారు. ఇందులో జాయింట్ డైరెక్టర్ నుంచి పరిపాలనా సిబ్బంది వరకు ఉన్నారు.

రాష్ట్రంలో కొత్తగా నెలకొల్పనున్న విద్యుత్ ప్రాజెక్టుల పర్యవేక్షణ, నిర్వహణ కోసం జెన్‌కోలో 1105 ఖాళీలను భర్తీ చేయనున్నారు. రాజీవ్ విద్యామిషన్ ద్వారా గిరిజన ప్రాంతాలలో విద్యావకాశాలు పెంపొందించేందుకు 2 వేల మంది అధ్యాపకులను నియమించనున్నారు. నెల్లూరు సింహపురి, కరీంనగర్ శాతవాహన, కాకతీయ విశ్వవిద్యాలయాల అవసరాల మేరకు 160 పోస్టులు భర్తీ చేయనున్నారు. రాష్ట్ర సమాచార కమిషన్‌లో 38, పదవ వేతన సంఘం సిఫారసుల అమలు కోసం ఏర్పాటు చేసిన కార్యాలయం కోసం 34 మందిని నియమించనున్నారు.

### ఆస్తి పన్ను వివాదాలపై బోర్డు

రోజురోజుకు పెరుగుతున్న ఆస్తి పన్ను వివాదాలను దృష్టిలో పెట్టుకుని వాటి పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో బోర్డు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు

చేసి యువతకు ఉపాధి కల్పించాలని మంత్రి వర్గ సమావేశం నిర్ణయించింది. ఇందులో భాగంగా కృష్ణా జిల్లా జగ్గయ్యపేట వద్ద 498 ఎకరాలలో, నెల్లూరు జిల్లా పెళ్ళకూరు మండలం సిరసనం బేడు వద్ద 176 ఎకరాలలో ఇండస్ట్రియల్ పార్కులు, మహబూబ్‌నగర్ జిల్లా బలమూరు మండలం జింకుంట వద్ద 25 ఎకరాలలో, వరంగల్ జిల్లా ఘన్‌పూర్‌లో 25 ఎకరాలలో, కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కంతేపల్లిలో 40 ఎకరాలలో లెదర్ పార్కులు ఏర్పాటు చేయనున్నారు.

### విజయవాడ విమానాశ్రయానికి నిధులు

విజయవాడ ఎయిర్‌పోర్టును విస్తరించడంతో పాటు దానికి అవసరమైన 491 ఎకరాల భూమిని సేకరించి ఇవ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. విస్తరణ పనుల కోసం తొలి విడతగా రూ. 110 కోట్లు విడుదల చేయాలనే ప్రతిపాదనకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో రూ. 4800 కోట్ల భారీ వ్యయంతో ఐటీ సెజ్ ఏర్పాటుకు అంగీకరించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెల్పుతూ ఒక తీర్మానాన్ని మంత్రివర్గ సమావేశం ఆమోదించింది.

---

ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు. ఇది పదవ ఆర్థిక సంఘం హయాంలో 7.91 శాతం వాటా రాగా, 13వ ఆర్థిక సంఘం నాటికి అది 6.94 శాతానికి తగ్గిపోయిందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రణాళిక వ్యయంలో 40 శాతంగా లెక్కిస్తే కేంద్రం నుంచి 20 వేల కోట్ల రూపాయలు పన్నుల వాటా కింద రావాల్సి ఉంటుందని శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు.

ద్రవ్య నియంత్రణ చట్టాన్ని సవరించడం ద్వారా రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇవ్వాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల తరచుగా ఏర్పడే నష్టాలను గుర్తించి ఆర్థిక సహాయం పెంచడంతో పాటు అమ్మకపు పన్ను ద్వారా కూడా రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూరేలా సిఫారసు చేయాలని ఆర్థిక సంఘానికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

మన రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఆర్థికవేత్త శ్రీ వైవీ రెడ్డి ఆర్థిక సంఘం ఛైర్మన్ కావడం మన అదృష్టమని, రాష్ట్ర పరిస్థితులపై ఆయనకు పూర్తి అవగాహన ఉందని ఆర్థిక మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో ముందంజలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను నిధుల కేటాయింపులో ప్రత్యేక దృష్టితో చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


*– వెన్నూరి గణేశ్*

## శీఘ్రంగా విద్యుత్తు ప్రాజెక్టులు పూర్తి చేయాలి

రాష్ట్రంలో విద్యుదుత్పత్తి, వినియోగంపై రాష్ట్ర సచివాలయంలో ఆగష్టు 27వ తేదీన జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి అధికారులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ఎ.పి.జెన్‌కో చేపడుతున్న విద్యుత్తు ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి వచ్చే వేసవికాలం నాటికి కరెంట్ సరఫరా సజావుగా జరిగేలా చూడాలి. అంటే వచ్చే డిసెంబర్ నాటికి ఆయా ప్రాజెక్టుల పనులు పూర్తి కావాలి. ఇప్పుడున్న విద్యుదుత్పత్తి, సరఫరా పరిస్థితి సంతృప్తికరంగా ఉంది" అన్నారు.

"ఈ విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల పనులు పూర్తయితే వచ్చే ఏడాది ఏప్రిల్ చివరి నాటికి రాష్ట్రానికి 3.745 మెగావాట్ల విద్యుత్తు వినియోగంలోకి వస్తుంది. గ్రిడ్ సమస్యలను కూడా త్వరగా పరిష్కరించాలి. అటవీ భూముల్లో గ్రిడ్ టవర్లు నిర్మించేందుకు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి, అటవీ శాఖ నుంచి అనుమతులు పొందాలి" అని ముఖ్యమంత్రి సూచించారు.




కృష్ణపట్నం, కాకతీయ పవర్‌ప్లాంటు పనులు 2014 మార్చి నాటికి పూర్తవుతాయనీ, వాటివల్ల అదనంగా 2,330 మెగావాట్ల విద్యుత్తు అందుబాటులోకి వస్తుందనీ అధికారులు సి.ఎం.కి చెప్పారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి.కె. మహంతి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం.సాహు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ పి. భాస్కర్, ఎ.పి.ట్రాన్స్‌కో, జెన్‌కో సి.ఎం.డి.లు, నెడ్‌క్యాప్ ఎం.డి., ఇతర అధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## సౌర, పవన విద్యుత్తుపై సమీక్ష

పవన, సౌర విద్యుత్తు, ఇతర సంప్రదాయేతర ఇంధన శక్తిని ఉత్పత్తి చేసే ప్రాజెక్టులపై రాష్ట్ర సచివాలయంలో ఆగష్టు 28వ తేదీన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తికి అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాబోయే కొన్నేళ్లలో సౌర, పవన విద్యుదుత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే వారిని ప్రధానంగా ప్రోత్సహించనున్నాం. ప్రత్యామ్నాయ ఇంధన శక్తిని ద్విగుణీకృతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించాలి. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పనులను వెంటనే పూర్తి చేయాలి" అని అధికారులను ఆదేశించారు.

వెంటనే నెడ్‌క్యాప్ ఎం.డి. శ్రీ కమలాకర్ బాబు స్పందించి మాట్లాడుతూ, ప్రభుత్వం రూపొందించిన మూడంచెల విధానంలో సౌరవిద్యుత్తు ఉత్పత్తికి చర్యలు చేపట్టినట్లు సి.ఎం.కి తెలిపారు. గత ఆగష్టులో రూఫ్‌టాప్ సోలార్ నెట్‌మీటరింగ్ సిస్టంపై నిర్వహించిన ప్రదర్శన ద్వారా వినియోదారుల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేశామని సి.ఎం.కి చెప్పారు. ఫలితంగా 1,258 మంది వినియోగదారులు సోలార్ నెట్-మీటరింగ్ సిస్టంను అమర్చుకునేందుకు ముందుకు రాగా వారికి డిస్కమ్ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలు కల్పించినట్లు ఆయన సి.ఎం.కి వివరించారు. అంతేకాక, పవన విద్యుదుత్పత్తిని కూడా 2014 మార్చి నాటికి పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన సి.ఎం.కి చెప్పారు.

## ఎరువుల సరఫరాపై తనిఖీలు చేయాలి

"ప్రజలకు అత్యవసరసేవలు నిరంతరం అందేలా ఎప్పటికప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుండాలి. రైతులకు సహాయం అందించడంలో జాప్యం చేయరాదు. జల విద్యుదుత్పత్తి చేసేప్పుడు రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. ఎరువుల, సరఫరా, పంపిణీపై కూడా విజిలెన్స్ అధికారులతో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయిస్తుండాలి. ముఖ్యంగా రాష్ట్రంలో, జంట నగరాల్లో శాంతి భద్రతలకు భంగం కలుగరాదు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచి, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు గైకొనాలి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర సచివాలయంలో శాంతి భద్రతలు, వర్షాలు, రిజర్వాయరల్లో నీటి నిల్వలు, విద్యుదుత్పత్తి, వ్యవసాయ పనులపై సెప్టెంబర్ 10వ తేదీన జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పై విధంగా సూచించారు.

సి.ఎం తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డాక్టర్ సి.కె. మహంతి, పోలీసు, విజిలెన్స్ అధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## మార్చిలోగా స్యూయరేజ పనులు పూర్తి చేయాలి

రాష్ట్రంలోని వివిధ నగరాల్లో, జంటనగరాల్లో జె.ఎన్.ఎన్.ఎం.యు.ఆర్.ఎం పథకం కింద జరుగుతున్న ప్రాజెక్టుల పనులపై రాష్ట్ర సచివాలయంలో సెప్టెంబర్ 2వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సమీక్షించి, పలు కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ నవీకరణ పథకం కింద తొలివిడతగా గ్రేటర్ హైదరాబాద్‌లో చేపట్టిన సీవరేజి మాస్టర్‌ప్లాన్ పనులను వచ్చే 2014 మార్చిలోగా పూర్తిచేయాలి. ఈ పథకంలో రెండవ దశకింద చేపట్టాల్సిన పనుల కోసం ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపాలి" అని అధికారులను ఆదేశించారు.

తర్వాత జలమండలి ఆధ్వర్యంలో పాతబస్తీలోని జోన్-1, జోన్-2, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ స్యూయరేజ మాస్టర్ ప్లాన్ పనులు, తాగునీటిని నిల్వచేసే రిజర్వాయర్ల ఇన్‌లెట్, ఔట్‌లెట్ డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ విస్తరణ పనుల గురించి ముఖ్యమంత్రి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ పథకంలో రూ. 2130.75 కోట్ల విలువ చేసే 26 ప్రాజెక్టులకు రాష్ట్ర స్థాయి కమిటీ ఆమోదించింది.

ఈ సమీక్ష సమావేశంలో మెట్రో వాటర్ బోర్డు ఎం.డి. శ్రీ జె. శ్యామల రావు, ఇ.డి. శ్రీ ఎం. సత్యనారాయణ ఆర్టీసీ ఎం.డి. శ్రీ ఎ.కె.ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు నష్టపరిహారం

"విశాఖపట్నంలోని హెచ్.పి.సి.ఎల్ దుర్ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు వీలైనంత అధిక మొత్తంలో నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి. సీనియర్ అధికారులు సహాయక చర్యలను స్వయంగా పరిశీలించాలి క్షతగాత్రులకు నాణ్యమైన వైద్య సహాయం అందించి, పునరావాస చర్యలు వేగవంతం చేయాలి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

హెచ్.పి.సి.ఎల్. దుర్ఘటన అనంతరం చేపట్టిన సహాయక చర్యలపై ఆగస్టు 24వ తేదీన రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "సహాయక చర్యలు చేపట్టడంలో అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పనిచేయాలి" అని సూచించగానే అధికారులు స్పందించి మాట్లాడుతూ, హెచ్.పి.సి.ఎల్ దుర్ఘటనలో ఆర్గురు మరణించగా, 96 మంది గాయ పడినట్లు సి.ఎం.కి చెప్పారు. తీవ్రంగా గాయపడిన 16 మందిని విమానంలో ముంబాయి ఆస్పత్రికి పంపి చికిత్స చేయిస్తున్నట్లు అధికారులు

సి.ఎం.కి వివరించారు. రెవెన్యూ, పోలీసు అగ్నిమాపక వ్యవస్థలు అత్యవసర సేవలు కొనసాగిస్తున్నాయనీ, బాధితులంతా కాంట్రాక్టు వర్కర్లనీ అధికారులు సి.ఎం.కి తెలిపారు.

ఈ సమీక్ష సమావేశంలో సి.ఎం.తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ పి.కె.మహంతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బియ్యం, ఉల్లి ధరలను నియంత్రించాలి

నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై రాష్ట్ర సచివాలయంలో పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో ఆగస్టు 30న ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో సమీక్ష సమావేశం జరిగింది. ఇందులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ముఖ్యంగా బియ్యం, ఉల్లిగడ్డల ధరల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. 'అమ్మహస్తం' పథకం కింద 2 కోట్ల 25 లక్షల మంది లబ్ధిదారులకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులను రూ. 185కు అందించే కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలి" అని పౌర సరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులను ఆదేశించారు.

"ఆరు జిల్లాల్లోని చౌక ధరల దుకాణాల్లో 'ఇ-పాస్ మెషిన్ల'ను త్వరగా ప్రవేశపెట్టాలి. అయిదు జిల్లాల్లో గ్యాస్ కనెక్షన్‌పై సబ్సిడీ పొందటానికి బ్యాంకు ఖాతాలతో ఆధార్‌కార్డుల అనుసంధానానికి గడువు తేదీని పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నాం. ఇంతవరకూ హైదరాబాద్, రంగారెడ్డి, తూర్పుగోదావరి, చిత్తూరు, అనంతపూర్ జిల్లాల్లో 48 శాతం మాత్రమే ఆధార్‌తో అనుసంధానం పూర్తయింది. ఇదేకాక రైస్ మిల్లుల లెవీ శాతాన్ని 75 శాతానికే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని కోరనున్నాం" అని ముఖ్యమంత్రి తెలిపారు.

మంత్రులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ, శ్రీ ముఖేష్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.కె. మహంతి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ శ్రీ సునీల్ శర్మ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి.వి. రమేష్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

## రూ. 464 కోట్లతో స్పిన్నింగ్ ప్రాజెక్టు

కేంద్ర జౌళిశాఖ మంత్రి శ్రీ కావూరి సాంబశివరావు, ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సి.ఎం. క్యాంపు కార్యాలయంలో సెప్టెంబర్ 16న జౌళి, చేనేత రంగాలపై జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

రాష్ట్ర టెక్స్‌టైల్ రంగంలో స్పిన్నింగ్, వీవింగ్ ప్రాజెక్టులకు రూ. 464 కోట్లు పెట్టుబడిగా పెట్టేందుకు జాతీయ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ (ఎన్.టి.సి) నిర్ణయించింది. గ్రూపు అప్రోచ్ కింద నలభై, క్లస్టర్ అప్రోచ్ కింద 15 ప్రతిపాదనలను మంజూరు చేసేందుకు కేంద్రమంత్రి శ్రీ కావూరి సాంబశివరావు అంగీకరించారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీ సాంబశివరావు మాట్లాడుతూ... "వచ్చే బడ్జెట్‌లో అనంతపురం జిల్లా ధర్మవరంలో సమగ్ర చేనేత అభివృద్ధి పథకం కింద మెగా క్లస్టర్ ఏర్పాటు చేయనున్నాం. పోచంపల్లిలో ఖాయిలాపడిన హ్యాండ్లూమ్ పార్కును పునరుద్ధరించేందుకు కేంద్రప్రభుత్వం సానుకూలంగా ఉంది. దీనికై అధికారిక కమిటీ కార్యాచరణ చేస్తోంది" అని తెలిపారు.

"చిత్తూరు జిల్లా నగరి, కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో వాడుకలో లేని మరమగ్గాలను అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనలున్నాయి. చేనేత కార్మికులకు సంబంధించి పునరుద్ధరణ, సంస్కరణ, పునర్ వ్యవస్థీకరణల విధానాలను సవరించేవి విషయం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మన రాష్ట్రంలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఫర్ టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్ సెంటరును ఏర్పాటు చేయ సంకల్పించాం" అని శ్రీ కావూరి సాంబశివరావు వివరించారు.

ముఖ్యమంత్రి శ్రీ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, 12వ పంచవర్ష ప్రణాళికలో భాగంగా చేనేత రంగంలో 15 నుంచి 20 వేల మందికి నైపుణ్యం పెంచేందుకు రాజీవ్ యువకిరణాలు కార్యక్రమంతో అనుసంధానించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రమంత్రి శ్రీ జి. ప్రసాద్ కుమార్, ఆప్కో చైర్మన్ శ్రీ సి.హెచ్. హనుమంతరావు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ ప్రదీప్‌చంద్ర, ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## సాయుధ బలగాలతో అటవీశాఖ బలోపేతం

"పోలీసు శాఖ ఎలా ఉందో అదే రీతిగా అటవీశాఖను కూడా బలోపేతం చేయాలి. అటవీశాఖ అధికారులపైన, సిబ్బందిపైన దాడులు చేస్తున్న స్మగ్లర్లను కఠినంగా శిక్షించాల్సి ఉంది. దోషులను జైలు పాలు చేయటానికి అటవీ చట్టాన్ని సవరించాలి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు.

అటవీశాఖ స్థితిగతులపై హైదరాబాద్‌లోని సి.ఎం. క్యాంపు కార్యాలయంలో సెప్టెంబర్ 19న సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ఇటీవల నిజామాబాద్ జిల్లాలో అటవీశాఖ అధికారి శ్రీ గంగయ్య హత్యకు గురవడం దారుణం. అలాంటి దారుణాలు జరగకుండా మరో నలభై సాయుధ బలగాలను సమకూర్చాలని నిర్ణయించాం. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. అటవీశాఖ కోసం ప్రభుత్వం తరఫున న్యాయవాదిని నియమించాలి" అని అటవీశాఖ అధికారులను ఆదేశించారు.

"ఎర్రచందనం స్మగ్లర్లపై విధించే జైలు శిక్షకాలాన్ని పదేళ్ళకు పెంచాలి. రూ. 10 వేల జరిమానాను రూ. 10 లక్షలకు పెంచాలి. దీని కోసం అటవీ, పి.డి. చట్టాన్ని సవరిస్తాం. టేకు, రోజ్‌వుడ్, గంధపు చెక్కల అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని సి.ఎం. సూచించారు.

అటవీ శాఖ మంత్రి శ్రీ శత్రుచర్ల విజయరామరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ పి.కె. మహంతి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ శామ్యూల్, తదితర అధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## రహదారుల పనులు వేగవంతం చేయండి

రాష్ట్రంలో రహదారుల నిర్మాణం పనులను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ ప్రాజెక్టులు సత్వరం చేపట్టాలని ముఖ్యమంత్రి శ్రీ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖ పనితీరును ఆయన సెప్టెంబర్ 6న సమీక్షించారు. ప్రణాళిక, ప్రణాళికేతర పద్దుల కింద చేపట్టిన పనులతో పాటు కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంక్, ఇతర ఆర్థిక సంస్థల సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రహదారుల పనులను ఆయన ఈ సమావేశంలో సమీక్షించారు. నిధులు వృథా కాకుండా ఈ ఆర్థిక సంవత్సరంలోనే పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

నీలం తుఫానుతో పాటు ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులను సమీక్షించిన ముఖ్యమంత్రి వీటికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు.

ప్రణాళిక వ్యయం కింద చేపట్టే రహదారుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చెబుతూ ఆర్థిక సంవత్సరం చివరి వరకు వేచి చూడకుండా తక్షణం చేపట్టాలని శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి సూచించారు. నిధులను దృష్టిలో పెట్టుకుని రహదారుల నిర్మాణం ప్రాధాన్యతాపరంగా చేపట్టాలని, అవసరమైతే అదనపు నిధులు కూడా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

శాసనమండలికి నూతన భవనంపై సలహాదారులను నియమించి ప్రణాళికలు తయారు చేయాలని కూడా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ భాస్కర్, రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ శ్యాంబాబుతో పాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

*





**"మనమంతా కలసికట్టుగా ఉంటేనే లాభం. అలాగైతేనే ఏదైనా సాధించవచ్చు. ప్రజలకూ, ప్రభుత్వానికీ మధ్య అనుసంధాన కర్తలుగా అధికారులు పని చేయాలి. ప్రజల అవసరాలను గుర్తించి, ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సలహాలూ, సూచనలూ ఇచ్చి సుపరిపాలన అందించే దిశగా చిత్తశుద్ధితో కృషి చేయాలి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు.**

# ప్రజలకు బాధ్యులుగా ఉంటేనే ప్రభుత్వాలకు మనుగడ : సి.ఎం.

కేంద్ర సర్వీసులకు కొత్తగా ఎంపికయిన ఐ.ఎఫ్.ఎస్. అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ఎం.సి.హెచ్.ఆర్.డి.లో సెప్టెంబర్ 3వ తేదీన లాంఛనంగా ప్రారంభిస్తూ ప్రస్తావించిన అంశాలు శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి మాటల్లో.... "నిజానికి రాజకీయాల్లో అవినీతి సర్వసాధారణమైనదే. రాజకీయ నాయకుల సంపాదన మళ్లీ ప్రజల వద్దకే వెళుతుంది. అయితే అది కూడా ఉండకూడదన్నదే నా నిశ్చితాభిప్రాయం. వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారుల వద్ద ఉన్న నల్లధనం సమాజంలోకి రాదు. రాజకీయ నేతలు అయిదేళ్లకోసారి ప్రజలు పెట్టే పరీక్షలో విజయం సాధించాల్సి ఉంటుంది.

అయితే అధికారులు మాత్రం ఒక్కసారి పోటీ పరీక్షలో ఉత్తీర్ణులైతే 30 నుంచి 35 ఏళ్లపాటు సర్వీసులో కొనసాగే అవకాశముంటుంది. ప్రజలకు బాధ్యులుగా ఉండకపోతే ప్రభుత్వాన్ని పడగొట్టే సత్తా వారిలో ఉంది. అందుకే ప్రజల అవసరాలు తీర్చే ప్రభుత్వ పథకాలను వారికి అందేలా గురుతరమైన బాధ్యతలను నిర్వర్తించాల్సింది అధికారులే" అని వివరించారు.

"మన దేశంలో ఏ ఇతర రాష్ట్రమూ కేటాయించని రీతిలో దాదాపూ రూ.25 వేల కోట్లు ఉన్నత విద్యాభివృద్ధికి మన రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తెచ్చిన ఆహార భద్రత పథకం కన్నా ముందుగానే.... అంతకన్నా ఉన్నత స్థాయిలో పలు పథకాలు అమలు చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి తెలిపారు.

అధికారుల ఫౌండేషన్ కోర్సు ప్రారంభోత్సవంలో సి.ఎం.తో పాటు ఎం.సి.హెచ్.ఆర్.డి. అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీ చంద్రవదన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

★

# నవంబర్ 14 నుంచి అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం

**18వ అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలు నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరుగుతాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. బాలల చలన చిత్రోత్సవాల నిర్వహణకు 35 మంది సీనియర్ అధికారులతో ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది.**

సుమారు లక్షన్నర మంది చిన్నారులు ఈ బాలల చలన చిత్రోత్సవాల్లో పాల్గొంటారని అంచనా. పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలుగులలితకళాతోరణంలో ప్రారంభ, ముగింపు కార్యక్రమాలు జరుగుతాయి. ఒక ప్రధాన వేదికగా ఎంపికైన ప్రసాద్ ఐమ్యాక్స్ థియేటర్‌లో బాలల చలనచిత్రాలను ప్రదర్శిస్తారు. మరికొన్ని థియేటర్లలో కూడా చిత్రాలను ప్రదర్శిస్తారు.

దీన్ని పురస్కరించుకుని ఇప్పటికే 72 దేశాల నుంచి 856 బాలల చిత్రాలకు ఎంట్రీలు వచ్చాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ పి.కె.మహంతి తెలిపారు. ఈ ఉత్సవంలో ఆసియన్ పనోరమా, చిన్నారులు దర్శకత్వం వహించిన అనేక చిత్రాలతో పాటు వివిధ పోటీల్లో పాల్గొన్న చిత్రాలను ప్రదర్శిస్తున్నట్లు ఆయన వివరించారు. వివిధ విభాగాల్లో ప్రావీణ్యం గల వెయ్యిమంది విద్యార్థులను ఉత్సవాల నిర్వహణ బాధ్యతలలో నిమగ్నులను చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

రాష్ట్ర చలన చిత్ర నాటక రంగ, టెలివిజన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎం. దాన కిషోర్ ఈ కమిటీకి కన్వీనరుగా వ్యవహరిస్తారు.

★



# మాతృభాషా వికాసమే మన ధ్యేయం కావాలి: సి.ఎం.

**"ప్రతీ ఇంట్లో తెలుగు భాషపై మమకారం చూపితేనే తెలుగు భాషా వికాసానికి అడ్డంకులుండవు. కుటుంబంలోని సభ్యులందరూ తెలుగు భాష మాట్లాడడంలోనూ, సంప్రదాయాలు పాటించడంలోనూ శ్రద్ధ చూపాల్సి ఉంది. ఇలా ప్రతీ ఒక్కరూ తెలుగు భాషకు ప్రాధాన్యతనిస్తే తెలుగు భాషా వికాసం జరుగుతుంది. మాతృభాషను విస్మరించకుండా భాషా సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించివల్లవుతుంది" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సూచించారు.**

హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి పంతులు 150 వ జయంత్యుత్సవం సందర్భంగా ఆగస్టు 29న జరిగిన సభలో ప్రస్తావించిన విషయాలు ముఖ్యమంత్రి మాటల్లో ... "దేశాల మధ్య హద్దులు చెరిగిపోతున్నాయి. అంతరాలు తగ్గిపోయాయి. ప్రపంచం ఒక కుగ్రామంగా మారిపోయింది. ఇలాంటి స్థితిలో మనం ఆంగ్ల భాషను మాత్రమే అనుసరించాలనుకోవడం అత్యంత దురదృష్టకరం. మనం మన తెలుగు భాషను కచ్చితంగా ప్రోత్సహించుకోవాలి" అని అన్నారు.

ఇటీవల తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతంగా జరిగాయి. మన భాష, విలువలను తమ పిల్లలకు తెలియజేయాలన్న అభిమానం, తాపత్రయాలతో ఆ నాటి తెలుగు సభలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావడం జరిగింది. ఈ మహాసభలు ముగిశాక తెలుగు భాషా పరిరక్షణకు పలు చర్యలు తీసుకున్నాం, అయితే ఇటీవలి కాలంలో మానవ సంబంధాల్లో వస్తున్న మార్పులు బాధాకరంగా పరిణమిస్తున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని పిల్లలకు విలువలు పెంపొందించే విద్యాబోధనకు ప్రాధాన్యత ఇవ్వాలి" అని సి.ఎం. సూచించారు.



సాంస్కృతిక శాఖ సంచాలకులు శ్రీ రాళ్లబండి కవితా ప్రసాద్ మాట్లాడుతూ, "రవీంద్రభారతిలో జరిగే అన్ని కార్యక్రమాలకు ముద్రించే ఆహ్వాన పత్రాలను తెలుగు భాషలోనే ముద్రించాలని ఆంక్షలు విధించాం" అని చెప్పారు.

సభావేదికపై వివిధ శాఖల పరిపాలనా పదకోశం, అధికార భాషా సంఘం కార్యక్రమ నియమావళి, నల్గొండ జిల్లా పరిపాలనలో ఆ జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో తెలుగును ఉపయోగించడం, ఇందుకు కావాల్సిన వాటిపై రూపొందించిన పదాలు - అర్థాలు కల నిఘంటువులను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

తర్వాత డాక్టర్ అల్లంశెట్టి చంద్రశేఖర రావు, (భాషాసేవ), శ్రీ జి. వెంకట రామారావు (పత్రికా రచన), ఆచార్య పేరి భాస్కర రావు (భాషా శాస్త్రం), ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి (విమర్శ)లను నగదు, ప్రశంసా పత్రాలతో ముఖ్యమంత్రి సన్మానించారు.

అధికార భాషా సంఘం అధ్యక్షులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రులు శ్రీయుతులు వట్టి వసంత కుమార్, ఎం. మహీధర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

చివరగా శ్రీ కృష్ణ జన్మాష్టమి, నవమి (పాదుకాపూజ)ల సందర్భంగా శతరూప -2013లో భాగంగా సాంస్కృతిక శాఖ నిర్వహించిన శ్రీకృష్ణ వేషధారణ పోటీల్లో పాల్గొన్న రెండు నుంచి 12 ఏళ్లలోపు బాలబాలికలతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. బాలకృష్ణుని వేషధారణలో ముద్దులొలికిన పలువురు చిన్నారులను ఆయన ఎత్తుకున్నారు.

- రాజఫణి.వి

# 'సర్టిఫికెట్' పొందటం ఇంత సులువా!

**పౌరులకు సేవలు తేలిగ్గా, త్వరగా అందించాలని, అలాగే ప్రభుత్వ కార్యాలయాల కార్యకలాపాలలో పూర్తి పారదర్శకత తేవాలన్న లక్ష్యంతో 'మీ సేవా' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో లబ్ధిదారులు తమకు అవసరమైన సర్టిఫికెట్లను శ్రమ లేకుండా ఎంతో సులవుగా పొందుతున్నారు.**

ఈ మీ సేవా కార్యక్రమం ద్వారా పౌరులకు అత్యంత అవసరమైన అడంగల్, ఆర్.ఓ.ఆర్. 1బి నకల్, ఎఫ్ఎంబి, గ్రామ భౌగోళిక పటం, ఆదాయ, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ (కులం–స్థానికత –జనన తేదీ), రెవిన్యూ రికార్డులలో వివరాల మార్పులు, ఇంకుంబరన్స్ సర్టిఫికెట్స్ జారీ, రిజిస్ట్రేషన్ పత్రాల ధృవీకృత నకళ్లు, ముందస్తు రిజిస్ట్రేషన్, రేషన్ కార్డుల్లో మార్పు, చౌకదుకాణంలో మార్పు, పోగొట్టుకొన్న లేదా తస్కరించిన ముఖ్యమైన దస్తావేజులు తదితర వంద రకాల సేవలను ప్రభుత్వం 'మీ సేవా' ద్వారా ప్రజలకు అందించే బృహత్తర కార్యక్రమం అమలు చేస్తోంది.

చిత్తురు జిల్లాలో ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, 2011 నవంబర్‌లో మొదటగా 12 రకాల సేవలతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో నేడు వంద రకాల సేవలను అందిస్తున్నారు.

ప్రధానంగా ప్రజలు కార్యాలయాలు చుట్టూ తిరుగుతూ కాలయాపన కాకుండా వారికి ఒక సమయం కేటాయించి, నిర్దేశిత సమయంలో వారు కోరిన సర్టిఫికెట్లు అందించడమే ప్రధాన లక్ష్యంగా 'మీ సేవా' కేంద్రాలు ప్రారంభమయ్యాయి.

'మీ సేవా' కేంద్రం ద్వారా అందించే ప్రతి సేవకు ఒక నిర్దేశిత సమయాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో 200 మీ సేవా కేంద్రాల ద్వారా ప్రజలు సేవలు అందుకొంటున్నారు.

చిత్తూరు జిల్లాలోని యాదమరి మండలంలో ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రంలో కొట్టాలం




గ్రామానికి చెందిన వి.రేఖ ఓబిసి సర్టిఫికెట్‌కు, జనన ధృవీకరణ పత్రాలకి దరఖాస్తు చేసుకొన్నామని, నిర్దేశించిన సమయాని కంటే ముందుగానే తాను సర్టిఫికెట్లు పొందినట్లు ఆనందం వ్యక్తం చేశారు.

ఇదే మండలంలోని వ్యాపనపల్లి గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి బ్యాంకు రుణం కోసం తన పొలానికి చెందిన అడంగల్ 1బికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే అతనికి 1బి అందించడంతో లబ్ధిదారుడు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పరంగా ప్రజలకు పూర్తి పారదర్శకతతో సేవలందించడంలో 'మీ సేవా' కేంద్రాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. రెవిన్యూ, రిజిస్ట్రేషన్, పౌర సరఫరాలు, మున్సిపల్, పోలీసు తదితర శాఖలకు సంబంధించి ప్రజలకు కావలసిన సేవలను సులభంగా, వేగంగా అందజేస్తున్నందుకు జిల్లా ప్రజలు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మీ సేవా కేంద్రాల నిర్వహణ, ధృవీకరణ పత్రాల జారీలో చిత్తూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ధృవ పత్రాల జారీలో రాష్ట్రంలోనే ఇతర జిల్లాలకన్నా అత్యుత్తమ సేవలు అందించి ప్రథమ స్థానం పొందింది. మీ సేవా కేంద్రాల ఉత్తమ నిర్వహణకు గాను జిల్లా కలెక్టరు సాల్మన్ ఆరోగ్య రాజ్, జిల్లా సంయుక్త కలెక్టర్ వి.వినయ్‌చంద్‌లు 2013 జనవరిలో హైదరాబాదు జూబ్లీహాలులో జరిగిన 'మీ సేవా' సదస్సులో ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకొన్నారు.

జిల్లాల నుంచి...

జిల్లాలో ఉన్న 'మీ సేవా' కేంద్రాలకు ఎ,బి కేటగిరిల కింద ప్రారంభం నుంచి జూలై వరకు 11,37,623 దరఖాస్తులు అందగా అందులో ఏ–కేటగిరి కింద 2,59,889 మందికి సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగింది. బి– కేటగిరి కింద అందిన ధరఖాస్తుల్లో 8,01,861 ఆమోదించి జారీ చేయడం జరిగింది.

*– ఐ.ఆర్.లీలావతి, చిత్తూరు*

# జొన్న, మొక్కజొన్నలకు మద్దతు ధరలు



మనరాష్ట్ర రైతాంగం పండించే మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులకు కొత్తగా నిర్ణయించిన కనీస మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 24న ప్రకటించింది. మొక్కజొన్న క్వింటాలు ఒక్కింటికి కనీస మద్దతు ధర రూ. 1310గాను, జొన్నలు క్వింటాలు ఒక్కింటికి రూ. 1250గాను, హైబ్రీడ్ జొన్న క్వింటాలు ధర రూ. 1500గాను నిర్ణయించింది.

అలాగే మలదండి జొన్న క్వింటాలు ఒక్కింటికి రూ. 1520, రాగులు క్వింటాలు ధర రూ. 1500లుగా ఖరారు చేసి, ఆయా పంటలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం సూచించింది. ✻







# అలరిస్తున్న 'శతరూప'

**2013 వ సంవత్సరాన్ని తెలుగు భాషా సాంస్కృతిక వికాస సంవత్సరంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జరుపుకుంటోంది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ 'శత రూప' మూరు రోజుల సాంస్కృతికోత్సవాలను ఆగస్టు 2 నుండి నిర్వహిస్తోంది. ఇవి మూరు రోజుల పాటు నవంబర్ 17 వరకు సాగుతాయి.**

**భారత దేశంలోనే తొలిసారిగా 'శతరూప' కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంస్కృతిక శాఖ 2006 లో శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని 23 జిల్లాల కళారూపాల ప్రదర్శనతో మూరు రోజుల కార్యక్రమం జరుపుతోంది. ఇందులో వర్ధమాన కళాకారుల నుంచి పరిణతి చెందిన కళాకారుల వరకు భాగస్వాములవుతున్నారు.**

సాంస్కృతిక శాఖ నిర్వహించే ప్రతిష్ఠాత్మక కార్యక్రమం 'శతరూప' కళాభిమానులందరినీ అలరిస్తోంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణమంతా పండుగ వాతావరణంలో కళకళలాడుతోంది. కళా ప్రదర్శన జరుగుతున్న ఘంటసాల కళా వేదిక ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. 'శతరూప' కార్యక్రమాలు దేశ విదేశాలలోని అందరి దృష్టిని ఆకర్షించిందని చెప్పవచ్చు.

ఈ ఏడాది 'శతరూప'కు ఓ ప్రత్యేకత వుందని చెప్పక తప్పదు. గత డిసెంబరులో తిరుపతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 4వ ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి ప్రకటించిన విధంగా తెలుగు భాషా సాంస్కృతిక వికాస కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా పలు వేదికలపై వైభవంగా జరుగుతున్నాయి.

'శతరూప' సాంస్కృతికోత్సవాలను తెలుగు భాషోద్యమ సారథులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ ఆగష్టు 2 న ప్రారంభించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభకు అధ్యక్షత వహించారు. తొలి కార్యక్రమంగా అవధాన సప్తాహం ఏర్పాటు చేశారు. సహస్రావధాని డా॥ మేడసాని మోహన్ అవధానం ప్రేక్షకులను రంజింపజేసింది.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా 'శతరూప' వుందని, 4 వ ప్రపంచ తెలుగు మహాసభల అనంతరం అనేక కీలక నిర్ణయాలు తీసుకుని తెలుగు భాషను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డిదేనని సభికుల హర్షధ్వానాల మధ్య తెలిపారు. సాంస్కృతిక సంచాలకులు డా॥ రాళ్లబండి కవితా ప్రసాద్ మాట్లాడుతూ, తెలుగు సాహితీ వికాసంతో సమాజంలో సంస్కృతీ సంప్రదాయాలు వెల్లివిరుస్తాయన్నారు.

## ఆకర్షిస్తున్న వేదిక

'శతరూప' సాంస్కృతికోత్సవం ఒక పండుగ వాతావరణంగా వుంది. రవీంద్రభారతి ప్రాంగణమంతా శోభాయమానంగా వుంది. 'శతరూప' జరుగుతున్న ఘంటసాల కళావేదిక ప్రపంచ తెలుగు మహాసభల ప్రాంగణాన్ని తలపిస్తున్నదని అభిమానులు అంటున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలకు వెళ్లలేని వారికి ఆ అనుభూతిని కలిగిస్తుందనడంలో సందేహం లేదు. ఒక వైపు తెలుగు తేజోమూర్తుల చిత్రపటాలు ప్రత్యేకంగా దర్శనమిస్తాయి.

మరోవైపు తెలుగు అకాడమీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాలు ప్రత్యేక రాయితీలతో పుస్తకాలను అందుబాటులో వుంచాయి. పుస్తక ప్రియులకు, అభిమానులకు ఈ ప్రదర్శన ఎంతో ఉపయోగకరంగా వుంది. తెలుగు కళామతల్లిని, భాషామతల్లిని కీర్తించి, అర్చించే విధంగా శోభాయమానంగా వేదిక అలరారుతోంది.




## కళారూపాలు

2013 ఆగస్టు 2 నుండి నవంబర్ 9 దాకా నూరు రోజులు సాగే 'శతరూప' సాంస్కృతికోత్సవాల్లో వరుసగా అవధాన సప్తాహం, శాస్త్రీయ నృత్య సప్తాహాలు, శాస్త్రీయ లలిత సంగీతోత్సవ సప్తాహం, జానపద, సంగీత, నృత్య సప్తాహం, హరికథా సప్తాహం, బుర్ర కథ సప్తాహం, సాహిత్య సప్తాహం నిర్వహిస్తున్నారు.

మిమిక్రీ, మైమ్ సప్తాహం, నాటక సప్తాహం, ఉర్దూ సాహిత్య కళారూపాల సప్తాహం, వాద్య సంగీత సప్తాహం, 23 జిల్లాల కళారూపాల ప్రదర్శనలు చాటుకుంటున్నాయి. వందలాది మంది కళాకారులు, సాహితీవేత్తలు ఇందులో పాలు పంచుకుంటున్నారు.

ప్రతి రోజు వందలాది మంది కళాభిమానులు కార్యక్రమాలను తిలకిస్తూ ఆనందపరవశులవుతున్నారు.

*– వద్దిరాజు జనార్దన రావు*



# కవులు ఎందరో, 'ప్రజాకవి' ఒక్కడే

ఆధునిక కవులలో కొందరి కవిత్వం వేరు - జీవితం వేరు. మాటలు కోటలు దాటతాయి, అడుగు గుమ్మం దాటదు అనే సామెత కూడా వుంది. కాళోజీ దీనికి భిన్నం. కవిత్వం, జీవితం ఒకటే అయిన అతికొద్ది మందిలో కాళన్న ఒకరు. కుల మత భేదాలకు, హెచ్చు తగ్గులకు, ఆడంబరతకు అతీతుడాయన. మెతకగా కనిపిస్తూనే ధిక్కార స్వరం గల తిరుగుబాటు కవి కూడా! నా యాస, నా నేల, నా జాతి, నా సంస్కృతి... అనే 'అహం భావం' గల అసలైన కవి! కాళోజీ కవిత్వంలో ఎన్నో యుక్తులూ సూక్తులూ ఉన్నాయి. నేటికీ సజీవంగా వుండి కాళోజీని మనముందు నిలబెడతాయి. వాటిలో కొన్ని...

*'పరిస్థితులెట్లా వున్నాయని కాదు*
*పరిస్థితుల్లో మన మెట్లావున్నామని?'*

*'అన్నపురాసులు ఒకచోట / ఆకలి మంటలు ఒకచోట*
*హంసతూలిక లోకచోట/ అలసిన దేహాలోకచోట'*

*'ఉదయం కానే కాదను కోవడం నిరాశ*
*ఉదయించి అట్లానే వుండాలను కోవడం దురాశ'*

*'విపణివీధి –తపోవనం*
*చాకిరేవు – శాసనసభ*
*సానికొంప – సాధుమఠం....*
*ఎచ్చటైతేం – ఎచ్చటైతేం*
*పోటీపడి కాటులాడ ఎచ్చటైతేం'*

*'అన్య భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు*
*సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా?'*

**శతజయంతి సంవత్సరం ప్రారంభం**
**సందర్భంగా...,**

**'కాలమునకే కాదు మహా**

**కాలునకు ఏనాడును**

**'జీ' అనని 'కలేజా'తో**

**కాళోజీ అనునది**

**నాగొడవను నది**

**నఖరాలు లేనట్టిది**

**నాజూకుది కానట్టిది**

**నాగొడవనునది అక్షరాల జీవనది'**

* * *

అసలు పేరు రఘువీర్ అయిన కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబర్ 9న ఆనాటి బీజాపూర్ జిల్లాలోని 'రట్టెహాళి' గ్రామంలో జన్మించారు. అది కర్ణాటక ప్రాంతం. పసితనంలో కొన్నాళ్ళు మహారాష్ట్రలో ఉన్నారు. ఆ తర్వాత తెలంగాణలోని ఇల్లెందు తాలూకా 'కారెపల్లి' గ్రామంలో నివసించారు. ఆ తర్వాత హనుమకొండ, మడికొండలకు వెళ్ళి వరంగల్‌లో స్థిరపడ్డారు.

నాకు ఆయన 'నక్కల గుంట, వరంగల్', అంటూ రెండుత్తరాలు రాశారు. కాళోజీ అభ్యుదయవాదా? మానవతా వాదా? విప్లవవాదా? జనకవా? ప్రభంజనకవా? సౌమ్య విప్లవవాదా? తీవ్ర ప్రాంతీయ వాదా?... అనే ప్రశ్నలకి ఒక్కటే జవాబు - 'అన్నీ కలిస్తేనే కాళోజీ' అని!

మహాకవిలో, ప్రజాకవిలో అన్ని లక్షణాలూ ఉంటాయి మరి! ప్లీడర్ చదివి - విద్యార్థిగా ఉండగానే వెల్దుర్తి మాణిక్యరావు, రాజన్న అవధాని వంటి మిత్రులతో కలసి 'వైతాళిక సమితి' అనే సాహితీ సంస్థను స్థాపించారు. విశేషం ఏమిటంటే తెలంగాణా చైతన్యానికి ఆయనే ఒక వైతాళికుడయ్యారు.

*'అభ్యర్థి ఏ పార్టీవాడని కాదు - ఏ పాటివాడో చూడు*
*ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు–*
*ఇందాకా ఏంచేశాడో చూడు*
*పెట్టుకునే టోపీ కాదు– పెట్టినటోపీ చూడు'*

*'వీర తెలంగాణ నాది, వేరు తెలంగాణ నాది*
*వేరైౖ కూడ తెలంగాణ, వీర తెలంగాణ ముమ్మాటికి*
*తెలంగాణ వేరై నిలచి భారతాన వెలయు ముమ్మాటికి'*

కాళోజీ తన కవితలన్నిటికీ 'నా గొడవ' అని ఒకే పేరు పెట్టడం విశేషం. ఏడు సంపుటాలుగా కవితలు వెలువడ్డాయి. యువ భారతి వారు ప్రచురించిన 'నా గొడవ'కి ముందు మాటలో దేవులపల్లి రామానుజ రావు గారి వివేచన ఇది–

"కాళోజీ యెక్కడ ఉన్నా యేమి చేసినా ఆయన ప్రజల మనిషి, ప్రజల గొడవే కాళోజీ గొడవ. ప్రజల సమస్యలే ఆయనను కవిగా పరికించినవి. కాళోజీ కవితా దర్పణాన్ని అవలోకించితే, గడచిన ముప్పది సంవత్సరాల జాతీయోద్యమాల ప్రతిబింబము, ఆ ఉద్యమాలచే ప్రేరితులైన ప్రజా హృదయాల స్వరూపము యిందులో సమగ్రంగా మనకు కనిపిస్తుంటవి. ప్రజల భాషలో ప్రజల హృదయాలను ప్రదర్శించిన నేటి తెలుగు కవి కాళోజీ!"

కాళోజీ జీవితం ఎప్పుడూ పోరుబాటలోనే సాగింది. ఉద్యమశీలి. నిర్భయ కవి. నిక్కచ్చి పలుకు. ముసుగులూ పొరలూలేవు. అంతేకాదు జాతీయ భావాలు గల కవి. స్వాతంత్ర్య సమరయోధుడు. నమ్మినప్పుడు ఎంతటి ఉత్తేజంతో ఆచరిస్తాడో గిట్టనప్పుడు అంతటి ఉద్రేకంతో ఎండగడతారు. హైదరాబాద్‌లో ఆర్యసమాజీయుల సత్యాగ్రహంలో పాల్గొనడం, ఆర్యసమాజ శాఖలను స్థాపించడం, నిజాం రాజ్యాంగ సంస్కరణలను ఖండిస్తూ...

*'నేటి గాను రెండు కండ్ల*
*మేటి మాట లెందులకు?*
*కాదు అనుచు చాటు గాను*
*కండ్లు గీటు లెందులకు*
*పంక్తి భోజనంబు పెట్టి*
*పక్షపాత మెందులకు'*

అంటూ దుమ్మెత్తి పోయడం, నిజామాంధ్ర మహాసభలలో చురుకుగా పాల్గొనడం, క్విట్‌ఇండియా ఉద్యమంలో తానొక సమిధలాగా కరపత్రాలు పంచిపెట్టడం, మతోన్మాదంపై తిరగబడి నగర బహిష్కరణ శిక్ష పొందడం... చైనా, పాకిస్థాన్‌ల దాడుల్ని తిట్టి పొయ్యడం... ఇలా కాళోజీ కలం చివరి దాకా కలకలం రేపింది.

# ఆల్బమ్

స్మృతుల దారులు
గతం తలుపులు తెరిచినట్టే
ఒక చిత్రం వెనుక దాగిన
గతాన్ని పలకరించినట్లు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.
వాటిలో, నెంతో లేదా తీరని చిక్కనిపున్నట్లు
నీ రెక్కల గొడుగుల విప్పుకొని
మధుర జ్ఞాపకాల సౌరభాలు
తనువంతా ఆవరిస్తాయి పరిమళించినట్లు.

ఒక దృశ్యం వెనుక మరో
దృశ్యం సమ్మోహనపరుస్తాయి.
వేసవిపైన కాసిన
అనంత కోటి అనుభూతుల సరళ్ళ అవి.
కాలవక్షానికి చిగురించిన చిత్రాలు
ఇంట్లోని అనుగులనన్నీ చూసి మురిసిపోతాం.
చిత్రాల విహారయాత్రలకు వెళ్ళిన
అద్భుత ప్రదేశాలను మరోసారి తలుస్తాం.
సేదతీరిన యాత్రస్థలాలను
మరొకసారి తిరగటను ఒప్పొగార్చి కల్పిస్తాయి.

ఆ రంగైన రంగుల చిత్రాలు
మన జీవనానికి సజీవ సాక్ష్యాలు.

ఇప్పుడు
సెల్‌ఫోన్ల ఇమేజ్‌ల్లో
కంప్యూటర్ ఫోల్డర్లో
ఫేస్‌బుక్‌లో భద్రపరుస్తున్నం
వీడియోల్లో దాచుకున్న నగలు.

ఆల్బమ్‌ను తిప్పుతున్నప్పటి
సంతోషాల సొగసుల్ని మాత్రం
అందుకోలేక పోతాం
సాంకేతిక మాయ జాలమే కదా.
పదింతల్ని పదిల పర్చేది
పరువపు పరవశాల్ని మననం చేసేది
ఎదుగుదలను క్రమంగా చూపించేది
నాటి నేటి తారతమ్యాన్ని నగ్నంగా
కళ్ళ వాకిళ్ళ ముందు నిలిపేది
ఒక్క ఆల్బమే.

కల్లోల క్షణాలను సైతం
మహదానందం చేసే మంత్రదండమది
మన మధ్య తిరుగాడిన
ఆప్తులు దూరమైన
వారితోటి బంధాల్ని సజీవ పర్చేది
అపూర్వమైన ఆల్బమే కదా...!
ఒక ఆత్మీయుని చేయూతలా
ఒక చెలిమి అనుభవంలా
ఒక శీతలపవనం అనుభూతిలా
ఒక వెచ్చని సహవాసంలా
ఆల్బమే నాతో అనుసరిస్తుంది...!

- గోపగాని రవీందర్

జరగనను గాంధేయవాదిగా జీవించిన కాళోజీ ధృఢంగా ఇలా చెరపలు వేశారు...

'ఇంకేమి కావాలి? ఇంకేమి కావాలి?
[illegible]
[illegible]
[illegible] ఇంకేమి కావాలి'

'ఆంధ్ర పత్రిక'లో "[illegible]" ప్రారంభించిన సందర్భం "తెలంగాణ గురించి [illegible]" అంటూ [illegible].

1992లో [illegible] కాళోజీ మొదటి కవితా సంకలనం 'నా గొడవ' ను [illegible] గా ప్రకటించారు.

కాళోజీ కవిగా ఉద్యమకారుడు [illegible] కాళోజీ [illegible].

'తెలంగాణ ప్రజ - తెలుగు [illegible]', '[illegible] కథ', 'తెలుగు గొడవ' వంటి కథలు [illegible]. 'నా గొడవ' [illegible] కాళోజీ. 'నా భారతదేశ యాత్ర', '[illegible]' వంటి



[illegible] చేశారు.

[illegible] కాళోజీ.

[illegible] కాళోజీ -

'[illegible] నీది
[illegible] నీది
[illegible]
[illegible]'

అని [illegible] చెప్పారు.

ఈ మాటలు కాళోజీకి కూడా [illegible]. కాళోజీ మన కవి - నేటి '[illegible]' కవి!

- [illegible]
[illegible]

# ఆత్మలేని తనువు...

-వెంపరాల వెంకట లక్ష్మీశ్రీనివాసమూర్తి

**మధుసూదన్ తన గదిలోకి అడుగుపెట్టి ఒకసారి తదేకంగా చూశాడు. రోజూ తను చూసే గదే అయినా ఎందుకో ఈ రోజు ప్రత్యేకంగా కనిపించింది. గదిలో ఓ పక్కగా గోడకి ఆనుకొని వున్న ఒక మంచం, ఒక కుర్చీ వున్నాయి. మిగిలిన మూడు వైపులా మూడు పెద్ద, పెద్ద ఇనుప అలమారాల నిండా ఎన్నో పుస్తకాలు వున్నాయి.**

**అలమారా నిండా పేర్చిన పుస్తకాలని ఒక్క సారి తడిమి, తడిమి చూసుకున్నాడు. అవి ఒక రోజు, ఒక నెల నుండీ తన గదిలో వున్న పుస్తకాలు కాదు. గత ముప్పై సంవత్సరాల నుంచి తనకు నచ్చి, తను మెచ్చి ఏరికోరి పట్టి, కూర్చి ఒక్క చోట పొందుపరిచిన మనోహరాలు.**

"పుస్తకాలు లేని గది ఆత్మ లేని శరీరం లాంటిది" చిన్నప్పుడు స్కూల్లో చదువుకున్నాడు. తన స్కూలు లైబ్రరీలోని గోడకి అతికించి వుండేది. రోజూ దాన్ని చూసి పుస్తకాలు చదవడాన్ని ఒక అభిరుచిగా మలచుకున్నాడు. కాలక్రమేణా తన ఇంటిని కూడా మినీ గ్రంథాలయంగా తయారుచేసుకున్నాడు.

మధుసూదన్ వయసు అరవై దాటి ఆరేళ్లయింది. ఏదో దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి, ఇంటి భారంగా నడిచే ఓ ప్రైవేట్ ఉద్యోగంలో రిటైర్ అయ్యాడు. పెద్దగా సంపాదించింది లేదు. ఎవరైనా స్నేహితులు, బంధువులు అడిగినా - "నా పుస్తకాలే నా ఆస్తి" అనేవాడు. అంతలా సాహిత్య ప్రేమతో మమేకమైపోయేవాడు.

అప్పట్లో కనిపించిన ప్రతి మంచి పుస్తకాన్ని కొనేవాడు. అదే అతని బలం, బలహీనత అని చెప్పొచ్చు. వృద్ధాప్యంలో ఇద్దరి పిల్లలని పెంచి, పెద్ద చేశాడు. కూతురికి పెళ్ళి చేసి ఒకింటిదాన్ని చేశాడు. కొడుకు ఓ ప్రైవేట్ కంపెనీలో యం.డి.గా పనిచేస్తున్నాడు.

సాహిత్యం మీద అభిరుచితో ఎన్నో పుస్తకాలు సేకరించడంతో పాటు వాటన్నిటినీ శ్రద్ధగా చదివేవాడు. ఆ నేపథ్యంతో తను కూడా నెమ్మదిగా సాహితీ సేద్యం చేయడం ప్రారంభించాడు. అనతికాలంలోనే మంచి రచయితగా కూడా పేరు తెచ్చుకున్నాడు. ఆర్థిక సంతృప్తి దక్కకపోయినా ఆత్మసంతృప్తితో ఓలలాడేవాడు. ఎన్నో పత్రికల్లో తను రాసిన రచనలు చూసినప్పుడు ఏదో తెలియని అలౌకికానందాన్ని పొందేవాడు. ఆ పుస్తకాలన్నిటినీ గుత్తగా ఒక అలమరలో సర్దుకున్నాడు. అవి భావి తరాలకి మార్గదర్శకాలుగా భాసిస్తాయని ఓ చిన్న ఆశతో ఎప్పుడూ వుండేవాడు.

అలాంటి పుస్తకాలు... మర్నాటి నుంచి తనని వదిలిపోతున్నాయనేసరికి, దేహం మాత్రమే కాకుండా, ప్రాణాంతక గుబులు కనిపిస్తోంది అతనికి.

అప్పట్నుంచి తన కొడుక్కి ముంబాయి బదిలీ కావడంతో తన ప్రాణం మీదకొచ్చినట్టుంది. అక్కడ తనకి లభించే అగ్గిపెట్టె లాంటి ఇంటి గురించి ముందే అందర్నీ హెచ్చరించాడు అతని కొడుకు. కొడుకు వెంట వెళ్ళడం మినహా వేరే దారి ఏదీ తన దగ్గర లేదు మధుసూదన్ కి. తను తనువుతో పూర్తిగా రావడానికి చోటు లేని మహానగరాల్లో, ఇలాంటి వస్తువులన్నిటి రావడానికి జాగా ఎక్కడిది.

కొడుకు తేల్చి చెప్పాడు.

"నాన్నా, నేను వెంట సామాన్లు వాటికి ఇవి అన్నీ అమ్మేద్దాం. ఇవన్నీ అక్కడికి తీసుకువెళ్ళలేమన్న సంగతి మీకూ తెలిసిందే కదా. ఇంటి ఓనర్ మంచివాడు అయితే నేం. మనం గుట్టుగా బతకడం వల్ల అయితే నేం ఇన్ని సంవత్సరాల నుంచి ఇక్కడ హాయిగా వున్నాం. ఇన్నాళ్ళ నుంచి వున్న



# మహాత్మునికి కర్పూర నీరాజనాలు

చేత చిని కర్ర బేలమా కుళ్లాయి
ముదుకు దిగనియట్టి ముదక పంచె!
మొలక నవ్వులొలుకు మోముతో 'మా గాంధి'
'బాపు... బయలు వెడలె! పల్లెలకును!

ఇతడటే! ప్రతియింట బ్రతుకు బాటను చూపు
'రాట్నమ్ము నిల్పు' గారాల తండ్రి!
ఇతడటే! భారత హృదయాలలో 'యహిం
సాజ్యోతి' వెలిగించు సాధు మూర్తి!
ఇతడటే! 'సూనృతవ్రతము' నూరూరను
బోధించి మించిన పుణ్యమూర్తి!

ఇతడటే! ఒకచెంప చితుక గొట్టిన వేరు
చెంప చూపిన మహా సిద్ధమూర్తి!

ఈతడే యౌన! కరుణ మూర్తీభవించు
అపర గౌతమ దేవుండటంచు ప్రజలు
తనివి తీరగ చూచివందనము లిడిరి
పల్లె ప్రాంతాలు బాపుజీ వచ్చినపుడు!!

కాలినడక వచ్చు గాంధితాతను జూచి
పల్లె పల్లె పైడి పళ్లెరాన
మంచి కప్పూరాల మంగళ హారతుల్
పట్టి మ్రొక్కినారు పదములకును!

– *వీళ్ల చింతప్పరు*

ఇంటిని వదిలి వెళ్ళాలంటే ఎంత బాధాకరమో అర్థమవుతుంది. అయినా తప్పదు కదా. ఏదో కాలక్షేపానికి నాలుగైదు పుస్తకాలు తెచ్చుకుంటే సరిపోతుంది. అయినా ఈ రోజుల్లో పుస్తకాలు చదివేవాడు ఎవడు? కావాలంటే ఇంటర్నెట్ నిండా ఈ-బుక్స్ దొరుకుతాయి" అన్నాడు.

కొడుకు మాటలు మస్తిష్కం మీద సమ్మెట పోటుల్లా అనిపించాయి మధుసూదన్‌కి.

"అవునురా, నీ లాంటి వాళ్ళందరూ ఇలా ఆలోచించడం వల్లే లోకంలో పాఠకులు తగ్గిపోయారు. పుస్తకాన్ని మించిన మంచి మిత్రుడు లేడు. పుస్తకం చదువుతున్నప్పుడు కలిగే ఆనందం కోట్లు సంపాదించినప్పుడు కూడా పొందలేరనే సత్యం అవగాహనలోకి రాకపోవడం విచారకరం. మనిషి మనుగడకి, మానవాళి సౌరభానికి, మనిషి మహోన్నతుడిగా ఎదగడానికి ఉపయోగపడే ఏకైక సాధనం పుస్తకం. అది ఈ రోజు కొనడానికి, చదవడానికి కూడా నిరాసక్తత ప్రదర్శించే రోజులు వచ్చాయి. నేను ఎన్నో సంవత్సరాల నుంచి పోగు చేసిన సంపద, ఈ రోజు కిరాణా కొట్టులో పొట్లాలకి, తూకానికి పోతుందనే భావనని ఒక సాహితీ ప్రియుడిగా నా మనసు అంగీకరించలేదు. దీనికి పరిష్కారం ఆలోచిస్తాను. తొందరపడొద్దు" బాధ నిండిన కళ్ళతో చెప్పాడు మధుసూదన్.

తెల్లవార్లూ ఆ గదిలోని అన్ని పుస్తకాలని ఒకదాని తర్వాత ఒకటి తీసి ఆత్మీయంగా తడిమి చూసుకున్నాడు. ఎలాగైనా ఈ పద సంపద నిరుపయోగంగా పోకూడదనుకున్నాడు. చాలా మథనపడి ఆలోచించాడు. అప్పుడు తనకి ఓ ఆలోచన స్ఫురించింది. ఆ ఆలోచనే సరి అయినదని నిర్ణయించుకున్నాడు. తను వీటన్నిటినీ ఎలాగూ అంత దూరం తీసుకువెళ్లే అవకాశం లేదు, అలాగని తూకానికి అమ్మడం వల్ల వచ్చే ప్రయోజనం కూడా ఏమీ లేదు అనిపించింది.

తెల్లారింది. సమయం ఎనిమిది దాటింది. ఇక ఆలస్యం చేయకుండా తన మదిలోని ఆశయాన్ని అమలుపరచాలనుకున్నాడు. వడివడిగా అడుగులు వేసుకుంటూ ఆ వూరి పౌర గ్రంథాలయం వేపు వెళ్ళాడు. అక్కడి 'గ్రంథపాలకుని' కలిసి తన మదిలోని కోరిక చెప్పాడు. ఎంతో ఉప్పొంగిపోయాడు ఆ గ్రంథాలయాధికారి. పుస్తకాలు నిరుపయోగంగా పోయే కంటే ఇక్కడ వుండడం ద్వారా ఎంతోమంది వాటిని వినియోగించుకొనే అవకాశం వుంటుందని, అందుకే తన దగ్గరున్న పుస్తక సంపదని ఈ గ్రంథాలయానికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నానని చెప్పాడు మధుసూదన్.

తేలిక పడిన మనసుతో ఇంటి వైపు అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు...

☆



# తెలంగాణ విడిచి ఉండలేనన్న ఉన్నవ

**"వెంకట రామయ్యగారూ! మీరు వట్టి చేతులతో వచ్చారు. వట్టి చేతులతో తిరిగి వెళ్తున్నారు. ఇక్కడికి వచ్చిన వారంతా అంతో, ఇంతో సంపాదించుకుని వెళ్ళారు. మీరు మాత్రం తెలంగాణా ప్రజలకు నిస్వార్థ సేవ చేసి వారిని ఋణగ్రస్తులను చేసి వెళ్తున్నారు."**

**1939లో తప్పనిసరి పరిస్థితులలో నిజాం రాష్ట్రం నుండి స్వగ్రామం ఉన్నవకు వెళ్తున్న వెంకటరామయ్యగారితో కన్నుల నీరు నింపుకుని బాధాతప్త హృదయంతో మాడపాటి హనుమంతరావు గారన్న మాటలివి.**

వెంకటరామయ్య గారు నాయకుడు కాదు. ఆంధ్ర మహాసభ నాయకులను తయారు చేసిన నలుగురు కార్యకర్తలలో ఆయన మొదట ఉండేవారు. పార్టీని కాపాడుకునేది కార్యకర్తలేనని ఈ నాటికీ నాయకులు అంటూనే ఉన్నారు. దాన్ని ఆయన నిజం చేసి చూపించారు. ఆనాటి నాయకులందరికీ ఆయన తలలోని నాలుక. మాడపాటి వారి నుంచి కొండా వెంకటరంగారెడ్డి గారి వరకు ఆయనను విశ్వసించే వారు. నాయకులకు ఉపన్యాసాలు రాసి ఇవ్వడం, ఉర్దు సర్క్యులర్లను తెలుగులో తర్జుమా చేసి ఇవ్వడం, అవసరమైతే వేదికలెక్కి అధ్యక్షుల ఉపన్యాసాలను చదివి వినిపించడం మొదలైన పనులు ఆయన చేసేవారు. ఈ విధంగా వెంకటరామయ్యగారు అందరి అభిమానం పొందగలిగారు.

వెంకటరామయ్యగారు 1896 జూలై 16 న గుంటూరు జిల్లా ఉన్నవ గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించినా, తన ఇరవై ఏట తెలంగాణాలోని ఇప్పటి రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి వచ్చారు. తెలుగు చదువు చెప్పడానికి ఆ గ్రామ పెద్ద వింజమూరి గోవిందరావు ఆహ్వానంపై వచ్చారు. తెలుగు చదువు కోసం ప్రజల కళ్ళు కాయలు కాచిన రోజులవి.

వెంకటరామయ్యగారు ఆరుట్ల గ్రామంలో ఒక చిన్న ఇల్లు తీసుకుని వీధిబడి నడిపారు. చిన్న బాలశిక్ష, పెదబాలశిక్ష, ఉత్తరాలు చదువ నేర్పే పాతకాలపు ప్రాథమిక శిక్షణనే కొనసాగించవలసి వచ్చింది. శతకాల్లోని, భాగవతంలోని పద్యాలు నేర్పడం ఈ చదువులోని ఒక భాగం. పాత్రను ఆలంబనంగా చేసుకొని ముందుకు వెళ్ళిన ప్రగతిశీలకుడు వెంకటరామయ్య.

1917 నుంచి 1926 వరకు వెంకటరామయ్య గారు ఆరుట్ల గ్రామంలో ఉన్నప్పుడు అక్కడ చరఖా సంఘం, భజన సంఘం మొదలైనవి ఏర్పాటు చేశారు. బాలికల పాఠశాల, హరిజన విద్య, వయోజన విద్య పాఠశాలలు ప్రారంభించారు. గ్రామస్థుల సహకారాలతో ఒక గ్రంథాలయాన్ని, పోస్టాఫీసుని స్థాపించారు.



ఉన్నవ వెంకటరామయ్య

ఆ గ్రామమే కాకుండా చుట్టుప్రక్కల అనేక గ్రామాలలో సైతం విద్యా ప్రచారాలు కావించారు. వర్తక సంఘాలు, రైతు సంఘాలు, పద్మశాలీ సంఘాలు, భజన సంఘాలు, నాటక సమాజాలను స్థాపించి, 'సంఘాల పంతులు'గా ప్రసిద్ధి చెందారు. నాటి ప్రభుత్వానికి ఇవన్నీ విద్రోహచర్యలుగా కనిపించాయి. ఆయన మీద పోలీసు నిఘా ఉండేది. నిర్బంధంలోనే ఉద్యమాలు నడిపారు.

ఎందరో నాయకులను ఆరుట్ల గ్రామానికి ఆహ్వానించి, ఉపన్యాసాలు ఇప్పించి, ప్రజలలో చైతన్యం కలిగించారు. ఉర్దూ భాష తెలియకుండా ఆనాడు తెలంగాణాలో ప్రచారాలు చేయడం కష్టం కనుక వెంకటరామయ్య గారు ఉర్దూ నేర్చుకుని ఉర్దూలో మిడిల్ పరీక్ష ప్యాసయి ఉద్యోగార్హత సంపాదించుకున్నారు.

వితంతు వివాహాలు జరిపించడం మాటలా ?

1925లో మధిరలో జరిగిన గ్రంథాలయ సమావేశంలో పాల్గొన్న వెంకటరామయ్య గారు అంతా తానే అయి పనిచేయడం మాడపాటి వారిని ఆకట్టుకున్నది. వెంటనే వెంకటరామయ్య గారిని హైదరాబాద్‌కు రప్పించుకుని ఆంధ్ర జనసంఘం కార్యకర్తగా వేతనం ఏర్పాటు చేసి నియమించారు. దీనితో ఆయన కార్యరంగం తెలంగాణా వ్యాప్తమైంది.

వెంకటరామయ్యగారు నిస్వార్థ సేవా పరాయణుడు, నిరాడంబర వ్యక్తి. కాలరు లేని ఖద్దరు లాల్చీ, ఖద్దరు ధోవతి, లాంగ్‌కోట్, ఒక చేతిలో చిన్న ట్రంకుపెట్టె, అందులో చిన్న ఫోల్డింగ్ కిరోసిన్ స్టౌ ఉండేవి. వీటితో రవాణా సౌకర్యం లేని తెలంగాణా గ్రామాలలో పర్యటనలు, ఆంధ్ర జనసంఘం కార్యక్రమాల ప్రచారం చేసేవారు.

ఆంధ్ర మహాసభల రెండు సమావేశాల కార్యభారం విజయవంతంగా నిర్వహించిన వెంకటరామయ్య గారిపై పోలీసు నిఘా ఎక్కువైంది. ఆయనను మన్ననూరు జైలుకు పంపే ప్రయత్నంలో ప్రభుత్వం ఉన్నట్లు వార్తలు వినిపించాయి. వెంకటరామయ్యగారి ఆర్థిక స్థితిని బట్టి ఆయనకు మరొక ఉద్యోగం చూపించవలసిన బాధ్యత ఆంధ్రమహాసభ మీద పడింది.

హైదరాబాద్ నగరంలోని ఎక్సెల్సియర్ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులుగా చేరారు. ఆంధ్రోద్యమంతో సంబంధం ఉన్నందున పోలీసులు ఆయనపై రహస్య నివేదికలు పంపుతూ వచ్చారు. ఆయనను ఉద్యోగం నుంచి తొలగించకపోతే ఆ పాఠశాలకు అందజేస్తున్న గ్రాంటును ఆపివేస్తామని ప్రభుత్వం పాఠశాల యాజమాన్యానికి నోటీసు ఇచ్చింది. ఆ పాఠశాల శ్రేయస్సు దృష్ట్యా ఆయన ఉపాధ్యాయ పదవికి రాజీనామా చేశారు.

ఉపాధ్యాయ పదవి విరమించుకున్న తరువాత వెంకట రామయ్యగారు మూడున్నర సంవత్సరాలు 'గోలకొండ' పత్రిక మేనేజరు పదవిలో పనిచేశారు. 'గోలకొండ' పత్రికలో తాను పనిచేసిన కాలంలో పత్రిక చందాదారుల సంఖ్య పెంచడానికి తీవ్రంగా ప్రయత్నించారు. 'గోలకొండ' పత్రిక చదివితే ప్రభుత్వం నుంచి ఏ ఆపద వస్తుందోననే భయంతో ప్రజలు చాటుమాటుగా పత్రికను తెప్పించుకునే రోజులవి. "చందా అయితే ఇస్తాం కానీ పత్రికను పంపించవద్ద"ని బతిమిలాడేవారు. అలాంటి చీకటి రోజుల్లో గోలకొండ పత్రిక భారం మోయడం నిజంగా సాహసకార్యమే.

అనారోగ్య కారణాల వల్ల ఆయన 1939లో తన స్వగ్రామం ఉన్నవ చేరుకున్నా తెలంగాణాతో

**తెలుగు వెలుగులు**

*- జి. వెంకట రామారావు*

# కొండకు గర్వం కూడదు

— డా॥ ఎన్. గోపి

**కొం**డకు గర్వం కూడదు
'నా ముందు మనిషెంత' అని
ధిక్కరించడం తగదు.

కాదనేదేముంది?
కొండకు ఎత్తుంది
దూరాలకు ప్రసరించే కళ్ళున్నాయి
రోజూ రవిబింబాన్ని
కిరీటంగా ధరించే వైభవముంది,
చంద్రవంకను సిగలో చెక్కుకొని

కాసేపు శివుడిలా
మురిసిపోయే సరదా వుంది
చెట్ల మరకతాలకు
పలురకాల రత్న మాణిక్యాలను
పూయించే నేర్పుంది.

ఎందుకో కొండకీమధ్య
అసహనం పెరుగుతోంది
జలపాతాల కొరడాలు ఝళిపిస్తూ
జడిపిస్తోంది.



మట్టిచరియలను విసిరేసి
చరిత్రలను రూపుమాపుతోంది.

యుగయుగాలుగా తపస్సు చేస్తున్నా
ఎందుకో దాని వివేకం చుట్టూ
మబ్బులు కమ్ముకుంటున్నాయి
అంధకారం
వికారంగా పరిణమిస్తున్నది.
అయితే కొండ
ఒక సంగతిని మరిచిపోయింది
దానికి కాళ్ళు లేవని
అంగుళమైనా ముందుకు
నడవలేదని,
ఇన్నాళ్ళూ
దూరదూరాలకు
మనిషి కాళ్ళతోనే తరలి వెళ్ళిందని
ఆకాశంలోకి
పక్షి రెక్కలతోనే ఎగిరిందని.

☆

తరతమ్మ సంబంధాల నుంచి వెంకటరామయ్యగారు తెలంగాణకు దూరంగా ఎక్కువకాలం ఉండలేక పోయారు. "తెలంగాణను విడిచి వుండలేను" అంటూ, ఉప్పల గ్రామంలో తనకున్న కొద్దిపాటి పొలం, ఇల్లు అమ్మేసి హైదరాబాద్‌లోనే శేష జీవితాన్ని గడిపారు.

ఇంతటి త్యాగమూర్తికి, శీలవంతునికి పోలీసు చర్య తర్వాత ఏర్పడిన ప్రభుత్వాలు ఏది కోరినా లభించేదే కానీ, ఆయన ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి గార్లతో కలిసి రాజకీయం నడిపిన వ్యక్తి. అయినా ఆయన ఎవరినీ ఏదీ కోరలేదు.

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో వెంకటరామయ్య గారి పరిస్థితి తెలుసుకుని స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ ఏర్పాటు చేశారు. దానితో ఆయన జీవిత చివరి కాలం ఆర్థిక ఒడుదుడుకులు లేకుండా గడిచిపోయింది.

మాడపాటి వారిలాగ వెంకట రామయ్యగారు రికార్డులో చిన్న పొరపాటు కూడా జరగనిచ్చేవారు కాదు. ఈ సంగతి గుర్తించిన కొండా వెంకట రంగారెడ్డి 1962 శాసనసభ ఎన్నికల సమయంలో ఆయనను తన ఎన్నికల ఏజెంట్‌గా నియమించుకున్నారు. తెలంగాణా ఉద్యమ జాగృత పరచిన ఉప్పల వెంకటరామయ్య గారు తన కడ పటి హైదరాబాద్‌లోని స్వగృహంలో మరణించారు.

☆

# తెలుగు పలుకుబడులు-15

## తరచుగా కనబడే అపభ్రంశాలు

* *అలాంటి నేరానికి శిరచ్ఛేదం తప్పదు* అని రాస్తూ వుంటాం. శిరస్, ఛేదం కలిసి ఇలా మాట వచ్చింది. ఇక్కడ 'శిరశ్ఛేదం' అని వాడాలి. కొన్నిసార్లు వాడుకలో తప్పులే ప్రామాణికం అవుతుంటాయి.
* *చిన్నా భిన్నం కాదు ఛిన్నా భిన్నం*
* *వైభవం కాదు వైభవం.*
* *మనోహారి కాదు మనోహరి.*
* *ధృఢంగా కాదు దృఢంగా.*
* *దోషం కాదు, దోసం కాదు, దోషం*




* ఆధార షడ్జమం, షడ్జమ స్వరం అని మామూలుగా వాడుతుంటాం. ఏడు స్వరాల్లో షడ్జం ఒక స్వరం. సాహిత్యంలో ఆధార షడ్జమని అంటుంటారు. అయితే యిది షడ్జమ స్వరం కాదు. షడ్జస్వరం మాత్రమే. పంచమ, మధ్యమంతో అంటాల్సినపని షడ్జంకి కూడా పెట్టడం అలవాటైంది.
* నిజానికి 'కమండలం' అనడం తప్పు. 'కమండలువు' సరైన శబ్దం. మరీ అంత శాస్త్ర రీత్యా పెడితే నిత్య వ్యవహారంలో కష్టం.

☆

పానుగంటి లక్ష్మీనరసింహారావు నాటకకర్తగా సుప్రసిద్ధులు. ప్రచండ యాదవం, ప్రసన్న యాదవం ముక్కోణిగా తెరకెక్కిన నాటకాలు. ఆ రోజుల్లో గయోపాఖ్యానం పాండవ పద్య నాటకం అప్రతిహతంగా అన్నమైన నాటకొంది. పానుగంటి వారి వినూత్న సృష్టి సాక్షి వ్యాసాలు. వ్యాసాలు కావవి కబుర్లు. ఎన్నో విషయాల మీద ఆశువుగా అనర్గళంగా దంచిన ఉపన్యాసాలు. 1913లో అంటే సరిగ్గా వందేళ్ళ క్రితం ధారావాహికంగా 'సువర్ణ లేఖ' పత్రికలో ఏడాది పాటు వచ్చాయి. ఆ తరువాత 1920 నుంచి రెండేళ్ళ పాటు 'ఆంధ్రపత్రిక'లో వెలువడ్డాయి. తదుపరి పుస్తక సంపుటాలుగా వచ్చి అలరించాయి. పానుగంటి రచించి నూరేళ్లయినా, అయిదారు తరాల పాఠకులను అలరించిన సాక్షి - యిప్పటికీ నిత్యనూతనమే. ఆ పద చిత్రాలలోని భాష వరుస అద్వితీయం, అనితర సాధ్యం. పానుగంటి వారొక చోట మన తెలుగు గురించి చెబుతూ.."నమ్రతకు నమ్రత, కఠినతకు కఠినత, సరసతకు సరసత, పరుషతకు పరుషత, బిగికి బిగి, జిగికి జిగి, మందతకు మందత" అంటారాయన. పానుగంటిని నిజాలు అర్థించడమంటే తెలుగు భాషని త్రికరణ శుద్ధిగా ప్రేమించుకోవడమే. ఇది సాక్షికీ, జంఘాల శాస్త్రికీ, వాణీ దాసుడికీ మొత్తం సాక్షి బృందానికి శతజయంతి వత్సరం. 'వాక్యం రసాత్మకం కావ్యం' అనే వాక్యాన్ని అక్షర సత్యం చేసిన ధన్యులు పానుగంటి.

-సంపాదకుడు




## అరవై వసంతాలు

ప్రభవ నుంచి క్షయ దాకా అరవై సంవత్సరాల ఆవృతం పూర్తవుతుంది. పూర్వం అరవై ఏళ్ళ కాలం ఎక్కువగా పూర్ణాయుర్దాయంగా భావించి అరవైకి ఒక వేడుక జరుపుకుని దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకునే వారు. ఇప్పుడు అరవై అంటే నడివయసు దాటినట్టు లెక్క. సహస్రచంద్ర దర్శనం అంటే ఎనభై మూడు సంవత్సరాలు కొంచెం వయస్సు మీరినట్టు లెక్క. అరవై పూర్తయిన వేళ "షష్టిపూర్తి" అనే వారు. అది షష్ఠ్యబ్దపూర్తి. షష్ఠి అంటే అరవై. షష్ఠి అంటే ఆరవది. పంచమి తరువాత షష్ఠి వస్తుంది కదా! అసలు మరీ శాస్త్రీయంగా పలకాలంటే "షష్ట్యబ్దపూర్తి ఉత్సవం" అనాలి. వాడుకలో పొంపులు పోతున్నట్టు, కొన్ని పదాలు వాడగా వాడగా అరిగిపోయి రూపం సంతరించుకుంటాయి. ఇప్పుడు షష్టిపూర్తి అలాగే అయింది. ఏదైనా భాష పరమార్థం వ్యక్తీకరణే కావచ్చు. కొన్ని సందర్భాల్లో భావం స్ఫురిస్తే చాలు. అదే పదివేలు.

☆

# తెలుగు పలుకుబడులు-15

## ప్రజల భాష

తమ అవసరానికి ప్రజలు స్వేచ్ఛగా తయారు చేసుకున్న భాష ప్రజల భాష. అలాంటివి ఎన్నో మాటలు పుట్టి స్థిరపడ్డాయి. అలాగే పత్రికలు సృష్టించిన భాష కూడా. జన సామాన్యానికి చెప్పే పత్రికలు సామాన్య భాషని వాడతాయి. అవిశ్వాస -నమ్మకం అపహారం, గృహదారం లాంటి ఎన్నో మాటలు ఆయా సందర్భాలలో చక్కగా ఇమిడి పోతాయి.



కళ్లలో ఏర్పడే పొరని ఇంగ్లీషులో కాటరాక్ట్ అంటారు. శుక్లం అని వాడుక. శుక్లాలు వచ్చాయి. శుక్లాలు తీయించుకున్నా అంటారు. దీని అర్థం అందరికీ తెలుసు. కొందరు తిమిరం అనేవారు ఆ రోజుల్లో. తిమిరం అంటే చీకటి. ఒక గ్రామీణుడు కబుర్లలో "మొన్న మధ్య కంటి మసకలు తీయించుకున్నా, ఇప్పుడు చూపు తేటగా వుంది" అన్నాడు. మసకలు అనే మాటని తను స్వయంగా ఆ సందర్భానికి సిద్ధం చేసుకున్నాడు.

రైతులు 'మొన్న వర్షానికి ధాన్యం మసక బారింది' అంటుంటారు. దానికి అర్థంగా వస్తే, "ఏం కళ్లు మసక బారినాయా" అని కనుల కోసం కళ్లు. 'మబ్బు మసకేసింది, జల్లు పడుతుందేమో' అంటారు. అంటే మసకని కంటికి వచ్చే కాటరాక్ట్‌కు వాడటం గ్రామీణుడి సొంత తెలివి. ☆

## వాణి నా రాణి

ఆనాడు పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుడు "వాణి నా రాణి" అన్నాడు. అని ఒప్పించాడు. నేను కూడా ఒప్పుకున్నాను. అయితే ఆ వాణి కాదు... ఒక సాంకేతిక వాణిని.




టెలిఫోనుని దూరవాణి అన్నారు. ప్రజా టెలిఫోన్‌ని జనవాణి అన్నారు. కాలక్రమంలో మొబైల్ ఫోన్ వచ్చింది. తీగల బాదరబందీ లేకుండా ఎక్కడ నుంచైనా మాట్లాడే సదుపాయం వచ్చింది. మొబైల్‌ని చరవాణి అన్నారు. మరికొందరు 'అంగుళ వాణి' అంటున్నారు. కార్డ్‌లెస్ ఫోన్‌ని నిస్తంత్రీవాణి. ఏకంగా వాటినా వ్యవహరించడం అంత ప్రాచుర్యం పొందలేదు. తాజాగా వచ్చిన వీడియో ఫోన్లలో అవతల వారు దర్శనమిస్తున్నారు. చరవాణి గోచరవాణి అయింది. ఫోను అనేది 'జేబులో బొమ్మ' అయింది. ప్రతి వానికీ ఇలా వాణి రాణిగా మారింది. ☆

## సామెతలు

సామెతలోని సొగసులు విడమరిచి చెప్పకపోయినా సామెతలు వాడుకలో వున్నాయి. అలాంటి కాలం చెల్లిన సామెతలను మరికొన్నిటిని చూద్దాం.

* ***తీగలాగితే డొంకంతా కదిలినట్టు*** - ఇప్పుడు తీగలా డొంకలా పెద్దగా లేవు కాని సామెత నిత్యం వాడుకలో వుంది. చిన్న సందేహంతో పెద్దకొండ బయట పడితే ఇలా సామెత వాడుతుంటారు.
* ***పిల్లి కాటుకి చెప్పుదెబ్బ*** - ఇది ఒక నాటి వైద్యం కావచ్చు. ఇప్పుడు పిల్లి కాటుకి అత్యాధునిక వైద్యం వచ్చింది. అయినా ఇది వాడుకలో వుంది. మాటకి మాట అంటించినప్పుడు ఇలా సామెత వినిపిస్తుంది.
* ***సింగినాదం జీలకర్ర*** - ఇది పాతకాలంలో మాట. చిన్న చిన్న నావలలో జీలకర్ర అమ్మకానికి వచ్చేది. అప్పుడు ఆ వార్త దూరంగానే తెలియడానికి శృంగనాదం చేస్తూ పూరి ఊదేవారు. కావల్సిన వారు రేవుకి వెళ్ళి వరుస (ఆర్డర్) పద్ధతిలో జీలకర్ర కొనుక్కునే వారు. శృంగనాదం ప్రజలనోళ్లలో పడి సింగినాదం అయింది. ఇది వాడుకలోనే వుంది. అంటే పెద్ద విశేషమేమీ లేదు. సింగినాదం జీలకర్ర వచ్చినప్పుడల్లాగే పెద్ద హడావిడి తరువాత నిష్ప్రయోజనం చేసినప్పుడు ఇలా సామెత వాడతారు. ☆

### పొడుపు

రేయింబవళ్లు పదిగా పదిపదిగా తిరుగును. నడిచేయదు, తినదు తాగదు కునుకు వేయదు.

### విడుపు

[illegible]

- శ్రీ

## మనవి

తెలుగు పలుకుబడి శీర్షికతో మనభాషకు గల పరిధిని కొంతమేర అంచనా వేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. మరుగున పడిన, పడుతున్న భాషా పదాలను గుర్తు చేసుకుంటున్నాం. ఈ ప్రయత్నాన్ని చాలామంది ఆమోదించి, తమ హర్షం తెలుపుతున్నారు. ఈ శీర్షిక మా పాఠకుల శీర్షిక. మీరికి మాటల్ని అందించండి. ఆదరించండి.

ఎడిటర్, ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక, సమాచార భవన్, ఏ.సి. గార్డ్స్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్ - 500 028

దసరా !

గులాములు చల్లుకోవటం, కొత్తబట్టలు వేసుకోవటం, పంచభక్ష్య పరమాన్నాలు వండుకుని తినటమేనా ?

అంతకుమించిన నిగూఢార్థం ఏమన్నా వుందా ?

నిజానికి, కనిపిస్తున్న ప్రపంచమంతా శక్తిమయం. చిగురులు కదలినా, చిదాకాశం మెరిసినా అది కేవలం శక్తి వల్లనే. పంచభూత సమ్మిళితమైన ప్రపంచం శక్తిని నిరంతరం ప్రదర్శిస్తూనే వుంటుంది.



# కదిలేదొకటి ... కదిలించేది మరొకటి !

భూమి, తన శక్తిని సహనంగా ఒక స్థాయిలో, ఉత్పత్తిని మరొకస్థాయిలో, నదులను, కొండలను ఒకటేమిటి, వేటినైనా భరించగల యింకొక స్థాయిలో వ్యక్తం చేస్తునే వుంటుంది.

నీరు, తన శక్తిని ప్రాణికోటికి జీవశక్తిగా, నిప్పును సైతం దాచుకోగల పరమశక్తిగా అభివ్యక్తం చేస్తుంటుంది.

గాలి, తన శక్తిని వేగంగా, ఆయువుగా, అనుభవంలోకి తెస్తుంది.

అగ్ని, తన దహన, హనన శక్తిగా ఒక సత్యానుభవం. ఆకాశం, తన శక్తిని, పరమాద్భుత ఖగోళ వేదికగా, మేఘసమూహాల కదలికగా, సూర్యచంద్రుల వెలుగులు పగలు రాత్రులను వెలిగించే కాంతి శక్తిగా, ఒక నిత్యానుభవం.

ఋతువు వెంట ఋతువుల చలనాలన్నీ శక్తి ప్రదర్శించే భిన్న ఆవిష్కరణలే!

ఏ శక్తులు ప్రకృతిని ఆవరించి, ఆవహించి, ఆవేశించి వున్నవో అవే శక్తులు ప్రతి వ్యక్తి యందూ వున్నాయి. ఆ కారణంగానే ప్రకృతిలో సంభవించే మార్పులన్నీ వ్యక్తిలోనూ జరుగుతూనే వున్నయ్.

ఇదంతా నిరంతర ప్రక్రియ. ప్రతి కదలికలోనూ పరిణామం యిమిడివుంది. ప్రతి పరిణామంలోనూ వృద్ధి, గతి శీలంగా వుంది. కంటికి కనబడే ఈ విషయాలన్నీ పదార్థ విజ్ఞానగతం.

పదార్థం నుండీ యదార్థం వైపు సాగేదే ప్రస్థానం.

ఇంతటి సృష్టినీ క్రమంతప్పక నడిపిస్తున్న అదృశ్య శక్తిని దైవంగా సంభావించటం, ఒక విశ్వభావన. కాలాన్ని పరబ్రహ్మంగా భావించటం, ప్రకృతిని ఆదిశక్తిగా పూజించటం, ప్రకృతిలోవున్న ప్రతి ప్రాణియందున్నది. భగవచ్ఛక్తే అనుకోవటం, భారతీయభావనే! అందువల్లనే, చెట్టు, పుట్ట, గుట్ట, మిట్ట, మన్ను, మిన్ను, కొండ, కోన, వాగు, వంక, నది, సముద్రం ..... సర్వమూ పూజలందుకోవటం, దైవరూపాలుగా ఆరాధనలనందు కోవటం భారతీయ దివ్యభావనలోని పవిత్రత.

పాము, కోతి, ఆవు, పక్షి,.... ఒకటేమిటి జీవరాశిలో దైవవాసిని ఉపాసించటం శక్తి వుపాసనలో భాగమే. మానవ శక్తిలో దాగిన మహితత్వాన్ని దర్శించటం, ఒక పరిణతస్థితి.

శక్తి- స్త్రీ స్వరూపంగా ఆవిష్కృతమైంది భారతదేశంలోనే . స్వరూప నిరూపణ విధానమే దేవీ పూజ. అవి, నవరాత్రులుగా, పర్వదిన ప్రవాహంగా హృదయంగమంగా, మానసోల్లాసంగా,

**అక్టోబర్ 14 విజయదశమి**

కనువిందుగా శక్తి ఉపాసనగా ఆసేతు శీతాచలం కదిలే చైతన్యంగా అనుభంలోకి వస్తాయి.

ప్రతి స్వరూపమూ ప్రతీకాత్మకమే.

తొలినాడు శైలపుత్రిగా - అచల శక్తి,

మలినాడు బ్రహ్మచారిణిగా - అద్వైత శక్తి,

అపై త్రిపురసుందరిగా - లలితా శక్తి,

చండిగా -అద్భుత శక్తి,

గాయత్రిగా - మేధా శక్తి,

శాంభవిగా - ఆత్మ శక్తి,

సరస్వతిగా - విద్యా శక్తి,

మహాలక్ష్మిగా- ధన శక్తి,

మహాకాళిగా - సువాసినీ శక్తి,

అపరాజితగా - దుర్గా శక్తి ....

ప్రకృతికి కావలసిన శక్తులనన్నిటినీ పరిచయం చేస్తూ, పూజిస్తూ, స్ఫూర్తి నందుకోవలసిన దివ్యకాలం ఈ నవరాత్రులు. నిజానికి ఈ నవరాత్రులన్నీ కాలపూజను సూచించేవే. సావిత్రీవిద్య ద్వారా ఆయువును, సరస్వతీ విద్య ద్వారా జ్ఞానాన్ని, గాయత్రీ విద్య ద్వారా బుద్ధిని వృద్ధి చేసుకోగల మహత్తర కాలం దేవీ నవరాత్రులు.

ప్రకృతితో సహజీవనం చేయటం వలన ఒనగూడే సర్వార్థ సంక్షేమాన్ని మానవుడు ఎట్లా క్షేమం చేసుకోవాలో, ఆనందంగా, ఆరోగ్యంతో, పవిత్రభావనలతో జీవించాలో బోధించే బోధకాలమే నవరాత్రులు. జీవుడు, జగత్తు, జగజ్జనని - మూడు స్థితులలో కనబడే ఒకే శక్తిగా అనుభవం చేసుకోమని సూచిస్తుంది భారతీయ తత్త్వచింతన. కనుక కంటికి

# పర్వతారోహణలో మహిళా డి.ఎస్పీ రికార్డు!

ఆమె ఇద్దరు బిడ్డల తల్లి.. అంతేకాదు, మన రాష్ట్ర పోలీసు శాఖలో ఉన్నత హోదా గల అధికారిణి.. విశేషమేమంటే అత్యంత కఠినమైన పర్వతారోహణలో ఆమె అరుదైన రికార్డు నెలకొల్పారు. ఇలాంటి రికార్డు నెలకొల్పడంలో మన రాష్ట్రం నుంచి తొలి మహిళా పోలీస్ ఆఫీసర్‌గా నిలిచారు.

... ఆమె పేరు జి. ఆర్. రాధిక...




ఎ.పి. పోలీస్ శాఖలో డి.ఎస్.పిగా విధులు నిర్వహిస్తున్న రాధిక సెప్టెంబర్ 20 సాయంత్రం 4 గంటల సమయంలో హిమాలయాల్లోని జన్‌స్కర్ శ్రేణుల్లో 5980 మీటర్ల ఎత్తయిన గొలెప్ కంగ్రి శిఖరాన్ని అధిరోహించారు. గడ్డకట్టే చలి, తీవ్ర ప్రతికూలమైన వాతావరణ పరిస్థితుల్లో డిఎస్పీ రాధిక ఆ శిఖరాన్ని అధిరోహించడం విశేషం!

వాస్తవానికి మన పోలీసు అకాడమీలో రాధిక శిక్షణలో ఉన్నప్పుడు అదనపు డి.జి.(క్రీడలు) శ్రీ రాజీవ్ త్రివేది ఆమె ప్రతిభను గుర్తించి ఎత్తైన శిఖరారోహణకు ప్రోత్సహించారు. జమ్ము-కాశ్మీర్‌లోని పహల్‌గావ్‌లో ఉన్న జవహర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ వింటర్ స్పోర్ట్స్‌లో శిక్షణలో ఉంటూనే ఈ ఘనత సాధించారు.

ఈ సంవత్సరం చివరి నాటికి ఇరవై వేల అడుగుల ఎత్తయిన పర్వతారోహణ చేయాలన్నది రాధిక లక్ష్యమని రాష్ట్ర క్రీడా విభాగం అధికారులు తెలిపారు. కాగా భవిష్యత్తులో డి.ఎస్.పి రాధిక ఎవరెస్ట్ శిఖరాన్ని కూడా అధిరోహించాలని అదనపు డి.జి (క్రీడలు) శ్రీ రాజీవ్ త్రివేది ఆకాంక్షించారు. ★

కనిపిస్తున్న ప్రకృతి సమస్తమూ పరస్పరాశ్రితంగా నడుస్తుంది. కదిలే దొకటి. కదిలించేది మరొకటి. మధ్యలో జీవుడు. ఇదొక అద్భుత త్రిపుటి.

జీవుడిలోవున్న ఇచ్ఛా, క్రియా, జ్ఞాన శక్తులు జీవుడి గమనాన్ని శాసిస్తయ్. సంకల్ప శక్తే యిచ్ఛా శక్తి, నిర్వహణ శక్తి, క్రియా శక్తి, విచక్షణా శక్తి, జ్ఞాన శక్తి. ఈ మూడు శక్తులనూ సమన్వయం చేసుకోగలిగితే, మానవ జీవితం ధన్యమౌతుంది. ప్రకృతిని ప్రేమించటం ద్వారా, ప్రకృతితో సహజీవనం చేయటం ద్వారా మనిషిలో పవిత్రత, సంయమనం, సౌందర్యభావనలు కలుగుతాయి. ఇంత పరమ రమణీయాద్భుత సృష్టిని, సృష్టించిన వాడెవరన్న ప్రశ్న మొలకెత్తి, అది అన్వేషణగా మారి, చివరకు యింతటికీ కారకుడు దైవమన్న భావన స్థిరపడుతుంది.

ఆ భావనే ప్రగాఢ విశ్వాసంగా రూపాంతరీకరణం జరిగి భక్తిగా స్థిమితమౌతుంది.

అటువంటి భక్తి, కాలగమనంలో జ్ఞానంగా ఫలించి, మనిషి, తనలోని దివ్యత్వాన్ని తాను అనుభవించగల స్థాయిని, స్థితిని కల్పిస్తుంది.

ఈ దిశలో నవరాత్రుల కాలాన్ని శక్తిమయంగా, ప్రకృతిని పరమదైవంగా, పరదైవాన్ని స్త్రీ రూపిణిగా, సర్వశక్తి రూపిణిగా దర్శించగలగాలి.

ప్రకృతి శక్తులలో దాగిన క్రీనీడలను, అవిద్యను, అజ్ఞానాన్ని, అహంకారాన్ని, మమకారాన్ని గమనిస్తూ, మనిషి తనతో తాను పోరాడి, అధర్మాన్ని అణచి, దైవ శక్తిని సాధించుకుని విజయుడు కావాలి. జీవప్రజ్ఞ, దైవ ప్రజ్ఞల సంఘటిత శక్తి, ప్రకృతికి రక్షాకవచం కావాలి.

'ద' అంటే దుర్గా శక్తి.

'స' అంటే సరస్వతీ శక్తి,

'ర' అంటే రమా శక్తి, ... అందుకే ఇది దసరా!

ఇదంతా కలిసి, విజయదశమి!

*– వి.యస్.ఆర్. మూర్తి*, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త
94406 03499

## ఆయుధమ్ములేని ఆహవమ్ము

కత్తిని పట్టబోవు, రిపుకాండములన్ శపియింపబోవు, నీ
చిత్తము సందొకించుకను చీకటి మూకల చేరనీవు, పెన్
కుత్తుక లుత్తరించెడి వృకోదర మూకల రాజ్యమున్ అహిం
సాత్తముగా జయించితివి – సాధుశిరోమణి నీవు బాపుజీ!
నీ చేతి సౌంజ్ఞతో నీహారగిరి నుండి
కడలి పర్యంతమ్ము కదలివచ్చె
నీ పల్కు వినగనే నిఖిల భారత ప్రజా
నీకమ్ము భక్తితో నిలిచిపోయె
నీవు కదిలిన చాలు నిర్ఝరాపగ వోలె
జనవాహినులు వెంట సాగి వచ్చె
నీ కంటి చూపులో నివ్వటిల్లిన కాంతి
దాస్య నిర్మూలన దారి జూపె

ఆయుధమ్ములేని ఆహవమ్ము నొనర్చు
నీదు పూన్కి గాంచి నిఖిలజగతి
వెరగుపడుచు నిన్ను వేనోళ్ళ కొనియాడి
గౌరవించెనయ్య! గాంధి దేవ!

*– సి. హెచ్.వి. బృందావన రావు*

# సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లను అదుపు చేయాలి

## జాతీయ సమగ్రతా మండలిలో సి.ఎం. శ్రీ కిరణ్

**రాష్ట్రంలో మతసామరస్యాన్ని, శాంతిభద్రతలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం గణనీయమైన సత్ఫలితాలు సాధించిందని ముఖ్యమంత్రి శ్రీ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.**

**సెప్టెంబర్ 23వ న్యూఢిల్లీలో జరిగిన జాతీయ సమగ్రతా మండలి సమావేశంలో తొలి ప్రసంగం చేసిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో మతసామరస్యాన్ని కాపాడటానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను, వాటి ఫలితాలను వివరించారు. ఆయన ఏమన్నారంటే...**




"రాష్ట్రంలో అత్యవసర పరిస్థితులు ఎదురైతే పారదర్శకంగా, వేగవంతంగా, పక్షపాత రహితంగా చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు భద్రత కల్పించడానికి, వకాలంలో పోలీసు సహాయం అందించేందుకు హైదరాబాద్ కేంద్రంగా డయల్ -100 ప్రాజెక్టును ప్రారంభించాం. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో నివసించే పౌరుడైనా కేవలం 100 నెంబర్‌కు డయల్ చేసి పోలీస్ సహాయం పొందవచ్చు. రాష్ట్రంలో అట్టడుగు స్థాయిలో ఉండే ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, మహిళా వర్గాలకు చెందిన పౌరులకు జవాబుదారీతో కూడిన పోలీసు సేవలు అందుబాటులోకి వచ్చాయి. పోలీసు శాఖలో మహిళల సంఖ్య హెచ్చించే చర్యలలో భాగంగా త్వరలో మరిన్ని మహిళా పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేయనున్నాం...

ఆపదలో వున్న మహిళలకు సహాయం అందించేందుకు పోలీసు శాఖ మహిళా సహాయ కేంద్రాన్ని నిర్వహిస్తోంది. అంతేకాదు రాష్ట్ర మహిళా కమిషన్ మహిళల సమస్యలను పరిష్కరిస్తోంది...

మహిళలకు గృహ హింస చట్టం - 2005 కింద అనేక సహాయక చర్యలను రాష్ట్రప్రభుత్వం అందిస్తోంది. మహిళల భద్రతకు రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నందు వల్లే ఇప్పటి వరకు నమోదు అయిన 23,040 ఫిర్యాదుల్లో 49 శాతం ఫిర్యాదులను కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించడం, మిగతా కేసులను నమోదు చేయడం జరిగింది.

రాష్ట్రంలో 2010-2012 మధ్యకాలంలో ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాల కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2010లో 4321 కేసులు నమోదు అయితే, 2012 లో వీటి సంఖ్య 3057కు తగ్గింది. అత్యాచారాల నిరోధక చట్టం కింద నమోదు అయిన కేసులు 2010లో 1509 ఉంటే వాటి సంఖ్య 2012 నాటికి 801కు తగ్గింది. సమాజంలో ఇతర వర్గాలతో సమానంగా ఎస్‌సి, ఎస్‌టిలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాలు సబ్‌ప్లాన్, షెడ్యూల్డ్ తెగల సబ్‌ప్లాన్‌కు 2013 లో దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్ట బద్ధత కల్పించింది.

రాష్ట్రంలో మత ఘర్షణలు నివారించేందుకు, నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాంతి కమిటీలను, శ్వాలీ పెత్రా కమిటీలను సమాజ ప్రముఖులతోను, మత పెద్దలతోను, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేయడం జరిగింది. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ శాంతి కమిటీల పనితీరు బావుంది. హైదరాబాద్-సికింద్రాబాద్ జంటనగరాల్లో మతసామరస్యం వెల్లివిరుస్తోంది. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు గణేష్ చతుర్థి, రంజాన్, బోనాలు వంటి పండుగ ఉత్సవాల్లో స్నేహపూర్వక వాతావరణంలో శాంతియుతంగా పాల్గొంటున్నారు.

ఇటీవల జరిగిన దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్ళ సంఘటనలు హైదరాబాద్ ప్రజల సామరస్యతను దెబ్బతీయలేకపోయాయి. హైదరాబాద్‌లో ప్రజలకు భద్రత కల్పించేందుకు 'సేఫ్ సిటీ ప్రాజెక్టు'ను అమలు చేయడానికి చర్యలు చేపట్టింది. అత్యధిక జనసాంద్రత ఉన్నప్పటికీ పోలీసు - పౌరుల నిష్పత్తి తక్కువగా ఉన్నందువల్ల సాంకేతిక సహకారంతో ప్రజల భద్రత కల్పించేందుకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులను ఉపయోగించుకుంటోంది. ఇందులో భాగంగానే నగరంలో 5 వేల నిఘా కెమెరాలను అందుబాటులోకి తెస్తోంది. ఇందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రజాభద్రతా చట్టం -2013ను రూపొందించింది. ఫలితంగా వాణిజ్య, విద్య, మత సంబంధమైన సంస్థలు ఇతర జన సమర్థం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో సి.సి టివి కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా పౌర భద్రత కల్పించాల్సి ఉంటుంది...

మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే వారి జీవితం భద్రంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. విద్యా సంస్థల్లోను, ఉపాధి అవకాశాల్లోను మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను రాష్ట్రప్రభుత్వం కల్పించింది. మహిళలకు సాధికారత కల్పించేందుకు మహిళా స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల కంటే ముందుంది. గ్రామీణ స్థాయి నుంచి స్వయం సాధికారత సాధించడంలో మహిళా బృందాలు విజయం సాధించాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 13.75 లక్షల మహిళా స్వయం సహాయక బృందాలు పనిచేస్తున్నాయి. వీటిలో ఒక కోటి 44 లక్షల మంది సభ్యులున్నారు. 2012-13లో

*జిల్లాల నుంచి...*

**ని**రక్షరాస్యత, అవగాహనా రాహిత్యం వల్ల కొందరు నిరుపేదలు అర్హత ఉన్నా, కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు అందిస్తున్న సహాయ, సహకారాలను అందుకోలేక పోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వివిధ ఆర్థిక సంస్థలు షెడ్యూల్డు కులాలు, వెనుకబడిన తరగతులు, సఫాయి కర్మ చారుల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ పథకాల పట్ల లబ్ధిదారుల్లో అవగాహన కల్పించేందుకు మన రాష్ట్రంలోనే ప్రథమంగా వరంగల్ జిల్లా మహబూబాబాద్‌లో సెప్టెంబరు 8వ ఓ అవగాహనా సదస్సు నిర్వహించారు.



# మీ కోసమే ఈ పథకాలు

కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఈ సదస్సును నిర్వహించింది. ఈ శాఖకు చెందిన కేంద్ర సహాయ మంత్రి శ్రీ పి. బలరామ్ నాయక్ ఈ సదస్సుకు హాజరై లబ్ధిదారులకు పలు ఉపకరణాలను పంపిణీ చేశారు. మొత్తం 1273 మంది వికలాంగులకు 246 ట్రై సైకిళ్ళు, 201 వీల్ ఛైర్లు, 572 వినికిడి యంత్రాలు, 185 చంక కర్రలు, 71 వాకింగ్ స్టిక్‌లు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. లక్ష మంది వికలాంగులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామని మంత్రి శ్రీ బలరామ్ నాయక్ ఈ సందర్భంగా చెప్పారు.

కాన్పూరు ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న భారతీయ కృత్రిమ అంగ నిర్మాణ కేంద్రం (ఎ.ఎల్.ఐ.ఎన్.సి.ఓ) వారు ఈ సందర్భంగా ఒక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ సి.ఎం.డి. శ్రీ నారాయణరావు ఈ సదస్సులో మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా వికలాంగులకు అందిస్తున్న సేవలను వివరించారు. 40 సంవత్సరాల క్రితం ఏర్పాటైన తమ సంస్థ 2001 జనాభా లెక్కల ప్రకారం దేశంలో గల 2 కోట్ల 19 లక్షల మంది వికలాంగులకు అవసరమైన 35 రకాల ఉపకరణాలను తయారు చేసి ఉచితంగా అందిస్తోందన్నారు.

షెడ్యూల్డు కులాల జాతీయ ఆర్థిక, అభివృద్ధి కార్పొరేషన్ సి.ఎం.డి. శ్రీ ఆర్.పి.సింగ్ ఈ సదస్సుకు నోడల్ అధికారిగా వ్యవహరించారు. తమ సంస్థ 2007-08 నుంచి రెండు లక్షల మంది లబ్ధిదారులకు 300 కోట్ల రూపాయల రుణాలు అందించిందని తెలిపారు.

జాతీయ మానసిక వికలాంగుల సంస్థ సంచాలకులు శ్రీ టి.సి. శివకుమార్ తమ సంస్థ ద్వారా మానసిక వికలాంగులకు అందిస్తున్న సేవలను వివరించారు.

మారుతి సుజికి ఇండియా, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సిపిట్ ప్లాస్టిక్ కంపెనీల ప్రతినిధులు కూడా ఈ సదస్సులో పాల్గొని, తమ సంస్థలలో నిరుద్యోగులకు అందిస్తున్న శిక్షణ, తద్వారా చేకూరుతున్న ఉపాధి అవకాశాలను వివరించారు.

ఈ సదస్సులో నేషనల్ సఫాయి కర్మచారీస్ ఫైనాన్స్ అండ్ డెవలపమెంట్ కార్పొరేషన్, తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొని, తమ సంస్థలు ఎటువంటి ఆర్థిక సహాయం అందిస్తోందో వివరించే కరపత్రాలు, ఇతర సమాచారాన్ని అందించారు.

జిల్లా అదనపు సంయుక్త కలెక్టర్ శ్రీ బి.సంజీవయ్య, డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్టు డైరెక్టర్ విజయ గోపాల్, శాసన సభ్యురాలు శ్రీమతి మాలోతు కవిత తదితరులు ఈ అవగాహనా సదస్సులో పాల్గొన్నారు.

ఇలాంటి అరుదైన, ప్రజలకు ప్రయోజనకరమైన కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

– *ఎం. శ్రీనివాస్ కుమార్,* మహబూబాబాద్

ఎస్‌హెచ్‌జి – బ్యాంకు లింకేజీ ద్వారా ఇచ్చిన రుణాలు రూ. 12,600 కోట్లు ఉన్నాయి.

బాలికల బంగారు భవిష్యత్‌కు భరోసా కల్పించేందుకు ఉద్దేశించిన 'బంగారుతల్లి'కి చట్టబద్ధత కల్పించాం. 2013 మే 1వ తేదీ తర్వాత రాష్ట్రంలో జన్మించిన బాలికలందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఆర్థిక సహాయంతో పాటు పౌష్టికాహార భద్రత, విద్య, ఆరోగ్యం అందించేందుకు ఈ 'బంగారు తల్లి' పథకం వీలు కల్పిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 12వ ప్రణాళికా కాలంలో దేశంలో అన్ని రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాల కంటే ఎక్కువ ప్రణాళిక రూ. 3,42,842 కోట్లతో రూపొందింది. ఇందులో రూ. 78 వేల కోట్లతో ఎస్‌సి, ఎస్‌టిల అభివృద్ధి, సంక్షేమానికీ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతోంది. 11వ ప్రణాళికలో బిసి సంక్షేమానికి రూ. 4,100 కోట్లు ఉంటే 12వ ప్రణాళికలో ఇది రూ. 7,465 కోట్లకు పెరిగింది. అలాగే మైనారిటీల సంక్షేమానికి 11వ ప్రణాళికలో రూ. 600 కోట్లు ఉంటే 12వ ప్రణాళికలో ఇది రూ. 5 వేల కోట్లకు పెరిగింది.

## సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లపై నియంత్రణ

సమాచార వేదికగా సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లు పనిచేయడం సంతోషదాయకం. అయినా ఇది మతానికి, గ్రూపులకు, వ్యక్తులకు వ్యతిరేకంగా ప్రచార వేదికలుగా మారుతుండడం ఆందోళన కలిగించే అంశం. సమాజంలోని విభిన్న వర్గాల మధ్య శాంతి, సత్సంబంధాలు దెబ్బతినడానికి కూడా ఈ సోషల్ నెట్ వర్కింగ్ సైట్లు దోహదం చేస్తున్నాయి.

సమాజాన్ని వేరు చేయడానికి, ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లు సమాచారాన్ని ప్రోది చేస్తున్నాయి. ఇందువల్ల పరిపాలనా యంత్రాంగానికి, శాంతిభద్రతలు కాపాడే యంత్రాంగాలకు చాలా పెద్ద సవాళ్ళు ఎదురవుతున్నాయి. అందువల్ల సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లు ఇండియాలో తమ సర్వర్లు ఏర్పాటు చేసుకునే విధంగా, భారతీయ చట్టాలకు లోబడి పనిచేసేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉందని నేను అభిప్రాయ పడుతున్నాను. వీటి నియంత్రణ తక్షణావసరం...

అలాగే 'నిర్భయ' కేసు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం క్రిమినల్ లా కు సవరణలు తీసుకు రావడం పట్ల నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. యాసిడ్ అమ్మకాలపై నియంత్రణలు విధించడం, పాయిజన్ చట్టానికి సవరణలు తీసుకురావడం వంటి చర్యలు ఆహ్వానించదగినవి. దీనివల్ల మహిళల పై యాసిడ్ దాడులను నియంత్రించడానికి ఇది దోహదపడుతుంది.

జాతికి సంబంధించిన అనేక అంశాలపై చర్చించే అవకాశం ఉన్న ప్రస్తుత వేదికపై నాకు ప్రసంగించే అవకాశం కల్పించిన ప్రధానికి, హోంమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను."

*

# మా వంట 'రవి' చేసి పెడ్తున్నాడు!

**గ్యాస్ సిలిండర్ల కోటా తగ్గినా,**

**ధర పెరిగినా ఫికర్ లేదు**

**సబ్సిడీ లేని వంట గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు రూ. 1024!**

**సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల కోసం ఎదురు చూపులు చూడనక్కర్లేకుండా, కరెంటు ఖర్చు లేకుండా, ఉచితంగా వంట చేసుకోవచ్చు!**

**మేం విశాఖపట్నంలోని మా ఇంట్లో ఇలా 18 ఏళ్ళుగా వంట చేసుకుంటున్నాం. రుచికరంగా వండుకుని తింటున్నాం. అందుకే సిలిండర్ల ధర పెరిగినా, సబ్సిడీ సిలిండర్ల కోటా తగ్గిపోయినా ఆ ప్రభావం మా కుటుంబ ఆర్థిక వ్యవస్థ మీద పడదు.**

* * *

**1987**లో కంపెనీల చట్టం కింద 'ఇండియన్ రిన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ' అనే దానిని నెలకొల్పారు. ఇదే 'సాంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ.' చిన్న తరహా నీటి పథకాలు, గాలిమరలు, గ్రామాల విద్యుద్ధీకరణ (సౌర శక్తితో) మొదలైన వాటి గురించి జనంలో చైతన్యం కల్పించి, ప్రోత్సాహకాలు ఇచ్చి, అభివృద్ధిని సాధించటం దీని లక్ష్యం. అప్పట్లో జమ్ము కాశ్మీరు తన కనీస రోడ్డయినా లేని మారు మూల గ్రామమైన 'యుస్లీ' అనే చోటుకి హెలికాప్టర్ల సాయంతో సౌరస్పందన ఫలకాలను తీసుకువెళ్ళి సౌరశక్తితో దీపాలు వెలిగించారు ఆ ఊళ్ళో!

అలాగే సముద్ర మట్టానికి 17500 అడుగుల ఎత్తులో వున్న మారుమూల గ్రామమైన 'డైగర్' లోనూ సౌర దీపాలు వెలిగించారు.

* * *

**సౌ**రశక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చే వాటికి 'ఫొటో వోల్టాయిక్స్' (Photo Voltaics) అని అంటాం. తెలుగులో సౌరస్పందకాలు! వీటిలో 'సిలికాన్ వేఫర్లు' వుంటాయి. సూర్యరశ్మి వాటి మీద పడినప్పుడు దానిని విద్యుత్తుగా మార్చి అవి నిలవ చేసుకుంటాయి.

1970 దశకంలోనే ఇవి మన దేశంలో వాడకంలోకి వచ్చినా, ప్రాచుర్యం పొందటానికి మాత్రం చాలా సమయం పట్టింది. మారు మూల ప్రాంతాలలో, మన దేశంలో, ఈ వేళ లక్షకు పైగా దీపాలు ఈ సౌరశక్తితో కాంతిని ఇస్తున్నాయి. నాలుగు వేల గ్రామాలలో ఈ వేళ ఈ సౌరశక్తిని వీధి దీపాలు వెలిగించుకోటానికీ, నూతిలోని నీటిని తోడుకోటానికీ వినియోగిస్తున్నారు.

అలాగే పెద్ద పెద్ద హోటళ్ళలో, భవంతులలో సౌరశక్తి పేటికల ద్వారా నీళ్ళు వేడి చేసి వాడుకోవటం జరుగుతోంది.

* * *

**సో**లార్ కుక్కర్‌తో వంట చేసుకోవటం చాలా సులభం! పైగా ఆరోగ్యకరం. కరెంట్‌లా షాక్ కొడుతుందనీ, గ్యాస్ లాగా ప్రమాదంతో కూడుకున్నదనీ, భయాలు అవసరం లేదు. వండిన పదార్థాలలో పోషక విలువలు అస్సలు వ్యర్థమైపోవు! వాతావరణం ఏమాత్రమూ కలుషితం కాదు. ఇంధనం పొదుపు చేయటం ద్వారా పర్యావరణ పరిరక్షణకు మన వంతు సాయం అందించిన వారమవుతాం. నగర ప్రజలు మొదలు అడవుల సమీపంలో నివసించే గిరిజనుల వరకూ అందరూ దీనిని సులువుగా ఉపయోగించుకోవచ్చును.

* * *

**2080** నాటికి క్రూడాయిలు నిల్వలన్నీ పూర్తయిపోయే సూచనలు వున్నాయి. భూగర్భంలోంచి వెలికి తీయగల నిల్వలు మహా వుంటే 800/900 బిలియన్ బేరల్స్ అని అంచనా. కొత్త నిల్వలు కనిపెట్టినా, అవి 400 బిలియన్ బేరల్స్ మించి వుండే అవకాశం లేదు. పాత లెక్కల ప్రకారం ఇరాన్ తమ వద్దవున్న నిల్వల కంటే మరో 60 బిలియన్ బేరల్సు ఎక్కువ వుండొచ్చునని చెబుతోంది. సౌదీ అరేబియా తన లెక్కలలో మరో 70 బిలియన్ బేరల్సు అదనంగా చేర్చింది. ఇలా 'ఎన్ని సున్నాలు కలిపినా ఒకటి కాదు' అనే చందాన, ఈ క్రూడాయిలు అంతా 2080 నాటికి లేదా 2100 సంవత్సరం నాటికి పూర్తిగా ఖాళీ అయిపోవటం ఖాయం.



ప్రపంచం మొత్తం మీద బొగ్గు నిల్వలు 1200 బిలియన్ టన్నులని తేల్చారు.

నేచురల్ గ్యాస్ విషయానికి వస్తే, వీటి నిల్వలు 2 మిలియన్ బిలియన్ క్యూబిక్ మీటర్లు అని అంచనా కట్టారు సోవియట్ రష్యావారు.

కాస్త అటూ ఇటూగా అయినా ఈ అంచనాలను బట్టి చూస్తే 21వ శతాబ్దం ముగిసే నాటికి ఇంధనం లేని గడ్డు రోజులు ఎదుర్కోవాలి. అప్పుడు మన ఖర్మకి కర్మసాక్షి, సాక్షాత్తూ సూర్యభగవానుడే, మరి!

* * *

**సూ**ర్యుని ద్వారా అమితమైన శక్తి భూమికి చేరుతోంది. ఇది స్వచ్ఛమైనది. జీవరాశులను జీవంతో వుంచే శక్తి! రోజూ సగటున భూమి మీద ప్రతి చదరపు మీటరు భాగానికీ 5 నుండి 6 'కిలోవాట్ అవర్స్' సౌర శక్తి అందుతోంది. భూమి మొత్తం వైశాల్యం ఎన్ని లక్షల చదరపు మీటర్లో ఆలోచిస్తే, ఈ శక్తి ఎంతవుంటుందో గానీ మన లెక్కలకి అందదు మరి!

ప్రతి రోజూ 75,000 ట్రిలియన్ కిలోవాట్ అవర్స్ విద్యుచ్ఛక్తికి సమానమైన సౌరశక్తి నేలను తాకుతోంది! అందులో కేవలం 0.1 శాతం వాడుకుంటే, మొత్తం ప్రపంచ ఇంధన అవసరాలన్నీ తీరిపోతాయి! కానీ, మనం ఏం చేస్తున్నాం? సూర్యుని వైపు చూడకుండా నేల వైపుకు చూస్తున్నాం.

భవిష్యత్తులో మనం సౌరశక్తి మీద ఆధారపడక తప్పదు! ఆ పని ఈ రోజు నుండే మనం మన ఇంటి నుండే ప్రారంభిద్దాం.

* * *

**సో**లార్ కుక్కర్ 2'X 2'X 1/2' సైజులో వుండే ఒక షీట్ మెటల్ పెట్టె. దీన్ని ఒక చోట నుండి మరో చోటుకి సూట్‌కేస్‌లా సులువుగా తీసుకు వెళ్ళొచ్చు. వేడిని ఒడిసి పట్టుకోటానికి, బయటకు పోనివ్వకుండా కాపాడటానికి ఆ షీట్ మెటల్ పెట్టెలో కింది భాగంలో థర్మాకోల్ లాంటి వస్తువు అమర్చుతారు.

పెట్టె లోపలిభాగంలో నల్లని రంగు పూసి వుంటుంది. ఆ భాగంలో 4 అల్యూమినియం బాక్సులు నల్ల రంగు పూసినవి అమర్చి వుంటాయి. వాటిపైన ఒక గ్లాసు షీటు అమర్చివుంటుంది. పెట్టె పైతల ఎపుకు ఒక అద్దం అమర్చి వుంటుంది. పెట్టె తెరిచి సూర్యుని వైపుకు తిప్పి మూతను వుంచితే, మూతకు

అమర్చిన అద్దం మీద పడే వెలుగు పెట్టెలోపల హెచ్చులోహ పాత్రల మీద పడేలా ఏర్పాటు చేయబడివుంటుంది. అన్నం, కూరలు, సాంబారు వంటివన్నీ దీనితో తయారు చేసుకోవచ్చు. అన్నానికి తగిన బియ్యం కడిగి అవసరం మేరకు నీరు పోసి మూత పెట్టేయ్యటమే.

ఎండ తీవ్రతను బట్టి రెండు నుంచి మూడు గంటల్లో అన్నం తయారయిపోతుంది. కంది పప్పులాంటివి చక్కగా లక్కలా ఉడికి పోతాయి. కూరలు ఉడికిన తర్వాత బయటకు తీసి మసాలా, పోపు వంటివి మనం చేర్చుకోవాలి. మరిగే క్రియ, ఉడికే క్రియ పూర్తిగా కుక్కర్‌లో అయిపోతుంది. అదనపు రుచులకు మనం గ్యాస్ వాడితే సరి పోతుంది. బంగాళా దుంపలు వంటివైతే పల్చగా తరిగి, తగిన నూనె వాటికి పట్టించి, కుక్కర్‌లో పెట్టేస్తే, వేపుడు కూడా అయిపోతుంది.

మినప రొట్టెలాంటివి, ఆవిరికుడుము లాంటివి చక్కగా తయారవుతాయి. పాలు కూడా వేడి చేసుకోవచ్చు. పూర్వపు రోజుల్లో 'పిడకల దాలి'లో కాచినట్టు నెమ్మది మీద ఎర్రగా కాగిన పాలతో సోలార్ కుక్కర్ ద్వారా కమ్మని పెరుగు తయారవుతుంది.

*ఇందులో ప్రయోజనాలు ఏమిటంటే...!!*

- ఉపయోగించటం చాలా సులువు, సురక్షితమైనది
- కరెంటు స్టౌలాగా షాక్ కొట్టే అవకాశం, గ్యాస్‌స్టౌలా గ్యాసు లీకయ్యే అవకాశం, కిరసనాయిలు స్టౌలాగా పేలే అవకాశం లేదుగాక లేదు.
- కుక్కర్ వాడుకలో వుండగా ఏ భాగం ముట్టుకున్నా ఏమీ అవదు. చంటి పిల్లలు పాకుతూ వెళ్ళి తాకినా, ఏమీకాదు!
- ఎటువంటి అనాగరికులయినా సులువుగా వాడుకోవచ్చు.
- అసలు ఖర్చు వుండదు దీనితో! ఎందుకంటే కరెంటు, గ్యాసు, కిరసనాయిలు, బొగ్గులు, ఊక, కర్రలు ఏవీ అక్కర లేదు దీనికి ఇంధనంగా! కేవలం మూడు గంటలసేపు ఎండవుంటే చాలు!! ఎండ పడేలా రెండు మూడు సార్లు బాక్సును తిప్పటమే! అంతే!
- బదిలీల మీద వెళ్తునప్పుడు మన పెట్టెలతో బాటు దీనినీ ఓ సూట్‌కేసులా తరలించుకు పోవచ్చును.
- సోలార్ కుక్కర్‌లో ఉడికిన పదార్థాలు శరీరానికి మరింత ఆరోగ్యం.

* * *

సోలార్‌కుక్కర్ వాడటం వలన పర్యావరణానికి అవగింజంతయినా హాని లేదు. సూర్యుని వేడిమిని ఒడిసి పట్టుకొని వండుకోవటమే! పైగా పర్యావరణానికి ఇంధనం మిగల్చటం ద్వారా మేలు చేస్తున్నాం అని మరిచిపోవద్దు!

ఎలా మేలు జరుగుతుందంటే... వర్షాకాలం నాలుగు నెలలూ మినహాయించి, ఏడాదిలో సుమారు ఎనిమిది నెలలు, వంటలో ముఖ్యమైన ప్రక్రియ 'ఉడకపెట్టటం' అనే దానికి సోలార్‌కుక్కర్ వాడుతూ, మిగిలిన పోపులు, కాఫీలు, టిఫిన్లు మొదలైన వాటికి గ్యాసును ఉపయోగిస్తే, ఏ దాడికి ఆరు సిలిండర్ల వాడకంతో ఓ మాదిరి కుటుంబం గట్టెక్కేస్తుంది. అంటే మిగిలిన మూడు సిలిండర్ల కోసమో, ఆరు సిలిండర్ల కోసమో వెంపర్లాడి జేబుకు చిల్లుపెట్టుకోనక్కర లేదు.

* * *

భూగోళ తాపాన్ని తగ్గించేందుకు కూడా సోలార్ కుక్కర్లు సాయ పడతాయి.

ఒక టన్ను ఎల్‌పిజి గ్యాసు మండించటానికి 3.95 టన్నుల ఆక్సిజన్ కావాలి. అది మండిన తర్వాత 3.341 టన్నుల కార్బన్‌డయాక్సైడు, 1.708 టన్నుల నీటి ఆవిరి వెలువడతాయి. అంటే ఈ ప్రక్రియతో ప్రకృతిలోని స్వచ్ఛమైన ఆక్సిజన్ వాడుకొని, పర్యావరణానికి హాని కల్గించే, గ్లోబల్ వార్మింగ్‌కి మరింత దోహదం చేసే కార్బన్ డయాక్సైడు మనం మన చర్య ద్వారా, ప్రకృతిలోనికి విడిచి పెడుతున్నాం.

ఏడాదిలో మన రాష్ట్రంలో 20,44,800 టన్నుల ఎల్‌పిజి వాడుతున్నాం కదా! అంటే, ఈ గ్యాసు మండించే ప్రక్రియలో 81,79,200 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ ఖర్చు పెట్టేస్తూ, 69,52,320 టన్నుల కార్బన్‌డయాక్సైడును పర్యావరణంలోకి వదిలేస్తున్నాం. ఇది కేవలం ఒక్క ఏడాదిలో ఒక్క రాష్ట్రంలో!!

*ఇప్పుడు మన రాష్ట్రంలోని పరిస్థితిని వివరంగా చూద్దాం! (2012 వివరాలు)*

| | |
|---|---|
| రాష్ట్రం మొత్తం గ్యాస్ కనెక్షన్లు సుమారు | రూ. 1.6 కోట్లు |
| అందులో గృహ వినియోగ కనెక్షన్లు సుమారు | రూ. 1.0 కోట్లు |
| వాణిజ్య కనెక్షన్లు సుమారు | రూ. 0.2 కోట్లు |
| దీపం కనెక్షన్లు సుమారు | రూ. 0.4 కోట్లు |

వాణిజ్య కనెక్షన్లు ఇరవై లక్షలూ మినహాయిస్తే, మొత్తం 1.4 కోట్ల కనెక్షన్లూ సబ్సిడీ మీద సుమారు రూ. 400 లకే కావాల్సినన్ని సిలిండర్లు అప్పటికి పొందే వారు. ఆ తర్వాత ఏడాదికి ఆరు సిలిండర్లు దాటితే మిగిలిన వాటిని అదనంగా మరో రూ. 542 చెల్లించి పొందేవారు. అంటే మొత్తం రూ. 947 గా అప్పట్లో రేటు నిర్ణయమైంది. సెప్టెంబర్ 13 మొదటి తేదీ నుంచి సిబ్బంది మీద రూ. 468 గానూ, సబ్సిడీ లేకుండా అయితే రూ. 1024.50 గాను పెంచటం జరిగింది.

ఇది సామాన్యునికి అశనిపాతమే! అయినా చమురు సంస్థల నష్టాల బేరీజులు, రూపాయి మారకం విలువలు, అంతర్జాతీయంగా క్రూడాయిలు ధరలు అలా ఎన్నిటి మీదో ఆధారపడి ఈ పెంపు లేదా తగ్గుదల జరుగుతుందన్నది మనందరికీ తెలిసిందే! ఈ మార్పులను మౌనంగా స్వీకరించటం తప్ప సామాన్యుడు చేయగల్గింది ఏమీ లేదు ఈ విషయంలో!

* * *

**1995**లో సోలార్ కుక్కర్ ధర రూ. 1100 సబ్సిడీ మీద రూ. 550కే సాంప్రదాయేతర ఇంధనవనరుల శాఖ ద్వారా దీనిని అప్పట్లో అందుబాటులోనికి తెచ్చింది.

అపుడు కొన్ని ప్రయివేటు సంస్థలు దీని మోడలు మార్చి రూ. 6000 కి అమ్ముతున్నాయి. కానీ పాత మోడలు బాక్సులను ప్రభుత్వం పెద్ద మొత్తంగా చేయిస్తే సులువుగా రూ. 4000 కే ఒక్కో సోలార్ కుక్కరూ తయారవుతుంది.

దీపం కనెక్షన్ల వారికి – అంటే 40 లక్షల గ్యాస్ కనెక్షన్ల వారికి, రూ. 1000 కి సోలార్ కుక్కర్ సరఫరా చేస్తే మిగిలిన రూ. 3000 ప్రభుత్వం భరిస్తే, రూ. 1200 కోట్లకే అందరికీ – అంటే, దీపం కనెక్షన్ల వారందరికీ సోలార్ కుక్కర్లు సబ్సిడీ మీద అందుతాయి.

అంత దీపం కనెక్షన్ల వారి సంగతి ఆలోచిద్దాం. వారు అదనంగా తీసుకునే 3 సిలిండర్ల ఖర్చు లోపునే అంటే కట్టవలసిన రూ. 1000 ఒక్క మారే కడితే కుక్కర్ వారి స్వంతమవుతుంది. ఆ మీదట, సోలార్ కుక్కర్ సాయంతో కేవలం ఏడాదికి 6 సబ్సిడీ సిలిండర్ల సాయంతో వారు వంట చేసుకోవచ్చును.

ప్రభుత్వ పరంగా ఆలోచిస్తే – దీపం కనెక్షన్ల వారికి సబ్సిడీ రూపంలో ఇస్తున్న భారం రూ 634 కోట్లు కనుక, సుమారు రెండేళ్ళ భారం ఒకేసారి పెట్టుబడి పెట్టి సోలార్ కుక్కర్‌లు సప్లయి చేస్తే, ఇక ఆ తర్వాత ప్రభుత్వానికి రూపాయి ఖర్చుండదు. ప్రతి సంవత్సరం పెరిగిపోయే భారం సబ్సిడీ రూపంలో ప్రభుత్వం నెత్తికి ఎత్తుకోనక్కర లేదు!

అలాగే మొత్తం వినియోగదార్లు (వాణిజ్యం మినహా) ఒక కోటీ నలభై లక్షల మందికీ అదనపు సబ్సిడీ సిలిండర్ల మీద ప్రభుత్వానికి పడే ఖర్చు రూ. 2219 కోట్లు (ఇప్పుడు ఇంకా పెరిగింది).

అందరికీ రూ. 1000 సబ్సిడీ రేటు మీద సోలార్ కుక్కర్‌లు ఇస్తే ప్రభుత్వానికి రూ. 4200 కోట్లు అవుతుంది. అంటే రెండు సంవత్సరాల బాటు సబ్సిడీ రేటు మీద అదనపు 3 సిలిండర్లు ఇస్తున్నామని అనుకుంటే, అయ్యే ఖర్చు అన్నమాట! ఆ తర్వాత సబ్సిడీ సిలిండర్లు ఇవ్వాల్సిన అవసరం వుండదు.

ఈ విధంగా రెండు సంవత్సరాల తర్వాత (ఆ సిలిండర్లు మినహా ఇస్తే) సబ్సిడీ భారం ప్రభుత్వానికి వుండ బోదు! సౌరశక్తి వినియోగ ప్రోత్సాహమూ జరుగుతుంది! వినియోగదారులకు డబ్బూ ఆదా అవుతుంది.

*– ద్విభాష్యం రాజేశ్వరరావు*
*0891-2790109*



# దసరా మామూళ్ళు . . . .



# పెద్ద సమస్యకి చిన్న పరిష్కారం

తరచుగా, అందరం ఎదుర్కొనే సమస్య నిర్మలంగా, పరిశుభ్రంగా వుండాల్సిన ప్రదేశాలు నయితం మురికి కూపాలుగా తయారవుతూండటం.

అందులో మనం భాగస్వాములం కాని సందర్భాలలో - చూసి బాధపడతాం. బాధ్యులైన వారిని తిట్టుకుంటాం. పాశ్చాత్యదేశాలలో అయితే పార్కులు, రోడ్లు, చెరువులు, ప్రార్థనా స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు - కద్దైరా అన్నీ ఎంత పరిశుభ్రంగా వుంటాయో అని తలుచుకొంటాం.

కాని ఇక్కడెందుకు ఇలా జరుగుతోందో, అందులో మన పాత్ర ఎంతో మాత్రం తెలుసుకునే ప్రయత్నం చేయం.

ఉదాహరణకి -

ఎంతో భక్తితో పూజలు చేస్తాం. ఆ తరువాత - నిన్నటి తాజా కుసుమాలు, ఇతర వ్యర్థ పదార్థాలు అన్నీ కలిపి ఒక పాలిథిన్ కవర్లో పెడతాం. దాన్ని తీసుకువెళ్లి ఒక మంచినీటి సరస్సులోనో, లేదా చక్కని పంటకాలువలోనో, పుణ్యనదిలోనో 'కవరు'తో పాటు పారేస్తాం.

పచ్చని పంట పొలాల్లో, దారికిరుప్రక్కలా, రోడ్డు పైనా విచక్షణా రహితంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తా చెదారం పారవేస్తాం. మన ఇల్లంతా శుభ్రం చేసి పదిమంది తిరిగే తోవల్లో ఆ వ్యర్థాల్ని విసిరేస్తాం. రైలు పట్టాల వెంబడి చూస్తే ఈ 'చెత్త' దర్శనం అనంతం.






సామవేదం షణ్ముఖ శర్మ

కాసింత తీరిక దొరికితే, వంట పదార్థాన్ని వాహనాల్లో సర్దుకొని, ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు, పళ్లాలు, పాత్రలు పట్టుకువెళతారు. తోవలో మంచి అటవీ ప్రాంతమో, పచ్చని తోటలో ఉంటాయి. 'ఇక్కడ ప్లాస్టిక్ పదార్థాలనీ, చెత్తనీ వేయకండి' అనే 'బోర్డు' కూడా కనబడుతుంటుంది. కానీ 'గుడ్డి' వారి వలె దాని సమీపంలోనే 'పిక్నిక్ స్పాట్' వలె కూర్చొని కడుపునిండా తిని - అంతా కలసి ఎంగిలి పళ్లాలనీ, గ్లాసులనీ, చెత్తనీ అక్కడే పారేసి చేతులు కడుక్కొని వాహనాలెక్కి వెళ్లిపోతారు.

ఇలాంటి పాపాత్మ పౌరులు కూడా వున్న దేశం పేరే భారతదేశం.

'సివిక్ సెన్స్' లేని మనవారందరూ పరిసరాలను కాలుష్య పరుస్తుంటారు. ఒకప్పుడు చేతి సంచితో బయటకు వచ్చి కావలసిన పదార్థాలన్నీ కొనుక్కొని అందులోనే నింపుకొని, ఇంటికివచ్చి భద్రపరచుకోవడం అనే మంచి అలవాటుండేది.

ఒక్క దశాబ్దం లోపలే ఈ మహమ్మారి దురలవాటు మనకి సోకింది.

ఆసేతు శీతాచలం-పర్యాటక స్థలాలు, పవిత్ర క్షేత్రాలు, పుణ్యనదులు... అన్నీ చెత్తకూపాలుగానే మారిపోయాయి. మరొక వైపు నాగరికత పెరుగుతోందనీ, సాంకేతికంగా ఎదిగిపోయామనీ భ్రమిస్తున్నాం. కానీ అన్ని విధాల తిరోగతే మన ఇన్నాళ్ళ 'అభివృద్ధి' అని తెలుసుకోలేక పోతున్నాం.

'ప్లాస్టిక్, పాలిథిన్లు వాడితే శిక్షార్హులు' అని ప్రకటించే వారంతా, అసలు వాటి ఉత్పత్తుల్ని ఎందుకు నిషేధించడం లేదు! స్వయం క్రమ శిక్షణ చేతకాని అనాగరిక మానవజాతులకి నీతి పాఠాలు చెవికెక్కవు. కాని మనం అనాగరికులమంటే ఒప్పుకుంటామా?

వెనకటికెవరో పాశ్చాత్యులు భారతదేశాన్ని 'డస్టబిన్'తో పోల్చితే చాలా నొచ్చుకొని, కొందరు అభిమానధనులు బాధపడ్డారు, కానీ 'డ్రైనేజ్ డ్రమ్'తో పోల్చితే ఇంకా సమంజసమేమో అని నేటి అనుభవజ్ఞులు భావిస్తున్నారు.

సంస్కృతి వదిలేయడంలోనూ, మాతృభాషను విడిచి, విచ్చలవిడిగా తిరుగుతూ, వికృతమైన కట్టూ, బొట్టూ అలవాటు చేసుకోవడంలోనూ ముందజవేస్తూ కాము 'పాశ్చాత్యీకరణ'లో కృతకృత్యులమై పోయామని పరవశించి పోతున్న కృతక యువత జాతి వైకృత్యం వెర్రితలలు వేస్తోంది. ఈ అనుకరణ కేవలం విచ్చలవిడితనంలోనో, 'పబ్' సంస్కృతిలోనో కాక - విదేశస్థుల న్యాయనిరతి, పరిసరాల పరిశుభ్రత, క్రమశిక్షణ వంటి వాటిలో పాటించితే కొంతైనా మేలు కదా !

ప్రపంచమొత్తం మీద గొప్ప సంస్కృతి, ధర్మం పరంపర కలిగిన దేశం మన భారతం మాత్రమే! కానీ-తనదైన వారసత్వ సంపదపై గౌరవం లేని, భావ బానిసత్వంలో దిగబడి, ఒక మహా మురికికూపంగా తన దేశాన్ని మార్చుకున్న పౌరులు భారతీయులు మాత్రమే!

అయితే- మన రామాయణ భారతాది ధార్మిక గ్రంథాలను పరిశీలిస్తే పరిసరాలను, ప్రకృతి పర్యావరణను ఎంత శుభ్రంగా, పదిలంగా తీర్చిదిద్దుకోవాలో స్పష్టమౌతుంది.

ఇతర దేశ నాగరికతలు కళ్లు తెరవకముందే ప్రాచీన భారతీయ శాస్త్రాలు పరిశుభ్రతకీ, సమాజం పట్ల బాధ్యతకీ ప్రాధాన్యాన్నిచ్చాయి. భారతీయ సంప్రదాయంలో 'శౌచం' ఒక ప్రధాన భాగం.

శుచిలేని చోట దేవతలుండరు - అని ధార్మిక గ్రంథాలు చాటి చెప్పాయి. బాహ్య శుభ్రత, సూక్ష్మమైన సదాచారం కలిసి 'శౌచం'. ధర్మంలో శౌచానికి ప్రధాన భూమిక.

ఇంత సంస్కారాన్ని అందించిన దేశంలో దేవాలయాల పరిసరాల్లోనే అసహ్యాకరమైన పరిస్థితుల్ని ఏర్పరచడం దిగ్భ్రాంతికరమైన దిగజారుడుతనం.

సత్సంకల్పాలతో, సదాలోచనలతో చిత్తాన్నీ, స్నాన శంభ్రాలతో శరీరాన్ని సత్కర్మలతో జీవితాన్నీ;పరిశుభ్రమైన పరిసరాలతో ప్రకృతినీ శుద్ధిచేసే ప్రక్రియలు మనకు సంప్రదాయాలుగా, ఆచారాలుగా ఋషులు బోధించారు.

వాటన్నింటినీ చాదస్తాలుగా కొట్టిపారేసి అనాచార, దురాచారాలు అలవాటుచేసుకొని, పశుప్రాయంగా మారుతున్నాం.

పరదేశాలను చూసి, మన మహర్షుల బోధల్ని పరిశీలించి - ప్రపంచానికే ఆదర్శప్రాయమైన 'శుద్ధ దేశం'గా పరిణతి చెందించగలమా?

ఇంత పెద్ద సమస్యకి ఒక చిన్న పరిష్కారం వుంది.

నిజానికి ప్రతి ఒక్క మనిషి ఈ సామాజిక స్పృహతో నడిస్తే ఈ సమస్య మిగులుతుందా ? *

# 'నీలం' తుపాను బాధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ

నిరుడు నవంబర్‌లో వచ్చిన 'నీలం' తుపాను బీభత్సానికి పంటలు కోల్పోయిన చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) కింద రూ. 216 కోట్ల 57 లక్షల 53 వేలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూశాఖ ఆగస్టు 21వ తేదీన ఉత్తర్వులు (జీవో.ఆర్.టి.నం. 222) జారీ చేస్తూ రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలకు చెందిన 5 లక్షల 45 వేల 358 మంది పంటలు దెబ్బతిన్న రైతులకు ఈ సబ్సిడీ మొత్తాన్ని అందించనున్నట్లు స్పష్టం చేసింది.

తూర్పుగోదావరి, శ్రీకాకుళం, గుంటూరు, కృష్ణా, విశాఖ పట్నం, ఖమ్మం, ప్రకాశం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లోని రైతులకు మాత్రమే ఈ ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తుందని జీవోలో పేర్కొంది.

## GOVERNMENT OF ANDHRA PRADESH

### REVENUE (DM.I) DEPARTMENT

**G.O.Rt.No. 222** **Dated: 21st August 2013**

**ORDER:**

In the reference 1st read above, administrative sanction was accorded for an aggregate amount of Rs.1662,89,71,500 (Rs one thousand six hundred sixty two crore eighty nine lakh seventy one thousand and five hundred only) from State Disaster Response Fund (SDRF) towards input subsidy for losses/damages caused on account of Drought - 2012 and 'Nilam' Cyclone – 2012 to Agriculture and Horticulture Sectors, as detailed hereunder.

**Table - 1**

| S.I. No. | Sector | Drought-2012 | 'Nilam' Cyclone 2012 | Total |
|---|---|---|---|---|
| 1 | Agriculture | 11858400000 | 4280706500 | 16139106500 |
| 2 | Horticulture | 130300000 | 359565000 | 489865000 |
| | | 1198,87,00,000 | 464,02,71,500 | 1662,89,71,500 |

ఈ తొమ్మిది జిల్లాల్లో నీలం తుపాను కారణంగా వాస్తవంగా పంటలు వేసిన విస్తీర్ణంలో యాభై శాతానికి పైగా అంటే 2 లక్షల 19 వేల 914 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నట్లు జీవోలో పట్టిక రూపంలో విపులీకరించింది. జిల్లాల వారీగా బాధిత రైతులకు పెట్టుబడి రాయితీ మొత్తం పంపిణీకి తగిన చర్యలు తీసుకోవాలని జీవోలో వ్యవసాయ శాఖ కమీషనర్‌ను ఆదేశించింది. ☆

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి)

---

# నాబార్డు రుణంతో గిరిజన స్కూళ్లలో వసతులు

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఉన్నత ప్రమాణాలకు దీటుగా కనీస సౌకర్యాల కల్పనకు రూ. 95 కోట్లు మంజూరు చేసేందుకు పాలనా పరమైన అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ నుంచి ఆగస్టు 22వ తేదీన ఉత్తర్వులు (జీవో.ఆర్.టి.నం.571) జారీ చేస్తూ మొత్తం నూరు గిరిజన సంక్షేమ పాఠశాలల్లో వసతుల మెరుగుకు ఈ నిధులు కేటాయించాలని సూచించింది.

మూడేళ్లలోగా అంటే 2016 మార్చి 31వ తేదీలోగా ఆయా పాఠశాలల్లో పనులు పూర్తి కావాలని జీవోలో తెలిపింది. మంజూరు కానున్న రూ. 95 కోట్లలో నాబార్డు తన వాటా రుణంగా

## GOVERNMENT OF ANDHRA PRADESH

### SOCIAL WELFARE (TW.BUD.2 DEPARTMENT

**G.O.Rt.No. 571** **Dated: 22nd August 2013**

**ORDER:**

In the reference 3rd read above, NABARD have conveyed their approval and sanctioned loan for 100 Tribal Welfare Schools as per the details given below:

| Type of project | Tribal Welfare Schools |
|---|---|
| No. of Projects | 100 |
| Outlay | **Rs.9500.00 lakhs** |
| Loan from NABARD | **Rs.8075.00 lakhs** |
| Amount to be contributed by the State Government | **Rs.1425.00 lakhs** |
| Cut off date for reimbursing the expenditure | Work done/expenditure incurred from 1st April 2013 |
| Period of completion of the projects | 31st March 2016 |
| Rate of interest | 8.75% (Current Bank Rate 10.25% |

రూ. 80 కోట్ల 75 లక్షలను భరిస్తుందనీ, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ. 14 కోట్ల 25 లక్షలు భరిస్తుందనీ జీవోలో పేర్కొంది. నాబార్డు ఇచ్చిన రుణాన్ని సద్వినియోగపరచుకునేలా గిరిజన సంక్షేమశాఖ చీఫ్ ఇంజనీర్ చర్యలు తీసుకోవాలని జీవోలో ఆదేశించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి)

☆

# ఇక కలెక్టర్ ధ్రువీకరిస్తేనే అభివృద్ధి నిర్మాణాలు

ప్రయివేటు వ్యక్తులకు, సంస్థలకు, ఇతరులకు ప్రభుత్వం కేటాయించిన భూముల్లో భవన నిర్మాణాలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి విధిగా ఉండాలని నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆగస్టు 23న ఉత్తర్వును (జీవో.ఎం.ఎస్. నం. 474) జారీ చేస్తూ ప్రభుత్వం కేటాయించిన భూములు దుర్వినియోగం కాకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది.

కేటాయించిన స్థలాల్లో లేదా అసైన్డ్ భూముల్లో ఎవరైనా అభివృద్ధి నిర్మాణాలకు దరఖాస్తు చేస్తే...

**GOVERNMENT OF ANDHRA PRADESH**

**REVENUE (ASSIGNMENTS.I) DEPARTMENT**

**G.O.Ms.No. 474** **Dated: 23rd August 2013**

**ORDER:**

It has been brought to the notice of the Government that Government land assigned or alienated in favour of private individuals / organizations with certain conditions where the allottees in total violation of the conditions of allotment are getting the necessary statutory approvals from the Statutory Bodies and going ahead with constructions in total violation of the initial conditions of allotment. This is making it difficult to resume such lands at a later period of time. This issue was discussed in a meeting held on 11.6.2013 and a decision has been taken to issue instructions in this regard to curtail such practice so as to safeguard the scarce valuable government land.

2. Government after careful examination of the matter and in the circumstances reported by the Special CS and CCLA as reported in the D.O. Letter cited, hereby direct all the Statutory Bodies viz., Urban Development Authorities, Municipalities, Panchayats, Pollution Control Board and the Registration Officers shall refer the applications where permission / approval seeking for construction / development on the government allotted / assigned to the respective District Collectors for confirmation of fulfillment of conditions

సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థలు, మున్సిపాలిటీలు, పంచాయతీ కార్యాలయాలు, కాలుష్య నివారణ మండలి, రిజిస్ట్రేషన్ అధికారులు పరిశీలించి, కలెక్టర్ అనుమతి ఉన్న అర్జీలకే అనుమతి ఇవ్వాలని జీవోలో ఆదేశించింది. సంబంధిత అధికారుల నుంచి ప్రభుత్వానికి వచ్చిన లేఖ ఆధారంగా రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి కొత్త నిబంధనలు రూపొందించినట్లు జీవోలో వివరించింది..

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

---

# 13 జిల్లాల్లో 1801 తాగు నీటి పథకాలకు అనుమతి

13వ ఆర్థిక సంఘం నిధులతో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో మొత్తం 1801 గ్రామీణ తాగునీటి పథకాల నిర్మాణానికి పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ విభాగం ద్వారా ఆగస్టు 27వ తేదీన ఉత్తర్వులు (జీ.వో.ఆర్.టి. నెం. 1379) జారీ చేస్తూ 2013-14; 2014-15 (రెండు) సంవత్సరాల కార్యాచరణ ప్రణాళిక కింద రూ. 14872 కోట్ల 58 లక్షలతో ఈ తాగు నీటి పథకాలు నిర్మించనున్నట్లు స్పష్టంచేసింది.

మంజూరైన ఈ పనుల్లో 1392 తాగునీటి పథకాలు కొత్తవికాగా, వాటికి రూ. 11441 కోట్ల 39 లక్షలు కేటాయించాలని నిర్ణయించినట్లు జీ.వో.లో తెలిపింది. ఇదికాక ఇవే జిల్లాల్లో జాతీయ గ్రామీణ తాగునీటి పథకం (ఎన్.ఆర్.డి.డబ్ల్యు.పి)

**GOVERNMENT OF ANDHRA PRADESH**

**PANCHAYAT RAJ AND RURAL DEVELOPMENT (RWS.IIIA) DEPARTMENT**

**G.O.Rt.No.1379** **Dated: 27th August 2013**

**ORDER:**

In the reference read above, the Engineer-in-Chief, Rural Water Supply & Sanitation, Hyderabad has requested to accord administrative sanction for 1392 new SVS works for an amount of Rs.11441.39 Lakhs and also sanction for conversion of the advanced stage of works sanctioned under NRDWP in (13) non coastal Districts for an amount of Rs.3431.19 Lakhs for 409 SVS works to 13th FC Grants under UIDAI Project.

2. The Government after careful examination of the request of the Engineer-in-Chief, Rural Water Supply & Sanitation, Hyderabad hereby accord administrative sanction for (a) 1392 new SVS works with an estimated cost of

కింద 409 తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అదనంగా రూ. 3431 కోట్ల 19 లక్షలు కేటాయించినట్లు జీ.వో.లో వివరించారు. సింగిల్ విలేజి స్కీమ్ కింద ఈ పథకాల పనులు జరిపేందుకు ముందుగా స్థల నిర్ధారణ, సేకరణ తోపాటు అన్ని అనుమతులూ లభించిన తర్వాతే పంచాయతీ రాజ్ నిబంధనలకు లోబడి టెండర్లు ఆహ్వానించాలని జీవోలో సూచించారు.

జిల్లాస్థాయి కమిటీ అధ్వర్యంలో తాగునీటి పథకాల పనులు జరుగుతాయి. జిల్లా స్థాయి కమిటీకి ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. కన్వీనర్‌గా గ్రామీణ తాగునీటి పథకం విభాగం సూపరింటెండెంట్ ఇంజనీర్ ఉంటారు. అంతేకాక ఈ కమిటీలో మరో ఆరుగురు సభ్యులుంటారని జీవోలో పేర్కొంది, 13వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలకు లోబడి నిధులు సద్వినియోగమయ్యేలా పథకాలు నిర్మించాలని జీవోలో సంబంధిత చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

## క్రిస్టియన్ల వార్షిక ఆదాయ పరిమితి పెంపు

**GOVERNMENT OF ANDHRA PRADESH**

**MINIRITIES WELFARE (ECDM)DEPARTMENT**

**G.O.Rt.No. 149** **Dated: 28th August 2013**

**ORDER:**

In the G.O.1st read above, orders were issued fixing the Annual Income Ceiling Limit upto Rs.50,000/- under Subsidy Grant for Bankable Scheme to the A.P.State Minorities Finance Corporation Limited, Hyderabad.

2. Further in the G.O.2nd read above, Government have enhanced the Annual Income Ceiling Limit from Rs.50,000/- to Rs.75,000/- under Subsidy Grant for Bankable Scheme to the A.P.State Minorities Finance Corporation Limited, Hyderabad.

3. In the references 3rd and 5th read above, the Managing Director, A.P.State Christian (Minorities) Finance Corporation, Hyderabad has requested the Government to enhance the Annual Income Ceiling limit from Rs.50,000/- to 75,000/- under Subsidy for Bank Linked Income Generated Schemes and from Rs.55,000/- to 75,000/- under Training, Employment and Placement Scheme, as it has been done in other Welfare Corporations in order to

వివిధ సంక్షేమ పథకాలలో సబ్సిడీ పొందగోరే క్రైస్తవుల వార్షిక ఆదాయ పరిమితిని పెంచాలని రాష్ట్రప్రభుత్వం వెల్లడించింది. ఇందుకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ఆగస్టు 28న ఉత్తర్వులు (జీవో.ఆర్.టి.నం. 149) జారీ చేస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని క్రైస్తవులకు వేర్వేరుగా వార్షిక ఆదాయ పరిమితిని నిర్ణయించినట్లు స్పష్టం చేసింది.

బ్యాంకు లింకేజీతోపాటు శిక్షణ ఉపాధి కల్పన పథకాలతో గ్రామీణ ప్రాంతాల్లోని క్రైస్తవులకు వార్షిక ఆదాయ పరిమితి రూ. 60 వేలుగాను, పట్టణ ప్రాంతాల క్రైస్తవులకు వార్షిక ఆదాయ పరిమితిని రూ. 75 వేలుగా నిర్ణయించినట్లు జీవోలో వివరించింది. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జీవోలో మైనార్టీ సంక్షేమ శాఖ కమీషనర్‌ను ఆదేశించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

---

## బాలల చలన చిత్రోత్సవ కమిటీ ఏర్పాటు

**GOVERNMENT OF ANDHRA PRADESH**

**GENERAL ADMINISTRATION (I&PR.II DEPARTMENT**

**G.O.Rt.No. 3868** **Dated: 28th August 2013**

**ORDER:**

In the circumstance reported by the Managing Director, APSFTvTDC Ltd., Hyderabad in the reference read above, Government after careful examination of the matter hereby constitution the Organizing Committee to oversee the arrangements of the 18th International Children's Film Festival at Hyderabad from 14th to 20th November, 2013 is as follows.

**ORGANISING COMMITTEE**

| Sl. No. | Name of the Person | |
|---|---|---|
| 1. | Chief Secretary to Government, Government of Andhra Pradesh | Chairman |
| 2. | Sri Bimal Julka, IAS, Secretary, Ministry of Information and Broadcasting | Co-Chairman. |
| 3. | Sri Amola Gupta, Chairman | Co-Chairman |

వచ్చే నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న 18వ అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కార్యనిర్వాహక కమిటీని నియమించింది. ఇందుకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ఆగస్టు 28వ తేదీన ఉత్తర్వులు (జీ.వో.ఆర్.టి. నం. 3868) జారీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్రం టి.వి., నాటక రంగాభివృద్ధి సంస్థ (ఎ.పి.ఎస్.ఎఫ్.టి.వి.టి.డి.సి) మేనేజింగ్ డైరెక్టర్ సమర్పించిన నివేదిక ప్రకారం కమిటీని నియమించినట్లు పేర్కొంది.

కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కో-ఛైర్మన్లుగా కేంద్ర సమాచార ప్రసారాల శాఖ కార్యదర్శి శ్రీ బిమల్ జుల్కా భారత చలన చిత్ర మండలి (ముంబై) ఛైర్మన్ శ్రీ అమోల్ గుప్తే, వైస్ ఛైర్మన్, చీఫ్ కో-ఆర్డినేటర్‌గా రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ శ్రీ దాన కిశోర్, సభ్య సలహాదారుగా చలన చిత్ర టి.వి. నాటక రంగాభివృద్ధి సంస్థ ఛైర్మన్, కార్యదర్శి శ్రీఎస్. శివశంకర్, కో-ఆర్డినేటర్‌గా ఎ.పి.ఎఫ్. టి.వి.టి.డి.సి. డిప్యూటీ మేనేజర్ శ్రీ శ్రీనివాసరావు, మరో 29 మంది సభ్యులు నియమితులైనట్లు జీవోలో వివరించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆



**తె**లుగు కవుల్ని అత్యంత బలంగా ప్రభావితం చేసిన దేశభక్తుడు ఎవరు?

ఈ ప్రశ్నకు ప్రతి ఒక్కరూ చెప్పగల సమాధానం ఒక్కటే - 'మహాత్మా' అని పిలవబడే మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధి.

సత్యం, త్యాగం, అహింస - ఈ త్రిమూర్తాత్మకమైన గాంధేయ విధానమే ఇప్పటికే ప్రపంచమంతటా 'గాంధీతత్త్వం'(Gandhian philosophy) గా ప్రచారంలోకి వచ్చింది. ఈ 'గాంధీతత్త్వం' ఎంత శక్తివంతమైనదంటే దక్షిణాఫ్రికా స్వాతంత్ర్యోద్యమ సారధి నెల్సన్ మండేలా వంటి వారికి కూడా ఈ విధానమే స్ఫూర్తి దాయకంగా నిలిచింది.

'గాంధీతత్త్వం' లోని అనేక ఇతర పార్శ్వాలను కూడా ఒంట బట్టించుకున్నవాళ్ళు తెలుగు సాహితీవేత్తలు. వాళ్ళ రచనల్లో గాంధీజీ తపన, ఆరాటం, ఆవేదన ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఇప్పటికీ మనలో ఆలోచనలు రగిలిస్తాయి.

# తెలుగుపాళీ - గాంధీ బాణీ

మహాత్ముని సిద్ధాంతాలననుసరించి కుల, మత, వర్గ బేధాలు, అగ్రవర్ణం, అధమ వర్ణం అనే తేడాలు వుండరాదు. నేడు నిమ్న జాతులు, వెనుకబడిన జాతుల ప్రజలు సంఘంలో తమకు తగిన విద్యా, ఉద్యోగాలు పొందుతూ రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో రాణిస్తున్నారంటే మహాత్ముని సిద్ధాంత ప్రభావమే కారణం. భారతదేశం అనేక మతాలకు, జాతులకు నిలయమైనట్టిది. అట్టి విశాల భారతదేశ ప్రజల మధ్య సోదర భావం, దేశాభిమానం, ఐకమత్యం నెలకొనటానికి గాంధీజీ సిద్ధాంతాలే కారణాలు.

మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పాటు భాగస్వాములు కావటానికి, వారు జాగృతం చెందటానికి గాంధీజీ సిద్ధాంతాలు వారి సందేశాలు ఎక్కువగా దోహదం చేశాయి.

1907వ సంవత్సరంలో చెన్నాప్రగడ భానుమూర్తి 'భారత దర్శనము' అనే కావ్యంలో భారతీయుల కర్తవ్యాన్ని తెలియచేసి, కార్యోన్ముఖులను చేశారు. స్వధర్మాన్ని వదిలి పరధర్మాన్ని ఆచరించటం వలన భారతీయులు పొందిన అవమానాలు, నిరాశా నిస్పృహలు అందరికీ తెలిసినవే. కాబట్టి జాతీయోజ్జీవాన్ని, విజ్ఞాన వికాసాలను, మాతృదేశాభిమానాన్ని రేకెత్తించటానికి వీరు సాహిత్య కృషి చేశారు. ఈ కావ్యంలోని - వందేమాతరం, హిందూదేశ దైన్య విచారము, భవిష్యద్భారత దర్శనము, భారతీయ ధర్మాధర్మ నక్షత్రమాల - అనే శీర్షికలలోని పద్యాలు దేశభక్తితో అలరారుతుంటాయి.

*చిన్నబిడ్డల ద్రావంగ క్షీరములను*
*భాగ్యవంతుల పాలకు పంచదార*
*యూరి పేదల గంజికి నుప్పుగల్లు*
*నన్యదేశము లంపంగ నయ్యో నకట*

అని భారతీయుల దీనస్థితిని హృదయం కరిగేటట్లుగా వర్ణన చేసి ప్రభుత్వంపై వైముఖ్యాన్ని కల్గించారు.

*'సంఘ సంస్కారమును మత సంస్కరణము*
*దేశ సంస్కారమున నిట్లు తెల్లముగ స*
*మన్వితము లౌట జేసెదు యత్నమెల్ల*
*ధారపోయుడు దాని కందరును గూడ'*

సాంఘిక, రాజకీయ, మత సంస్కరణల కోసం ఏకోన్ముఖంగా తమ త్యాగ ధనాన్ని సమర్పించాలని ఈ కవి పై పద్యంలో దేశ ప్రజలను కోరినాడు.

స్త్రీ జనోద్ధరణ కవితలు రాసిన వారిలో బుడమగుంట శివరామయ్య ముఖ్యుడు. స్త్రీల పట్ల పురుషులు ప్రదర్శించే అనాదర భావం, దాష్టీకం, స్త్రీలను భయించే వెతలను సులభ శైలిలో వర్ణించి స్త్రీల పట్ల గౌరవ భావాన్ని ప్రకటించినారు. 'అబలా విలాపము' అనే శీర్షికతో వీరు వ్రాసిన పద్యాలలో పురుషుల మనస్తత్వాన్ని బయల్పరిచారు.

*అతివలున్నత విద్యనభ్యసింపగ రాదు*
*భవుని దైవంబుగా దలపవలయు*
*సంగీతమును నేర్వ సతులకు గారాదు*
*పాటలు సొంపుగా బాదవలయు*
*వ్యాయామ మొనరింప నబల లర్హులు గారు*
*బండ చాకిరి చేయవలయు నెపుడు*
*చనదు స్త్రీ లారోగ్య శాస్త్రంబులను జూడ*
*పరిశుభ్రముగ నుండవలయు నిండ్లు*
*అకట! యిది యేటి యన్యాయ మార్యులార!*
*తనకు తెలియని విషయముల్ ధాతమైన*
*చేయ జాలునే! ఇక నైన స్త్రీల వివిధ*
*విద్యలను నేర్పజేయుడీ ప్రేమ తోడ.*

స్త్రీ విద్యావశ్యకతను, దాని ఫలితంగా పురుషునికి కలిగే ప్రయోజనాన్ని ఈ పద్యంలో తెలియచెప్పినాడు. అంతేకాక స్త్రీకి విద్య నేర్పించక

**అక్టోబర్ 2 గాంధీ జయంతి**

# 'జాతిపిత' గాంధీ

అహింసా మూర్తి
'జాతిపిత' మహాత్మాగాంధీ
మనందరికి
అహింసా మార్గాన్ని చూపిన మహాత్ముడు
తెల్లవారి గుండెల్లో
నిద్రించిన మహానేత
దేశ ప్రజలకు ఇలవేల్పు
స్వాతంత్ర్య గమ్యాన్ని
అహింసాయుధంతో
దృఢ సంకల్పంతో
పట్టు సడలక, ప్రాణాన్ని పణంగా పెట్టి
ఉద్యమాన్ని నడిపించి ఆత్మబలంతో
విజయాన్ని సాధించిన
మీ దీక్ష
దేశ ప్రజలందరికీ కావాలి
స్ఫూర్తి
మన దేశపు జెండా ఎగిరినంతకాలం
మీరు
మా హృదయల్లో నిరంతరం
స్పందిస్తూనే వుంటారు
వెలుగు దారిలో
ఊపిరున్నంత కాలం
గాంధీమార్గం
కొత్త నడక కావాలి
సమాజానికి
ఆ మార్గంలో అందరూ నడవాలి
వెలిగే వెన్నెల తరంగంలా
ఎగిసిపడే కెరటంలా
జనమంతా మీ మార్గం వెంటే
పయనం
మీ బాటలో
తడిసి ముద్దవుతున్నారు.

*– నల్లా నరసింహమూర్తి*

వారిని అష్ట దిగ్బంధాలలో ఉంచి వారి నుండి ఎక్కువ ఫలితాన్ని ఆశించడం సరియైన పద్ధతి కాదని హెచ్చరించాడు.

గాంధీజీ ప్రతిపాదించిన సిద్ధాంతాలకు ప్రభావితులయి అనేక మంది కవులు తెలుగుదేశంలో హరిజనోద్యమానికి తమ గళాలను వినిపించారు. వీరిలో తుమ్మల సీతారామమూర్తి చౌదరి, వెంకట పార్వతీశ కవులు, పురిపండా అప్పల స్వామి మొదలయిన వారు ఉన్నారు. అనాటి మద్యపాన నిషేధంపై వచ్చిన గరిమెళ్ళ సత్యనారాయణ 'కల్లు త్రాగబోకు –కడుపు మాడ్చుకోకు', 'కల్లు మానండోయ్–బాబు కళ్ళు తెరవండోయ్' వంటి గీతాలు ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి.

బసవరాజు అప్పారావు రచించిన 'కొల్లాయి గట్టితేనేమి' అన్న పాట అనాడు అబాల గోపాలమును, పండిత పామరులను పరవశులను చేసింది.

*'వెన్నపూసా మనసు –కన్నతల్లీ ప్రేమ*
*పండంటి మోముపై బ్రహ్మ తేజస్సు'*

అనే వర్ణన గాంధీజీ రూపమును, హృదయమును హృద్యంగా ఆవిష్కరించింది.

*'పక పక నవ్వేసు జగతి కంపించేసు, పలుకు పలికి తేసు బ్రహ్మవాక్కేసు'*

అనే వర్ణన గాంధీజీ కర్మ వీరత్వాన్ని, బ్రహ్మర్షిత్వాన్ని చక్కగా విశద పరిచింది. వీరే వ్రాసిన–

*'గాంధీ మహాత్ముడు బయలుదేరగా*
*కలకల నవ్వింది జగత్తు, కలకల నవ్వింది'*

అనే గేయం భారతదేశంపై గల గాంధీజీ ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేసింది.

గాంధీజీని గూర్చి, రాట్నాన్ని గూర్చి, స్వరాజ్యమును గూర్చి, ప్రచారస్థాయిలో గేయాలు, పద్యాలు రాశారు అనాటి కవులు. బలిజేపల్లి లక్ష్మీకాంతం గారి 'స్వరాజ్య రథము', 'స్వరాజ్య సమస్య' అనే ఖండకావ్యాలు బాలగంగాధర తిలక్, గాంధీ మొదలైన దేశ నాయకులు నడిపిన స్వరాజ్యోద్యమం ప్రభావంతో వచ్చినవే.

మాధవపెద్ది బుచ్చి సుందర రామశాస్త్రి ***'అంటరాని వారెవరోకారు మా వెంట రానివారే'*** అనే సుప్రసిద్ధ గేయాన్ని రచించారు.

*ముప్పయి కోట్ల ప్రజలు రాంభజన – పంజర బంధమైనారు*
*బంధాలు త్రెంపుకొని రాంభజన – అవతల పడాలి*
*గాంధీ మంత్రమిదేను రాంభజన – స్వరాజ్య మంత్రం*
*ఒక్కటే మంత్రం రాంభజన – మేలైన యంత్రం*

– ఈ విధంగా చమత్కార ధోరణిలో సాగే 'రాంభజన' కీర్తనలను దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు రచించారు.

జాస్తి వేంకట నరసయ్య, ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యం కలిసి 1946లో వ్రాసిన 'జయభేరి' అనే ఖండకావ్యం నిజంగా స్వరాజ్య రథోత్సవానికి జయభేరి వంటిది.

*ఖాదీ పరిశ్రమ గావింపవలె వృద్ధి*
*మద్యపానంబును మాన్పవలెను*
*హిందూ ముస్లిముల కింపొంద జేయుము మైత్రి*
*అంటరాని తనంబు మంటగలుపు*
*మహిళా మణుల హక్కు మన్నింపగా వలె*
*ఆరోగ్య బోధ జేయంగవలెను*
*గ్రామ పరిశ్రమల్లదు వృద్ధి గావింపు*
*పారిశుధ్యంబునకు బాటుపడుము*

*వృత్తి విద్య పయోజన విద్య గఱపు*
*మమత నేర్పు హిందూస్థాని మాతృభాష*
*విడకు మార్థిక సమత గావింపవలయు*
*కుష్ఠురోగుల నిలయముల్ గూర్పవలయు*

ఈ పద్యంలో గాంధీ తత్త్వ సారంశమంతా ఇమిడి ఉంది.

ఖాదీ పరిశ్రమలను అభివృద్ధి చేయటం, ప్రజలు మద్యపానాన్ని మానివేయటం, హిందూ ముస్లిములు మైత్రీభావంతో మెలగటం, అంటరానితనాన్ని పారద్రోలటం, మహిళల హక్కులను గౌరవించటం, విద్యా ప్రాముఖ్యతను వివరించటం, అస్పృశ్యతను రూపుమాపటం, ఆర్థిక వ్యత్యాసాలు లేని సమతా రాజ్యాన్ని సాధించటం గాంధీజీ ఆశయాలు. వానిని తెలుగు కవులు ఎందరో తమ రచనల ద్వారా ఆవిష్కరించారు.

(వ్యాస పరిమితి దృష్ట్యా కొందరు కవులను మాత్రమే పేర్కొని వారి కవిత్వాన్ని పరిచయం చేశాను)

*–గనిపాక పద్మ*

# 'మధ్యాహ్న భోజనం' ధరలు పెరిగాయ్!

రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రయిమరీ, అప్పర్ ప్రయిమరీ, హైస్కూళ్లలో అమలవుతున్న మధ్యాహ్నభోజన పథకంలో వంటలకయ్యే ఖర్చుల మొత్తాన్ని పెంచాలని నిర్ణయించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. ఇందుకు రాష్ట్ర మాధ్యమిక విద్యాశాఖ ఆగస్టు 28న ఉత్తర్వులు (జీవో.ఎం.ఎస్.నం. 52) జారీ చేస్తూ జాతీయ కార్యక్రమంలో భాగంగా అమలవుతున్న ఈ పథకంలో సవరించిన ధరల వివరాలు ఈ విద్యా సంవత్సరం జూలై ఒకటో తేదీ నుంచి వర్తిస్తాయని స్పష్టం చేసింది.

ప్రయిమరీ స్కూళ్లలో ఒక్కో విద్యార్థికి భోజనం తయారీకి అయ్యే ఖర్చును రూ. 4 నుంచి రూ. 4.35 పైసలకు పెంచినట్లు జీవోలో పేర్కొంది. అప్పర్ ప్రయిమరీ స్కూళ్లలో ఒక్కో విద్యార్థికి

## GOVERNMENT OF ANDHRA PRADESH

### SECONDARY EDUCATION (PROG.I) DEPARTMENT

**G.O.Ms.No.52** **Dated: 28th August 2013**

**ORDER:**

In the reference 1st read above, Ministry of HRD, Department of School Education & Literacy, Government of India have decided to increase the cooking cost for 2013-14 @ 7.5% over and above the cooking cost for the year 2012-13 for Primary and Upper Primary Schools. w.e.f 1st July, 2013.

2. In the reference 2nd read above, the Commissioner and Director of School Education, A.P., Hyderabad has requested the Government to issue orders for enhancement of cooking cost under National Programme of Mid Day Meal Scheme w.e.f 1/7/2013 from Rs.4.00 to Rs.4.35 for Primary Schools and Rs.4.65 to Rs.6.00 for Upper Primary Schools as per GOI norms; and also for enhancement of the Cooking cost from Rs.4.65 to Rs.6.00 w.e.f 1/7/2013 as a (100%) State share for providing Mid Day Meals for classes XI & X th classes.

భోజనం తయారీకి అయ్యే ఖర్చును రూ. 4.65 పైసల నుంచి రూ. 6 కు పెంచినట్లు జీవోలో వివరించింది. అలాగే అప్పర్ ప్రయిమరీ, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికీ భోజనానికి అయ్యే ఖర్చును కూడా రూ. 4.65 పైసల నుంచి రూ. 6 కు పెంచినట్లు జీవోలో పేర్కొంది.

పాఠశాల విద్యాశాఖ కమీషనర్ చేసిన విజ్ఞప్తి ప్రకారం మార్కెట్‌లో పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకయ్యే ఖర్చులను సవరించినట్లు జీవోలో స్పష్టం చేసింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

---

# ఉత్తమ నంది నాటకాలకిచ్చే నగదు పారితోషికం పెంపు

నంది నాటకోత్సవాలలో ప్రదర్శించిన ఉత్తమ పద్య నాటకాలు, పిల్లలు, సాంఘిక నాటకాలు, నాటికలకు ఇంతవరకు అవార్డుగా ఇస్తున్న నగదు మొత్తాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ నుంచి ఆగస్టు 30న ఉత్తర్వులు (జీవో.ఆర్.టి. నం. 3889) జారీ చేస్తూ ఎ.పి. చలనచిత్ర నాటక రంగాభివృద్ధి సంస్థ (ఎ.పి.ఎస్.ఎఫ్.టి.వి.డి.టి.సి) మేనేజింగ్ డైరెక్టర్ పంపిన ప్రతిపాదనలను పరిశీలించి నగదు పారితోషికాన్ని పెంచాలని నిర్ణయించినట్లు స్పష్టం చేసింది.

ఉత్తమ పద్యనాటకానికి ఇంతవరకు రూ. 50 వేలు నగదు బహుమతి ఉండగా ఆ మొత్తాన్ని

## GOVERNMENT OF ANDHRA PRADESH

### GENERAL ADMINISTRATION (I&PR.II) DEPARTMENT

**G.O.Rt.No. 3889** **Dated: 30th August 2013**

**ORDER:**

In the reference 3rd read above Government has constituted a committee, to make recommendations for enhancing cash prize, remuneration etc., for Nandi Theatre Awards.

2. In the circumstances reported by the Managing Director, Andhra Pradesh State Film Television and Theatre Development Corporation Ltd., Andhra Pradesh, Hyderabad in the reference 4th read above, has informed that the Committee met on 01-05-2013 and recommended for enhance of cash prize in respect of Padya Natakams, Social Plays, Social Play-Lets, Children Social Play-Lets, Remuneration to participants in Nandi Natakotsavam and Remuneration to Staging of Award Winning Plays as requested by the Managing Director, APSFTvTDC Ltd.

రూ. ఎనభై వేలకు, ద్వితీయ ఉత్తమ బహుమతిగా ఇచ్చే రూ. 40 వేల నగదు బహుమతిని రూ. 60 వేలకు, తృతీయ ఉత్తమ బహుమతిగా ఇచ్చే రూ. 30 వేల నగదు బహుమతిని రూ. 40 వేలకు పెంచినట్లు జీవోలో వివరించింది.

వ్యక్తిగత అవార్డుల కేటగిరీలో ఇచ్చే ఉత్తమ దర్శకుడు అవార్డుగా ఇచ్చే రూ. పదివేల నగదు పారితోషికాన్ని రూ. 20 వేలకు పెంచడం జరిగింది. ఇదే రీతిగా సాంఘిక నాటకాలు, నాటికలు, పిల్లల నాటికలు తదితర కేటగిరీల్లో కూడా ఉత్తమ అవార్డుల క్రింద ఇచ్చే నగదు మొత్తాలను కూడా పెంచినట్లు జీవోలో పట్టిక రూపంలో పొందుపరిచింది..

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

# పథకాల పర్యవేక్షణకు స్పెషలాఫీసర్లు

మన రాష్ట్రంలో ప్రాధాన్యతా క్రమం కింద ఎంపిక చేసి అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు పర్యవేక్షణ బాధ్యతలను సీనియర్ ఐ.ఎ.ఎస్ అధికారులకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలనా విభాగం (జి.ఎ.డి.) ద్వారా సెప్టెంబర్ 3వ తేదీన ఉత్తర్వులు (జీవో.ఆర్.టి.నం. 3930) జారీ చేస్తూ మొత్తం 23 జిల్లాలకు స్పెషల్ ఆఫీసర్ హోదాలో ఐ.ఎ.ఎస్ అధికారులు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఈ ప్రత్యేకాధికారులు ప్రతీ నెలా తమ తమ జిల్లాల్లో పర్యటించి, ప్రజల కోసం మండల, గ్రామ స్థాయిల్లో జరుగుతున్న పథకాల అమలు తీరును పరిశీలించాలని జీవోలో సూచించింది.

## GOVERNMENT OF ANDHRA PRADESH

### GENERAL ADMINISTRATION (SPL-A) DEPARTMENT

**G.O.Rt.No.3930** **Dated: 3rd September 2013**

**ORDER:**

In supersession of the orders issued on the subject, the following officers are appointed as Special Officers for the Districts mentioned against their names for the purpose of monitoring / review of various development / welfare / flagship programmes of the Government and disaster preparedness of Districts and supervising rescue, relief and rehabilitation measures in the event of natural calamities / disasters:

| Sl. No. | District | Special Officer |
|---|---|---|
| 1. | Srikakulam | Sri B.M.D.Ekka, IAS (95), Commissioner-Sugar |
| 2. | Vizianagaram | Sri Rajat Kumar, IAS (91), Commissioner-Industries |
| 3. | Visakhapatnam | Sri Sanjay Kumar, IAS (95), Member-Secretary, AP PCB |
| 4. | East Godavari | Sri M.Ravichandra, IAS (96), MD, APHM&HIDC Ltd. |
| 5. | West Godavari | Sri. Sanjay Jaju, IAS (92), Secy. to Govt., IT & C Dept. |
| 6. | Krishna | Sri B.R. Meena, IAS (86), Principal Secretary to Govt., Revenue Deptt. |
| 7. | Guntur | Sri B.Venkatesham, IAS (95), MD, AP State Housing Corpn. |

అలాగే ప్రతీనెలా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ముఖ్య కార్యదర్శిలతో ప్రతీ నెలా సమావేశం ఉంటుందని జీవోలో పేర్కొంది. ఏ జిల్లాకు ఎవరిని స్పెషలాఫీసర్‌గా నియమించారో తెలిపే పట్టికను కూడా జీవోలో పొందుపరచడమైంది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

# రూ. 1862 కోట్లకు పైగా ఖర్చుతో నెట్టెంపాడు ఎత్తిపోతల

జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాన్ని గతంలో ప్రతిపాదించిన మొత్తం కాకుండా సవరించిన విధంగా రూ. 1862 కోట్ల 73 లక్షలు మం.జూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖ నుంచి సెప్టెంబర్ 2వ తేదీన ఉత్తర్వులు (జీవో. ఎం.ఎస్.నం. 88) జారీ చేస్తూ మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజక వర్గాల పరిధుల్లోని కరువు పీడిత ప్రాంతాలలో ఉన్న సుమారు 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు, సుమారు 148 గ్రామాలకు తాగునీరు సరఫరాకు ఈ ప్రాజెక్టును రూప కల్పన చేసినట్లు స్పష్టం చేసింది.

## GOVERNMENT OF ANDHRA PRADESH

### IRRIGATION & CAD (PW.M&MI.T1.A1) DEPARTMENT

**G.O.Ms. No.88** **Dated: 2nd September 2013**

**ORDER:**

In the reference 1st read above, administrative approval has been accorded for Jawahar Nettempadu Lift Irrigation Scheme for Rs. Rs.1428.00 Crores to create irrigation facilities to 2.00 lakh acres in the drought prone upland area of Gadwal and Alampur constituencies covering about 148 Nos of villages besides providing drinking water facilities in Mahabubnagar District.

2. In the reference 2nd read above, the Chief Engineer(P), Mahabubnagar has furnished the revised estimate for Jawahar Nettempadu Lift Irrigation Scheme, and, therefore, requested to accord revised administrative approval to Jawahar Nettempadu Lift Irrigation Scheme for an amount of Rs 1862.73 Crores as the works are under brisk progress and some of the works are nearing completion.

ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 1428 కోట్లు మంజూరు చేయాలని గతంలో నిర్ణయించగా ఆ మొత్తాన్ని సవరించి కొత్తగా రూ. 1862 కోట్ల 73 లక్షలు కేటాయించాలని నిర్ణంచినట్లు జీవోలో వివరించింది.

వెంటనే నెట్టెంపాడు ప్రాజెక్టు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని జీవోలో మహబూబ్‌నగర్ చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించింది..

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

## చేపల చెరువుల అద్దె 10 శాతం పెంపు

రాష్ట్ర వ్యాప్తంగా మత్స్య శాఖ పరిధిలో వున్న చేపల చెరువుల అద్దె ధరను పదిశాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ నుంచి సెప్టెంబర్ 13న జీవో (ఆర్.టి.నం. 396) జారీ చేస్తూ పెంచిన అద్దె ధరను ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి 2014 జూన్ 30వ తేదీ వరకు అమల వుతుందని తెలిపింది.

(సమగ్ర పాఠానికై
**http://goir.ap.gov.in** లో చూడండి)

☆

### GOVERNMENT OF ANDHRA PRADESH

**ANIMAL HUSBANDRY, DAIRY DEVELOPMENT & FISHERIES (F.II)DEPARTMENT**

**G.O.Rt.No. 396** **Dated: 13th September 2013**

**O R D E R :**

In the G.O. 3rd read above orders were issued not to enhance the rentals by 10% for a period of 5 years commencing from Fasli 1418 (ie. 1.7.2008) to Fasli 1422 (i.e. 30.6.2013) in respect of tanks vested with Fisheries Department in the State.

2. In the reference 2nd read above, the Commissioner of Fisheries, Hyderabad, among other things has requested the Government to issue orders to enhance the rentals by 10% for Fasli 1423 i.e from 1.7.2013 to 30.06.2014 in respect of tanks vested with Fisheries Department.

3. Government after careful examination hereby order to enhance the rentals by 10% for Fasli 1423 i.e from 1.7.2013 to 30.06.2014 in respect of tanks vested with Fisheries Department.

4. The Commissioner of Fisheries shall take necessary action accordingly.

5. This order issues with the concurrence of Finance Department vide their U.O.No.20715/178/A1/Expr.AHFFCS&E/13, dated 27.07.2013.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRADESH)

---

## రూ.2,615 కోట్లతో సోమశిల ప్రాజెక్టుకు తుది రూపం

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సోమశిల ప్రాజెక్టు నిర్మాణానికి సవరించిన అంచనా మొత్తం రూ. 2,615 కోట్లు విడుదల చేసేందుకు పాలనా పరమైన అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. ఈ మేరకు భారీ నీటి పారుదల శాఖ ద్వారా సెప్టెంబర్ 20న ఉత్తర్వులు (జీవో.ఎం.ఎస్.నం.91) జారీ చేస్తూ 2012-13 షెడ్యూల్డు స్టాండర్డ్ రేట్లు (ఎస్.ఎస్.ఆర్) ప్రకారం అ నిధులతో కొత్త పథకాలు, మార్పులు, చేర్పులతో కూడిన మిగిలిన ప్రాజెక్టు పనులు చేపట్టాలని వివరించింది.

ఈ ప్రాజెక్టును 2017-18 సంవత్సరానికి పూర్తి చేయాలనీ, ఇది పూర్తయితే 6 లక్షల 72 వేల 500 ఎకరాల అయ కట్టుకు సాగునీరు అందుతుందనీ జీవోలో తెలిపింది.

### GOVERNMENT OF ANDHRA PRADESH

**IRRIGATION & C.A.D. (PW:M&MI-R1) DEPARTMENT**

**G.O.Ms.No. 91** **Dated: 20th September 2013**

**O R D E R :**

In the G.O 1st read above, Administrative approval was accorded for revised estimate of Somasila Project in Nellore district for Rs.1196.00 Crores to take up all the balance works and to complete the project as targeted.

2. In the reference 2nd read above, the Chief Engineer, NTR TGP, Srikalahasti has submitted the revised estimate for Somasila Project of Rs. 2615 Crores for all balance works and other O & M works including modifications & new schemes, with current SSR rates of 2012-13. He stated that it is programmed to complete all balance works by the year 2017-18 and to create the entire ayacut of 6,72,500 acres.

3. In the reference 3rd read above, the CE, NTR TGP, Srikalahasti submitted the revised estimate for an amount of Rs.1732.00 Crores duly deleting certain provisions made in his earlier proposal furnished in the reference 2nd cited. Further, vide reference 4th read above, the C.E, NTR TGP informed that a tentative provision of Rs.6.00 Crores towards the decretal charges of Package - 94 is deleted from the estimate of Rs.1732 Crores.

4. Government after scrutiny of the estimate here by accord Administrative Approval to the 5th Revised Estimate of Somasila Project for Rs.1548.49 Crores (Rupees One Thousand Five Hundred Forty Eight Crores and Forty Nine Lakhs only).

5. The Chief Engineer, NTR TGP, Srikalahasti shall take further action in the matter accordingly.

6. This order issues with the concurrence of Finance (W&P) Department vide their U.O.No.2844/F7 (A2)/2013 dt. 31.08.2013.

శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ తుంగభద్ర ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ తగిన చర్యలు తీసుకోవాలని జీవోలో ఆదేశించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి)

☆

# మహాత్ముని హైదరాబాద్ పర్యటన



**మ**హాత్మాగాంధీ మొదటిసారి హైదరాబాద్ పర్యటన 1929 ఏప్రిల్‌లో జరిగింది. కృష్ణస్వామి ముదిరాజ్ తన ఆంధ్ర వాలంటీర్ దళాన్ని వాడి స్టేషన్‌కు తీసుకు వెళ్ళి మహాత్మునికి స్వాగతం పలికి నాంపల్లి స్టేషన్‌కు తీసుకు వచ్చారు. స్టేషన్ ప్లాట్‌ఫారమ్ మీద, స్టేషన్ బైట ఇసుక వేస్తే రాలనంత జనం జమకూడారు. జన ప్రవాహం నుంచి గాంధీజీని తీసుకురావడం కష్టమని తెలుసుకున్న ముదిరాజ్, సమయ స్ఫూర్తితో రైలు పెట్టె వెనుక భాగంలో ఉన్న ద్వారం తెరచి మహాత్ముని అక్కడనుంచి దింపి సురక్షితంగా వేచి ఉన్న కారులో కూర్చుండపెట్టారు. ఆ తరువాత మహాత్ముని ఊరేగింపుగా తీసుకువెళ్ళారు.

# 'మీ త్రాగుడు వల్ల వాళ్ళ విద్యాశాఖ నడుస్తోంది'

ఊరేగింపుకు ముందు 'ఆంధ్ర బ్యాండు' మేళ తాళాలు నడిచినవి. మహాత్ముని దర్శించుకున్న ప్రజల ఆనాటి ఆనందోత్సాహాలు వర్ణనాతీతం. స్థానిక నాయకులైన వామననాయక్, మాడపాటి హనుమంతరావు, మందుమల నరసింగరావు, ఆర్.ఎన్.నాయక్, రాజ్ బన్సీలాల్, ముకుంద్ దాస్ మొదలైన వారు వివేక వర్ధనీ మైదానంలో మహాత్మునికి స్వాగతం పలికి సభాస్థలికి తీసుకుపోయారు. వామన్ నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో మహాత్ముని ప్రసంగం క్లుప్తంగా యిలా సాగింది.

"రాట్నము కామధేనువు. మన దేశానికది సకల వరప్రదాయిని. ఖద్దరు ఉత్పత్తికి హైదరాబాద్ రాష్ట్రంలో మంచి వాతావరణం ఉందని నాకు తెలిసింది. మరికొంత అభివృద్ధిపరిస్తే భారతదేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా సహాయ సహకారాలందించే స్థితిలో మీరున్నారు. ఇక్కడ మంచి నాణ్యత గల ఖాదీ ఉత్పత్తి అవుతుందని సరోజినీ నాయుడు నాకు చెప్పారు. అయితే హైదరాబాద్ సంస్థానంలో మద్యపాన వ్యసనం ఎక్కువగా ఉందని తెలిసింది. అది అనర్థదాయకం. కనుక దాన్ని రూపుమాప వలసిన అవసరం ఉంది. ఆ విధంగానే అంటరాని తనం శాస్త్ర సమ్మతం కాదు. కాబట్టి, హిందువులు యీ దురాచారం నుంచి విముక్తి పొందాలి."

మహాత్ముని ఉపన్యాసం పూర్తికాగానే రాజ్ ధన్ రాజ్ గిర్జీ 2 వేల రూపాయలు, ముకుందదాస్ నూరు రూపాయలు మహాత్మునికి సమర్పించుకున్నారు. దేశభక్త వామన్ నాయక్ సమర్పించుకున్న సన్మాన పత్రానికి మహాత్ముడు యీ విధంగా సమాధానమిచ్చారు.

"మీరు యీ దరిద్ర నారాయణుణ్ణి దర్శించి సత్కరించినందుకు కృతజ్ఞతలు. హిందూదేశం కన్నా దరిద్రదేశం మరొకటి లేదు. ఎందుకంటే మనదేశంలో రోజుకి ఒక్క పూటైనా అన్నం దొరకని వారి సంఖ్య మూడు కోట్ల మందికి పైగానే ఉంటుంది. అటువంటి వారికి రాట్నం కామధేనువు వంటిది. రాట్నం వలన ఒక లక్షమంది స్త్రీలకు జీవనోపాధి కలుగుతున్నది. వారు తాము వడికిన నూలు అమ్మకం కోసం 5,6 మైళ్ల నడిచి వెళుతున్నారు. ఈ నూలు వడికే వారి కోసమే నేను భారతదేశమంతా తిరుగుతున్నాను. ఇందుకోసమే నేను బర్మా కూడా తిరిగివచ్చాను...

"మేము బ్రిటిష్ ఇండియాలో చేసే పనులన్నీ సంస్థానాలలో చేయలేము. కానీ మీరు వాటిని నెరవేరిస్తే బ్రిటిష్ ఇండియా పౌరుల స్థాయికి అభివృద్ధి చెందగలుగుతారు. రాట్నంలో వడికి, ఖద్దరు ఉత్పత్తి చేసి హిందూస్తాన్ అంతటికీ మీరు సప్లై చేయగలుగుతారు. మీరందరూ

## అక్టోబర్ 2 'మహాత్ముని' జయంతి

కలిసి కట్టుగా పనిచేస్తే ఒక ఏడాదిలోనే కావల సినంత ఖాదీ తయారవుతుంది. మీకు సన్నని బట్టలు, విదేశీ బట్టల మీద మోజు ఉన్న సంగతి నాకు తెల సు. కానీ, సోదర భారతీయులను దృష్టిలో పెట్టుకుని ముతక బట్టలు ధరిస్తే వారికి సహాయపడిన వారవుతారు. అదేవిధంగా మద్యపానం విసర్జించండి. మనదేశంలో మద్యపానంతో వచ్చే ఆదాయంతో బ్రిటీష్ ఇండియాలో విద్యాశాఖను నడుపుతున్నారు. అది ఎంతో లజ్జాకరం.

ఆది హిందువులను అంటరాని వారిగా చూడడం హిందూ మతానికి కళంకం. వారిని అంటరాని వారిగా భావించుకునే ఆచారాన్ని, ఏ మతంలో ఎక్కడా లేని అంటుదోషాన్ని వదిలించుకోండని సోదర హిందువులను ప్రార్థిస్తున్నాను. నా మెడలో వేసిన నీలదండ హరిజనులు వడికినదని తెలుసుకొని నేనెంతో సంతోషపడ్డాను. ఇంతటి సన్నని నూలును నేనెక్కడా చూడలేదు" అని మహాత్ముడు తన ఉపన్యాసాన్ని ముగించారు.

ఉపన్యాసానంతరం 12 వేల రూపాయల విరాళాలు వసూలయ్యాయి.

1929 ఏప్రిల్ 7న సుల్తాన్‌బజార్‌లోని ప్రేం థియేటర్‌లో మహాత్ముని గౌరవార్థం మహిళా సభను ఏర్పాటు చేశారు.

*– జి.వి. రామారావు*

## మహాత్ముడు మహారాజాకు రాసిన లేఖ

సత్యాగ్రహాశ్రమము, సబర్మతి,
B.B.CC.I.Rly.
తేది 7 జూన్ 1928

*ప్రియ మిత్రమా!*

ఖాదీ ఉద్యమంలో మీరు శ్రద్ధ చూపుతున్నట్లు, స్వయంగా మీరే ఖాదీ వడుకుతున్నట్లు రూప్‌లాల్ ద్వారా తెలుసుకుని ఆనందించాను. ఖాదీ ఉద్యమంలో మైసూరు సంస్థానం అగ్రగామిగా ఉందనే సంగతిని మీ దృష్టికి తెస్తున్నాను. ఈ ఉద్యమాన్ని మీరొక దీక్షగా నడిపిస్తే నిజాం రాష్ట్రంలోని బీద ప్రజానీకానికి మీరెంతో సేవ చేసిన వారవుతారు.

మీరు, మీ జ్యేష్ఠ పుత్రుడు వడికిన దారపు సాంపుల్స్‌ను నాకు పంపించండి. ఇక్కడ ప్రదర్శనశాలలో ఉంచుతాము.

సం॥ ఎం.కె.గాంధీ

*(మహారాజా అనగా మహారాజా కిషన్ ప్రసాద్, హైదరాబాద్ సంస్థానపు ప్రధానమంత్రి)*



**హై**దరాబాద్ ఐ.టి. మణిహారంలో మరో కలికితురాయి చేరబోతోంది. హైదరాబాద్‌లో 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పెట్టుబడుల ప్రాంతం. (ఐ.టి.ఐ.ఆర్) ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రి వర్గ కమిటీ సెప్టెంబర్ 20న ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి కేంద్రప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుంది.

ఈ తరహా ప్రాజెక్టు ఏర్పాటు కావడం దేశంలోనే ఇది ప్రథమం. రెండు దశల్లో పూర్తి చేయబోయే ఈ భారీ ప్రాజెక్టుకు మౌలిక వసతుల కల్పన కూడా భారీగానే చేయవలసి వుంటుంది.

# హైదరాబాద్‌కి మెగా ప్రాజెక్టు

## ఐ.టి.ఐ.ఆర్‌కు గ్రీన్ సిగ్నల్

మొత్తం 202 చదరపు కిలోమీటర్ల పరిధిలో, 50 వేల ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయ తల పెట్టిన ఐ.టి.ఐ.ఆర్‌లో దాదాపు 2,19,440 కోట్ల రూపాయలు పెట్టుబడులు రాగలవని అంచనా వేస్తున్నారు. అందులో ఐ.టి.ఐ.టీ అనుబంధ సేవల (ఐ.టి.ఈ.ఎస్) సంస్థల ఏర్పాటుకు 1.18 లక్షల కోట్ల రూపాయలు, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ తయారీ సంస్థల ఏర్పాటుకు 1.01 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాగలవని ప్రభుత్వం అంచనావేస్తోంది.

దీనివల్ల ప్రత్యక్షంగా సుమారు 15 లక్షల మందికి, పరోక్షంగా 56 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐ.టీ.ఐ.ఆర్) కోసం 3,275 కోట్ల రూపాయల వ్యయంతో మూడు రేడియల్ రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు, మెట్రోరైలు ప్రాజెక్టును ఫలక్‌నుమా నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

ఐ.టి.ఐ.ఆర్ కోసం మూడు క్లస్టర్లుగా 202 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని గుర్తించారు. 1. హైదరాబాద్ డెవలప్‌మెంట్ ఏరియా (హెచ్.ఎం.డి.ఎ) చుట్టు ప్రక్కల 86.7 చదరపు కిలోమీటర్లు. 2. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ ఏరియా, మహేశ్వరం -79.2 చదరపు కిలోమీటర్లు 3. ఉప్పల్, పోచారం ప్రాంతాలలో 10.3 చదరపు కిలోమీటర్లు గుర్తించారు. ఈ ప్రాజెక్టును రెండు దశలలో పూర్తి చేస్తారు. మొదటి దశ 2018 సంవత్సరంలోపు, రెండవ దశ 2018-2038 మధ్య కాలంలోనూ పూర్తి చేస్తారు.

ఐ.టీ, దాని అనుబంధ, ఎలక్ట్రానిక్ తయారీ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించడానికి వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఐటీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్స్‌ను ఏర్పాటు చేయాలని తీసుకున్న విధాన నిర్ణయంలో భాగంగానే దీన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని మంత్రి వర్గ కమిటీ తెలిపింది.

ఐ.టి.ఐ.ఆర్ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం పట్ల రాష్ట్ర ఐ.టి. శాఖ మంత్రి శ్రీ పొన్నాల లక్ష్మయ్య కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఐ.టి.ఐ.ఆర్ ఏర్పాటు కోసం 202 చదరపు కిలోమీటర్ల పరిధిలో 50 వేల ఎకరాల స్థలాన్ని కేటాయించిందని మంత్రి తెలిపారు. సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీ.డి.ఎ) గచ్చిబౌలి, మాదాపూర్‌లతో కలిపి, హైదరాబాద్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా), మామిడిపల్లి, రావిర్యాల, ఆదిభట్ల, మహేశ్వరం, ఉప్పల్, పోచారం ప్రాంతాలకు కలిపి ఐ.టి.ఐ.ఆర్‌గా గుర్తిస్తారు.

నాలెడ్జ్ క్లస్టర్‌లో ఐ.టీ,ఐ.టీ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తారు. ఈ క్లస్టర్‌లో ప్రత్యేక ఆర్థికమండలి (సెజ్), పారిశ్రామిక పార్కులు, స్వేచ్ఛా వాణిజ్య ప్రాంతాలు, గోదాములు ప్రాంతాలు, ఎగుమతికి ప్రత్యేక యూనిట్లు, అభివృద్ధి ప్రాంతాలు ఉంటాయి.

వీటన్నింటి వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో 30 వేల కోట్ల రూపాయల రాబడి రాగలదని భావిస్తున్నారు.

– కె.యస్. శాస్త్రి

### ఐ.టి.ఐ.ఆర్ ముఖ్యాంశాలు ఇవీ...

- ★ ఈ తరహా ప్రాజెక్టు దేశంలోనే ఇది ప్రథమం.
- ★ మొత్తం 202 చదరపు కిలోమీటర్ల (50 వేల ఎకరాలు) పరిధిలో ఏర్పాటు.
- ★ ఐ.టీ. పెట్టుబడులు రూ. 2,19,440 కోట్లు
- ★ ఐ.టి. ఎగుమతులు రూ. 2,35,000 కోట్లు.
- ★ ప్రత్యక్షంగా 15 లక్షల మందికి ఉపాధి.
- ★ పరోక్షంగా 56 లక్షల మందికి ఉపాధి.
- ★ రాష్ట్రానికి అదనంగా పన్నుల రూపంలో లభించే ఆదాయం రూ. 30,170 కోట్లు.



# నడుస్తున్న చరిత్ర



## అవార్డులు - రివార్డులు

* పాశ్చాత్య సంగీత విద్వాంసుడు జుబిన్ మెహతా 2013వ సంవత్సరానికి గాను టాగూర్ సాంస్కృతిక సామరస్య పురస్కారాన్ని స్వీకరించారు.
* పాకిస్థాన్‌కు చెందిన బాలికల విద్యా ప్రచారకర్త మలాలా దచ్ అంతర్జాతీయ పిల్లల శాంతి బహుమతికి ఎంపికయ్యారు.
* బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్‌బచ్చన్‌కు ప్రతిష్ఠాత్మక 'గ్లోబల్ డైవర్సిటీ అవార్డు' లభించింది.
* 2013 సంవత్సరానికి అల్లు రామలింగయ్య జాతీయ పురస్కారం సుప్రసిద్ధ నటుడు కోట శ్రీనివాసరావుకు ప్రకటించారు.
* నైజీరియా అధ్యక్షురాలు, నోబెల్ విజేత ఎలెన్ జాన్సన్ సిర్లీఫ్ ప్రతిష్ఠాత్మక ఇందిరాగాంధీ శాంతి, నిరాయుధీకరణ అభివృద్ధి బహుమతిని అందుకున్నారు.

## నియామకాలు

- ✔ రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా ప్రముఖ ఆర్థికవేత్త, కేంద్ర ఆర్థికశాఖ ముఖ్య సలహాదారు శ్రీ రఘురామ్‌రాజన్ (సెప్టెంబర్ 4న) బాధ్యతలు స్వీకరించారు.
- ✔ ప్రధాన సమాచార కమిషనర్ (సిఐసీ)గా దీపక్‌సింధు సెప్టెంబర్ 5న ప్రమాణ స్వీకారం చేశారు.
- ✔ ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్‌గా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. రోహిణి సెప్టెంబర్ 6న నియమితులయ్యారు.
- ✔ ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా మన రాష్ట్రానికి చెందిన జస్టిస్ నూతలపాటి వెంకటరమణ సెప్టెంబర్ 2న ప్రమాణ స్వీకారం చేశారు.
- ✔ నిరాయుధీకరణ,అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక విధానంపై తన ప్రత్యేక దూతగా రాకేశ్‌సూద్‌ను ప్రధాని మన్మోహన్ సింగ్ నియమించారు.

## రాష్ట్రీయం

- తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు అనక్తి వ్యక్తీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తాధ్వర్యంలో ప్రయివేటు భాగస్వామ్యంతో దీనిని నెల కొల్పనున్నారు. రూ. 128 కోట్లతో దీనిని ఏర్పాటు చేయనున్నారు.

## జాతీయం

- ❖ పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ, డెవలప్‌మెంట్ అథారిటీ (పిఎఫ్ఆర్‌డిఏ) బిల్లు-2011 ను లోక్‌సభ ఆమోదించింది. వృద్ధాప్య ఆదాయ భద్రతను ప్రోత్సహించే అథారిటీ ఏర్పాటుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది.
- ❖ దేశ అక్షరాస్యతలో 94.65 శాతం అక్షరాస్యతలో త్రిపుర మొదటి స్థానాన్ని కైవశం చేసుకుంది. ఈ మేరకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.
- ❖ భారీ రవాణా విమానం సీ-17 గ్లోబ్ మాస్టర్-3 ని సెప్టెంబర్ 2న వైమానిక దళంలో ప్రవేశపెట్టారు.
- ❖ భూసేకరణ బిల్లు-2012కు లోక్‌సభ ఆమోదించింది.
- ❖ భారతదేశ జనాభా మార్చి 1, 2013 నాటికి 123 కోట్లకు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.
- ❖ భారత నౌకాదళం కోసం చేపట్టిన జీశాట్-7 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది.
- ❖ లెవీ బియ్యం సేకరణను 75 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలని భారత ఆహార సంస్థ నిర్ణయించింది.

### అక్టోబర్ నెలలో ముఖ్యమైన రోజులు

| | |
|---|---|
| 1 | ఇంటర్నేషనల్ డే ఫర్ ది ఎల్డర్లీ పీపుల్ |
| 2 | మహాత్మాగాంధీ జయంతి |
| | లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి |
| 3 | వరల్డ్ హేబిటేషన్ డే |
| 4 | ప్రపంచ జంతు సంరక్షణా దినోత్సవం |
| 8 | ప్రపంచ పోస్టాఫీసు దినోత్సవం |
| 10 | జాతీయ తపాలా దినోత్సవం |
| 15 | ప్రపంచ అంధుల సహకార దినోత్సవం |
| 16 | ప్రపంచ ఆహార దినోత్సవం |
| 31 | శ్రీమతి ఇందిరాగాంధీ వర్ధంతి |
| | సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి |

- ❖ అణ్వస్త్ర సామర్థ్యం గల 'అగ్ని-5' దీర్ఘశ్రేణి ఉపరితల క్షిపణిని రెండోసారి విజయవంతంగా పరీక్షించారు. దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఈ క్షిపణి ఐదువేల కిలోమీటర్లకు పైగా దూరంలో గల లక్ష్యాలను ఛేధించగలదు.
- ❖ భారీ వరదల కారణంగా మూతపడిన ప్రఖ్యాత కేదార్‌నాథ్ దేవాలయంలో 86 రోజుల తర్వాత (సెప్టెంబర్ 11న) పూజలు ప్రారంభమయ్యాయి.
- ❖ ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్న బ్యారేజీకి మహారాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## అంతర్జాతీయం

- ❍ పాక్ అధ్యక్షుడిగా జర్దారీ స్థానంలో మమ్నూన్ హుస్సేన్ సెప్టెంబర్ 10న ప్రమాణ స్వీకారం చేశారు.
- ❍ ఆస్ట్రేలియా ప్రధానిగా టోనీ అబోట్ ఎన్నికయ్యారు. అబోట్ నాయకత్వంలోని లిబరల్/నేషనల్ సంకీర్ణం హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్‌లో 150 స్థానాలకు గాను 90 స్థానాలు గెలుచుకుంది.
- ❍ ప్రధానమంత్రి హూన్‌సేన్‌కు చెందిన కంబోడియా పీపుల్స్ పార్టీ విజయం సాధించింది.
- ❍ ప్రసిద్ధ ఐరిష్ కవి, నాటకరచయిత, నోబెల్ అవార్డు గ్రహీత సీమస్ హీనీ డబ్లిన్‌లో కన్నుమూశారు.
- ❍ భూటాన్ దేశానికి 5000 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు భారత్ ప్రకటించింది.
- ❍ సిరియాపై ముసిరిన యుద్ధమేఘాలు తాత్కాలికంగా పక్కకు తొలగినట్టే కనిపిస్తోంది. సిరియా వద్ద ఉన్న రసాయన ఆయుధాలను 2014 మధ్య కల్లా తొలగించడమో, నిర్మూలించడమో చేసే దిశగా అంతర్జాతీయ ఒప్పందం కుదుర్చుకునేందుకు అమెరికా-రష్యా దేశాలు అంగీకరించాయి.

## వార్తలు - విశేషాలు

- ❖ జపాన్‌కు 160 కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహా సముద్ర గర్భంలో భూమిపై అతి పెద్ద అగ్ని పర్వతాన్ని హ్యూస్టన్ యూనివర్శిటీ పరి

# మూగవేదన



[illegible]

- డా॥ వి. రాజేంద్రప్రసాద్

[illegible]

## క్రీడలు

[illegible]



# ప్రేమ, త్యాగాలకు సంకేతం !

**అక్టోబర్ 16 బక్రీద్ సందర్భంగా ....**

**ఇస్లాం ధర్మంలో రెండు పండుగలకు గుర్తింపు ఉంది. ఒకటి రమజాన్ పండుగ. దీనిని 'ఈదుల్‌ఫితర్' అని అంటారు. రెండవది బక్రీద్ పండుగ. దీనిని 'ఈదుల్ అధా' అని అంటారు.**

**యూదులకు, క్రైస్తవులకు, ముస్లిములకు మూలపురుషుడు ఇబ్రాహీం అలైహిస్సలామ్. ఈయనను క్రైస్తవులు అబ్రహామ్ లేక ఎబ్రహామ్ అంటారు.**

**ఇబ్రాహీం గారికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్య పేరు 'సారా', చిన్న భార్య పేరు 'హాజిరా'. సుమారు ఎనభై ఆరు సంవత్సరాల వయస్సులో హాజిరా ద్వారా ఇబ్రాహీంకి ఒక కుమారుడు జన్మిస్తాడు. అతనిపేరు ఇస్మాయిలు. ఇతని వంశావళిలోనే కడపటి ప్రవక్తయైన మహమ్మదు ప్రవక్త (స) మక్కాలో జన్మించి ఇస్లాం ధర్మాన్ని స్థాపించారు.**

సుమారు వంద సంవత్సరాల వయస్సులో ఇబ్రాహీమ్ 'సారా' ద్వారా ఇస్‌హాక్ (Isaac) అలైహిస్సలామ్ జన్మించారు. ఇతని వంశావళిలో మూసా (Moses) జన్మించి 'తోరా' (బైబిల్) గ్రంథం ద్వారా యూదు మతాన్ని స్థాపిస్తారు. ఈసా (Christ) జన్మించి బైబిల్ ద్వారా క్రైస్తవ మతాన్ని స్థాపిస్తారు.

సులేమాన్ అలైహిస్సలామ్ నిర్మించిన జెరూసెలమ్ దేవాలయం కంటే చాలా పురాతనమైనది మక్కా నగర మందలి కాబ పుణ్యక్షేత్రం.

మక్కా నగరమందలి 'కాబ' కంటే పురాతనమైన పూజా మందిరం మరొకటి లేదని దివ్య ఖురాన్ ఇలా తెలుపుతుంది...

*"ఇన్న అవ్వలబైతిన్ వుదిఅ లిన్నాసి లల్లజీ బి బక్కత ముబారకన్ వహుదల్ లిల్ ఆలమీన్" (3-96).*

ప్రప్రథమంగా మానవుల కొరకు నిర్మించబడిన ఆరాధన గృహం నిస్సందేహంగా మక్కాలో ఉన్నదే. దానికి సకల శుభాలు ప్రసాదించబడ్డాయి. (3-96)

మనుజుడు దైవ ప్రీతి పొందుటకు, అమితంగా ప్రేమించిన దాన్ని త్యాగం చేయుటకు సిద్ధపడాలని దివ్య ఖురాన్ ఇలా తెలుపుతుంది...

*"లన్ తనాలుల్ బిర్ర హత్తాతున్ ఫిఖూమిమ్మా తుహిబ్బూన్" (3-92).*

మీరు అమితంగా ప్రేమించే వస్తువులను అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టనంత వరకు మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరు. మీరు ఖర్చు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు.(3-92)

మానవులందరూ ఒక కుటుంబీకులే అని దివ్య ఖురాన్ ఇలా అంటుంది...

"మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. అంతా ఆ జంట ద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను తెంచటం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి. (4-1).

మన సనాతన ధర్మ మందలి మకుటం లాంటి శ్లోకం ఇలా తెలుపుతుంది:

*'అ యం నిజః పరోవేతి గణనీ లఘు చేత సాం ఉదార చరితానాంతు వసుధైక కుటుంబకం.'*

"వీరు నా వారు, వారు పరాయివారు అనే భావన గలవారు అల్పులు. భూమండలంలో నివసించే వీరందరూ ఒక కుటుంబీకులే అనే భావన గలవారు ఉదాత్తులు."

మహమ్మదు ప్రవక్త (స) మక్కానగర కాబ గృహాన్ని కేంద్రంగా చేసి ప్రతి సంవత్సరం నిర్ణీత కాలంలో నిర్ణీత పద్ధతిలో హజ్‌యాత్రను చేసి చూపించి, నిరూపించి, మారని, చెరగని మాసిపోని పద్ధతుల ద్వారా ఏకేశ్వరోపాసనా, సర్వ మానవ సౌభ్రాతృత్వం, సర్వమానవ సమానత్వం వసుధైక కుటుంబాన్ని స్థిరపరచారు.

జిల్‌హజ్జ లేక బక్రీద్ నెలలో మక్కాలోని కాబాకు ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో వ్యయప్రయాసలకు ఓర్చి దైవ ప్రసన్నతను పొందేందుకు ఈ హజ్ యాత్రను జరుపుతుంటారు. ఆఫ్రికా కాంగో ప్రాంతం నుండి అతి నల్లటి వాడు, మెక్సికో ప్రాంత్రం నుండి అతి ఎర్రటి వర్ణం వాడు, యూరోపు, ఇంగ్లండు నుండి అతి తెల్లటి వాడు, చైనా నుండి పసుపు పచ్చ రంగు వాడు పలు విధాల వర్ణ, వర్గ, ప్రాంత, లింగ, భాషా భేదాలతో గుమిగూడి మనమందరం దేవుని ఎదుట సమానమనే సిద్ధాంత రీత్యానే కాక, ఆచరణలో కేవలం రెండు కుట్టని బట్టలు రాజు-బంటు, యజమాని-సేవకుడు, ధనికుడు-దరిద్రుడు, పామరుడు- పండితుడు ధరించి సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తారు.

ఇక్కడ గమనించదగ్గ ఒక విషయం ఉంది. మక్కా నగరమందలి కాబ వద్ద ధూప దీప నైవేద్యం జరుగదు. పూజ పునస్కారాలుండవు. ఎలాంటి దీపారాధనా ఉండదు. దక్షిణగా డబ్బు వేయవలసి ఉండదు. అక్కడ ఎటువంటి హుండీ ఉండదు. కానుకలు వేయడం ఉండదు. కాబ దర్శనార్థం టికెట్టు కొనవలసిన అగత్యముండదు. సర్వకాల, సర్వావస్థల్లో, సర్వ భక్తులు కాబ ఉచిత దర్శనం చేసుకోవచ్చును. భక్తులు కాబా ప్రదక్షిణం కలసిమెలసి చేసి, దేవుడు ఒక్కడే, అతనికి అతడే సాటియని చాటిస్తూ చేస్తూ ఉంటారు.

అల్లాహ్ ఇబ్రాహీమ్‌ను అనేక విషయాల్లో కఠిన పరీక్షలకు గురిచేస్తాడు. వాటన్నిటిలో ఇబ్రాహీం అలైహిస్సలాం పూర్తిగా నెగ్గాడు.

అపుడు అల్లాహ్ ఇలా అన్నాడు... "నేను నిన్ను మానవులందరికీ నాయకునిగా చెయ్యబోతున్నాను".

ఇబ్రాహీం తన ప్రభువును ఇలా అడిగాడు... "ఈ నీ వాగ్దానము నా సంతానానికి కూడా వర్తిస్తుందా?"

అపుడు అల్లాహ్ "నా వాగ్దానం దుర్మార్గులైన వారికి వర్తించదు" అని సమాధానమిచ్చాడు.

దేవుడు, ఇబ్రాహీమ్‌ను 'ఖలీల్'గా ప్రకటిస్తాడు. 'ఖలీల్' అనగా దేవుని మిత్రుండని అర్థం. ఇబ్రాహీం తండ్రి బహు దైవారాధకుడు. ఇబ్రాహీం ఏకేశ్వరోపాసకుడు. అందువల్ల అతని తండ్రి కోపగించి ఇంటి నుండి గెంటేస్తాడు.

నమ్రూద్ అనే రాజు ఇతని ఏకేశ్వరోపాసనకు



ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలసాగు సెప్టెంబర్ చివరి నాటికి ముగిసింది. జూలై నుంచి సెప్టెంబర్ 3వ వారం వరకూ రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన వర్షాల వల్ల రైతులకు ప్రయోజనం చేకూరిందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో ఆహారధాన్యాల దిగుబడి ఆశించిన విధంగానే ఉంటుందని అధికారులు ధీమాగా ఉన్నారు.

కృష్ణా, పెన్నా డెల్టాలు, నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాల్వల కింద ఇంకా వరినాట్లు పడాల్సి ఉంది. ఈ నెలాఖరు నాటికే వీటి పరిధిలో కూడా నాట్లు పూర్తి అవుతాయని అంచనా. మొత్తం మీద ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆహారధాన్యాల ఉత్పత్తి ఆశాజనకంగానే ఉంటుంది. ఆహార పంటల్లో ప్రధానమైన వరిసాగు లక్ష్యం గతంలో కంటే కొంచెం పెరగుతుందని అంచనా...

# ఆశలు పెంచుతున్న ఖరీఫ్ సాగు

సాధారణ సాగు విస్తీర్ణం కంటే రెండు లక్షల ఎకరాల్లో వరిసాగు విస్తీర్ణం పెరగవచ్చని ప్రాథమిక అంచనా. ఇక వాణిజ్య పంట వేరుశెనగ సాధారణ సాగు విస్తీర్ణం 11.94 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకూ 9.11 లక్షల ఎకరాల్లో సాగు పూర్తి అయ్యింది. ముతక ధాన్యాలైన మొక్కజొన్న సాగు 22 శాతం పూర్తి అయ్యింది.

అయితే పప్పుధాన్యాల సాగు ఈ ఖరీఫ్ సీజన్‌లో కొంచెం తగ్గింది. జొన్నలు, సజ్జలు, రాగులు సేద్యం 30 శాతం తగ్గినా, వరి, మొక్కజొన్నల సాగు విస్తీర్ణం పెరిగినందువల్ల ఖరీఫ్ సీజన్‌లో మొత్తం మీద ఆహార ధాన్యాల సాగు ఆశాజనకంగా కనిపిస్తోంది.

నూనె గింజలు, మిరప సాగులో సైతం తగ్గుదల కనిపిస్తోంది. నూనె గింజల సాగులో ఇప్పటివరకూ 16 శాతం తగ్గుదల కనిపిస్తుండగా, మిరపసాగు తగ్గింది. అయితే మిరపసాగుకు ఇంకా సమయం ఉన్నందున వల్ల పరిస్థితి మెరుగుపడవచ్చునని వ్యవసాయ శాఖ అంచనా.

ఖరీఫ్ సీజన్‌లో మొత్తం పంటల సాధారణ సాగు విస్తీర్ణం 2.3 కోట్ల ఎకరాలు. అయితే ఇప్పటి వరకూ సాగు అయిన విస్తీర్ణం 1.95 కోట్ల ఎకరాలు. ఇంకా 8 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉంది. కృష్ణా, నెల్లూరు, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో సెప్టెంబర్ చివరి వారంలో కూడా వరినాట్లు పడ్డాయి.

ఆహార ధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 1.04 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటి వరకూ 99 లక్షల ఎకరాల్లో పంటల సాగు పూర్తి అయ్యింది. వరి పంటకు సంబంధించి 65.75 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 65 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి.

ఆగస్టు–సెప్టెంబర్ మాసాల్లో కురిసిన వర్షాల వల్ల ప్రధాన జలాశయాలన్నీ జలకళతో నిండుగా ఉన్నందువల్ల సెప్టెంబర్ చివరి వారంలో కూడా పంటల నాట్లు పూర్తి అవుతాయని అంచనా. అందువల్ల సాధారణ సాగు విస్తీర్ణం కంటే కనీసం 2 లక్షల ఎకరాల్లో వరి అధికంగా సాగు ఉంటుందని అధికారుల అంచనా.

ముతక ధాన్యాలు 18.68 లక్షలకు గాను, 19.7 లక్షల ఎకరాల్లో సాగు అయ్యాయి. మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగినందువల్ల ముతక ధాన్యాల సాగు ఆరు శాతం పెరిగింది.

అయితే పప్పు ధాన్యాల సాగు 3.83 లక్షల ఎకరాల్లో తగ్గింది. నూనె గింజల సాగు మొత్తం 41.6 లక్షల ఎకరాల సాగు కావాల్సి ఉన్నా, ఇప్పటి వరకూ 34.9 లక్షల ఎకరాల్లోనే సాగు పూర్తి అయ్యింది.

మొత్తం మీద ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఆశాజనకంగా ఉంటుందని అధికారుల అంచనా.

*– గోసాల ప్రసాద్*

ఆగ్రహించి బ్రహ్మాండమైన అగ్నిగుండం తయారు చేసి అందులో పడవేయగా దైవాజ్ఞచే ఆ అగ్ని చల్లబడి పూబంతులవలె ఆహ్లాదం కలిగిస్తుంది.

ఇబ్రాహీం ఖలీలుల్లాకి ముసలితనంలో జన్మించిన, సుమారు పన్నెండు సంవత్సరాల వయసులో ఉన్న ఏకైక పుత్రుడు ఇస్మాయిలు జబీ ఉల్లాని బలి ఇవ్వమని అల్లాహ్ ఆజ్ఞాపిస్తాడు. వెంటనే మారు మాటాడక ఇబ్రాహీం ఖలీలుల్లా కుమారుడు ఇస్మాయిల్‌ని బలిచేయటానికి సిద్ధపడి ఈ విషయం అతనికి తెలుపుతాడు. ఇస్మాయిలు పవిత్ర పుత్రుడు. తండ్రికి తగిన తనయుడు. తక్షణం అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి, అంగీకరించి తండ్రి కలను నిజం చేయటానికి సిద్ధమౌతాడు.

అపుడు ఇబ్రాహీం తన ఏకైక ప్రియతమ పుత్రుని నేలపై పరుండబెట్టి కత్తితో బలిచేయటానికి ఉపక్రమిస్తాడు. అప్పుడు దేవుడు అతని త్యాగబుద్ధికి, దైవప్రీతికి మెచ్చి, సంతసించి జిబ్రాయీల్ దూత ద్వారా ఒక దుంబను పంపి ఖుర్బాని చేయించి ఇస్మాయీల్‌ను కాపాడతాడు.

సత్య ధర్మాలను కాపాడటానికి, దైవాజ్ఞపాలను నిర్విఘ్నంగా నెరవేర్చడానికి బక్రీదు పండుగలో ఖుర్బాని ప్రక్రియ భక్తులకు బోధిస్తుంది.

మానవుడు నిజమైన సత్య సంధుడు, దైవభక్తి పరుడగుటకు ఇలా జీవించాలి అని దివ్య ఖురాన్ తెలుపుతుంది.

"సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పు పడమరకో త్రిప్పటం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని దూతలనూ, అల్లాహ్ అవతరింప చేసిన గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలనూ హృదయ పూర్వకంగా విశ్వసించటం. ఇంకా అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని, బంధువుల కొరకూ, అనాథల కొరకూ, నిరుపేదల కొరకూ, బాటసారుల కొరకూ సహాయం చెయ్యండి అని అర్థించే వారి కొరకూ, ఖైదీలను విడుదల చెయ్యటానికీ వ్యయ పరచటం. ఇంకా నమాజు ప్రార్థనను స్థాపించటం. జకాత్ విధి దానం ఇవ్వటం. వాగ్దానం చేస్తే దానిని పాలించేవారు, కష్టకాలంలో లేమిలో సత్యానికీ, అసత్యానికీ మధ్య జరిగే పోరాటంలో స్థైర్యం చూపేవారూ సత్పురుషులు. వాస్తవంగా సత్య సంధులు. అల్లాహ్ ఎడల భయ భక్తులు కలవారు వీరే" (2–177).

*– షేక్ గౌస్ సాహెబ్*




# ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఎల్.ఐ.సి. పాలసీలకు శ్రీకారం

**ప్రపంచంలో ఏ ఇతర దేశంలోనూ లేని విధంగా నూతన బీమా నిక్షేప వ్యవస్థ (ఇన్సూరెన్స్ రిపాజిటరీ సిస్టమ్ - ఐ.ఆర్.ఎస్)కు తొలిసారిగా మన దేశంలో శ్రీకారం చుట్టారు. జీవితబీమా పాలసీలను ఎలక్ట్రానిక్ పద్ధతిలో పొందేలా రూపకల్పన చేసిన బీమా నిక్షేప వ్యవస్థను హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ చిదంబరం సెప్టెంబర్ 16న లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సభావేదికపై ఐ.ఆర్.ఎస్.ఖాతా పొందిన వినియోగదారునికి సంబంధిత పత్రాలను శ్రీ చిదంబరం అందజేశారు.**

బీమా నియంత్రణ అభివృద్ధి సంస్థ (ఐ.ఆర్.డి.ఎ) రూపొందించిన ఐ.ఆర్.ఎస్ సేవలను పాలసీదారులకు అందించటానికి తొలుత అయిదు సంస్థలకు అనుమతిచ్చింది. ఎన్.ఎస్. డి.ఎల్. డేటా బేస్ మేనేజ్‌మెంట్, సెంట్రల్ ఇన్సూరెన్స్ రిపాజిటరీ, షిల్ ప్రాజెక్ట్స్, కార్వీ ఇన్సూరెన్స్ రిపాజిటరీ, క్యామ్ రిపాజిటరీ సంస్థలు వివిధ బీమా సంస్థలు తరఫున పాలసీదార్ల డీమ్యాట్ ఖాతాలను నిర్వహిస్తాయి. ఇకపై, జీవిత బీమా పాలసీలను సైతం పాలసీదారులుగా నేరుగా ఎలక్ట్రానిక్ పద్ధతిలో డీమ్యాట్ ఖాతాల్లో పొందే వీలు కలుగుతుంది. ఈ వినూత్న వ్యవస్థలో వినియోగదారులు తమకు ఇష్టమైన సంస్థను ఎంపిక చేసుకుని రిపాజిటరీ ఖాతా తెరచి, అందులో తమ ఖాతాలన్నింటినీ భద్రపరచుకోవచ్చు.

వేగంగా, ఖచ్చితంగా, పారదర్శకంగా సమర్థంగా తక్కువ ఖర్చుతో బీమా పాలసీలను నిర్వహించే ఉద్దేశంతో ఐ.ఆర్.ఎస్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. ఈ ఐ.ఆర్.ఎస్‌లో ఒక విశిష్ట కోడ్ నంబర్ ఖాతాదారుకు కేటాయిస్తారు. ఖాతాదారునికి ఉన్న పాలసీలన్నీ ఆ కోడ్ నంబర్ కిందకే వస్తాయి. ఖాతాదారుని పూర్తి వివరాలతో పాటు క్లెయిమ్‌లు, నామినీలు, లబ్ధిదారులు తదితర సమాచారాన్ని ఆ కోడ్ నంబర్‌లో పొందుపరుస్తారు.

## ఐ.ఆర్.ఎస్.తో లాభాలెన్నో...


బీమా నిక్షేప వ్యవస్థ వల్ల పాలసీదారులకు అనేక ప్రయోజనాలున్నాయి. పాలసీబాండ్లు కనపడకుండా పోతే, ముఖ్యంగా తుపాన్లు, వరదలు, అగ్ని ప్రమాదాలు సంభవించిన సందర్భాల్లో పాలసీపత్రాలు గల్లంతయితే, మరణించిన తమ వారి పాలసీ వివరాలు లభ్యం కాని స్థితిలో ఐ.ఆర్.ఎస్. చక్కని పరిష్కారమార్గంగా నిలుస్తుంది.

## ఐ.ఆర్.ఎస్ కిందకు అన్ని పాలసీలూ తేవాలి

ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ చిదంబరం మాట్లాడుతూ "బీమా నిక్షేప వ్యవస్థ అనే నూతన సదుపాయాన్ని కేవలం జీవిత బీమాకే పరిమితం చేయరాదు. సాధారణ బీమా పాలసీలకు కూడా వర్తించేలా చేయాలి. ముందుగా అయిదు సంస్థలకు మాత్రమే బీమా రిపాజిటరీ హోదా కల్పించాం. వీటికి వచ్చే ఏడాది జూలై 31వ తేదీ వరకూ లైసెన్స్ వర్తిస్తుంది" అని పేర్కొన్నారు.

"పాలసీదారుకు ఒక్కో ఖాతా తెరిచేందుకు రూ. 150 వరకూ ఖర్చవుతుంది. దీన్ని విస్తరించాక ఆ ఖర్చు రూ. ఇరవైకి తగ్గే అవకాశముంది. మొత్తమ్మీద బీమా నిక్షేప సేవల వల్ల బీమా కంపెనీలకు, వినియోగదారులకు దీర్ఘకాలం భద్రతతో పాటు అనేక ప్రయోజనాలు కలుగుతాయి" అని శ్రీ చిదంబరం వివరించారు.

సభలో సి.ఎన్.బి. మెట్‌లైఫ్ ఇండియా ఎం.డి. శ్రీ రాజేష్ రేలాన్, సి.డి.ఎస్.ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ పి.ఎస్.రెడ్డి, ఐ.ఆర్.డి.ఎ. ఛైర్మన్ శ్రీ విజయన్ తదితర్లు పాల్గొన్నారు.




- ఆర్పీ. వడ్లమూడి

# ప్రభుత్వ సాయంతో 'పట్టు' సాధించారు!

**వ్యవసాయ అనుబంధ రంగమైన పట్టు పరిశ్రమ సాగులో గత ఐదు సంవత్సరాలుగా చిత్తూరు జిల్లా ప్రథమస్థానంలో నిలుస్తోంది. చిత్తూరు జిల్లా పడమటి మండలాలలో తరచూ కరువు పరిస్థితులు ఏర్పడేవి. ఇలాంటి ప్రాంతాలలో వ్యవసాయం చేయడం కష్టతరంగా ఉండేది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు ఈ ప్రాంత రైతులు అధికారుల సహకారం, ప్రభుత్వ ప్రోత్సాహంతో వాణిజ్య పంట అయిన మల్బరీసాగుకు శ్రీకారం చుట్టారు. మదనపల్లి డివిజన్‌లోని రైతులు ఎక్కువగా మల్బరీ సాగుపై మక్కువ చూపుతున్నారు.**

చిత్తూరు జిల్లాలో 24,600 ఎకరాలలో 18,750 మంది రైతులు రాష్ట్రంలోనే అధికంగా మల్బరీసాగు చేస్తున్నారు. పంటకు ప్రధాన ఆధారమైన పట్టుగుడ్లను 13.79 లక్షలు ఉత్పత్తి చేస్తున్నారు. గత సంవత్సరం ఏడాదికి 5 పంటలు పండిస్తూ దాదాపు రూ. 225 కోట్లు ఆదాయం పొందారు. సగటున ప్రతి రైతు ఏడాదికి రూ. 1.25 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు.

మల్బరీ సాగు, పట్టుగూళ్ల అధికోత్పత్తికి గాను రైతులను మరింత ప్రోత్సహించేందుకు క్రాస్‌బీడ్ రకం పట్టుగుడ్లకు మార్కెట్ మద్దతు ధరకు అదనంగా ప్రతి కేజీకి రూ. 10 వంతున, బైవోల్టిన్ పట్టు గుడ్లకు ప్రతి కేజీకి రూ. 50 చొప్పున ఈ జూన్ 1వ తేదీ నుండి రైతులకు ప్రోత్సాహకాన్ని అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. పట్టు పరిశ్రమ సన్నకారు, చిన్నకారు రైతులకు ముఖ్యమైన జీవన వృత్తిగా ఉంది.

చిత్తూరు జిల్లా మదనపల్లి డివిజన్ పలమనేరు మండలం ముసలిమడుగు గ్రామంలో నివసించే కె. చంద్రకళ (34) బిఏ, బిఇడి వరకు చదువుకున్నారు. తన భర్త చంద్రశేఖర్‌తో కలసి 3 ఎకరాలలో ప్రభుత్వం అందించిన రాయితీతో డ్రిప్, రేరింగ్ షెడ్లు, మల్బరీ మొక్కలు అందుకుని మల్బరీని సాగు చేశారు. స్వంతంగా షెడ్లను శుభ్రపరచుకునేవారు. అధికారుల సూచనలు, సలహాలతో చీడపీడల యాజమాన్య పద్ధతులను పాటించి తెగుళ్లను నివారించి అధికోత్పత్తి సాధించారు.

ఒక పంటకు 85 కేజీల వరకు క్రాస్ బీడ్ పట్టుగుడ్లను, సిఎస్ఆర్ రకం 65 కేజీల వరకు ఉత్పత్తి చేసి పంటకు రూ. 30 వేల వరకు ఆదాయం పొందేవారు. ఏడాదికి 3 పంటలు పండిస్తూ వార్షికంగా రూ. 2.40 లక్షల ఆదాయం పొందుతున్నారు. మల్బరీ సాగు వల్ల వచ్చిన ఆదాయంతో ఒక ఎకరా భూమి కొనుగోలు చేసి అందులో రూ. 7 లక్షలతో పెద్ద రేరింగ్ షెడ్డు నిర్మించుకున్నారు.

గ్రామంలో రాజీవ్ గాంధీ మహిళా సంఘం లీడర్‌గా కూడా చంద్రకళ ఉన్నారు. సంఘానికి వచ్చిన రూ. 3లక్షల బ్యాంకు రుణంతో తన వాటాతో పాడి ఆవులను కొన్నారు. సంఘంలోని ఇద్దరు సభ్యులు మల్బరీ సాగు చేపట్టేలా ప్రోత్సహించారు. పట్టు ఉత్పత్తిలో మహిళా రైతు అవార్డు అందుకొన్నారు.

"గతంలో మా ఆదాయం అంతంత మాత్రమే. ప్రభుత్వ అందించిన రాయితీ, అధికారుల ప్రోత్సహంతో మల్బరీసాగుతో మంచి దిగుబడులు, ఆదాయం పొందాం. పట్టు పరిశ్రమలో అందిస్తున్న ప్రోత్సాహకాలు మా అభ్యున్నతికి దోహదం చేస్తున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు" అని మహిళా రైతు చంద్రకళ తెలిపారు.

ఇదే మండలం జగ్రానారి పల్లి గ్రామ పంచాయతీలో దాదాపు వందకుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామానికి చెందిన ఎస్. ఇంతియాజ్ భాషా రైతుగా తనకు గల ఐదు ఎకరాల పొలంలో మొదట చెరకు పంట పండించేవాడు. ఆ పంట అంత గిట్టుబాటు కాకపోవడంతో మల్బరీ సాగుపై

*జిల్లాల నుంచి...*

ఆసక్తి చూపాడు. ఇతని ఆసక్తిని గమనించిన పట్టు పరిశ్రమ శాఖాధికారులు ప్రోత్సహించి ఇంటివద్ద పెంచే పట్టుపరుగులను, చాకీ సెంటర్ నందు పెంచే విధంగా అందుకు అవసరమైన షెడ్ నిర్మాణానికి ఋణం అందజేశారు.

ఒక పంటకు 300 గుడ్లను పెంచడంతో పాటు, వాటికి ఆహారమైన మల్బరీ తోటను 4 ఎకరాలలో పెంచుతున్నట్లు మల్బరీతోటకు డ్రిప్ సౌకర్యం కల్పించడం జరిగిందని, తనతో పాటు తన భార్య పట్టుపురుగుల పెంపకంలో సహాయం చేయడంతో ఎటువంటి కూలీ ఖర్చులు లేకుండా పంటను పండించు కోవడం జరుగుచున్నదని తెలిపారు.

రూ. 35 వేల వరకు ఆదాయం వస్తోందని, పెంకుటిల్లులో ఎన్న తాను నేడు సొంత ఇల్లును కట్టుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందామని, మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకం సిరులు కురుపిస్తున్నదని ఆనందం వ్యక్తం చేశాడు ఇంతియాజ్ భాషా.

పలమనేరు మండలం తావడపల్లి గ్రామానికి చెందిన సి. పరంధామ్ (45) రైతుగా తనకు గల రెండున్నర ఎకరా పొలంలో మొదట చెరుకు, వరిపంటలను పండించేవాడు. ఈ పంటలకు నీరు అధికంగా అవసరం కావడం, కష్టం ఎక్కువ ఫలితం తక్కువగా ఉండేది. పట్టుపరిశ్రమ శాఖాధికారుల ప్రోత్సాహంతో మల్బరీ సాగు పట్ల ఆసక్తి చూపారు.

రెండున్నర ఎకరా పొలంలో మొదట 9090 సెంటీమీటర్ల స్థలంలో మల్బరీ తోటను పెంచి, ఒక ఎకరాకు 20 టన్నుల పశువుల ఎరువులను సేంద్రియ ఎరువుగా మల్బరీ తోటకు అందించడం జరిగిందని తెలిపారు. చాకీ సెంటర్‌లో ఒకసారి 250 గ్రుడ్లను పెంచడం జరుగుచున్నదని, ఒకసారి 165–175 కేజీలు పట్టుగుడ్లు ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు.

నెలకు ఒకసారి వచ్చే పంటలో ఖర్చులు పోను రూ. 30 వేలు సంపాదన ఉంటుందని తెలిపారు.

*– బి. పద్మజ, మదనపల్లి*



# స్త్రీ శక్తి......

-ఇంద్రగంటి నరసింహమూర్తి

[illegible]



[illegible]

*****

'ఈయన గారికి సాహిత్యాభిలాష అస్సలు లేదు. కనీసం భార్య ఏం రాసిందో చదువుదామన్న ఆసక్తి లేదు. ఏం మనిషో...' పళ్లు పటపట కొరికింది.

'ఎంత సేపూ ఆ బిజినెస్ పేపర్లు చదవడం... సిఎన్‌బిసి లాంటి ఛానెల్స్ చూసుకోవడం... తప్ప వేరే గొడవ వుండదు. ఆ బిజినెస్‌లో ఏం వస్తోందో... ఎంత పోతోందో లెక్కలు వేసుకోడు' ఆమెకు నీరసం ఆవహించింది.

నేనేమిటో ఆయనకి తెలిసేలా చేయాలి. ఎలా?

ఆలోచిస్తున్న ఆమె మదిలో ఓ కార్యక్రమం రూపుదిద్దుకుంది. బంగాళాదుంపలు వేగడం, ఆమె ఆలోచనలు ఓ కొలిక్కి రావడం ఒకేసారి జరిగాయి.

*****

నాలుగు నెలల తరువాత...

ఆ రోజు....

రోజులాగే కాలేజీకి బయలుదేరుతున్నాడు పద్మనాభం. "ఈ రోజు టాటాస్టీల్ షేర్లు కొనండి. షేరు ధర పది రూపాయలదాకా పెరగొచ్చు" సలహా యిచ్చింది ప్రవీణ.

"కలగన్నావా!" హేళనగా అడిగాడు పద్మనాభం.

"అలాగే అనుకోండి" స్థిరంగా పలికింది ప్రవీణ.

పద్మనాభానికి భార్య తెలివితేటల మీద నమ్మకం లేక పోయినా ఆమెకు వాక్శుద్ధివుందని నమ్ముతాడు. అతను వెంటనే బ్రోకర్‌కు ఫోన్ చేసి భార్య సలహాను పాటించి కాలేజీకి వెళ్లిపోయాడు.

ఒంటిగంట ప్రాంతంలో ప్రవీణ నుండి సెల్ కాల్.

"టాటా స్టీల్ పదిరూపాయలు పెరిగింది. అమ్మేసి హిండాల్కో కొనండి. యివాళ మెటల్స్ కౌంటర్ అప్ ట్రెండ్ కొనసాగుతోంది" సలహా చెప్పింది ప్రవీణ.

ఆశ్చర్యపోవడం పద్మనాభం వంతయింది.

భార్య సలహాను అక్షరాలా పాటించాడు.

*****

సాయంత్రం రోజు కన్నా గంటముందే యింటికి వచ్చాడు పద్మనాభం.

"నీ కల నిజమయింది ప్రవీణా. ఈ రోజు నాకు రెండు వేలు లాభం" హుషారుగా అంటూ భార్య బుగ్గపై చిటికె వేశాడు.

"ఇంకా నేను కలగన్నాననే వూహిస్తున్నారా" ఋంగమూతి పెట్టింది ప్రవీణ.

"మరి..." పద్మనాభం ఆశ్చర్యం.

ప్రవీణ తనెందుకు ఆ రెండు కంపెనీల షేర్లు కొనమని సలహాయిచ్చిందో వివరించింది.... నిఫ్టీ ఏ బై షేర్లలో ఏ కంపెనీ షేర్లు తక్కువధరలో వున్నాయో.. ఏ షేర్లు అధిక ధరల వద్ద ట్రేడ్ అవుతున్నాయో.. అందుకు కారణాల విశ్లేషణ గడగడా చెప్పేసింది.

భార్య చెపుతున్న విషయాలు మంత్రముగ్ధుడిలా విన్నాడు భర్త.

"నీకు.... ఇంత అవగాహన... నాలెడ్జ్... ఓ మై గాడ్..... నువ్వు.... నువ్వు... నా ప్రవీణవేనా.... నీ కింతకాలం సరస్వతీ కటాక్షమే వుందనుకున్నాను... ఇంత హఠాత్తుగా లక్ష్మీకటాక్షం ఎలా సంపాదించావు" సంభ్రమంగా అడిగాడు భర్త.

ఓ వెర్రి నవ్వునవ్వింది. తన నాలుగుమాసాల శ్రమ ఆమె కళ్ళల్లో మెదిలింది.

*****

నాలుగు నెలల క్రితం....

భర్త తిరస్కార భావంతో మాట్లాడడం ఆమె అహాన్ని దెబ్బతీసింది. ఆ సమయంలో ఆమె దృఢంగా నిశ్చయించుకుంది. భర్త తనలాంటి వాళ్లకి ప్రవేశం దుర్లభం అని భావిస్తున్న షేర్ మార్కెట్ పద్మవ్యూహంలో ప్రవేశించాలని, ఆ కథ తెలుసుకోవాలని... మనసుంటే మార్గం వుండదా.....

భర్త కాలేజీకి, పిల్లలు స్కూలుకి వెళ్లాక...

ఖాళీ సమయంలో ప్రవీణ సాధారణంగా పుస్తకాలు చదువుతుంది. కవితలు వ్రాస్తుంది... టివి సీరియల్స్ చూస్తుంది... అప్పుడా కార్యక్రమాల కి విరామం యిచ్చి...

బిజినెస్ పేపర్లు చదవడం మొదలు పెట్టింది.

బిజినెస్ ఛానల్స్ చూడడం అలవాటు చేసుకుంది.

ఇంట్లోవున్న షేర్ మార్కెట్‌కి సంబంధించిన పుస్తకాలు చదవడం –మార్కెట్‌పై అవగాహన పెంచుకోవడం దైనందిన కార్యక్రమంగా మార్చుకుంది.

సాయంత్రం పిల్లలు స్కూలు నుండి రాగానే ఇంటి పనులు ఎలాగో తప్పవు.

ఖాళీ సమయం సద్వినియోగమైంది.

ప్రవీణ రెండు నెలలు షేర్ మార్కెట్ పై అధ్యయనం కొనసాగించింది.

*****

రెండు నెలల తరువాత ప్రవీణ 'మాక్ ట్రేడింగ్' మొదలెట్టింది. రోజూ ఏఏ షేర్లు ఎంత ధరలో కొనాలో.. అమ్మాలో కాగితం మీద రాసుకోవడం... తను అనుకున్నట్లుగా ధరలు పెరుగుతున్నాయా, తగ్గుతున్నాయా అని గమనించడం... మధ్యాహ్నం మూడున్నరకి మార్కెట్ క్లోజింగ్‌లో తన అంచనాలు ఎంత వరకు కరెక్ట్ అయ్యాయో లెక్కవేయడం.

టివి ఛానల్స్‌లో వచ్చే ఎనలిస్ట్‌ల రికమండేషన్స్‌లో నిజమెంత... బోగస్ ఎంత... అని విశ్లేషించుకోవడం... ట్రేడింగ్ జరుగుతున్నంత సేపూ బిజినెస్ ఛానల్స్ ఫాలో అవడం... ఆమెకు ఎంతో ఉత్కంఠభరితంగా రోజులు గడచిపోయాయి.

*****

మరో రెండు నెలల నిశిత పరిశీలన తరువాత ప్రవీణకు మార్కెట్ పై పట్టు దొరికినట్లనిపించింది. తన పై తనకు నమ్మకం ఏర్పడింది.

*****

"మందితల్ నేర్వగరాని విద్యగలదే..... అర్థమయిందా" ఆక్షేపించింది ప్రవీణ.

పద్మనాభం నిశ్చేష్టుడయ్యాడు.

భార్య పట్టుదల ముందు తలవంచాడు.

"సారీ ప్రవీణ... నిన్ను సరిగ్గా అర్థం చేసుకోలేక పోయాను... నీకు మనసారా అభినందనలు" భార్యని దగ్గరకు తీసుకోబోయాడు.

ఉబుకుతున్న ఆనందాశ్రువుల్ని ఆపుకుంది. దూరంగా జరిగింది. ఇంట్లోకి పోబోయింది.

పద్మనాభం చేయి అడ్డంపెట్టాడు.

''అదేంటి నిన్ను అభినందిస్తుంటే వెళ్ళిపోతున్నావ్!"

"నాకు అభినందనలు చెప్పటానికి సాహిత్యాభిమానులు చాలా మందివున్నారు. వాళ్ళ కోసం నేను కవితలు రాసుకోవాలి. దారి వదలండి" నిష్కర్షగా అనేసి లోపలికెళ్ళిపోయింది.

*****

రెండు వారాల తరువాత ఒక వార పత్రికలో ఆ ముందు వారం ప్రవీణ రాసిన కవితని విశ్లేషణాత్మకంగా అభినందిస్తూ లేఖ పడింది. రాసింది పద్మనాభం. ఆ లేఖ చదివి ఉబ్బితబ్బిబ్బయింది ప్రవీణ.


మరునాడు సాయంత్రం.

"శ్రీవారూ... మీకో ముఖ్యమైన సలహా" భర్తకి టీ కప్పు అందిస్తూ ప్రవీణ.

"చెప్పు... నీ మాట ఎలా కాదంటాను" పద్మనాభం.

"మీరు రోజూ చేస్తున్న షేర్ ట్రేడింగ్ ఓ జూదమండి. ఈ వ్యాపారంలో ఒక్కోసారి లాభాలొచ్చినా తాత్కాలికమే. నష్టాలే ఎక్కువ. నాలుగు నెలల నా పరిశీలన నాకు నేర్పిన పాఠమిది. రోజూ చేసే ట్రేడింగ్ బదులు మన దగ్గరున్న డబ్బుతో బ్లూ చిప్స్‌ని ధరలు తగ్గినప్పుడు కొని దీర్ఘకాలానికి మదుపు చేస్తే.... లాభాలు సంపాదించవచ్చు. మనశ్శాంతికీ కొరత వుండదు.. ఏమంటారు?" అర్ధాంగి సలహా.

"అవును, అప్పుడు నీ కవితలు, రచనలు చదివి ఆస్వాదించటానికిక్కూడా నాకు టైం దొరుకుతుంది" అంటూ చిరునవ్వు నవ్వాడు పద్మనాభం. ప్రవీణ సిగ్గుపడింది. ☆



# మా ఊరి చెరువుతో మాట్లాడుదాం రండి!!

"కవిత్వం రాస్తుంటే హృదయం చిద్రుపలై చిద్రుపలై అక్షరాల్లో ఒదిగిపోతుంది
రేపటి మృత్యుపుష్పం కోసం అమరత్వపు మకరందం ప్రాణం పోసుకుంటుంది
కవిత్వం రాస్తుంటే నువ్వే ఓ కవిత్వమై పోతావ్!"

*- కాంచనపల్లి*

మనిషి, మనిషిని మరింత సన్నిహితం చేసేది సాహిత్యం. జీవితాన్ని ఉన్నతీకరించే క్రమంలో సమూహం వైపు నడిపించేది కవిత్వం. మనిషి ఒంటరితనాన్ని, మౌనాన్ని, ఛేదించి సామూహికంగా, సామాజిక సంబంధాలతో పురోగమించేది కవిత్వం. ప్రతికూలతలన్నీ ప్రతిబంధకాలుగా మారినప్పుడు వాస్తవిక దృక్పథంతో తన ఉనికిని ధైర్యంగా ప్రకటిస్తుంది.

తాను జీవించే, అనుభవించే సామాజిక కల్లోలం లోంచి తాను నలిగిపోయే సందర్భాలను, సన్నివేశాలను కవిత్వం చేస్తాడు కవి. దేశ సౌభాగ్యమంతా పల్లెసీమల్లోనే పదిలంగా ఉంది అని నమ్మిన గాంధీజీ లాంటి వారికి ఒకనాటి పల్లె సీమలన్నీ సస్యశ్యామల సౌందర్య క్షేత్రాలు. ఇవాళ గాంధీ గారు లేరు, ఆనాటి పల్లెల సౌందర్య చిత్రాలూ కన్పించవు. నిజంగా పల్లె మన తల్లి ఒడి. మన చదువు సంస్కారాలకు చక్కని ఒరవడి.

పచ్చటి పల్లెకు ఆసరా చెరువు. చెరువులేని పల్లెటూరు ఒక అనాథ. సాగునీరూ, త్రాగునీరూ ఆ పల్లె ప్రజలకు జీవానాధారం. కాలవ గట్టూ, కొండలూ, గుట్టలూ, ఆకుపచ్చ మైదానల్లో పిట్టలూ, పశువులూ, బాటసారులూ- ఈ దృశ్యాలన్నీ పల్లె సీమలకు అమర్చిపెట్టిన సహజ సౌందర్య ఆభరణాలు. వర్తమానకవులకూ పుట్టిళ్ళు పల్లె సీమలే కదా! 'తమ ఊరి చెరువుతో కవిత్వంతో సంభాషిస్తున్నారు. వర్తమానంలో అదృశ్యమైపోయిన చెరువును గురించి ఆవేదన చెందుతున్నారు. ఇవాల్టి కవులు తమ ఊరి చెరువును గురించి ఎలా స్పందిస్తున్నారో? కనుమరుగైపోయిన ఆ జల స్వప్నం గురించి ఎలా ఆందోళన పడుతున్నారో వారి కవితల్లోనే విశ్లేషించుకుందాం....

ఇక్కడో చెరువుండేది. అదిగో ఆ తూమే సాక్ష్యం. ఆ కనిపించే నల్లగుండే నీటి తల్లికి గుండెకాయ. ఈ రాళ్ళ మీద మీ చెవి ఆనించండి. నీళ్ళ శబ్దం వింటారు. ఈ గుంటలను చూడండి అశ్రువులు లేని కనుకొలుకులు కనిపిస్తాయి. ఈ చెరువే నాకు బాల్యం. ఇది లేకపోతే నాకు జీవితం లేదు. అంటూ తన ఆవేదనను ప్రకటిస్తున్న ఈ కవి -

*"మీరు చూశ్కేదు గానీ/ ఆ ఆకాశం వొంగిన దాకా నీళ్ళుండేవి / అద్దాల్లో మబ్బుల్ని పట్టుకోడానికి/ తల్లకిందులుగా దూకి ఈతలు కొట్టే వాళ్ళం / కాలువ కొంగును పట్టుకొని దూరాలకి లాగి/ సతాయించేవాళ్ళం / సాయం తిలకం దిద్దుకొని/ నురగల పెదవుల్తో పిలిచేది/ గాలివేళ్ళు తగిలితే చాలు / వేల వేల పూల డిజైన్లతో/ నీటి మీద షోలాపూర్ దుప్పట్లు పరుచుకునేవి/ మాకూ అమ్మమ్మ ఊరికీ మధ్య చెరువు / నమ్మి దిగే వాళ్ళం / అరికాళ్ళను నిమురుతూ / ఆవలి దాకా సాగనంపేది/ అమ్మమ్మను తగలేసిన మంటలు/ చెరువు గుండెల్లోనే జ్వలించేవి / భరించడం కష్టం / ఆ ఫ్యాక్టరీ గొట్టానికి తగిలి / పక్షి కూలిపోతుంది/ అది నేనే"*

*- ఎన్.గోపి*

చెరువులేని మా ఊరుని చూడలేను. నేనిప్పుడు అమ్మలేని అనాథను. చిన్నప్పుడు చెరువు చెక్కిళ్ళని ముద్దుపెట్టుకున్న నీటి జ్ఞాపకాలు, జలమైదానంలో దినమొలతో పరుగెత్తిన గాథ స్మృతులు కానీ నాకు లేవు. ఈ చెరువు పలకమీదే జలాక్షరాలు దిద్దుకోవాలని చిన్నప్పుడు ఎంతగా తపనపడ్డామో మబ్బుల ఊరేగింపుల్లో ఉరుములతో గొంతు కలిపి నినాదాలు చేసేవాళ్ళం. అంటూ ఊరి చెరువుతో బాల స్మృతుల్ని పంచుకుంటున్న ఈ కవి -

*"చెరువు మా బాల్య జల స్వప్నం / ఆకాశం కొలిమిగా మారిన రుతువులో / ఒక చెరువు కోసం/ ఒక చెలమ కోసం/ బొబ్బలెక్కిన కాళ్ళతో కాందిశీకుల మయ్యే వాళ్ళం / మా వూరు గుర్తుకొచ్చి / నా బాల్యం వీపు నిమిరినప్పుడల్లా / నా తాత ముత్తాతల నాటి మెట్ట పొలం కళ్ళల్లో కదిలినప్పుడల్లా / చెరువు లేని నా పల్లె రూపం/ నన్ను నిలువెల్లా నీరుగా మార్చేస్తుంది./ నన్ను చెరువుగా మారమని / మట్టి గొంతుతో నినదిస్తూ వుంటుంది."*

*- ఎండ్లూరి సుధాకర్*

ఈ కవి చెరువు గట్టూ - రావిచెట్టునూ గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. గాలి రావిచెట్టు ఆకులతో ఊసులు చెబుతుంటే చెరువు అలల తలలు ఆడిస్తూ ఆలకిస్తూ ఉంటుంది. రావి ఆకు పడవ చీమ యాత్రికుణ్ణి ఆవలి తీరం చేరుస్తుంది. అంటున్న ఈ కవి మాటల్లోనే -

*"రావి చెట్టు తన అందాలు / చెరువు అద్దంలో చూసుకొని / ఆకు పచ్చ పొదరు / ముఖానికి అద్దుకొంటుంది / తొంగి చూచే చంద్రుడి మీదికి / చెరువు అలల / టార్చిలైట్లు వేస్తుంది / రావి*

*చెట్టు గాలి నీళ్ళలో ఈది / దిసెమొలతో ఊళ్ళోకి పరుగెత్తుతుంది / చెరువు నీళ్ళ దోసిళ్ళతో / చెట్టు కాళ్ళనూ వేళ్ళను కడుగుతుంటుంది / వరవశంలో చెట్టు ఆకులు రాల్చి / చెరువును దీవిస్తూ ఉంటుంది."*

**- ఆచార్య కొలకలూరి ఇనాక్**

ఇంద్రసభ ఉన్నట్టు మా ఊరి చెరువుండేది. పరిచారికలు విసన కర్రలు విసిరినట్టు, చెరువుకు ఇరువైపులా మత్తళ్లు దూకేవి. అలలు గంధర్వకన్యలై గంతులేస్తుంటే, చెరుకట్టే దేవేంద్రుడై చకితుడై చూస్తుండే వాడు. గట్టు మీద చెట్లన్నీ దేవతలై గుడ్లప్పగించి చూస్తుండేవి. గతాన్ని తలపోస్తూ కాలం గడపటం తప్ప, ఇప్పుడా చెరువేది. ఋతుపవనాలు వీచినా, తుఫానులొచ్చినా మా ఊరు చెరువు నిండదేం. మా చెరువు అదే మా రావునూతల చెరువు అంటున్న ఈ కవి -

*"మా ఊరి చెరువంటే చెరువు కాదు / చేపల ధాన్యాగారం / మా ఊరి ధాన్యాగారానికి జన్మనిచ్చిన గర్భకుహరం / తాత ముత్తాతల నాటి చెరువు / నీ ఉపరితలం మీద / కొంగ గుంపులు చుక్కల పందిళ్ళు వేసిన చెరువు / ఆడపడుచులు అందంగా పేర్చి నీళ్ళలో వేసిన బతుకమ్మల చెరువును / పాల పొంగులా ఉబికి వచ్చి అలుగులు దూకుతున్న చెరువును కళ్ళారా చూద్దామంటే / పొద్దంతా వాన కురిసినా నిండదేం / ఆ చివర నుండి ఈ చివరి దాకా / నడుస్తుంటే రాజ వీధిలా చెరువు / కట్టమది నుంచి చూస్తుండే నీటి తళ తళలు / రాజు గారు ధరించిన పట్టు వస్త్రాల జరీ మెరుపులా చెరువు / కారణాలు ఏవైతేనేం / ఆకలైన వాని గిన్నెలో అన్నం లేనట్టు / నీళ్ళు లేని చెరువు నాకెందుకు."*

**- కందుకూరి శ్రీరాములు**

చెరువు మా పల్లెకు పట్టినంత ఆసర. పొద్దు పొడుపుల్లో, పొద్దు కుంకుడుల్లో ఎగిరే చేపల పులకలు, కట్ట తూము తెరవగానే విడిచిన బడి. బండలపై జారుడు పాటలు సుళ్ళు తిరుగుతూ, పారుతున్న కప్పల ఆనందాలు. కట్టకు ఇటు నీరు అటు పొలాలు. నీరార బోసుకుని ఆవిరయ్యే త్యాగాలు. అడుగున బురదున్నా నవ్వే కమలం పువ్వు. నీటిని పాదరసం చేయడం నేర్పిన రసవిద్య తామరాకు. అంటున్న ఈ కవి -

*"ఎందరికో నేర్పిన ఈతలతో / అడుక్కు దాచుకున్న తరాల ఉప్పి మైలలతో / దుంకించుకున్న కొక్కిరాళ్ళ కప్పలతో - చెరువు / రాత్రుల్లో పెద్దద్దం / పగళ్ళంతా సందడించే జీవనం / వానల్లో / నిండు నవ్వుల తడలు / పగలబడే మత్తళ్ళు / చలుల్లో మంచు బూరు పొగలు / ఎండల్లో ఆవిరయ్యే చెమటలు / పల్లెకు బుచ్చి తీపిసముద్రం / చెరువెండితే? చెరువైన పల్లె గుండె"*

**- రామగిరి శివకుమారశర్మ**

చెరువు తల్లి అమ్మకమైంది. అత్యాశగాళ్ళ దాహానికి బలి అయింది. వరుస కరువుల్తో పల్లె నడక వల్లకాటికి చేరింది. తెగిపోయిన మా రక్త నాళాలను ఎవరు ముళ్ళేస్తారు? చెరువు జాడల్ని కాపాడే అపర భగీరథుడెవరు? అంటూ చెరువు కోల్పోయిన దుఃఖంతో ప్రశ్నిస్తున్న ఈ కవయిత్రి మాటల్లో -

*"చెరువోయమ్మ చెరువు / తల్లిని అమ్ముకునే వాళ్ళే అంతా! / పల్లె గుండెనీ / ఊరూ వాడా ఊపిరినీ / మనిషికీ మట్టికీ / పిట్టకీ పైరుకీ పశువుకీ / దప్పిక తీర్చిన దాహాన్ని / అమాంతంగా మింగేసే / అత్యాశ గాళ్ళే అంతా / కట్టలన్నీ కరిగిపోయినై / పూడిక పెరిగిపోయింది / ఆఖరి నీటి చుక్క కూడా ఆవిరై పోయాక / వరస కరువుల్తో పల్లె నడక వల్ల కాటికేనా / తెగిన రక్త నాళాలని ఎవరు ముళ్ళేస్తారు? / చెరువు జాడల్ని కాపాడే భగీరథుడెవరు"*

**- డా॥ సి. భవానీ దేవి**

ఒకప్పుడు ఇక్కడొక పెద్ద చెరువుండేది. ఇప్పుడు అది జనావాసాల నిలయమైంది. ఇక్కడ అన్నీ ఆకాశాన్నంటే ధరల్లాగా లిఫ్టులు బిగించిన ఎత్తయిన అపార్ట్‌మెంట్లు, తళ తళ మెరిసేకార్లు. ఓహో! ఇది భూతల స్వర్గమా ఇది! అంటూ ఆశ్చర్యపోతున్నాడు ఒకనాటి చెరువు స్మృతుల్ని తలపోసుకుంటున్నాడు ఈ కవి -

*"గతంలో ఈ సీమ ఒక పెద్ద చెరువు / ఇక్కడే నీటి పక్షులు గుంపులు గుంపులుగా ఎగిరేవి / గిజిగాని గూళ్ళు తుమ్మలకు లోలాకుల్లా వేళ్లాడేవి / కట్టమీద పశువులు పాలపుంతలా సాగిపోతుంటే / కెక్కెక్కుమంటూ కముజులు పరుగులు పెట్టేవి / ఆ రోజుల్లో ఈ ఊరికి చెరువే అండ / ఇప్పుడు చెరువును చంపి పట్నం వెలిసింది / కట్టమీది మైసమ్మ కానరావట్లేదు / చాకి రేవు కాడి మడేలయ్య ఆనవాలు లేదు / సెలకలోని బీరన్న, చెట్టు కాడి పీరీలు / ఏ దారి వెతుక్కున్నాయో జాడ తెలియట్లేదు / పర్యావరణమా ఏమిటే నీకీ దైన్యం / ఒంటిపై గంగను పొంగించిన మహిమాన్వితవు / తను వంతా తూట్లుపడి విలవిలలాడుతున్నావు."*

**- దేవి యాదగిరి**

నా శైశవానికి సముద్రంలా భాసించే నా చెరువు ఇదేనా? ఆకాశంలో చుక్కల్లా అక్కడక్కడా అందంగా కన్పించే నా చెరువు ఇదేనా? ఎండకాలంలో తిండి లేక సాయంత్రం దాకా నేను ఈతకొట్టింది ఈ చెరువులోనే. ప్రతి వ్యక్తినీ పలకరించే నేస్తం ఈచెరువేనంటూ చెరువుతో తన బాల్యస్మృతుల్ని మనతో పంచుకొంటున్న ఈ కవి :

*"ఒక యేడు బాగా వర్షాలు కురిసి / చెరువుకు గండి పడినప్పుడు / మా వూరి జనం గుండె చెరువైన సంగతి / ఇప్పటికీ బయటి ప్రపంచానికి తెలువదు / అత్త పెట్టే బాధల్ని / కొత్త కోడలు జీర్ణించుకోలేక / తన దగ్గరికి వచ్చినప్పుడు / తల్లిలా అక్కున చేర్చుకొన్నది ఈ చెరువే / నాన్నా అమ్మా దివంగతులైనప్పుడు / వారి భౌతికకాయాలను అగ్ని కర్పించింది ఈ చెరువు పక్కనే / బతుకమ్మ పండుగనాడు / తలల మీద జ్యోతులు వెలిగించి / ఒక్కొక్క బతుకమ్మను నీళ్ళలోకి వదులుతుంటే / అవి బంగారు మేరువులై సాగిన తీరు / అద్భుతం, మహాద్భుతం / మరి నల్లై ఏండ్ల తర్వా త / నేను చూస్తున్న చెరువు పరిస్థితి ఏమిటి? / నాగరికత పెరిగి ఊరు మీద పడ్డది / ఊరు విరిగి చెరువు మీద పడ్డది".*

**-డా॥ మనస చెన్నప్ప**

ఇవీ మన ఊరి చెరువు జ్ఞాపకాలు. ఈ కవులందరి ఆవేదనలు. అక్షర రూపమైన ఆత్మీయ దుఃఖం. చెరువులతో చెలిమిని పంచుకున్న కవుల కవిత్వ నేపథ్యాలు. కాలువ కొంగును పట్టుకొని దూరాలు సాగిన బాల్య నేపథ్యాలు. వర్తమానంలో చెరువు లేని తమ ఊరిని చూడలేక పోతున్నారు. అమ్మకమైపోతున్న చెరువుతల్లి పట్ల ఆక్రోశాలు. తనువంతా తూట్లు పడి విలవిల్లాడుతున్న దయనీయ దృశ్యాలు. ఈ కవుల కవితల్లో ప్రతి ఫలిస్తున్న శైశవం, బాల్యం, యవ్వనం వివిధ రూపాల్లో చెరువుతో అంటుకట్టిన జీవన వసంతాన్ని మనసారా ఆస్వాదిద్దాంరండి!

*'చెరువోయ్ మా ఊరి చెరువు*

*ఊరి బరువు నంతా మోసే ఏకైక ఆదరువు చెరువోయ్' అంటూ పారవశ్యంతో గానం చేస్తున్న గోరటి వెంకన్న పాటతో కోరస్ కలిపి ఊరిబాట పట్టి సాగిపోదాం రండి!!*


**-డా॥ రాధేయ**



# అమ్మ ఒళ్లో పాలు తాగుతున్న బిడ్డను

**నీతి-నిజాయితీలకు, నిస్వార్థ-నిరాడంబరతలకు, ధైర్య-సాహసాలకు, పరిపక్వత కలిగిన నాయకత్వ లక్షణాలకు నిలువెత్తు రూపంలో నిలిచిన లాల్‌బహదూర్ శాస్త్రి వంటి నాయకులను మనం మరచిపోతున్నాం. ఈ మరపుకు రెండు ప్రధాన విశ్లేషణలు చెప్పుకోవచ్చు. మన ప్రాధాన్యతాక్రమాల్లో మార్పు వచ్చి ఉండాలి లేదా వారిని మరచిపోయేటట్లు చేయకపోతే మన మనుగడ కష్టమని నవతరం నాయకులు భావిస్తూనయినా ఉండాలి. శాస్త్రిగారి వంటి నాయకులను మనం ఇంకా ఎందుకు గుర్తుంచుకోవాలో తెలుసుకోవాలంటే ఆయనకు సంబంధించిన కొన్ని విషయాలు మనం మళ్ళీ..మళ్ళీ మననం చేసుకుంటూనే ఉండాలి.**

అయితే ఏంటట!!!



శాస్త్రి గారు ప్రధానిగా ఉన్న కాలంలో చైనా భారత్‌కు ఒక లేఖ రాస్తూ-"మీ సైనికులు మా చైనా భూభాగంలో కొంత సైనిక సామాగ్రిని ఉంచారు. అది వెంటనే అక్కడినుండి తీసేయకపోతే మా క్రోధాగ్నికి గురి కావలసివస్తుంది" అని హెచ్చరించింది. దానికి తక్షణం స్పందించిన శాస్త్రిగారు...

"మీ ఆరోపణలు అవాస్తవం.చైనా భారత్ మీద దాడిచేస్తే మా స్వేచ్ఛకోసం పోరాడడానికి మేం చాలా గట్టి కృతనిశ్చయంతో ఉన్నాం. సరిహద్దులను కాపాడుకోవాలన్న మా సంకల్పాన్ని మీ బలం నిరుత్సాహపరచలేదు" అని జవాబిచ్చారు.

## ఖబడ్దార్ ! ! !

ప్రధానిగా ఆయనున్నకాలంలోనే అంతర్గతంగా ఆహార సంక్షోభం వంటి పలు సమస్యలతో భారత్ సతమతమవుతున్నది.ఇదే అదనుకొని పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతుంటే ఆయన చూసి చూసి చూసి 1965లో పాక్ మీద యుద్ధం ప్రకటించాడు. ఆ యుద్ధంలో పాక్ తోకముడిచిన తరువాతే పొట్టివాడు మహా గట్టివాడని ప్రపంచదేశాలన్నీ ఆయన ధైర్యసాహసాలను గుర్తించి ప్రశంసించాయి. అయితే తర్వాత పాకిస్థాన్ అభ్యర్థనపై సోవియట్ రష్యా మధ్యవర్తిత్వంలో తాష్కెంట్‌లో సంధి చర్చలు జరిగాయి.

ఆ చర్చల సందర్భంగా "భవిష్యత్‌లో పాకిస్థాన్ ఎప్పుడూ బలప్రయోగానికి దిగనని భారత్‌కు హామీ ఇవ్వాలి" అని ఆయన పట్టుబట్టారు. ఈ చర్చలు ఒక కొలిక్కి రాలేదు. ఆ రాత్రే ఆయన హఠాన్మరణం చెందారు. గుండెనొప్పితో అని అధికారులు ప్రకటించారు. విషమిచ్చారని, భౌతికకాయం తమ దగ్గరకు వచ్చేటప్పటికి నీలంరంగులో ఉందనీ, దర్యాప్తు జరపాలని ఆయన భార్య అప్పుడు, ఆ తరువాత చాలాసార్లు డిమాండ్ చేశారు. ఆ అనుమానపు తెరలు ఇప్పటికీ తొలగలేదు.

ఆయనకు పత్రికా కార్యదర్శిగా పనిచేసిన కులదీప్ నాయర్ సమాచార హక్కుచట్టం ఆధారంగా ఇటీవల అర్జీపెట్టుకుంటే ఆయనకు అందిన సమాధానం...."విదేశీ సంబంధాలకు హాని కలిగిస్తుంది, దేశంలో అవాంఛనీయ సంఘటనలు జరగవచ్చు, పార్లమెంటరీ హక్కులకు భంగం కలుగుతుంది.....అందువల్ల ఆ సమాచారాన్ని ప్రభుత్వం బయటకు వెల్లడించడం కుదరదు."

## సజీవనాదం ! ! !

భారత్-పాక్ యుద్ధం, ఆహార సంక్షోభాల సమయంలో ఆయన ఇచ్చిన నినాదం 'జై జవాన్-జై కిసాన్' ఇప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

## కొంగు పట్టుకొని ! ! !

"నా మతం తర్వాతే నా దేశ భక్తి. ఎందుకంటే..తల్లి ఒంటికి అంటుకుని పాలుతాగుతున్న బిడ్డలాగా భరతమాత కొంగుపట్టుకొని వేలాడుతున్నా. ఆమె నాకవసరమయిన ఆధ్యాత్మిక శక్తినిస్తుంది. నా ఉన్నతాశయాలకు ఆమె స్పందిస్తుంది."

## లెక్క సరిపోయింది ! ! !

తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో మేనమామ ఇంట్లో పెరిగాడు లాల్ బహదూర్. బాల్యంలోనే ఓ రోజున మామతో కలిసి మీర్జాపూర్‌లో నడుచుకుంటూ పోతున్నాడు. మామిడిపళ్ళు అమ్ముకునే వ్యక్తి ఎదురుపడి బేరం దొరకలేదన్న నిరాశతో ఒక అణా ఇస్తే 100 మామిడి పళ్ళిస్తానన్నాడు. మామ అణా తీసిస్తే అతను పళ్ళు లెక్కబెట్టి లాల్ బహదూర్ పట్టుకున్న సంచీలో వేస్తున్నాడు. లెక్క 50కి చేరగానే ఇక చాలు ఆపమన్నాడు లాల్. "మీరు అణా ఇచ్చారు కదా, ఇంకా 50 పళ్లొస్తాయి" అని వ్యాపారి అంటూండగా, మామ కూడా "అదేమిటి, మిగతా 50 కూడా తీసుకోవాలికదా" అని మందలింపుగా సూచించగా..."అతడు నిరాశలో అమ్ముకుంటున్నాడు. దాన్ని అవకాశంగా చేసుకుని మనం లాభపడాలంటే ఎలా ! అయినా మన ఇంటిల్లిపాదికీ ఈ 50 పళ్ళు సరిపోతాయికదా" అని బహదూర్ సమాధానమిచ్చాడు.

## ఇదీ రాజీనామా అంటే ! ! !

నెహ్రూ మంత్రివర్గంలో ఆయన రైల్వే మంత్రిగా ఉండగా ఒక రైలు ప్రమాదం జరిగింది. దానికి నైతిక బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేశారు. నెహ్రూ, ఇతర మంత్రులు ఆయనకు ఎన్నో విధాలుగా నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. కానీ ఆయన తగ్గలేదు. ఆ తర్వాత జరిగిన సాధారణ ఎన్నికలలో గెలిచిన పిదప మాత్రమే మళ్ళీ మంత్రివర్గంలో చేరారు.

## శాస్త్రిగారే కానీ శాస్త్రుల్లవారు కాదు ! ! !

12వ ఏట ఆయన తన పేరు చివరన ఉన్న 'వర్మ' ను తొలగించుకోవాలని పట్టుబట్టాడు. హెడ్‌మాస్టర్ కూడా వద్దే. అయినా చెప్పాడు, అమ్మా చెప్పింది..అయినా కులపట్టింపులు ఇష్టంలేని ఆయన చివరకు తన పంతం నెగ్గించుకున్నాడు. శాస్త్రాలను క్షుణ్ణంగా చదివిన దానికి గుర్తుగా కాశీలో విశ్వవిద్యాలయం వారిచ్చిన పట్టా 'శాస్త్రి'మాత్రం ఆయన పేరులో భాగంగా ఉంచుకున్నారు.

## ఏడడుగులంటే ఇవీ ! ! !

కలవారింటి అమ్మాయి లలితతో వివాహం జరిగింది. పెళ్లయిన వెంటనే ఆమెకు తన మనోగతాన్ని వివరించాడు. మనం మనకంటే తక్కువ స్థాయిలో ఉన్న వాళ్ళ ఆర్థిక స్థితి చూసి జాలిపడాలి, దయచూపాలి. నీవు పట్టుచీరల కంటే ఖాదీ కడితేనే బాగుంటుందని చెప్పాడు....అంతే. ఆమె తన దగ్గరున్న మొత్తం పట్టుచీరలను దానం చేసింది. ఆ తరువాత ఆయన అడుగులో అడుగేస్తూ గృహిణిగానే కాక స్వాతంత్ర్యసమరంలో కూడా పాల్గొన్నది.

భర్త జైలుకెళ్ళాడు. ఇల్లు గడవడం కష్టంగా ఉంది. జైల్లోఉన్న భర్తను చూడ్డానికి వెళితే..'కనీసం రోజుకు ఓ గ్లాసెడు పాలయినా తాగుతుండు' అని ఆయన సలహా ఇచ్చాడు. ఆమె తలూపి వచ్చింది. కానీ అన్ని పాలేవీ ? కానీ భర్తకు మాటిచ్చింది. ఇప్పుడెలా ! పెద్ద గ్లాసుకు బదులు బుజ్జి గ్లాసు తీసుకుని పాలుతాగి, చస్తుల్లో కూడా భర్తకిచ్చిన మాట నిలబెట్టుకున్నది.

-ములుగు రాజేశ్వరరావు

అక్టోబర్ 2 పూర్వపు ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా . . .

చిన్నారిబాలకేర్పన్

# గంప్పాలి పెండ్లాం

– తెలికేపల్లి భానుమూర్తి

**మా ఎదురింట్లో తిర్పతి, మంగమ్మ ఉంటున్నరు. గాళ్లది కడప జిల్లా. గాళ్లకు గీ నడుమనే పెండ్లి అయ్యింది. మంగమ్మ ఉసోళ్ల పిల్ల. దాంతోని గామెకు ఫికరుండేది. గామె మొగని మాట ఇనేది గాదు. గాయిన ఒగటే జెప్పె గామె ఇంకొకటి జేసేది. తిర్పతిని దినాం ఒక్కతీర్గ సతాయించేద్ది. ఈ నడ్మ బంగారం దర అడ్డగోల్గ పెరిగింది. బంగారం దర తక్కువున్నప్పుడు మంగమ్మ నసువు తెయ్యలేదు. గాని గిప్పుడు దర పెర్గగానే రొండు తులాల బంగారి గొల్సు గొనియ్యుమని మొగనికి జెప్పింది.**


"బంగారం దర సితం పెర్గింది. గిప్పుడు నా తాన 'పైసలు లెవ్వు'" అని తిర్పతి అన్నడు.

"గదంత నాకెర్కలేదు. అప్పుజేస్తవో దొంగతనం జేస్తవో ఏదన్న జెయ్యి గాని నాకైతె బంగారి గొల్సు గొనియ్యి" అని మంగమ్మ అన్నది.

పెండ్లాం గట్లనంగనే తిర్పతికి దైస్ అబ్బలేదు. 'బంగారి గొల్సు గొనియ్యి అంటె గాయి గాయి జేస్తది. ఇజ్జత్ దీస్తది. ఏం జేతునో దేవుడో. గసువంటి పెండ్లాంను ఎందుకిచ్చినవురో' అని మనసుల అనుకుంట పెండ్లాంకు గంప్పదఫకుంట నెత్తి గొట్టుకోబట్టిండు. ఆక్లు లేకోబోయింది. గాని నెత్తి మీద గాదికి ఉన్నయి దిందిందికదే. గని యాదికి రాంగనే ఊకుండు. చెక్కలుండదిని గాడు అప్పు అడిగిండు. గని ఎవ్వరు గాదికి అప్పు ఇయ్యలేదు.

ఏం జెయ్యాలె? ఎట్ల సావాలె? ఇంటికి పోతినా అంటె నా పెండ్లాం నా పని జేస్తది. గిది గూడ నీకు తెల్వ గాదా? నువ్వు మొగోనివేనా? పెండ్లాంకు గొల్సు గొనియ్య తాకతోనివి పెండ్లెందుకు జేసుకున్నవు. మా ఇంట్ల వంటి మన్నుకున్నంత బంగారం గూడ నా పెయ్య మీద లేదు. మా తల్లి గారింటికి పోదామంటె సిగ్గైతున్నది అన్నుంట పురానం నడుపుతది. నా బత్కు అద్దెంగ్ జేస్తది. గిట్లని ఎద్సుంటె 'పెండ్లి జేసొక్క పొయ' అని తిర్పతి అనుకోబట్టిండు. వెకే లాస్ట సిగరెట్ మీద సిగరెట్ దాగ బట్టిండు.

రాత్రి పది గొట్టింది. తిర్పతికి ఇంటికి పోబుద్ది గాలేదు. ఆడ సక్కగ బారేకు పోయిండు. మందు గొట్టిండు. అటింకం పాన్ బినుకుంట సాగ్నుర్ కికె గొట్టిండు. పొద్దు జాము దాంగానే పోలీసోల్లు ఆది



సాగ్నుర్ దుకాణముందిన్నరు.

"మందు గొట్టి ఇంటి నడ్మభరి నీ కెర్కలేదా?" అని ఒక పోలీసోడు అడిగిండు.

"ఎర్కే" అని తిర్పతి అన్నడు.

"ఎర్కుండి గూడ పోలీసోల్లు ఏం జేస్తరనుకోని ఇంటి నడ్మతిరా?"

"పుణాలే జైగెందుకు? మీ కింత గావాల్నో జెప్పుండ్రి" అని తిర్పతి అన్నడు.

పోలీసోల్లకు సుఫ్రమయ్యింది. ఆళ్లు తిర్పతిని అడేక్ కవేరికి దీస్కపోయిండ్రు. తెల్లారేదంక గాన్ని అడాయితువు గొండ దోయిండ్రు. తిర్పతికి ఆడ్డే జాగ్రాన పేసింది.

గంతేగాకుంట అన్ని రొండు దినాలు జేల్లనే ఉండుమని జెప్పింది. పోలీసోల్లు అన్ని జేల్ల ఉంచిండ్రు. మొగడు ఇంటికి రాకుంట అబ్బి మంగమ్మ పరేశాన్ గాబట్టింది. గింత దిని గామె టి.వి. మొంగటు గూసున్నది. గని గామెకు టి.వి సూడబుద్ది గాలేదు. దాంతోని గామె టి.వి బంద్ జేసింది. రాత్రి పదకొండు గొట్టినా తిర్పతి ఇంటికి రాలేదు. గీయిన యాడున్నడో, ఎట్లున్నడో అని గామె అనుకోబట్టింది. తెల్లారింది. దినంపూట పదకొండు గొట్టింది. మొగడు ఇంటికి రాకుంట అబ్బి గామె కండ్లల్ల నీళ్లు దిర్గినయి. పరేశాన్లైతె పని గాదని గామె తిర్పతి దోస్తు దీస్కొని సక్కగ అడేక్ కవేరికి బోయింది.

"ఏం గావాలమ్మా – నీ అత్త గారింట్ల అందరు బాగుండ్రా" అని ఎస్.ఐ అడిగిండ్రు.

"అందరు బాగున్నరు సార్"

"అందరు బాగున్నంక అడేక్ కవేర్కి ఎందుకొచ్చినవ్?"

"నిన్న రాత్రి కెల్లి నా మొగడు కండ్లబడ్తలేడు"

"నీ మొగన్ని గిన సతాయించి నవా?"

"లేదు సార్"

"నువ్వు సతాయించకుంటె నీ మొగడు నీకు గూడ జెప్పకుంట యాడ్కో ఎందుకు పోతడు. నిజం జెప్పు. నిజం గిన జెప్పక పోతినా అంటె నిన్ను జేల్ల ఏస్త" అని ఎస్.ఐ. అన్నడు.

గాయిన గట్లనంగనే మంగమ్మకు బుగులైంది.

"సార్ నిన్న, నాకు నా మొగనికి నడ్మ పంచాదైంది" అని గామె అన్నది.

"నీ మొగని పోల్కు ఇయ్యి" అని ఎస్.ఐ అన్నడు. మంగమ్మ మొగని పోల్కు ఎస్.ఐ కిచ్చింది.

"గీడు నీ మొగడా. గాన్ని నువ్వు ఒక్క తీర్గ సతాయిస్తున్నవు పట గదా" అని ఎస్.ఐ అడిగిండు. "నేనేం సతాయించిన. రొండు తులాల బంగారి గొల్సు గొనియ్యి మన్న" అని మంగమ్మ అన్నది.

"నీ తెల్వకు నీ మొగడు మందు గొట్టి సాగ్నుర్ మీదొస్తుంటె పట్టుకున్నం. అడాయిత్ గొండ పోతే రొండు దినాలు జేల్ల ఉండుమన్నరు. గాడు గూడ నీ మొగన్ని సుకూర్గ ఉండనియ్యి" అని ఎస్.ఐ. అన్నాడు.

☆

# సాహితీ విన్యాసాలు- 13

కవులేం చేస్తారు?
అక్షరాలకు ఆక్సిజన్ ఇస్తారు.
భావాలకు 'మేకప్' వేస్తారు.
మెదడుకి పదును పెడతారు.
హృదయానికి ఉల్లాసాన్నిస్తారు.
ఇన్నిటికీ మూల కారణం 'అక్షర క్రీడ'!
దీని కోసం కవులేం చేస్తారు?
అక్షరాలతో చెడుగుడు ఆడుకుంటారు.
పదాలతో కబడ్డీ ఆడుకుంటారు.
ఒక్కొక్కసారి 'కాయ్ రాజా కాయ్' లాగా గమ్మత్తులూ చేస్తారు.
అవేమిటో తెలుసుకుందామా...?

# కవుల అక్షర క్రీడలు

*సప్తకము గల దిక్పతి*
*సప్తకము వేలుడ్డ సప్తక ప్రభవా*
*సప్తకమునకు రిపుని*
*సప్తకమునైన నేను సాధుని పిలిచెన్*

ఇందులో సప్తక పదాన్ని మళ్ళీ మళ్ళీ వాడి చమత్కారం ప్రదర్శించారు. ఇది మామూలు విషయం కాదు. ఇందులో కవి ప్రతిభతో పాటు తెలుగుభాష ప్రౌఢిమనూ వుంది. అభిమన్యుడు పద్మవ్యూహాన్ని ఛేదించడానికి యుద్ధరంగానికి వెళ్తున్న సందర్భంలో - అతని భార్య ఉత్తర వీర తిలకం దిద్దుతోంది. అదీ విషయం-

సప్తకముగల దిక్పతి - అంటే పేరులో సప్తకం గల 'ఉత్తర'
సప్తకము వేలుడ్డ - అంటే 'భరితను' వేలిలో పట్టుకొని
సప్తక ప్రభవా-సప్తకాలకు ప్రభవమైన చంద్రుని వంశంలో పుట్టిన అభిమన్యుని
సప్తకమునకు రిపుని - ఒక 'మూలకు' రిపుని
సప్తకమునైన నేను - 'పార్థ' మనుమ అతని మీద నేను
సాధుని పిలిచెన్ - భర్తను పిలిచింది.

శ్లేషను పరిజ్ఞానాన్ని ఎంత సమయస్ఫూర్తితో వాడుకున్నాడో-ఒక అజ్ఞాత కవి!






మరొక అక్షర క్రీడా పద్యం కూడా అజ్ఞాత కవిదే! దీనిని చాలా మంది వల్లెవేస్తుంటారు. తమ పేరును చాటుగానే ఉంచుకున్న మహనీయులు వారు!

*మా పని నీ పనిగాదా*
*పాపము మా పాప గాని పని నీ పనిగా*
*నీ పని బాధని పని గదా*
*పాపని మాని మాని పని గానిమ్మా'*

కవికి ఛందశ్శాస్త్ర పరిజ్ఞానం ఉన్నప్పుడే ఇటువంటి అపూర్వ ప్రయోగాలు చేయగలడు. సంగీతంలో గల సప్తస్వరాల్ని 'స-రి-గ-మ-ప-ద-ని' ప్రయోగించి చమత్కరించడం గమనిస్తాం. సంగీత జ్ఞానంతో ప్రావీణ్యం తార్కాణం సహజం కాబట్టి కవి కూడా అలాగే ప్రయోగించాడు.

జాగ్రత్తగా చదివితే... భావం తెలుస్తుంది. గొప్ప భావమేమీ కాదు గానీ సప్తస్వరాలను వాడి భావం చెప్పడమే గొప్ప.

*'అలిగొల్లక ముప్పు వానయ్య మొగని*
*నందు లోపల నున్న వాడప్పునని*
*నప్పగాడని చెరప వానయ్య నపతి*
*నిచట మీతప్పు నెవ్వరు కనుల లేద'*

ఇది సంకేతార్థంతో, చమత్కార ధోరణిలో, ఉత్పలతో రాయబడిన పద్యం. సూటిగా చెప్పకుండా మరొక విధంగా చెప్పడాన్ని సాహిత్యంలో 'అన్యాపదేశ' (ఇన్ డైరెక్టుగా) అంటారు. ఇది తెలుగు పద్య వైభవానికి మచ్చు తునక.

అలిగొల్లకమున్నవాడు - శేషుడు
అతని అమ్మ -గంగా దేవి
ఆమె మగడు - సముద్రుడు
అందులోపల నున్న వాడు -మైనాకుడు (అనే పర్వతం)
అతని అక్క - మగడు - హిమవత్పుత్రుడు, శివుడు
అతనిని నమ్మినవాడు - రావణాసురుడు (శివ భక్తుడు గదా)
వానిని చెరచినది - పతిని జేసినది, సీత
దానమ్మ -భూ దేవి
ఆమెకు సవతి - లక్ష్మీ దేవి.

ఇటువంటి లక్ష్మీదేవి మీకు దయతో సంపదలు ఇవ్వుగాక అనేది ఆశీస్సు! ఈ ఆశీస్సును అర్థం చేసుకోవాలంటే శబ్ద పరిజ్ఞానం, పురాణ పరిజ్ఞానం ఉండాలి.

**కొసమెరుపు** : మాటలు తీరులో తికమకలనూరా ఉంటాయి. కలవు తనమూ ఉంటుంది. అప్పటికీ ఆకర్షించే హాస్యమూ అవసరం. ఒకసారి శ్రీశ్రీని పిలిచి ఒక సంస్థ వారు సన్మానం చేశారు. సన్మానం అయిన తర్వాత శ్రీశ్రీ మాట్లాడుతూ -"ఈ సంస్థ వారు నాకు బాగా సన్మానం చేశారు. సంతోషం. ఈ సంస్థ దిన దినాభివృద్ధి చెందాలని కోరుకోవడం లేదు. అని కాసేపు ఆగారు. సభలో కలకలం. ఇలా అంటారేమిటి? అని ఆశ్చర్యం!


వెంటనే శ్రీశ్రీ 'ఈ సంస్థ క్షణక్షణాభివృద్ధి చెందాలని కోరుకుంటున్నా' అన్నారు. (ఇక చప్పట్లే చప్పట్లు!)

- డా॥ ద్వా.నా. శాస్త్రి











# దసరా సందడి . . .









తెలుగులో మార్గదేశి కవితాభేదాలు ఉన్న విషయం మనకు తెలిసిందే.

వస్తువులోను, ఛందస్సులోను, పదజాలంలోను మార్గకవిత్వం సంస్కృత సంప్రదాయాన్ని అనుసరిస్తుంది. దేశికవిత్వం పైఅంశాల్లో సంస్కృతమార్గాన్ని అనుసరించక దేశీయలక్షణాలతో కూడి ఉంటుంది.



# అన్నమయ్య పలుకుల ఒంపుసొంపులు

తెలుగులో ఆదికవియైన నన్నయ మార్గ కవిత్వంలోనే మహాభారత రచనచేయడంవల్ల తరువాతి తెలుగుకవులు ఎక్కువగా మార్గకవితపైనే మొగ్గుచూపినారని భావించవచ్చు. మార్గకవిత్వంలో సంస్కృత బాహుళ్యాన్ని, దీర్ఘసమాసరచనను గమనించవచ్చు.

తిక్కన పదప్రయోగవిషయంలోమాత్రం సంస్కృతప్రభావానికి లోనుగాక మహాభారత రచనలో దేశ్యపదజాలాన్నే ఎక్కువపాళ్లలో వాడి దేశిలక్షణాన్ని పాటించినట్లుగా చెప్పవచ్చు. భాషలో అంతకుముందు వ్యవహారంలో స్థిరపడి ఉన్న దేశ్యపదజాలాన్ని వాడడమే కాక కొన్నిసంస్కృతశబ్దాలకు దేశ్యశబ్దాలను స్వయంగా సృష్టించుకొని వాడడం కూడా కనిపిస్తుంది.

అంటే సంస్కృత శబ్దాలనే ఎందుకు వాడాలి? వాటిని దేశ్యశబ్దాలుగా భాషాంతరీకరించి ఎందుకు వాడుకోగూడదు? అంతకుముందు కవులు దేశ్యశబ్దాల నెన్నింటినో సంస్కృతీకరించుకొని వాడుకోలేదా? ఆ విధంగానే సంస్కృత శబ్దాలను అచ్చతెలుగు శబ్దాలుగా మార్చుకొని వాడుకుంటే తప్పేమిటి? అన్న భావన తిక్కనకు కలిగి ఉంటుంది.

అందుకే అతడు స్వాగతం, న్యాయదృష్టి, పద్మవ్యూహం, రక్తసంబంధం, జీవచ్ఛవం, దేశకాలాలు మొదలైన సంస్కృతశబ్దాలను క్రమంగా మేలురాక, నెఱి గుఱి, తమ్మిమొగ్గరం, నెత్తురుపొత్తు, నేలప్రొద్దులు ఇత్యాదిగా అచ్చ తెలుగు శబ్దాలుగా వాడడం కనిపిస్తుంది. ఆ తరువాత పదకవుల కూడా తమ రచనల్లో అచ్చతెలుగుకే పట్టంకట్టి దేశిపదాలను రాసిపోసినారు. 15, 16 శతాబ్దుల్లో వెలసిన తాళ్లపాక కవులు వేలకొద్దీ సంకీర్తనలు రచించి, వాటిలో 'దేశి' తనాన్ని పుష్కలంగా పోషించి తెలుగుభాషకూ, సాహిత్యానికీ ఎంతో సేవ చేసినారు.

వీరిలో అన్నమాచార్యులు ప్రముఖులు.

అన్నమయ్య భాషాప్రయోగంలో అచ్చటమైన అచ్చ తెలుగు పదజాలపుసొంపు తొణికిసలాడుతుంది. ఆయనకు అచ్చతెలుగు పదాల ప్రయోగంపై ఎంత అభిమాన మంటే వాడుకలో అతిప్రచుర్యంగా వాడుకునే సంస్కృతపదాలకు కూడా ఆయన అచ్చ తెలుగు పదాలనే వాడినట్లుగా మనం గమనించవచ్చు. ఉదాహరణకు మనం పాయసం, క్షీరాన్నం అనే పదాలను సర్వసాధారణంగా వాడతాం. ఇవి సంస్కృతపదాలు. పాయసం అన్నది పయస్ శబ్దంపై అణ్‌ప్రత్యయంరాగా ఏర్పడ్డ తద్ధితాంతపదం.

అన్నమయ్య ఈ పదాలను వాడక 'పాలకూడు' (పాలతో చేసిన అన్నం) అనే పదాన్ని వాడాడు. ఒకచోట కాదు, అనేక పర్యాయాలు వాడాడు. దీన్నిబట్టి ప్రసిద్ధమైన సంస్కృత పదం ఉన్నా ఆయన అచ్చతెలుగు పదాలను వాడడానికే ఇష్టపడ్డాడని భావించవచ్చు. అన్నమయ్య వాడిన ఇలాంటి పదాలను గూర్చి ఈ వ్యాసకర్త తన 'అన్నమయ్య భాషావైభవం' (2006) అన్న వ్యాస సంకలనంలో 'అన్నమయ్య వాడినకొన్ని దేశ్యశబ్దాలు' అన్న వ్యాసం (27-34 పుటలు) లో వివరించడం జరిగింది. ప్రస్తుత వ్యాసంలో మరికొన్ని శబ్దాలను గురించి తెలుసుకుందాం.

అన్నమయ్య తన సంకీర్తనల్లో వాడిన అచ్చ తెలుగు పదాలు, వాటికి ఎదురుగా వ్యవహారంలో ఉన్న ప్రసిద్ధ సంస్కృత పర్యాయాలు దిగువ ఇవ్వబడ్డాయి. వీటిని పరిశీలిస్తే సంస్కృతపదాలకు బదులుగా అన్నమయ్య అచ్చతెలుగుపదాల ప్రయోగంలోనే చూపిన ఆసక్తిని మనం గమనించవచ్చు.

అంచపునడపులది- హంసగమన
అడిబంటు-పాదసేవకుడు
అడి కోలుమాటలు-నిందావాక్యములు
ఉసురుసూరుపు-ప్రాణవాయువు
ఎగ్గుదప్పులు-గుణదోషాలు
ఏనుగునడపుది-గజగమన
కప్పుమొయిలు-నీలమేఘము
కమలపుటింతి-కమలజ
కుదురువంటి కైదువ-చక్రాయుధము
కూసెట్టుసదువుల కొనలు-ఉపనిషత్తులు
చనవరివారు-స్నేహితులు
చింకచూపులాడి- సౌందర్యవతి
చిగురుమోతలాడు-కోకిల
చీరపసపువాడు-పీతాంబరుడు
చుట్టుకైదువ- చక్రాయుధం
తమ్మిమోము -పద్మముఖము
తమ్మిలోని మగువ-కమలజ, పద్మజ
నసువుచేతలు-ప్రేమచేష్టలు
నిచ్చకొత్తలు-నిత్యనూతనాలు
నిచ్చభోనాలు - నిత్యభోజనాలు
నీరుబుగ్గ-బుద్బుదము
పసపు జీరవాడు-పీతాంబరుడు
పేసినవాడు-పాముపడకవాడు,
పాయపుబడుచులు - యువతులు
పొంచులు-రహస్యాలు
పూసగొండి-కలహశీలుడు
బంటుబంటు-దాసానుదాసుడు
బొడ్డుపూవకొడుకు-కమలజుడు (బ్రహ్మ)
సలుపు-బాధ
నీకటి మైవాడు-నీలదేహుడు
సూదిరాయి -అయస్కాంతము

పై ఉదాహరణలను పరిశీలించినపుడు అన్నమయ్యకు అచ్చతెలుగుపై ఎంతమమకారమో అర్థమౌతుంది. అన్నమయ్యనకాలంలో వచ్చిన ప్రబంధ సాహిత్యాన్ని పరిశీలిస్తే భాషా విషయకంగా అన్నమయ్య ఎంత విప్లవం తెచ్చినాడో ఆశ్చర్యం కలుగుతుంది. ప్రబంధాల్లో, ఇతర కావ్యవాఙ్మయంలో స్త్రీవాచక పదాలుగా చాలావరకు సంస్కృతపదాలే ప్రయుక్తమై కనిపిస్తాయి.

అన్నమయ్య కూడా స్త్రీవాచక పదాలుగా కొన్నిసంస్కృతపదాలను వాడినా అచ్చతెలుగుపదాలే అధికంగా ప్రయోగింపబడ్డాయి. ఈ వ్యాసకర్త పరిశీలనలో సుమారు నూరుఅచ్చతెలుగు పదాలు స్త్రీవాచక పదాలుగా ప్రయుక్తమై కనిపిస్తున్నాయంటే అన్నమయ్య అచ్చతెనుగు అభిమానం ఎంత ప్రశంసనీయమో మనం గమనించవచ్చు.

భాషావేత్తలు ప్రత్యేకదృష్టితో అన్నమయ్య అచ్చతెనుగు ప్రయోగాలపై పరిశోధన చేసి, నూత్నాంశాలను వెలికితీయాల్సిందిగా కోరుతున్నాను.

- *ఆచార్య రవ్వా శ్రీహరి*
*పూర్వ-ఉపాధ్యక్షులు, ద్రవిడ విశ్వవిద్యాలయం*

**రంగారెడ్డి జిల్లాలో సి.ఎం.**



రంగారెడ్డి జిల్లాలో రూ. 183 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి సెప్టెంబర్ 22న శంకుస్థాపనలు చేశారు.

40.5 ఎకరాలలో రూ. 3 కోట్ల వ్యయంతో ముళ్ళకత్తువ చెరువు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చెరువును కాపాడాలనీ, మురుగునీరును, ఇతర జలాలను మళ్ళించాలని నిర్ణయించారు.

# రూ. 183 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

రూ. 15 కోట్లతో మియాపూర్ నుంచి ఎల్లమ్మబండ వరకు లింకు రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. జాతీయ రహదారి-9కు సమాంతరంగా అభివృద్ధి చేస్తున్న ఈ లింకు రోడ్డు నిర్మాణం ద్వారా ట్రాఫిక్ సుల భమవుతుంది. అదే విధంగా హుడా కాలనీలోని చందానగర్ నుంచి హఫీజ్‌పేట్ ఫ్లై ఓవర్‌కు రూ. 16.43 కోట్లతో రహదారుల విస్తరణ పనులకు సి.ఎం. శంకుస్థాపన చేశారు.

హైటెక్ సిటీకి అతిదగ్గరగా వుండే శేరిలింగంపల్లి-హఫీజ్‌పేట్ మధ్యన ప్రధాన లింకు రోడ్డు, చందానగర్ ఎం.ఎం.టి.ఎస్., రైల్వే స్టేషన్‌కు లింక్‌గా ఏర్పడుతుంది.

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు నుంచి హైటెక్ సిటీకి రూ. 3.20 కోట్లతో నిర్మించనున్న సర్వీసు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. మూసాపేటలోని ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ఈ సర్వీసు రోడ్డు దోహదపడుతుంది.

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సంస్థ కోసం రాష్ట్ర ప్రభుత్వం 20 ఎకరాలు కేటాయించింది. దీనికోసం రూ. 145 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుంది. ఈ సంస్థలో 2013-14లో 9 వేల మంది పట్టణాభివృద్ధి సంస్థల సిబ్బందికి, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విపత్తుల నిర్వహణపై శిక్షణ ఇస్తారు.

ఈ కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి శ్రీ సర్వే సత్యనారాయణ, రాష్ట్ర మంత్రులు శ్రీ మహీధర్ రెడ్డి, శ్రీ శ్రీధర్ బాబు, శ్రీ ముఖేష్ గౌడ్, శ్రీ ప్రసాద్ కుమార్, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. ★

**జిల్లాల నుంచి...**

# బీడు భూముల్లో సిరుల పంటలు

అది గత పదిహేను సంవత్సరాలుగా వృథాగా ఉన్న బంజరు భూమి. ప్రభుత్వం తమకు పంపిణీ చేసిన భూమి కళ్లెదుటే ఉన్నా దాన్ని బాగు చేసుకోలేని, పంటలు పండించలేని దయనీయ పరిస్థితి లబ్ధిదారులది. ఇటువంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'ఇందిర జలప్రభ పథకం' ఆ భూమి రూపు రేఖలనే మార్చి వేసింది.

జగిత్యాల డివిజన్ రాయికల్ మండలం ధర్మాజీపేట్ గ్రామంలో నెరెళ్ల లింగమ్మ, ఎర్రం సత్తెమ్మ, సావన్ పల్లి రాజు, మోరంపల్లి లక్ష్మీ, మోతె వెంకమ్మ కోరేపు రాజు, కండ్లపల్లి గంగనర్సు, నేరెళ్ల చిన్నలక్ష్మీ, బెక్కం లక్ష్మీ అనే ఎస్సీలకు ఒక్కొక్కరికి 19 గుంటల చొప్పున 4.35 ఎకరాల భూమి ప్రభుత్వం పంపిణీ చేసింది. అలాగే అజ్మీర కమలా, లావుడ్య దేవి, భూక్యా రజిలి, గుగులావత్ గౌరి, గుగులావత్ పద్మ, అంగాత్ చిలుకమ్మ, అంగాత్ మధవి, గుగులావత్ రాజవ్వ, గుగులావత్ రుక్మా అనే ఎస్టీలకు 5.09 ఎకరాలు, మొత్తం 10.04 ఎకరాల బంజరు భూమిని ప్రభుత్వం గతంలో పంపిణీ చేసింది. కానీ దాన్ని సాగు చేసుకునే స్తోమత వారికి లేకపోవటంతో అది ఇంతకాలం బీడుగా ఉండిపోయింది. ఈ పరిస్థితిలో ప్రారంభమైన 'ఇందిర జలప్రభ' పథకం వారికి అండగా నిలబడింది.

'ఇందిర జలప్రభ' పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీల భూములలో ప్రభుత్వం బావులు తవ్విస్తున్నట్లు తెలుసుకుని ధర్మాజీపేటకు చెందిన ఈ దళితులు, ఎస్టీలు భూమిలో బావి త్రవ్వుకొని, ఆ భూమిలో వరి, పసుపు, నువ్వులు, పత్తి, మిరప పంటలు సాగుచేస్తున్నారు. గత సంవత్సరం 12 క్వింటాళ్ల పసుపు పంట పండించారు. ప్రతి ఒక్కరికి పంటకు ఖర్చులు పోగా రూ. 10 వేలు లాభం చేకూరింది.



"ప్రస్తుతం వరి, నువ్వులు, మిర్చి సాగుచేస్తున్నాం. పనికిరావని భావించిన బీడు భూముల్లో పంటలు పండటంతో, మా కష్టాలు ఈ నాటికి తీరిపోయాయి" అంటున్నారు భూక్యా రజిలి, అంగాత్ చిలుకమ్మలు.

"ప్రభుత్వం మా బీడు భూములను పంట భూములుగా అభివృద్ధి చేసుకోవడానికి, బావి త్రవ్వించడానికి రూ. 52,406 లు, మోటారు, పంపుసెట్‌కు రూ. 35,060, విద్యుచ్ఛక్తి అందించేందుకు మొత్తం రూ. 4,45,131 ఖర్చు చేసింది" అని లబ్ధిదారులు తెలిపారు.

ప్రభుత్వం తాజాగా ఎస్.సి., ఎస్టీ ఉప ప్రణాళికకు చట్టబద్ధత కల్పించడంతో మరెంతోమంది దళిత, గిరిజన కుటుంబాలు బాగుపడనున్నాయి.

– *అబ్దుల్ కలీమ్*, జగిత్యాల



**కేంద్రంలోని యు.పి.ఎ. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'భూసేకరణ, పునరావాస కల్పన, పునఃపరిష్కార బిల్లు -2013' (ది లాండ్ అక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్ మెంట్ బిల్) ను ఆగస్టు 29వ తేదీన లోక్‌సభ ఆమోదించింది.**

# 120 ఏళ్ల తర్వాత కొత్త భూసేకరణ బిల్లు

దీనితో 1894 లో అప్పటి బ్రిటీషు పాలకుల హయాంలో రూపొందించిన... అంటే 120 సంవత్సరాల పురాతన భూసేకరణ చట్టానికి కాలం తీరినట్లయ్యింది.

వాస్తవానికి 2011 లో యు.పి.ఎ. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లులోని అంశాలను తొలుత పార్లమెంటరీ పానెల్ క్షుణ్ణంగా పరిశీలించి, 2012 మేలో ఒక నివేదిక సమర్పించింది.

పారదర్శకంగా, న్యాయబద్ధంగా బలవంతపు భూసేకరణను నిరోధించి, భూములు కోల్పోయిన వారికి తగిన నష్ట పరిహారం / పునః పరిష్కారం అందించాలన్న ముఖ్యోద్దేశంతో నూతనంగా ఈ బిల్లును రూపొందించడమైంది.

ప్రజా ప్రయోజనాల కోసం అంటే గనుల తవ్వకాలకు, మౌలిక వసతుల అభివృద్ధికీ, రక్షణ అవసరాలు, మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు, పోర్టులు, రోడ్లు, రైల్వేలు, హైవేల నిర్మాణానికి, ప్రభుత్వరంగ సంస్థల ప్రాజెక్టుల స్థాపనలో నిర్వాసితులయ్యే వారికి - వివిధ పథకాల కింద పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని భూముల్లేని పేదలకు గృహ సముదాయాల నిర్మాణానికి ఇతరత్రా అవసరాలకు భూమి సేకరించవచ్చని ఈ బిల్లు నిర్వచిస్తోంది. భూసేకరణ ప్రక్రియలో ప్రయివేటు ప్రాజెక్టుల కోసం 80 శాతం భూ యజమానుల సమ్మతి ఉండాలి. ప్రయివేటు, ప్రభుత్వ భాగస్వామ్యంలోని ప్రాజెక్టుల కోసం 70 శాతం మేరకు యజమానులు సమ్మతించాలి.

2011 సెప్టెంబర్ 5వ తేదీ తర్వాత ఎవరైనా కొన్న భూమిని సేకరిస్తే ఆ భూమిపై నష్టపరిహారంలో నలభై శాతం వాస్తవ యజమానికి చెందుతుంది. అంతేకాక, భూమిని అమ్ముకోకుండా కౌలు (లీజు) కిచ్చే హక్కు కూడా యజమానికుందని చట్టం సూచిస్తోంది.

భూములు కోల్పోయిన వారు తాము పొందే నష్టపరిహారానికి సంబంధించి ఆదాయపుపన్ను, స్టాంపు రుసుముల నుంచి మినహాయింపు ఉంటుంది. సేకరించిన భూమిలో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యకలాపాలలో బాధిత కుటుంబాల వారికి సైతం భాగస్వామ్యం కల్పించడం జరుగుతుంది.

వక్ఫ్ భూముల సేకరణ ఉండదని సూచించే ఈ బిల్లులోని ముఖ్యాంశాలకు భంగం కలగని రీతిలో రాష్ట్ర ప్రభుత్వాలు సొంతంగా భూసేకరణ చట్టాలను రూపొందించుకోవచ్చు. భూసేకరణ, కొనుగోళ్ల బాధితులలో ఎస్సీ, ఎస్టీలంటే ఆయా వర్గాల వారికి రూ. యాభై వేల నష్టపరిహారం అందజేయడం జరుగుతుంది. జిల్లా వెలుపల నిర్వాసితులు పునరావాస కల్పన చేయాల్సి వస్తే అదనంగా 25 శాతం పునరావాస, పునఃపరిష్కార లబ్ధిపొందే వీలుంది.

★

# ఉద్యోగుల పెన్షన్ బిల్లుకు చట్టబద్ధత

**ఉద్యోగుల ఆదాయం, పొదుపు చర్యలపై భద్రత కల్పించాలన్న ఉద్దేశ్యంతో రూపొందించిన పెన్షన్ నిధి నియంత్రణ, అభివృద్ధి బిల్లు -2011 (పి.ఎఫ్.ఆర్.డి.ఎ) ను సెప్టెంబర్ 4వ లోక్‌సభ ఆమోదించింది.**

ఈ బిల్లుతో పెన్షన్ రంగంలో 26 శాతం మేరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్.డి.ఐ)లను అనుమతించేందుకు మార్గం సుగమమైంది. పైగా ఉద్యోగుల పెన్షన్ నిధిని చట్టబద్ధం కాని సంస్థలు వినియోగించటానికి వీలుండదు. చందాదారు వ్యక్తిగతంగా పెన్షన్ ఖాతాను కలిగి ఉండాలని ఈ బిల్లు నిర్దేశిస్తోంది.

నిజానికి పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పి.ఎఫ్. ఆర్.డి.ఎ) 2003లో ఏర్పాటైంది. 2004లో నూతన పెన్షన్ విధానం (ఎన్.పి.ఎస్) అమలులోకి వచ్చింది. 2011లో ప్రవేశపెట్టిన పి.ఎఫ్.ఆర్.డి.ఎ. బిల్లును ప్రస్తుతం లోక్‌సభ ఆమోదించడంతో చట్టబద్ధత కలిగినట్లయ్యింది.

2004 జనవరి ఒకటో తేదీ నుంచి కేంద్రప్రభుత్వ సర్వీసులో చేరిన ఉద్యోగులు (సాయుధ బలగాలు మినహా) ఈ కొత్త విధానంలో విధిగా చేరాలని బిల్లు సూచిస్తోంది. సభ్యత్వం కలిగిన వారికి కొన్ని ప్రత్యేక సందర్భాల్లో పెన్షన్ నిధిని వాపసు తీసుకునేందుకు, ఇన్సెంటివ్ పొందేందుకు వీలు కల్పిస్తుంది.

కొత్త పెన్షన్ విధానంలో చేరే ఉద్యోగులు దీర్ఘకాలం తర్వాత అనేక ప్రయోజనాలు పొందవచ్చు. ముఖ్యంగా ఆదాయంతో పాటు పొదుపు చర్యలు పాటిస్తూ పదవీ విరమణ సమయంలో క్రమం తప్పకుండా ఆదాయం పొందే వెసులుబాటు ఈ పి.ఎఫ్.ఆర్.డి.బిల్లు కల్పిస్తుంది. చందాదారులుగా చేరిన ఉద్యోగులు తమ పెన్షన్ నిధిని పెట్టుబడి నిల్వగానో, సెక్యూరిటీ బాండ్ల రూపంలోనో మలచుకునేందుకు ఈ బిల్లు దోహదపడుతుంది.

ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ చిదంబరం మాట్లాడుతూ, స్థాయి సంఘం (స్టాండింగ్ కమిటీ) చేసిన సిఫారసుల్లో ఒక సిఫారసు మినహా తక్కినవన్నీ కేంద్ర ప్రభుత్వ ఆమోదం పొందాయని చెప్పారు.

★





# రావిర్యాలలో ఆగాఖాన్ అకాడమీ

**రం**గారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన ఆగాఖాన్ అకాడమీని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పళ్లం రాజు ప్రిన్స్ ఆగాఖాన్‌లతో కలిసి ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సెప్టెంబర్ 20వ తేదీన లాంఛనంగా ప్రారంభించారు.

దీన్ని పురస్కరించుకుని సి.ఎం. శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "విద్యార్థులు జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలి. అప్పుడే చదివిన చదువుకు సార్థకత కలుగుతుంది. ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆగాఖాన్ అకాడమీ నాణ్యతతో కూడిన విద్యబోధిస్తోంది. అలాంటి ఉత్తమ విద్యా సంస్థను మన రాష్ట్రంలో నెల కొల్పడం అభినందనీయం" అన్నారు.

కేంద్ర మంత్రి శ్రీ పళ్ళంరాజు మాట్లాడుతూ, "ప్రభుత్వం ప్రయివేట్ భాగస్వామ్యంతో దేశంలోని విలువైన, పురాతన కట్టడాల పరిరక్షణకు అకాడమీ పలు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది" అని తెలిపారు.

ప్రిన్స్ షాకరీం అల్ హుస్సేనీ అలియాస్ ఆగాఖాన్ మాట్లాడుతూ, "మా విద్యాసంస్థలకు విశాల మైన స్థలాన్ని కేటాయించి, ఆసియాలో విస్తరించి ఉన్న మా విద్యా సంస్థలతో అనుసంధానించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవకాశం కల్పించింది" అని అన్నారు.

మాజీ మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి, ఆగాఖాన్ అకాడమీ డైరెక్టర్ శ్రీ సలీం భాటియా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ బి. శ్రీధర్, తదితరులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

# వీధివ్యాపారులకు అభయహస్తం!

**మ**నుపెన్నడూ లేని రీతిలో కేంద్రంలోని యు.పి.ఎ. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీధి వ్యాపారుల బిల్లు –2012ను లోక్‌సభ సెప్టెంబర్ 9వ తేదీన ఏకగ్రీవంగా ఆమోదించింది.

వీధివ్యాపారులకు రక్షణ, భద్రత కల్పించే ఈ బిల్లు వల్ల వ్యాపార జోన్లను గుర్తించేందుకు, చాలాకాలంగా ఉన్న వ్యాపార కూడళ్లను ఇక నుంచి మార్కెట్ ప్రదేశాలుగా కొనసాగించేందుకు ఉద్దేశించి రూపొందించడమైంది. ఎవరైనా వీధి వ్యాపారం చేయాలని నిర్ణయించుకుంటే అలాంటి వారు విధిగా తమ పేరును పట్టణ వ్యాపార కమిటీ (టి.వి.సి)లో తప్పక రిజిస్టరు చేయించుకోవాలి. ఆ వ్యాపారి తర్వాత వ్యాపార ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే ఆ సర్టిఫికెట్‌ను మంజూరు చేయడం జరుగుతుంది. ఈ ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్న వ్యాపారులను అధికారులు తొలగించటానికి వీలు లేదు.

వీధి వ్యాపారుల కోసం రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థలు, ప్లానింగ్ అధికారులతో సంప్రదించి ప్రతీ అయిదేళ్లకు ఒకసారి కొత్త ప్రణాళికను రూపొందించవచ్చు. స్థానిక పోలీసులు, మున్సిపల్ అధికారుల వేధింపుల నుంచి వీధి వ్యాపారులకు రక్షణ కల్పిస్తుంది.

రైల్వేస్‌కు సంబంధించిన స్థలాలు, ప్రాంగణాలు, రైళ్లలో వీధి వ్యాపారాలు చేయరాదని ఈ బిల్లు సూచిస్తోంది.

# పాత పద్ధతిలోనే ధాన్యం లెవీ సేకరణ

**రా**ష్ట్ర సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 23,24 తేదీల్లో ఢిల్లీలో పర్యటించిన ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి రాష్ట్ర రైతాంగానికి మేలైన విధానాలు అమలు జరిగేలా కేంద్రప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు పొందారు.

కేంద్రమంత్రి శ్రీ థామస్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో కొత్త లెవీ విధానం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారనీ, రైసు మిల్లుల యాజమాన్యాలు రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయనీ ఆవేదన వెలిబుచ్చారు. బియ్యం లెవీ సేకరణ 25 శాతానికే పరిమితం చేస్తే వారు బాగా నష్టపోతారనీ, మరో నెలరోజుల్లో పంట చేతికి రానున్నందున లెవీ విధానంలో మార్పులు తేవాలని సి.ఎం. కేంద్రమంత్రికి సూచించారు.

పాత విధానంలోనే మళ్ళీ లెవీ సేకరణ జరగాలని సి.ఎం. కోరగా... కేంద్రమంత్రి శ్రీ థామస్ అంగీకరిస్తూ 75 శాతం లెవీ సేకరణ, 25 శాతం నాన్‌లెవీ కింద ధాన్యం సేకరణ జరుగుతుందని సి.ఎం.కి హామీ ఇచ్చారు. అలాగే పామాయిల్‌పై ఇస్తున్న 15 రూపాయల సబ్సిడీని కొనసాగిస్తామని కేంద్రమంత్రి సి.ఎం.కు వివరించారు.

కేంద్రమంత్రితో సమావేశమైన సి.ఎం.తో పాటు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ డి. శ్రీధర్‌బాబు కూడా ఉన్నారు.

సినిమా(య)

# చివరి రోజుల్లో...

# ఆ 'రాకుమారి' గోడ కూలి చనిపోయింది!

**ఆమె రాకుమారి, సౌందర్యరాశి కాకపోయినా, మహారాజుగారి పుత్రి. కనక, అందగత్తె. ఆమె కోసం, వాళ్లతోటలో పనిచేసేవాడు ఆమె మీద ఆశపడ్డాడు. సాక్షాత్తు మేనమామ అయిన వాడు ఇంట్లోనే తిరుగుతున్నాడు. రాణిగారి తమ్ముడినని చెప్పుకుంటూ, అతనూ రాకుమారి మీద మనసు పారేసుకున్నాడు.**

**అంతేనా? మాయలు, మంత్రాలు తెలిసిన నేపాళం మాంత్రికుడికీ ఆ రాజకుమార్తె కావలసివచ్చింది. ఆం ఫట్ అని మంత్రం వేసి, ఎత్తుకుపోయాడు! ఇంతమందిని ఆకర్షించిన ఆ రాకుమారి ఇందుమతి ప్రేక్షకుల్ని మాత్రం ఆకర్షించదా? ఆకర్షించింది. 'పాతాళభైరవి' చూసిన చాలామంది ప్రేక్షకులు రాకుమారి పాత్రధారి మాలతికి ప్రేమలేఖలు రాశారు. ఎప్పుడో ఆమెకు వివాహం అయిపోయినా?**

ఒక సినిమా విజయోత్సవాలు చేసుకుంటే అందులో నటించిన వారందరికీ ఖ్యాతి వస్తుంది. మాలతి అంతకుముందు నాయిక పాత్రలు, ఉపనాయిక పాత్రలూ ధరించినా, 'పాతాళభైరవి' నాయిక గనక, ఆ సినిమా సర్వజనుల్ని వినోదపరచింది గనక, మాలతిని గ్లామర్ సింహాసనం మీద కూచో బెట్టారు. ఆ రోజుల్లో నాయిక పాత్రలు ధరించిన వారందరూ పాతికేళ్లు పైబడ్డవారే. కొందరికి వివాహాలు అయినాయి, కొందరికి పిల్లలూ వున్నారు. ఇవాళ 16 ఏళ్లు నిండని వాళ్లనీ 20 ఏళ్లు దాటని వాళ్లనీ 'హీరోయిన్లు'గా చూస్తున్నాం.

కన్నాంబ, శ్రీరంజని దగ్గర్నుంచి, అంజలిదేవి షావుకారు జానకి వరకూ చూసుకుంటే వాళ్లు తల్లులయ్యాకనే సినిమాలకి వచ్చారు. ఐతే వాళ్ల నటనే వాళ్ల గ్లామరు! ఆ నటనే వాళ్ల అందచందాలు!

1939లో మోడరన్ సినీటోన్ అనే కంపెనీ 'ఉష' పేరుతో పురాణచిత్రం నిర్మించింది. 'మాలపిల్ల' హీరో గాలి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించారు. పద్మావతి సావిత్రిగావ్ అనే గాయని ఉషగా నటించింది. ఈ సినిమా మాలతి నటించిన తొలి సినిమా. ఇందులో ఆమె ఉషకి చెలి.

తర్వాత వాహినీ సంస్థ తీసిన 'సుమంగళి' (1940)లో మంచి పాత్ర ధరించింది. పాట అంతంత మాత్రం వచ్చిన వాళ్లయినా, వాళ్లకి పాటనేర్పి, చక్కగా పాడించగల నైపుణ్యం గల చిత్తూరు వి. నాగయ్య సంగీత దర్శకత్వంలో మాలతి – 'వస్తాడే మా బావ' పాట నేర్చుకుని చక్కగా పాడింది. ఆ పాట ప్రజల నోటికి అందింది. 'వస్తాడే మా బావ – రేపో మాపో వస్తాడే' అని నాటి ప్రేక్షకులు పాడుకునే వారు. ఆ పాటకి వున్న ప్రసిద్ధి ఎంత అంటే– 'వస్తాడే మా బావ' పేరుతో సినిమా కూడా వచ్చింది.

మధురంగా, శ్రావ్యంగా వుంటాయి.

తర్వాత వచ్చింది 'పాతాళభైరవి' (1951) అప్పుడు పెద్దలందరూ మాలతి ఏమిటి? హీరోయిన్ ఏమిటి? అని విమర్శలు చేసినా, కె.వి.రెడ్డిగారు మాత్రం పూర్తి నమ్మకంతో వుండి ఆమెకు నాయిక పాత్ర ఇచ్చారు.

దురదృష్టం ఏమిటంటే – తర్వాత మళ్లీ ఆమెకు అలాంటి పాత్ర రాలేదు. సినిమా హిట్టయితే, ఒక్కొక్కరూ 'తారలు' అవుతారు. మాలతికి అలాంటి అవకాశం రాలేదు. ఎందుకనో కొన్నాళ్లపాటు ఖాళీగా వుండి, ప్రౌఢ పాత్రలకు మారిందామె.

కాళహస్తి మహాత్మ్యం, నేనంటే నేనే వంటి చిత్రాల్లో నటించింది. ఎంత పెద్ద హీరోయిన్ అనిపించుకున్నా ఆ రోజుల్లో సంపాదన అంతంత మాత్రమే. ఐతే, ఆమె వేషాల కోసం తిరగలేదు, ఎవర్నీ అడగలేదు. నాటకాల్లో వెయ్యలేదు. ఆశాభావంతో మద్రాసులోనే తేనాం పేటలోని చిన్న ఇంట్లో వుండేది.

వాహిని సంస్థ నుంచి వచ్చింది కాబట్టి – అక్కడ అందరూ ఒకర్ని ఒకరు 'బ్రదర్' అని పిలుచుకుంటారు కాబట్టి –ఎన్.టి.రామారావుకి వచ్చినట్టే ఆ 'బ్రదర్' మాలతికీ వచ్చింది. పెద్దవాళ్లయినా, చిన్న వాళ్లయినా పురుషులందర్నీ 'బ్రదర్' అనే పిలిచేది. 'నేనంటే నేనే' సమయంలోనే నాకు ఆవిడ ప్రత్యక్ష పరిచయం. 'పాతాళభైరవి' విషయాలు ప్రస్తావిస్తే 'ఇప్పుడెందుకు బ్రదర్.. ఐపోయింది ఆ భోగం' అన్నారామె నిరాశగా.

1943లో వచ్చిన 'భాగ్యలక్ష్మి', 'భక్త పోతన' చిత్రాల్లో మాలతి ధరించినవి ముఖ్య పాత్రలు. నాగయ్య గారు నిర్మించిన 'భాగ్యలక్ష్మి'లో మాలతి నాయిక. 'పోతన'లో శ్రీనాథుడి కుమార్తె, 'పోతన'కు కోడలు. వాహిని వారే కె.వి.రెడ్డి దర్శకత్వంలో నిర్మించిన 'గుణ సుందరి కథ'లో రాజుగారి ముగ్గురు పుత్రికల్లోనూ రెండో పుత్రిక – మాలతి. ప్రథమ పుత్రిక శాంతకుమారి – మాలతి, కలసి నాట్యం చేస్తూ పాడిన పాటలు ఏ మాత్రం ఎబ్బెట్టుగా అనిపించవు. అంత పెద్ద వాళ్ళ నాట్యమా? అనిపించారు.

'కలకలా ఆ కోకిలేమో పలుకరించే వింటూ', 'చల్లని దొరవేలే చందమామా, నీ అల్లరి చాలించవోయి చందమామ' అన్న రెండుపాటలూ (ఓగిరాల రామచంద్రరావు సంగీత దర్శకుడు) శాంతకుమారి, మాలతి కలసి పాడారు. రెండూ

చిన్న చేతి సంచితో, మాలతి తేనాంపేట రోడ్డులో, రోడ్డు ప్రక్కన వున్న కూరగాయల కొంటూ వుంటే చూశాను. పలకరిద్దామనుకున్నా –మనసు సహకరించలేదు. మాసిన చీరతో మామూలు స్త్రీలా వున్న తనను చూస్తే ఏమనుకుంటారో అని ఆమె భావిస్తుందని నేను పలకరించలేదు. ఎవరూ గుర్తించే స్థితిలో కూడా లేదు ఆమె. కొన్ని తమిళ చిత్రాల్లోనూ నటించినా, తమిళులూ మరచిపోయారు.

మాలతి వాళ్లు చిన్న ఇంట్లో వుండేవారు. ఒక వర్షాకాల సమయంలో, ఆరబెట్టిన బట్టలు తియ్యబోతే వుంటే – ఆ పాత ఇంటి గోడ కూలిపోయి, మాలతి మీద పడిపోయింది!... అంతే! మాలతి ప్రాణాలు గోడ కింద నుంచి అనంతవాయువుల్లో కలసిపోయాయి! చాలామందికి ఆమె మరణవార్త తెలియలేదు.

రెండు రోజుల తర్వాత కాబోలు ఒక దిన పత్రిక 'గోడకూలి మాలతి మరణం' అని వార్త ప్రచురించింది. సినిమాగ్లామరు, నీటిబుడగా ఒక్కటే. 'రాకుమారి' అంతటి ఆదరణ అందుకున్న మాలతి వంటి వాళ్లు ఈ రంగుల సినీమాయా జగతిలో ఇంకా ఎందరో కనిపిస్తారు.



– రావి కొండలరావు 98480 71175



## మెదడు కణాల్లో ఏం జరుగుతుంది?

## మనకొచ్చిన భయమేమీ లేదు!

## మెదడుని మోసం చేయొచ్చు!



## నిద్రలో భయం పోతుంది...

## అంగారకుడి మీద ఆవాసం కష్టమే!

- హేమంత్

**ఆగస్టు 22 :** క్యాంపు కార్యాలయంలో ఏపీఎన్జీవో ప్రతినిధులతో సమావేశం అయ్యారు. సమ్మెపై చర్చించారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు శ్రీ బొత్స సత్యనారాయణ సమావేశం అయ్యారు. హైదరాబాద్‌లో అమీర్‌పేట్‌లో తమిళనాడు గవర్నర్ శ్రీ రోశయ్య నివాసానికి వెళ్ళి మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.

**ఆగస్టు 23 :** క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర మంత్రులు సమావేశమయ్యారు. రాష్ట్ర విభజనపై చర్చించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ పరిధిలోని రహదారుల స్థితిపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విశాఖపట్నంలో హెచ్‌పీసీఎల్‌లో చోటు చేసుకున్న భారీ అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. సహాయ చర్యలు వేగవంతం చేయాలని, క్షతగ్రాతులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

**ఆగస్టు 24 :** తెలంగాణ మంత్రులు సచివాలయంలో సమావేశం అయ్యారు. విశాఖపట్నంలో హెచ్‌పీసీఎల్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాద ఘటనపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

**ఆగస్టు 25 :** హైదరాబాద్‌లోని మాదాపూర్ ఎన్.కన్వెన్షన్‌లో తమిళనాడు గవర్నర్ శ్రీ రోశయ్య మనవరాలి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

**ఆగస్టు 26 :** విశాఖపట్నంలో హెచ్‌పీసీఎల్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదఘటనపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 14వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర సర్కారు సమర్పించే నివేదికలో పొందుపర్చాల్సిన అంశాలపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు సచివాలయంలో కలుసుకున్నారు. క్యాంపు కార్యాలయంలో పీసీసీ అధ్యక్షుడు శ్రీ బొత్స సత్యనారాయణతో సమావేశం అయ్యారు.

**ఆగస్టు 27 :** క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ శ్రీ దినేష్‌రెడ్డితో సమావేశమయ్యారు. హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రజాప్రతినిధులు శ్రీ ఆరేపల్లి మోహన్, ఎమ్మెల్యే శ్రీ ప్రకాశ్‌గౌడ్, తెరాస నేత శ్రీ మధుసూదనాచారిని పరామర్శించారు. రాష్ట్రంలోని విద్యుత్ పరిస్థితిపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వున్న కొత్త ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ జెన్‌కోకు ఆదేశాలు జారీ చేశారు. లోక్‌సభలో ఆహార భద్రత బిల్లు ఆమోదం పొందినందుకు కాంగ్రెస్ అధినేత్రి శ్రీమతి సోనియాగాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

**ఆగస్టు 28 :** హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి రూరల్ డెవలప్‌మెంట్ ఫెలోస్ రూపొందించిన 'ఫ్రం ది బాటమ్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించి అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత మంత్రులు సమావేశమయ్యారు.

**ఆగస్టు 29 :** క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ శ్రీ దినేష్‌రెడ్డితో సమావేశం అయ్యారు. రాష్ట్రంలోని శాంతి భద్రతలపై చర్చించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు.




**ఆగస్టు 30 :** నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సచివాలయంలో మంత్రులు, అధికారులతో సమీక్షించారు. అనంతరం భూ సంస్కరణల ముసాయిదాపై సమీక్షించారు.

**ఆగస్టు 31 :** బంజారాహిల్స్ పార్క్ హయత్ హోటల్‌లో 'మెట్రో ఇండియా' అనే నూతన ఆంగ్ల దినపత్రికను ఆవిష్కరించారు. క్యాంపు కార్యాలయంలో మంత్రులు శాసనసభ శాసనమండలి సభ్యులు అధికారులు, కార్యకర్తలు కలుసుకున్నారు.

**సెప్టెంబర్ 1 :** క్యాంపు కార్యాలయంలో కేంద్రమంత్రి శ్రీమతి కిల్లికృపారాణి, రాష్ట్రమంత్రులు వేరువేరుగా సమావేశమయ్యారు. అనంతరం సీమాంధ్ర మంత్రులు, అధికారులు, కార్యకర్తలు కలుసుకున్నారు.

**సెప్టెంబర్ 2 :** క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత మంత్రులు సమావేశం అయ్యారు. క్యాంపు కార్యాలయంలో ఎంపీ శ్రీమతి విజయశాంతి, తెదేపా నేత మోత్కుపల్లి నర్సింహులు వేరు వేరుగా సమావేశం అయ్యారు. అనంతపురానికి చెందిన వివిధ పక్షాల రైతులు సీపీఐ మాజీ శాసనసభ్యుడు శ్రీ రామకృష్ణ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో కలుసుకుని హంద్రీనీవా నుంచి నీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రైతులు తమ సమస్యలను చెప్పుకున్నారు.

**సెప్టెంబర్ 3 :** మర్రి చెన్నారెడ్డి మానవవనరుల సంస్థలో కేంద్ర సర్వీసులు, ఐఎఫ్ఎస్ అధికారులకు ఫౌండేషన్ కోర్సుల శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యాడు. అనంతరం ట్రైనీ అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానలిచ్చారు. అనంతరం పట్టణ శివారులలో ఎస్.వాణి అనే యువతిపై జరిగిన యాసిడ్ దాడిని ఖండిస్తూ సచివాలయంలో ఇదే అంశంపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. హైదరాబాద్ జూబ్లీహాల్‌లో భూటాన్ దేశం ప్రధాని శ్రీ లించెన్ షెరింగ్‌తోగెతో సమావేశమయ్యారు. అనంతరం గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఏర్పాటు చేసిన విందులో భూటాన్ ప్రధానితో కలిసి పాల్గొన్నారు. అనంతరం భూటాన్ ప్రధానిని ఘనంగా సత్కరించారు. సాయంత్రం ఢిల్లీ పర్యటన నిమిత్తం బయలుదేరి వెళ్ళారు. ఢిల్లీలో ఆంటోని కమిటీతో సమావేశమయ్యారు. రాత్రి ఢిల్లీలోని ఏపీభవన్‌లో బసచేశారు.

**సెప్టెంబర్ 4 :** ఢిల్లీలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జీ శ్రీ దిగ్విజయ్‌సింగ్‌తో సమావేశమయ్యారు. అనంతరం కేంద్ర హోంమంత్రి శ్రీ సుశీల్‌కుమార్ షిండేతో సమావేశమయ్యారు. ఢిల్లీలో రాష్ట్రపతి శ్రీ ప్రణబ్‌ముఖర్జీతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని పరిస్థితులపై చర్చించారు. ఢిల్లీలో రాష్ట్ర మాజీ మంత్రి శ్రీమతి కొండాసురేఖ దంపతులు శ్రీ దిగ్విజయ్ సింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన కార్యక్రమానికి హాజరయ్యారు. సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు.

**సెప్టెంబర్ 5 :** క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత మంత్రులు శాసనసభ, శాసనమండలి సభ్యులు కలుసుకున్నారు. క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ప్రభుత్వ పథకాల అమలుపై చర్చించారు.

**సెప్టెంబర్ 6 :** రాష్ట్రంలో వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో పలువురు మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కార్యకర్తలు తదితరులు కలుసుకున్నారు.

**సెప్టెంబర్ 7 :** క్యాంపు కార్యాలయంలో పలువురు సీమాంధ్ర ప్రాంత నేతలు సమావేశం అయ్యారు. రాష్ట్ర విభజనపై చర్చించారు. క్యాంపు కార్యాలయంలో శాసనసభ, శాసనమండలి సభ్యులు,




అధికారులు, తదితరులు కలుసుకున్నారు. రాష్ట్ర సాంస్కృతిక మండలి మాజీ అధ్యక్షుడు ఆర్.వి. రమణమూర్తి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**సెప్టెంబర్ 8 :** క్యాంపు కార్యాలయంలో పలువురు సీమాంధ్ర ప్రాంత మంత్రులు, కార్యకర్తలు, అధికారులు కలుసుకున్నారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాలలో ఉన్న తెలుగువారందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని కటాక్షంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

**సెప్టెంబర్ 9 :** క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమకు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంలో మంత్రులు, శాసనసభ, శాసనమండలి సభ్యులు, అధికారులు తదితరులు కలుసుకుని వినాయక చతుర్థి శుభాకాంక్షలు తెలిపారు.

**సెప్టెంబర్ 10 :** రాష్ట్రంలో శాంతి భద్రతలు, వినాయక నిమజ్జన ఏర్పాట్లపై, వర్షాలు రిజర్వాయర్లలో నీటి నిల్వలు, విద్యుత్తు ఉత్పత్తి వ్యవసాయ పనుల పై సచివాలయంలో సి.ఎం.ఓ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు మంత్రులతో వేరు వేరుగా సమీక్షలు నిర్వహించారు. సచివాలయంలో మంత్రులు, శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు, తదితరులు కలుసుకున్నారు.

**సెప్టెంబర్ 11 :** రాష్ట్రంలో ప్రజా జీవనంపై ఏపీఎన్జీవోల సమ్మె ప్రభావం పై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. సమ్మె విరమించాలని ఏ.పీఎన్జీవోలకు విజ్ఞప్తి చేశారు. టీటీడి, విద్యుత్, వైద్యం విద్య, తదితర అత్యవసర సేవాలకు అటంకం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల పరిస్థితి పునరావాస చర్యలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. తెలుగుదేశం పార్టీ ఎం.పీ శ్రీ సిఎం రమేష్ సచివాలయంలో సమావేశం అయ్యారు. క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత విద్యుత్ ఉద్యోగులతో సమావేశం అయ్యారు. సమ్మెపై చర్చించారు. సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేశారు. క్యాంపు కార్యాలయంలో సిఎంఓ అధికారులతో సమావేశమయ్యారు. సీ ఎం ఆర్ ఎఫ్ కింద పెండింగ్‌లో వున్న అన్ని విజ్ఞప్తులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో మంత్రివర్గ సహచరులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని పరిస్థితులపై చర్చించారు. అనంతరం 14వ ఆర్థిక సంఘం ఛైర్మన్ శ్రీ వేణుగోపాల్‌రెడ్డి గౌరవార్థం ఏర్పాటు చేసిన విందులో మంత్రివర్గ సహచరులతో కల్సి పాల్గొన్నారు.

**సెప్టెంబర్ 12 :** హైదరాబాద్ జూబ్లీహాల్‌లో 14వ ఆర్థిక సంఘం సభ్యులతో మంత్రివర్గ సహచరులతో కల్సి సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్రానికి అధికనిధులు కేటాయించాలని 14వ ఆర్థిక సంఘం సభ్యులను కోరారు. క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత మంత్రులు శాసనసభ, శాసనమండలి సభ్యులు, తదితరులు కలుసుకున్నారు. క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర సమాచార హక్కు కమీషనర్లు సమావేశమయ్యారు.

**సెప్టెంబర్ 13 :** దేశప్రధాని, శ్రీమన్మోహన్ సింగ్, శ్రీ దిగ్విజయ్‌సింగ్ రాష్ట్ర గవర్నర్ శ్రీ నరసింహన్‌లు తదితరులు నుంచి ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు అందుకున్నారు. క్యాంపు కార్యాలయంలో కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, శాసనసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు కార్యకర్తలు అధికారులు తదితరులు కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**సెప్టెంబర్ 14 :** క్యాంపు కార్యాలయంలో ఆర్బీఐ ఎం.డీ ఏ.కే.ఖాన్ సమావేశమయ్యారు. క్యాంపు కార్యాలయంలో కేంద్రమంత్రులు, శ్రీ కావూరి సాంబశివరావు, శ్రీమతి పురందేశ్వరిలు వేరువేరుగా సమావేశమయ్యారు.

**సెప్టెంబర్ 15 :** క్యాంపు కార్యాలయంలో మంత్రులు, శాసనసభ, శాసనమండలి సభ్యులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు కలుసుకున్నారు.

**సెప్టెంబర్ 16 :** క్యాంపు కార్యాలయంలో రాష్ట్రమంత్రులు శ్రీ పొన్నాల లక్ష్మయ్య, శ్రీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమావేశమయ్యారు. క్యాంపు కార్యాలయంలో కేంద్రమంత్రి శ్రీ కావూరి సాంబశివరావు ఆధ్వర్యంలో జౌళి, చేనేత రంగాల పై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

**సెప్టెంబర్ 17 :** క్యాంపు కార్యాలయంలో పలువురు సీమాంధ్ర ప్రాంత మంత్రులు శాసనసభ, శాసనమండలి సభ్యులు కలుసుకున్నారు. రాష్ట్ర వస్త్రసాజి సంరక్షణ బోర్డుపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి శ్రీమతి గీతారెడ్డి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి, శ్రీ ధర్మాన ప్రసాద్‌రావులు సమావేశం అయ్యారు.

**సెప్టెంబర్ 18 :** క్యాంపు కార్యాలయంలో మంత్రులు శాసనసభ శాసనమండలి సభ్యులు, కార్యకర్తలు కలుసుకున్నారు. వినాయక నిమజ్జన పరిస్థితిపై క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షించారు. సహాయ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**సెప్టెంబర్ 19 :** క్యాంపు కార్యాలయంలో అటవీశాఖపై మంత్రి శ్రీ శత్రుచర్ల విజయరామరాజు, అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించరు. అటవీశాఖను బలోపేతం చేయడానికి 40 అదనపు సాయుధ బలగాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. క్యాంపు కార్యాలయంలో మంత్రులు, శాసనసభ, శాసనసమండలి సభ్యులు, అధికారులు తదితరులు కలుసుకున్నారు.

**సెప్టెంబర్ 20 :** సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలోని రావిర్యాల గ్రామంలో ఆగాఖాన్ విద్యాసంస్థల సముదాయాన్ని కేంద్రమానవ వనరుల శాఖ మంత్రి శ్రీ పల్లం రాజుతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.

**సెప్టెంబర్ 21 :** క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత మంత్రులు, శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు తదితరులు కలుసుకున్నారు. హైదరాబాద్ తాజ్ ఫలక్‌నుమాతో ప్యాలేస్‌లో విడిది చేసిన అంతర్జాతీయ ఆగాఖాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రిన్స్ ఆగాఖాన్‌తో మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు.

- ఎ.మధుసూదనరెడ్డి

కథ

# మౌక్తిక-మోహన్

-విద్యాలక్ష్మి

"హలో..!"

"ఆ, హలో..!"

"ఎవరండీ?"

"అదేంటి... ఫోన్ చేసింది మీరు. ఎవరని నన్నడుగుతారేమిటి?"

"మీరు 'హలో' అన్నారుగా. అందుకని మాట్లాడేదెవరని అడిగాను.."

"ఇంతకీ నీవెవరు బాబూ? ఏం పని మీద ఫోన్ చేశావ్? అంకుల్‌తో పనా?"

"అబ్బే, అంకుల్‌తో కాదు... మీతోనే పని ఆంటీ..."

"నా తోనా.. ఏం పని బాబూ?"

"పనంటూ ఏం లేదాంటీ, కాసేపు మీతో మాట్లాడదామని ఫోన్ చేశానంతే."

"ఏం మాట్లాడాలి? ఇంతకీ నీవెవరంటే చెప్పవేం?"

"మీ శ్రేయోభిలాషిని.."



"శ్రేయోభిలాషి?... అంటే...?"

"అయ్యో, రామా! 'అంటే' అని అడుగుతున్నారేమిటి? అచ్చంగా తెలుగు టీచర్గా గవర్నమెంట్ ఉద్యోగం వెలగబెడుతున్నారు కదా! ఆ పదానికి ఆ మాత్రం అర్థం తెలీదా? మీరు తెలుగులో డాక్టరేట్ అనుకుంటాను."

"వాట్... నాన్సెన్స్..!"

"ఓహో, సారీ ఆంటీ, మీకు చాలా కోపం వచ్చినట్లుంది.. నేనలా అడిగినందుకు. నానా అర్థాలు, పర్యాయపదాలు అని తెలుగులో ఏ కోటో ఉంటాయికదా ఆంటీ? ఎప్పుడో చిన్నప్పుడు చదువుకున్నాను. అయినా ఇప్పటికీ అన్నీ బాగానే గుర్తున్నాయి అనుకోండి. 'శ్రేయోభిలాషి' అంటే మీ మేలుని మంచిని కోరేవాడని అర్థం..."

"తెలుసు నాకు..."

"తెలిస్తే ఇందాక మరలా 'అంటే?' అని అమాయకంగా అడిగారేంటి ఆంటీ?"

"అయ్యో బాబూ! ఎవరివిరా నీవు? అంటే అంటే అని పదే పదే పిలుస్తూ జోక్ చేయబోయి భ్రమపడ్డావన్నాడే నన్ను తెగ ఏడిపిస్తున్నావ్. మా మేలుకోరే వాడివైతే విషయమేమిటో సూటిగా చెప్పి ఏడ్వు...!"

"ఓ... అలా అన్నారు బాగుంది. ఇక సూటిగా విషయానికే వస్తున్నాను. మీ అమ్మాయి మౌక్తికకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారని విన్నాను... నిజమేనా?"

"అవును చూస్తున్నాం... నీవన్నది నిజమే. ఐతే..."

"ఐతే గితే ఏం లేదాంటీ... ఆ ప్రయత్నాలు వెంటనే విరమించుకోమని చెప్పడానికి ఫోన్ చేశాను."

"అలా చెప్పడానికి నీవెవరివిరా?! అయినా మా ఇష్టం. వచ్చినదే."

"వచ్చినదో గిచ్చినదో గానీ, నా ప్రమేయం లేకుండానే మీరు పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టారని తెల్సి... నేనిలా మిమ్మల్ని హెచ్చరించడానికి ఫోన్ చేశాను."

"నీవెవరివిరా? మమ్మల్ని హెచ్చరించడానికి...?"

"ఇందాక చెప్పాను గదా ఆంటీ! మీ శ్రేయోభిలాషిని... దగ్గర వాడిని..."

"ఛీ... నోర్ముయ్ వెధవా.. అతిగా వాగావంటే న్యూసెన్స్ ఫోన్‌కాల్స్ చేస్తున్నావని పోలీసులకు రిపోర్ట్ చేస్తా. నన్ను దొర్లతో తోయించగల సమర్థురాలను నేను తెలుసా?"

"ఛ! ఊరుకోండి ఆంటీ! మీరావిధంగా చేయలేరుగానీ. నేను చెప్పిన విషయం మాత్రం బాగా గుర్తుంచుకోండి. మౌక్తికకు పెళ్ళి ప్రయత్నాలు మానండి. బై బై ఆంటీ! మళ్ళీ కలుద్దాం..."

అవతలి వైపున ఫోన్ పెట్టేసినట్లనిపించింది ధ్వనికి. తాను కూడా ఫోన్ పెట్టేసింది.

ఆ మరుక్షణం నుండే ఆమెని ఆలోచనలు పరిపరి విధాల పోసాగాయి. 'ఎవడు వాడు?... తనకు ఫోన్ చేసి మౌక్తికకు పెళ్ళి సంబంధాలు చూడొద్దంటాడేమిటి? వీడికీ మౌక్తికకు ఉన్న సంబంధమేమిటి? ఒట్టి ఫ్రెండ్‌షిప్పేనా? లేక ఇంకేమైనా...' అని ఆలోచించలేకపోయింది. తన ఏకైక కూతురు మౌక్తిక అలాంటిలాంటి పిల్లకాదు. చాలా బుద్ధిమంతురాలు. చక్కదనాల చుక్క. తెలివైనది. బాగా చదువుకుంటుంది. ఇంజనీర్ ఫైనలియర్లోనే క్యాంపస్ సెలక్షన్‌లో బెంగుళూరులోని ఓ పెద్ద కంపెనీలో జాబ్ కూడా వచ్చింది. ఊరోగా తాము పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టారు. మౌక్తిక కూడా దానికేలాంటి అభ్యంతరం చెప్పలేదు. తనకి ప్రేమలు పెళ్ళిళ్లపై ఏలాంటి ఆసక్తి లేదంది. ఆ అమ్మాయి తల్లిదండ్రుల మనస్సే ఎరిగినట్టు మాట్లాడే వైపే మొగ్గుచూపింది. అందుకే పెళ్ళిసంబంధాలు చూడ్డం మొదలు పెట్టారు తల్లిదండ్రులు.

*****

"మౌక్తికా! నీవు కొన్న ఆ టీవీ వాళ్ళు వచ్చింది. నేను మీ నాన్నగారితో మాట్లాడాలి."

"అలాగే అమ్మా! ఏం మాట్లాడాలి?"

"నీ పెళ్ళి విషయం గురించి"

"ఓ.. సరే ఐతే... నేనీ టీవి కట్టేసి నాగదిలో కెళతానమ్మా!"...

"ఏం ఫర్వాలేదు. నీవిక్కడే ఉండమ్మా! మా మాటలు వినొచ్చు. ఇందులో రహస్యాలు ఏమీలేవు. అవునండీ... మీరు మొన్నా మధ్య శాస్త్రిగార్ని వెంటబెట్టుకొని కర్నూల్ వెళ్ళి పెళ్ళి వారితో మాట్లాడి వచ్చారు. కదా!? ఏమన్నారు వాళ్ళు? ఏ విషయం చెప్పనే లేదింత వరకూను.."

"ఏమో మరి.. మన వివరాలన్నీ రాసిచ్చాను. ఫోన్ నెంబర్‌తో సహా. మౌక్తిక ఫోటో అబ్బాయ్ తల్లిదండ్రులకి బాగానే నచ్చింది. 'మా మురళి ఆఫీస్ పనిమీద బొంబాయి వెళ్ళాడు... అబ్బాయ్ వచ్చాక ఈ ఫోటోను చూసి వాడూ ఇష్టపడితే పెళ్ళిచూపుల కి రావడానికి శాస్త్రిగారి ద్వారా కబురు పంపుతాం. లేదా మీకే నేరుగా ఫోన్ చేసి చెప్పుతాను...' అని అబ్బాయ్ తండ్రి క్లియర్‌గా చెప్పాడు..."

"ఏదీ, ఇంతవరకూ వాళ్ళ నుంచి ఏ కబురూ అందలేదు."

"అవును భవానీ! మేం వెళ్ళొచ్చి రెండు వారాల యింది. అదే నాకూ అర్థం కావడం లేదు. బహుశా, ఆ అబ్బాయ్‌కి మన మౌక్తిక ఫోటో నచ్చలేదేమో!?..."

"ఛ! ఊర్కోండి. మన మౌక్తిక నచ్చక పోవడమేమిటీ? అమ్మాయ్ నచ్చలేదూ అంటే ఆ పెళ్ళి కొడుక్కు ఏదో కంటి దోషముందనే లెక్క మన అమ్మాయ్‌కేమండీ... బంగారు బొమ్మ..!"

"కాకి పిల్ల కాకికి ముద్దని వెనకటి పెద్దలు ఊ ర్కనే అనలేదు భవానీ..."

"అంటే మీ ఉద్దేశం?"

"మన బంగారు బొమ్మ బహుశా పెళ్ళికొడుక్కి ఎందుకనో నచ్చలే..."

"అబ్బ ! ఊర్కోండి. మీరిలా అశుభపు మాటలు మాట్లాడకండీ... మన మౌక్తికకి చూసిన మొట్టమొదటి సంబంధమే ఇలా అయిందేమిటా అని నేను బాధ పడుతున్నాను.. పోనీ ఓ పని చేద్దామా?"

"ఏంటది?"

"మనమే పెళ్ళివారికి ఫోన్ చేసి పెళ్ళిచూపులకి ఎప్పుడొస్తున్నారని అడిగితే పోలా?"

"ఊహూ, అలా అడగడం అంతగా బాగుండదేమో భవానీ..!"

"మరిక ఏం చేద్దామంటారు?"

"వాళ్ళ నుంచి ఏదో కబురు వచ్చే వరకూ వెయిట్ చేద్దామంటాను..."

"పోనీ శాస్త్రిగార్కి ఏమన్న ఫోన్ చేసి చెప్పారేమోనండీ... ఓ మారు ఆయనకి ఫోన్ చేయండి..."

"సరే... నీ ఇష్టమిక. ఫోన్ చేస్తాను. అదిగో మాటల్లోనే శాస్త్రిగారే మనింటికి వస్తున్నారు. అదిగో, అటు చూడు గేట్ వైపు భవానీ!"

"అవునండోయ్! నిజమే..."

"నమస్కారం శాస్త్రిగారూ మీకు నిండా నూరేళ్ళ ఆయుస్సు. ఇప్పుడే మీకు ఫోన్ చేద్దామనుకున్నాం. సరిగ్గా ఇంతట్లోనే మీ దర్శనం అయింది."

"నేనే మొదట మీకు ఫోన్ చేసి మాట్లాడుదామనుకున్నాను. కాని ఈ వీధిలో ఉండే శివాలయంలో మా మేనల్లుడు అర్చకుడిగా పనిచేస్తున్నాడు. వాడితో కాస్త పనుండి గుడికొచ్చాను. అలాగే మిమ్మల్ని కూడా కల్సి ఆ శుభవార్త చెప్దామనే నేరుగా ఇటువచ్చేశానండీ..."

"శుభవార్తా!?... ఏంటది? పెళ్ళివారేమన్న కబురు పెట్టారా శాస్త్రిగారూ?"

"అవునమ్మా... అదే మరిప్పుడు నేను మీ ఇంటికి రావడానికి కారణం, అబ్బాయికి మన అమ్మాయి చాలా బాగా నచ్చిందట.. వచ్చే ఆదివారం దశమిరోజు పెళ్ళి చూపులకి రావడానికి నిర్ణయించుకున్నారట. వారిది మరొక విన్నపం..."

"ఏంటది శాస్త్రిగారూ?"

"అబ్బే, మరేమంత పెద్ద విషయం కాదనుకోండిగానీ, పెళ్ళి చూపులు చాలా సింపుల్‌గా ఉండాలన్నారు. ఫలహారాలనీ అవనీ ఇవనీ పెద్ద ఆర్భాటాలు ఏమీ లేకుండా సింపుల్‌గా టీ బిస్కెట్స్‌తో కానీయ్యమని మీకు చెప్పమని కోరారమ్మా".

"చూశారా... పెళ్ళి వారెంత మంచివారో!... ఈ రోజుల్లో పెళ్ళి చూపుల పేరిటన వచ్చి పీకలదాకా మెక్కి పిల్ల నచ్చలేదనే వాళ్ళని ఎంతమందిని చూడ్డంలేదు. వాళ్ళ హోదాకి, అంతస్తుకు అతిసామాన్యులమైన మేము తూగగలమా శాస్త్రిగారూ! కట్న కానుకలు ఏపాటి అడుగుతారో ఏమోననీ భయం పట్టి పీడిస్తోంది."

"మీరిలా మొదటే కంగారు పడకండమ్మా. ఇప్పుడవన్నీ ఎందుకమ్మా మాట్లాడుకోవడం? చూద్దాం.. వాళ్ళు అలాంటి వారిలా కన్పించరు. కట్న కానుకలు అడుగుతారని నేననుకోవడం లేదు. ఆదివారం సాయంత్రానికి నేను కూడా పెళ్ళి వారితో పాటు వస్తాను. నేనిక వెళ్ళొస్తానమ్మా. బజారులో కాస్త పనుంది..."

"అయ్యో, అప్పుడే వెళ్ళిపోతారా, కొంచెం ఆగండి... మౌక్తికా శాస్త్రిగార్కి ఓ కప్పుకాఫీ చేసి తీసుకురావమ్మా."

"అలాగే అమ్మా!..."

*****

ఫోన్ రింగవుతోంది హాల్లో... భర్త ఆఫీసుకి, అమ్మాయ్ కాలేజీకి వెళ్ళి పోయారప్పటికే.. తాను కూడా స్కూల్‌కి వెళ్ళడాన్కి తయారయిన భవాని గదిలో నుంచి ఇవతలికి వచ్చింది. ఫోన్ ఇంకా రింగవుతూనే ఉంది ఆదేపనిగా–

## రెక్కలు

బాల్యం
ఆపాత మధురం
విచ్చుకొనే
పత్తి పువ్వు
మధుర స్మృతుల
ఖజానా
  వాన
  మనిషి
  సుఖం కోసం
  ప్రకృతి ఇచ్చేదీవెన
  నింగీ నేలకు
  మైత్రీ వారధి
భూకంపం
మనిషి
చేతలకు
భూమి గుండె పగలడం
విషాదానికి
రూపం
  శృంగారం
  రెండు హృదయాల
  విలీనం కోసం
  పిలిచే రసాయనం
  మనసు సౌందర్యాన్ని
  మాట్లాడించే ఓషధి
కరుణ
అనాథలకోసం
కార్చే
హృదయరసం
మానవతా
పరివర్తన గుణం
  మధ్యాహ్నం
  మానసిక
  ఉద్రేకానికి
  తారాస్థాయి
ప్రకృతికి
కిరణస్నానం

– *వల్లభాపురం జనార్దన*

"హల్లో, ఎవరండీ?"

"నేనేనండీ ఆంటీ. అప్పుడే మర్చిపోయారా? మీ శ్రేయోభిలాషిని..."

"మళ్ళీ ఎందుకు ఫోన్ చేసి తగలడ్డావురా?"

"అయ్య బాబోయ్! అంత కోపంగా అడిగారేంటి ఆంటీ?"

"నాకు స్కూల్‌కి టైమ్ అవుతుంది. త్వరగా వెళ్ళాలి... నీవెవడివిరా! ఎందుకిలా మమ్మల్ని విసిగిస్తున్నావ్?"

"మీరు నా మాట పెడచెవిన పెట్టారు. వ్యవహారం పెళ్ళిచూపుల వరకూ వచ్చిందట..."

"ఆ విషయం అప్పుడే నీకెలా తెల్సిందిరా?.."

"అంతగా ఆశ్చర్యపోకండి ఆంటీ! తెల్సుకోవడాన్ని మనసుంటే మార్గముంటుంది... ఆ పెళ్ళి చూపులకి వచ్చేవాడితో మీ కూతురి పెళ్ళి జరుగుతుందా లేదా? అన్న విషయం నేనే తెలుస్తాను. నేనిక్కడ మోక్షికని పెళ్ళి చేసుకోవడాన్కి రెడీగా ఉన్నాను. నా పేరు మోహన్. పేరుతో పాటు మీ అమ్మాయ్‌కి మంచి జోడీని. మంచి అందగాడిని కూడా. నామాట నమ్మండి ఆంటీ! నిజంగా మోక్షికను నేనెంతగానో ఇష్టపడుతున్నాను. మా వాళ్ళతో మాట్లాడి మా పెళ్ళి జరిపించండి ఆంటీ, ప్లీజ్!"

"నీవెవడివో మాకు తెలీదు. మా అమ్మాయ్ పెళ్ళి వాళ్ళు ఒప్పుకుంటే ఆవచ్చే పెళ్ళికొడుకు మురళితోనే జరుగుతుంది. నీలాంటి అలగాజాతి వెధవలతోకాదు! ఏం చేసుకుంటావో చేసుకో ఫో...!... మళ్ళీ ఇంకెప్పుడైన ఇలా ఫోన్ చేసి నన్ను విసిగించకు.. మర్యాద ఉండదు జాగ్రత్త!" అంటూ కోపావేశాలతో ఫోన్ పెట్టేసింది భవాని.

వెంటనే మళ్ళీ ఫోన్ రింగయింది.

ఆవిడ ఈ మారు రిసీవర్ తీసి కింద పెట్టి ఇంటికి తాళం పెట్టి స్కూల్‌కెళ్ళిపోయింది.

*****

"రండి... రండీ!" శాస్త్రిగారితో పాటు వచ్చిన మగపెళ్ళివారిని సగౌరవంగా ఇంట్లోకి ఆహ్వానించారు చిరునవ్వు ముఖాలతో భవాని దంపతులు.

తల్లిదండ్రులతో పాటు లోపలికి వచ్చిన పెళ్ళికొడుకు సోఫాలో కూర్చున్నాక నింపాదిగా చూసిన భవాని అబ్బుర పడిపోయింది. తెల్లటి శరీరచ్ఛాయతో గిరజాల జుట్టు తలకట్టూ, చురుకైనా కళ్ళతో ఫొటోలో కన్నా చూడ్డాన్కి నిజంగా ఎంతో సుందరంగా అగుపించాడు ఆవిడ కళ్ళకి.

తన కూతురికి తగిన జోడీ అనుకున్న భవాని మనస్సు సంతృప్తితో నిండిపోయింది.

అందరూ ఆసీనులైనాక మంచినీళ్ళు అందించింది భవాని.

అప్పటికే మోక్షిక ఫ్రెండ్స్ ఇద్దరొచ్చి ఆమెను చక్కగా అలంకరించారు. ఎక్కువ నగలేమి లేకుండా సింపుల్‌గా తయారయింది.

లైట్ పింక్ గులాబీ రంగు షిఫాన్ జార్జట్ చీర ధరించింది. పొడగాటి జడలో కుడివైపుకి గులాబీని పెట్టుకొన్న ఆమె అందం అచ్చం పింక్ గులాబీలా ఉంది.

మోక్షిక ట్రేలో కాఫీ కప్పులు, బిస్కెట్స్ పెట్టుకొని వచ్చి వారందరి మధ్యలో ఉన్న గుండ్రటి టీపాయ్ మీదుంచి అందరికీ చిరునవ్వు ముఖంతో నమస్కరించింది. పెళ్ళికొడుకు మోక్షికని కన్నార్పకుండా ఆనందంగా చూడసాగాడు. ఆమె అందించిన కాఫీ కప్పుని అందుకుంటూ క్రీగంటగా చూడసాగాడు.

పెళ్ళికొడుకు తల్లిదండ్రులకు మోక్షిక బాగా నచ్చినట్లుగా వాళ్ళ ముఖాల్లోని హావ భావాల్ని చూస్తూనే తెల్సిపోయింది భవాని వాళ్ళకు.

"బావగారూ! మాకందరికీ మీ అమ్మాయ్ బాగా నచ్చింది. మీకు కూడా మా అబ్బాయ్ నచ్చినట్లైతే వెంటనే తాంబూలాలను పుచ్చుకుందాం. ఎలాంటి కట్న కానుకలు మాకక్కర లేదుగానీ, మాకు కాబోయే కోడలికి మాత్రం మేం ఎదురు కట్నంగా పాతిక తులాల బంగారునగలు తనకినచ్చే విధంగా పెట్టగలం. మీకు అల్లుడైనా, కొడుకైనా మా అబ్బాయే. మాకు కోడలైనా కూతురైనా మీ అమ్మాయి మోక్షికనే కాబట్టి... మన రెండు కుటుంబాలు ఒకటై ఘనంగా వీరి పెళ్ళి జరిపిందాం... ఏమంటారు బావగారూ?.."

"మేమిక ఏమంటాం? మీ విశాల హృదయానికి మా జోహార్లంటాం."

"వదినగారూ! మాది మరొక మనవి. మా వాడు వచ్చేనెలలో కంపెనీ పనిమీద ఏదో ప్రాజెక్ట్ నిమిత్తమై అమెరికాకు వెళ్ళుతున్నాడు. రెండేళ్ళ వరకూ అక్కడే ఉంటాడు. కాబట్టి మనం వీలైనంత తొందరలో వీళ్ళపెళ్ళి జరిపిస్తే అంతమంచిది. అమ్మాయ్‌ని కూడా తనతోపాటు అమెరికాకు తీసికెళ్ళుతాడు."

"అలాగలాగే... తప్పకుండా వదినగారూ!" అంటూ భవాని సంతోషంతో ఉప్పొంగి పోసాగింది. కూతురి పెళ్ళి ఎంత త్వరగా జరిపిస్తే అంత మంచిదని ఆవిడకు అనిపిస్తోంది. ఎందుకంటే ఈ మధ్య మొదలైన ఆ శ్రేయోభిలాషిగాడి పీడ కూడా సుబ్బరంగా వదలిపోతుందని ఆవిడ లోలోన అనుకోసాగింది.

"అమ్మా! మీ అభిప్రాయాలు చెప్పడమేనా? ముందుగా మోక్షిక మనస్సులో ఏముందో అడిగి తెల్సుకోండి. నేను తనకు నచ్చానో లేదో తెలియాలి కదా?".

కాబోయే అత్తగారి పక్కన అతనికి ఎదురుగుండా కూర్చున్న మోక్షిక తలెత్తి చిన్నగా నవ్వి "నాకెలాంటి అభ్యంతరం లేదు..." అని అనగానే అందరి ముఖాలు సంతోషంతో కళకళలాడసాగాయి.

పెళ్ళివారు వెంటనే శాస్త్రిగారితో మాట్లాడి పెళ్ళిముహూర్తం మూడు వారాలలోపే పెట్టించుకొని... తమలపాకులు, వక్కలు పండ్లు పళ్లెంలో పెట్టుకొని తాంబూలాలు మార్చుకున్నారు. శుభసూచకంగా చాలా సింపుల్‌గా జరిగిపోయిందాతంతు.

వెళ్ళేముందు పెళ్ళికొడుకు కాసేపు ఒంటరిగా మోక్షికతో మనసువిప్పి మాట్లాడారు. తనకెంత బాగా మోక్షిక నచ్చిందో తెలియపర్చాడు. చిరునవ్వు మందహాసాల మధ్య ఆ తర్వాత మోక్షిక తన ఫ్రెండ్స్‌నిద్దర్నీ పరిచయం చేసింది. అందరూ కల్సి కాసేపు సరదాగా మాట్లాడుకున్నారు.

చివరగా తమకి వీడ్కోలు చెప్పడాన్కి వాకిట్లో ఉన్నకారు దగ్గరికి కాస్త వెనుకగా వస్తున్న భవానిని చూస్తూ, "బై ఆంటీ వస్తాను, నాకు నచ్చిన మోక్షికని పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. చేసుకోబుతున్నాను కూడా. ఐయామ్ వెరీ హ్యాపీ! నా పూర్తి పేరు మురళీ మోహన్! మీ శ్రేయోభిలాషిని ఆంటీ!..." అంటూ నవ్వుతూ చేయి ఊపుతూ హుందాగా కార్లో కూర్చుంటున్న ఆ అల్లరి అల్లుడిని సంభ్రమాశ్చర్యాలతో చూస్తున్న భవాని నిజంగానే షాక్ తిన్నట్లైంది కాసేపటి వరకూను.

☆



# మా అమ్మాయి బంగారుతల్లి!



పుష్ప, పూజ అనే ఇద్దరు అమ్మాయిలు మంచి స్నేహితులు. ఇద్దరూ నాలుగో క్లాసు చదువుతున్నారు.

బడిదగ్గర పూజ నిలబడి పుష్ప కోసం ఎదురుచూస్తోంది. ఇంతలో పుష్ప వాళ్ల అమ్మ స్కూటర్ మీద తీసుకువచ్చి, బడి దగ్గర దింపింది.

పుష్పని చూడగానే పూజ ఎగిరిగంతువేసింది!

"ఏంటే, ఇవాళ అందంగా వచ్చావే!" అని అడిగింది పుష్పని.

"చూడు" అంటూ తను వేసుకున్న కొత్త గౌను చూపించింది పుష్ప.

"అబ్బ! కొత్త గౌను! చాలా బాగుంది!" అన్నది పూజ.

"అవునూ.. నువ్వేంటి ఇవాళ మాసిపోయిన గౌను వేసుకున్నావ్..?" అని అడిగింది పుష్ప.

"మా అమ్మకి కోపం వచ్చింది. నా గౌను ఉతకలేదు! నువ్వే ఉతుక్కో అంది!"

"అదేంటి అలాగ?" అని అడిగింది.




"నేను ఆడపిల్లని కదా! మా అమ్మకి ఆడపిల్లలంటే ఇష్టం వుండదు! మా తమ్ముడు మగపిల్లాడు కదా! వాడు అంటే చాలా ఇష్టం! కావాలంటే చూడు.. నా లంచ్ బాక్స్‌లో కూరవుండదు! స్వీట్ వుండదు! మా తమ్ముడు ఎనిమిది కదా.. వాడికి లంచ్‌బాక్స్ చాలా బాగుంటుంది. అందులో కూర, స్వీట్ పెడుతుంది! పైగా వాడిని మాటిమాటికీ మెచ్చుకుంటుంది. వాడికి ముద్దులు పెడుతుంది. నన్ను దగ్గరగా తీసుకోదు. ఎప్పుడూ తిడుతూ వుంటుంది. మా తమ్ముడికి గట్టిపెరుగువేసి అన్నం పెడుతుంది. నాకేమో మజ్జిగ పోస్తుంది. నవీ.. ఈ గౌను ఎప్పుడూ వుండేదే. నువ్వేంటి కొత్త గౌను వేసుకున్నావ్? నీ పుట్టినరోజా" అని అడిగింది పూజ.

"కాదు! మన సినిమా అంకుల్ ఏదో 'బంగారుతల్లి' పథకం పెట్టారట. అందుకని.. మా అమ్మ నన్ను పుష్పీ.. పుష్పీ అని పిలవడం మానేసింది! బంగారు తల్లీ.. అనిపిలుస్తోంది" అని చెప్పింది పుష్ప.

పూజ విచారముఖం వేసింది!

"మీ అమ్మ గుడ్ గర్ల్! మా మమ్మీ బ్యాడ్ గర్ల్, నన్ను ఒసేయ్... దరిద్రపు పీనుగా.. అని పిలుస్తుంది" అని చెప్పింది పూజ.

"అయ్యో పాపం! ఈ సంగతి మీ డాడీకి చెప్పకపోయావా?" అని అడిగింది పుష్ప.

"అయ్యో మా నాన్నకి కూడా.. మా తమ్ముడు అంటేనే ఇష్టం! మా నాన్న బయటకువెళ్తే వాడినే తీసుకుపోతారు" అని చెప్పింది పూజ.

"అయితే ఓ పనిచేద్దాం! మన సినిమా అంకుల్‌కే చెప్పేద్దాం" అన్నది పుష్ప.

"అమ్మో! అక్కడ పోలీసులు వుంటారు. జైల్లో పడేస్తారు" అన్నది పూజ.

"అయితే.. వచ్చే శనివారం గుడికి వెళ్దాంగా. అప్పుడు నువ్వు కూడా వచ్చే.. దేవుడికి చెప్పేద్దాం" అన్నది పుష్ప.

అంతలో బడిగంట మ్రోగింది. పూజ... పుష్ప ఇద్దరూ సంచుల భుజాన వేసుకొని క్లాసులోకి పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయారు.

– గీతా సుబ్బారావు

## పిలుపులు

అమ్మ నాన్నలు లేరు, 'మమ్మీడాడీ'లె నా
నగరాల యిండ్లలో గలరు నేడు !
అత్తయు, పిన్ని, పెద్దమ్మయున్ వరుసలు
కలిసిపోయిన 'ఆంటీ' పిలుపులోనె!
'అంకు' లందురనె మామయ్యయు, బాబాయి,
పెదనాన్న ఒక్కటై కుదురు కొనిరి !
పులి జూచి నక్క వాతలు పెట్టుకొన్నట్లు
అనుకరణము లెక్కువాయె నిపుడు !

అది నుండి మనకు ఆత్మీయమైనట్టి
పిలుపు లేల మార్చవలయు ? మనల
మనసె చిన్న బుచ్చుకొనుటయే యౌగాని,
కొత్త పిలుపులందు గొప్పకలదె ?

– చంద్రం

# అభినయ పరిణామం

## దేవిక

**ఆమె సన్నగా, నాజూగ్గా, పూలతీగలా వుండదు - కొద్దిపాటి స్థూలకాయం. అయినా సరే ఒక పుష్కర కాలం (1958-70) కథానాయికగా తన అభినయ ప్రతిభతో రాణించిన విలక్షణ నటి దేవిక. ఆమె అసలు పేరు ప్రమీల.**

1955లో ప్రతిభా వారి 'రేచుక్క'లో యువరాణి పాత్రలో వెండి తెరకు పరిచయమయ్యారు. కథానాయకుడు ఎన్.టి.ఆర్.ను అభిమానించి ప్రేమ వ్యక్తం చేసిన సన్నివేశంలోనూ, అతని నిజాయితీని శంకించిన సన్నివేశంలోనూ అది ఆమెకు తొలి చిత్రం కాదేమో అన్నంత సహజంగా నటించింది. పాత్ర పరిచయ గీతం 'ఎక్కడిదీ అందం', విషాదగీతం 'ఆ మనసేమో ఆ సొగసేమో' చిత్రీకరణలోనూ గీతభావాలను ప్రస్ఫుటంగా ప్రదర్శించారు.

ఆ తరువాత వచ్చిన చిత్రం 'వరుడు కావాలి'. అనుపమ తిలక్ తీసిన 'అత్తా ఒకింటి కోడలే' చిత్రంలోనూ ప్రమీల పేరుతోనే రెండో కథానాయిక పాత్ర పోషించారు.

దేవికగా పేరు మార్చుకున్న తరువాత టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి'. తనను వరించబోయే రాకుమారులను ప్రశ్నలడిగి జవాబు చెప్పలేని వారి శిరసులను ఖండించే భూమిక. పాత్ర పరిచయ గీతం 'ఎవరు నను జయించు వారెవరు' లో అహంకారం, అభిజాత్యం చక్కగా ప్రదర్శించారు. తనకు కాబోయే భర్తను బదులు చెప్పలేనందుకు శిరస్సు ఖండించాల్సి వచ్చినప్పుడు బాధను అణుచుకొని స్థిరచిత్తంతో కర్తవ్యాన్ని నిర్వహించినపుడు ఎంతో సంయమనం పాటించారు.

అదే సంవత్సరం (1960) ఆమెకు లభించిన విభిన్నమైన ఉదాత్త భూమిక 'శాంతి నివాసం' లోని వదిన పాత్ర. కాంతారావుకు జంటగా 'రాగాల సరాగాల' పాట పాడినపుడు మరిది అక్కినేనితో చనువుగా, ఆత్మీయంగా మాట్లాడినపుడు 'ఇటువంటి వదిన వుంటే ఎంత బాగుండును' అన్ని ప్రేక్షకులు



భావించేలా నటించారు. ఈ తరహా పాత్ర ఆమెకు 'శభాష్ రాజా' లో కూడా లభించింది. హిందీ మూలం 'భాయీ భాయీ' చిత్రంలో నిరూపరాయ్‌ను మరపించారు.

ఎన్.టి.ఆర్ కాంబినేషన్‌లో పలు చిత్రాల్లో నటించినా చెప్పుకోదగ్గ రెండు చిత్రాలలో కథానాయిక ఆడబ్రతుకు, 'నిండు మనసులు'.

ఆడబ్రతుకులో కథానాయిక పేద కుటుంబానికి చెందిన నర్తకి. జమీందారు కొడుకును ప్రేమిస్తుంది. మావగారి వల్ల భర్తకు దూరమౌతుంది. ఒక విధంగా అనార్కలీ కథను సోషలైజ్ చేశారనిపిస్తుంది. ఎంతో క్లిష్టమైన పాత్ర. తనను అభిమానించిన కాంతారావు హత్యా నేరంలో చిక్కుకొంటే, సాక్ష్యం చెప్పి రాణించిన సన్నివేశంలోనూ, భర్త తనను అనుమానించిన సన్నివేశంలోనూ నటిగా తనేమిటో నిరూపించుకొన్నారు. 'ఫూల్ ఔర్ పత్థర్' హిందీ చిత్రంలో మీనా కుమారి పోషించిన వితంతు పాత్రను తెలుగు చిత్రం 'నిండు మనసులు'లో ఆమెకు దీటుగా నటించారు.



ఉత్తమ చిత్రాల దర్శకుడు సి.వి. శ్రీధర్ నిర్మించిన తమిళ చిత్రం 'నెంజిల్‌ఒరు ఆలయం' (తెలుగులో మనసే మందిరం)లో ప్రేమించిన డాక్టర్ రఘు, పెళ్ళి చేసుకొన్న భర్త రాము. వారిద్దరి మధ్య సంఘర్షణకు లోనయిన కథానాయిక సీత' పాత్రకు అభినయంతో ప్రాణం పోశారు.

ఎన్.టి.ఆర్. కాంబినేషన్‌లో నటించిన జానపద చిత్రాలు 'కంచుకోట, గండికోట రహస్యం, రాజకోట రహస్యం', పౌరాణిక చిత్రం 'శ్రీకృష్ణావతారం'లో రుక్మిణి పాత్ర, చారిత్రిక చిత్రం 'మహామంత్రి తిమ్మరుసు'లో అన్నపూర్ణా దేవి పాత్రలు చెప్పుకోదగ్గవి.

కంచుకోట, కర్ణ, రక్త సంబంధం–ఈ మూడు చిత్రాల్లో సావిత్రి, దేవిక కలిసి నటించారు. వారిద్దరి పై గీతాలు కూడా చిత్రీకరించారు. 'అసామాన్యమైన ఆ యిద్దరి పర్సనాలిటీలతో తెర నిండిపోయింది' అనే హాస్యోక్తులు వినిపించినా అభినయ పరంగా యిద్దరూ పోటీపడి సన్నివేశాలను పండించటంతో ఆ విమర్శ సామాన్యంగానే మిగిలిపోయింది.

జగ్గయ్యతో 'ధర్మపత్ని', రేలంగితో 'పిన్ని', ఎస్వీ రంగారావుతో 'పాపం పసివాడు', గుమ్మడితో 'పండంటి కాపురం' చిత్రాల్లో కుటుంబపరమైన గంభీర ఇల్లాలి పాత్రలు పోషించారు.

ప్రత్యేకించి 'పండంటి కాపురం' లో తన భర్తపైన, తమ కుటుంబంపైన కక్షగట్టిన రాణి మాలినీ దేవి (జమున) వద్దకు వెళ్ళి ప్రశ్నించిన సన్నివేశంలో నిండుగా పైట కప్పుకొని గంభీరం, ఆవేదన, ఆర్ద్రత కలిగిన భావాలను ప్రదర్శించి జమునతో దీటుగా ఆ సన్నివేశాన్ని రక్తి కట్టించారు.

'మహామంత్రి తిమ్మరుసు' చిత్రంలో తాత గజపతి ఆజ్ఞ మేరకు తన భర్త శ్రీకృష్ణ దేవరాయలను తొలినాటి రాత్రి సంహరించాలి. ఒక ప్రక్క ప్రేమ, మరో వైపు తార ఆజ్ఞ. ఈ సంఘర్షణ అభినయంలో పలికించి చారిత్రక పాత్రకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

కాంతారావు కాంబినేషన్‌లో 'నువ్వే నేను', 'సుగుణ సుందరి కథ' చిత్రాల్లో నాయికగా నటించిన దేవిక రాజనాలకు భార్యగా 'అన్నా చెల్లెలు' చిత్రంలో విభిన్న భూమిక నిర్వహించి భర్త చేతిలో చిత్ర హింసలు అనుభవించిన సన్నివేశాల్లో ప్రేక్షకుల కంటతడి పెట్టించారు.

తెలుగు సినీ స్వర్ణయుగ కాలంలో (1951-75) కథానాయికగా రాణించిన దేవిక తెలుగు, తమిళ భాషల్లో సుమారు వంద చిత్రాలే నటించినా తన ప్రత్యేక ముద్రను ప్రేక్షక హృదయాలపై ప్రతిష్ఠించుకొన్న ఉత్తమ నటి.

*- ఎస్.వి. రామారావు*

*98491 39030*

## 'చిన్నరావూరులోని గయ్యాళులు'
### (కథా సంపుటి)

కన్నడ కథ కూడ మంచి మంచి కథల్ని తెలుగు పాఠకులకు అందించాలనే సదాశయంతో రామగోపాల్ గారు ఒక అంతర్జాలవాద సంస్థను ఏర్పాటు చేయడం హర్షణీయం. ఆయన కలం నుండి నేటివరకు ఐదు పుస్తకాలు వెలువడ్డాయి.

ఈ 'చిన్నరావూరు'లోని గయ్యాళులు' కథా సంపుటిలో ప్రముఖులైన కన్నడ కథకుల అనువాదాలు 17 వరకూ చోటు చేసుకున్నాయి. మొదటి కథ పూర్ణ చంద్ర తేజస్వి గారిది. అద్భుతంగా నాటుంగా తర్జుమా చేసిన శాఖమూరి రామగోపాల్ పెద్దారు. ఈ కథ 71 పుటలు చోటు ఆక్రమించింది. మిగిలిన కథల్ని ఊహాతీ కథా లక్షణాల్ని పుణికి పుచ్చుకున్నవే!



కన్నడ ప్రభ, సుధా (వారపత్రిక) వెలువడ్డిన పత్రికలలో ఈ కథలు ప్రచురితమైతే రామగోపాల్ ఆయా రచయితల ప్రతిభకు లోటు రానీయకుండా అక్కడి నేటివిటీ గుర్తుకు తేస్తూ ఈ కథల అనువాదం కొనసాగించడం అభినందనీయం. పూజారి కొడుకు పాముతో సహవాసం చేస్తున్న వైనాన్ని 'భోమి కాయనే నేను' కథలో చిత్రిస్తే, కుల వృత్తులను విస్మరించి, జ్యోతిషాన్ని ఆశ్రయిస్తే ఆయుష్షు ఊరి ఉనికే ప్రశ్నార్థకమవుతున్న నిజాన్ని 'కమ్మరి వీధి భద్రాచారి జ్యోతిష్యుడిగా మారిన తరువాత' కథ వివరిస్తుంది.

'మంత్రంతో' కథ కేవలం పుస్తకాలకు మనిషి బానిసైపోయినప్పుడు ఒక తాత్విక నేపథ్యంతో వ్రాసిన కథగా దర్శనమిస్తుంది.

కథల్లో భాష సరళంగా వున్నా, ప్రాంతీయమైన కొన్ని పాఠకాలు నాటి తెలుగు పదాలు అక్కడక్కడా అగుపించకపోవచ్చు. వీటి అనువాదంలో రాజవుల, నాశ్యుల, సామెతలు కొన్ని అనువదపోకానికి దూరమైనవి ఛాయామాత్రంగా అగుపించడం కద్దు.

ఈ పుస్తకానికి పేరు పెట్టిన పెద్ద కథ 'చిన్నరావూరు లోని గయ్యాళులు'లో ఇతి వృత్తం గ్రామీణ వాతావరణాన్ని చిత్రిస్తుంది. ముఖ్యంగా దీనిలో వస్తువుకు తగ్గ శైలి పాఠకుల్ని ఎంతగానో ఆకట్టుకునేట్లు ఉంటుంది. (కన్నడ నుండి అంతర్జాలవాదం : శాఖమూరి రామగోపాల్, పేజీలు : 226 ; వెల : రూ 200, ప్రతులకు : రచయిత పేర, ఇం.నెం. 5-10, రోడ్ నెం :21, దీప్తి శ్రీనగర్, మియాపూర్ పోస్ట్, హైదరాబాద్ -49, విశాలాంధ్ర వారి బుక్‌హౌసు)

**– డా॥ మంతెన**





## జీవిత గుణపాఠాల 'మొదటి పేజీ'

